
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 16
సంచిక: 288
సోమవారం 1-7-2024
SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'



'అద్భుత క్షణాలివి'

టీ20 వరల్డ్‌కప్ టైటిల్ సాధించడం తన కెరీర్‌లోనే అతి పెద్ద ఘనత అని భారత కెప్టెన్ రోహిత్ శర్మ వ్యాఖ్యానించాడు. ఈ విజయాన్ని ఎంతగానో కోరుకున్నామని, అందుకే ఇది మరింత ఆనందాన్ని పంచుతోందని అన్నాడు. మరోవైపు టీ20 వరల్డ్‌కప్ నెగ్గిన భారత జట్టుకు బీసీసీఐ ఏకంగా రూ. 125 కోట్లు నజరానాగా ప్రకటించింది.

12లో



జన స్పందనకు వందనం

ఎన్నికల్లో 65 కోట్ల మందికి పైగా ఓటేశారని.. రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై తిరుగులేని విశ్వాసం తెలిపారని ప్రధాని మోదీ అన్నారు.

వివరాలు 6లో ▸



ఆర్మీ చీఫ్‌గా జనరల్ ఉపేంద్ర

చైనా, పాక్‌లతో సరిహద్దుల్లో సుదీర్ఘ కార్యాచరణ అనుభవమున్న లెఫ్టినెంట్ జనరల్ ఉపేంద్ర ద్వివేది ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టారు.

వివరాలు 6లో ▸



నేటి నుంచి అమల్లోకి..

ఐపీసీ, సీఆర్‌పీసీ, భారత సాక్ష్యాధార చట్టాల స్థానంలో కేంద్రం తీసుకువచ్చిన 3 కొత్త నేర చట్టాలు నేటి నుంచి అమల్లోకి రానున్నాయి.

వివరాలు 6లో ▸



మళ్లీ 'టెట్'

ఉపాధ్యాయ అర్హత పరీక్షకు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం నోటిఫికేషన్ విడుదల చేయనుంది. షెడ్యూల్‌ను మంగళవారం ప్రకటించనుంది.

వివరాలు 14లో ▸

పిల్లలపై పిడుగు!

ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన చెల్లింపులకు ఎసరు

అప్పు చేసైనా కట్టి తీరాల్సిందేనని యాజమాన్యాల ఒత్తిడి

- సర్టిఫికెట్లు చేతికి రాకపోవడంతో విద్యార్థుల అగచాట్లు
- ఇన్నాళ్లు సాఫీగా సాగిన విద్యారంగంలో ఒక్కసారిగా కుదుపు
- షెడ్యూల్ ప్రకారం ఇవ్వాల్సిన రూ.1,300 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను నిలిపివేసిన కూటమి ప్రభుత్వం
- 2023-24 హాస్టల్ ఖర్చులు, మెస్ చార్జీల కింద ఇవ్వాల్సిన మరో రూ.1,100 కోట్లకు మంగళం
- మొత్తం చెల్లించాల్సిన రూ.2,400 కోట్లు ఎగ్గొట్టే యత్నాలు.. పాత పథకాల పేర్లు మార్చేసి డబ్బులివ్వకుండా పిల్లల భవిష్యత్తుతో చెలగాటం
- నాడు రూ.1,778 కోట్ల పాత బకాయిలు చెల్లించిన వైఎస్ జగన్
- విద్యా దీవెన, వసతి దీవెన కింద రూ.18,663 కోట్లు ఖర్చు చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- రాజకీయాలకు అతీతంగా విద్యా రంగానికి పెద్దపీట



సాక్షి, అమరావతి: 'మీరు.. పరీక్షలు రాయాలంటే ముందు ఫీజు కట్టండి. చివరి సంవత్సరం పాసైన వాళ్లకు సర్టిఫికెట్లు ఇవ్వాలంటే ఫీజులు మొత్తం చెల్లించాల్సిందే. మెస్, హాస్టల్ చార్జీలు కడితేనే గదులు కేటాయిస్తాం. ప్రభుత్వం ఇచ్చేవరకు చూద్దామంటే కుదరదు. కొత్త ప్రభుత్వం వచ్చింది. ఇక మీకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వస్తుందని ఆశ పడొద్దు. అప్పో.. సప్పో చేసి తీర్చండి. లేదంటే మీ చదువులకు కచ్చితంగా ఆటంకాలు తప్పవు. ఆ తర్వాత మాది బాధ్యత కాదు...' ఇదీ రాష్ట్రంలో డిగ్రీ, ఇంజనీరింగ్, డిప్లొమా కాలేజీ యాజమాన్యాల బెదిరింపు ధోరణి! ''గత ఐదేళ్ల

మిగతా 2వ పేజీలో ▶

ఉన్నత విద్యకు అడ్డంకి..



తిరుపతి ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ పూర్తయ్యింది. రెండేళ్లుగా జగనన్న వసతి దీవెన, విద్యా దీవెన టైమ్ టూ టైమ్ మా అమ్మ బ్యాంకు ఖాతాలో జమ చేశారు. దీంతో సకాలంలో కాలేజీ ఫీజులు చెల్లించాం. ప్రస్తుత ప్రభుత్వం ఇంకా నగదు జమ చేయలేదు. సర్టిఫికెట్లు ఇవ్వాలంటే ఫీజులు కట్టాలని యాజమాన్యం చెబుతోంది. ఉన్నత విద్యకు దరఖాస్తు చేసుకోవాలంటే ఇబ్బందిగా ఉంది. మంత్రి లోకేశ్ విద్యార్థుల పరిస్థితిని అర్థం చేసుకోవాలి. - పి.శేఖర్, తిరుపతి



'లద్దాఖ్' మృతుల్లో

పెడన జవాను

- యుద్ధట్యాంకు నదిలో మునిగి కొట్టుకుపోయిన ఐదుగురిలో నాగరాజు
- కృష్ణాజిల్లా పెడన మండలం చేవేంద్ర నాగరాజు స్వగ్రామం
- నేడు స్వగ్రామానికి నాగరాజు మృతదేహం

14లో

ఐటీ రిటర్న్స్.. చలో ఆన్‌లైన్!

రిటర్నులు దాఖలు ఈజీ.. అందుబాటులో ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు - 13లో

పేట్రేగిపోతున్న టీడీపీ

వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలే లక్ష్యంగా కొనసాగుతున్న దాడులు

- ఆస్తుల విధ్వంసాలు, శిలాఫలకాల తొలగింపు, వైఎస్సార్ విగ్రహాల ధ్వంసం
- పుంగనూరుకు వెళ్లకూడదంటూ పెద్దిరెడ్డి, మిథున్‌రెడ్డిలపై ఆంక్షలు
- టీడీపీ తరఫున వకాల్తా పుచ్చుకుని అడ్డుకున్న పోలీసులు
- హోం మంత్రి సొంత నియోజకవర్గంలో ఇద్దరు మహిళల దుస్తులు చింపేసి దాడి
- ఆళ్లగడ్డలో పోలీస్‌స్టేషన్ సాక్షిగా రెచ్చిపోయిన టీడీపీ కార్యకర్తలు
- సీఐ ఎదుటే ప్రేమికుడిని చితకబాదిన వైనం
- కక్ష సాధింపుతో చూసిచూడనట్లున్న సీఎం చంద్రబాబు.. రాష్ట్రంలో రావణ కాష్టం రగిలించడమే టీడీపీ ఉద్దేశం

3,10లో


హోంమంత్రి నియోజకవర్గంలోని కోటవురట్లలో మహిళలపై దాడి చేస్తున్న టీడీపీ కార్యకర్తలు

ఇదేం విష సంస్కృతి!?

- పార్టీ ఆఫీసులు, ప్రభుత్వ భవనాలపై దాడులు సరికాదు
- అవకతవకలుంటే చట్టబద్ధంగా చర్యలు తీసుకోవచ్చు
- దౌర్జన్యాలు, బెదిరింపులకు దిగే సంప్రదాయం కొనసాగకూడదు
- మాజీ మంత్రి బొత్స

2లో

పోలవరం ప్రాజెక్టును పరిశీలించిన అంతర్జాతీయ నిపుణులు



- ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు పరిశీలన
- జలవనరులశాఖ సలహాదారు, సీఈలతో సమీక్ష
- దెబ్బతిన్న డయాఫ్రమ్‌వాల్ పరిశీలన నేడు

2లో

క్లుప్తంగా...

టీమిండియాకు వైఎస్ జగన్ అభినందనలు



సాక్షి, అమరావతి: టీ20 ప్రపంచకప్ గెల్చుకున్న టీం ఇండియాకు మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందనలు తెలియజేశారు. 'టీ20 ప్రపంచకప్‌లో చారిత్రాత్మక విజయం సాధించిన టీం ఇండియాకు అభినందనలు. మీ పట్టుదల, కృషి ఫలించాయి. ఇది ప్రతీ భారతీయుడు గర్వించదగ్గ క్షణం. జైహింద్' అని ట్వీట్ చేశారు.

సీఎం అదనపు కార్యదర్శిగా కార్తికేయ మిశ్రా

ఉత్తర్వులు జారీచేసిన సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు అదనపు కార్యదర్శిగా కార్తికేయ మిశ్రాను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. కార్తికేయ మిశ్రా డిప్యుటేషన్‌పై కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖలో పనిచేస్తున్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం కార్తికేయ మిశ్రాను రాష్ట్ర సర్వీసుకు పంపించాల్సిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు కార్తికేయ మిశ్రాను రాష్ట్ర సర్వీసుకు కేంద్రం పంపించింది.

నేటినుంచి రాష్ట్రవ్యాప్తంగా 'స్టాప్ డయేరియా'

సాక్షి, అమరావతి: డయేరియా నివారణ, నియంత్రణ చర్యల్లో భాగంగా వైద్యశాఖ నేటినుంచి (సోమవారం నుంచి) ఆగస్టు 31 వరకు రాష్ట్రవ్యాప్తంగా స్టాప్ డయేరియా కార్యక్రమం నిర్వహించనుంది. ఐదేళ్లలోపు చిన్నారుల్లో ప్రాణాంతకంగా మారుతున్న డయేరియా వ్యాధిని నిరోధించి, మరణాల బారిన పడకుండా ఉండేందుకు కేంద్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ స్టాప్ డయేరియా ప్రచార కార్యక్రమం రూపొందించింది. ఇప్పటికే అమలులో ఉన్న డయేరియా నివారణ కార్యక్రమంలో ఐదేళ్లలోపు పిల్లలకు ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్ (ఓఆర్ఎస్) ఇవ్వడంతో పాటు రెండువారాలు జింక్ ట్యాబ్లెట్లు ఇస్తున్నారు. దీన్ని మరింత విస్తరించి కొత్తగా రూపొందించిన స్టాప్ డయేరియా కార్యక్రమంలో ఐదేళ్లలోపు పిల్లలకు రెండు ఓఆర్ఎస్ ప్యాకెట్లతో పాటు 14 రోజులకు సరిపడా జింక్ ట్యాబ్లెట్లు ఇస్తారు. డయేరియా వ్యాధి నిరోధానికి పూర్తిస్థాయిలో తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించేందుకు రెండునెలల పాటు సుదీర్ఘ ప్రచార కార్యక్రమం కూడా నిర్వహిస్తారు.

మూడు వారాల్లో రూ.7 వేల కోట్ల అప్పులా?

- సంపద సృష్టించడం అంటే ఇదేనా చంద్రబాబూ?
- వైఎస్సార్‌సీపీ జాతీయ అధికార ప్రతినిధి రవిచంద్రరెడ్డి ధ్వజం

సాక్షి, న్యూఢిల్లీ: మాజీ సీఎం వైఎస్ జగన్ ఐదేళ్ల పాలన అంతా అప్పులమయమని విమర్శించిన ప్రస్తుత సీఎం చంద్రబాబు మూడు వారాల్లోనే రూ.7వేల కోట్ల అప్పు చేయడం సిగ్గుచేటని వైఎస్సార్‌సీపీ జాతీయ అధికార ప్రతినిధి కనుమూరి రవిచంద్రరెడ్డి పేర్కొన్నారు. చంద్రబాబు చెబుతున్నట్లుగా సంపద సృష్టించడం అంటే అప్పులు చేయడమేనా? అని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో ప్రతి మంగళవారం అప్పు లేనిదే గడవని పరిస్థితి నెలకొందని వ్యాఖ్యలు చేసిన చంద్రబాబు.. ఇప్పుడు ఆయన చేస్తున్నదేంటో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం పేదలకు రూ.2.70 లక్షల కోట్లు డీబీటీతో నేరుగా అందచేసి ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించిన విషయాన్ని గుర్తుచేశారు. రవిచంద్రరెడ్డి ఆదివారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. ఒక్క పథకం అమలు చేయడానికే రూ.7 వేల కోట్లు అప్పు చేసిన చంద్రబాబు మిగతా హామీలను నెరవేర్చాలంటే ఇంకెన్ని కోట్లు అప్పు చేయాల్సి ఉంటుందో రాష్ట్ర ప్రజలు గమనించాలన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన రోజు నుంచే వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై విచ్చలవిడిగా దాడులకు తెగబడుతున్నా సీఎం చంద్రబాబు ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం దారుణమన్నారు. ఆయన ప్రోద్బలంతోనే దాడులు జరుగుతున్నట్లు భావించాల్సి వస్తుందన్నారు.



పిల్లలపై పిడుగు!

▶ మొదటి పేజీ తరువాయి

మా పిల్లల చదువులు సాఫీగా సాగిపోయాయి. ప్రతి మూడు నెలలకు ఒకసారి షెడ్యూల్ ప్రకారం జగనన్న విద్యా దీవెన కింద ఫీజులతోపాటు ఏడాదికి హాస్టల్, మెస్ ఖర్చులు వసతి దీవెనతో మా ఖాతాల్లో పడేవి. వెంటనే మేం కళాశాలలకు చెల్లించేవాళ్లం. మా పిల్లలకు సరిగా చదువు చెప్పకున్నా, హాస్టల్ బాగోలేకున్నా గట్టిగా ప్రశ్నించే వాళ్లం. ఇప్పుడు పరిస్థితులు చూస్తుంటే మళ్లీ అప్పులు చేసి పిల్లలను చదివించుకోవాల్సిన దుస్థితి తప్పదని భయమేస్తోంది'' తల్లిదండ్రులు ఆవేదన ఇది!

పేర్లు మార్చడంలో ఉన్న ఉత్సాహం అమలులో ఏది?

రాష్ట్రంలో ఐదేళ్ల పాటు నిశ్చింతగా ఉన్న ఉన్నత విద్యా రంగంలో ఒక్కసారిగా కుదుపు మొదలైంది. ఇన్నాళ్లూ ప్రభుత్వం ఇచ్చిన భరోసాతో చదువుల్లో రాణిస్తున్న పేదింటి బిడ్డల్లో తీవ్ర ఆందోళన రేకెత్తించే పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి ఖర్చులు కలిపి మొత్తం రూ.2,400 కోట్లు ఇంతవరకు విడుదల కాకపోవడంతో పిల్లల చదువుల పరిస్థితి గాలిలో దీపంలా మారింది. విద్యా సంవత్సరం ప్రారంభమైనా ఫీజుల డబ్బులు విడుదల కాకపోవడం, కోర్సులు పూర్తి చేసిన వారి చేతికి సర్టిఫికెట్లు అందకపోవడంతో ఆదుర్దా చెందుతున్నారు. ఏ కళాశాలలో చూసినా ఫీజుల గోలే వినిపిస్తోంది. ఇంతకాలం ప్రతి 3 నెలలకు ఒకసారి (త్రైమాసికం) విడుదల చేస్తున్న ట్యూషన్ ఫీజుల చెల్లింపులు నిలిచిపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. మరోవైపు ఇంటికి దూరంగా ఉంటూ ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సాయంతో(వసతి దీవెన) హాస్టళ్లలో చదువుకుంటున్న విద్యార్థులపై ఒక్కసారిగా అప్పు భారం పడింది. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్‌సీపీ హయాంలో అమలైన పథకాలకు పేర్లు మార్చిందే కానీ.. వాటి అమలు ఊసే విస్మరించింది. జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన పథకాలను పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్ (ఆర్టీఎఫ్, ఎంటీఎఫ్)గా మార్పు చేసింది. షెడ్యూల్ ప్రకారం ప్రతి త్రైమాసికానికి సంబంధించి విడుదల చేయాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, హాస్టల్-మెస్ చార్జీల విషయాన్ని మాత్రం గాలికొదిలేసింది. నిర్ణీత షెడ్యూళ్ల ప్రకారం ఇవ్వాల్సిన ట్యూషన్ ఫీజు రూ.1,300 కోట్లు, హాస్టల్-మెస్ చార్జీల కింద ఏడాది చివరిలో ఇవ్వాల్సిన మరో రూ.1,100 కోట్లు కలిపి మొత్తం రూ.2,400 కోట్లు ప్రభుత్వం నుంచి అందకపోవడంతో లక్షలాది మంది విద్యార్థులు, తల్లిదండ్రుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

విద్యార్థుల్లో 'ఫీజుల' కలవరం

ప్రతి పేదింటి విద్యార్థికి ఉన్నత స్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో మాజీ సీఎం వైఎస్ జగన్ పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేశారు. పారదర్శకతకు పెద్దపీట వేస్తూ విద్యార్థులు, తల్లిదండ్రుల ఖాతాల్లోనే నేరుగా ఫీజుల మొత్తాన్ని జమ చేసే విధానాన్ని తెచ్చారు. వారి ద్వారా ఫీజులు చెల్లిస్తుండడంతో యాజమాన్యాల్లో జవాబుదారీతనం పెరిగింది. ప్రతి త్రైమాసికానికి ముందే షెడ్యూల్ ప్రకటించి నిధులు విడుదల చేశారు. 2023–24 విద్యా సంవత్సరంలో అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికానికి సంబంధించి 9.44 లక్షల మంది విద్యార్థులకు రూ.708.68 కోట్లను మార్చిలోనే గత ప్రభుత్వం విడుదల చేసింది. అయితే ఎన్నికల కోడ్ రావడంతో చెల్లింపుల ప్రక్రియ నిలిచిపోయింది. పోలింగ్ తర్వాత అనుమతి లభించగా, కొంత మంది ఖాతాల్లో నగదు జమైంది. ఇంతలో కూటమి అధికారంలోకి రావడంతో హఠాత్తుగా చెల్లింపులు నిలిపివేశారు. ఇంకా రూ.605 కోట్లకుపైగా చెల్లించాల్సి ఉండగా కొత్త ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం విద్యార్థులను కలవరపెడుతోంది. పైగా జూన్‌లో 3వ విడత(జనవరి-మార్చి) కింద సుమారు రూ.700 కోట్లు ఫీజుల కింద విడుదల చేయాల్సి ఉండగా ఆ ఊసే ఎత్తడం లేదు. దీంతో గత సర్కారు తెచ్చిన పథకాలకు కొత్త ప్రభుత్వం మంగళం పాడే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

చదువులపై బాధ్యత లేదా?

పేదింటి విద్యార్థులను అత్యున్నత ప్రమాణాలు కలిగిన కళాశాలల్లో చదివించి వారి భవిష్యత్తుకు జగన్ ప్రభుత్వం ఉజ్వల బాటలు వేసింది. విద్యార్థులు, కళాశాలలు ఎక్కడా ఇబ్బంది పడకుండా చర్యలు చేపట్టింది. చదువుల విషయంలో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించింది. 2017 నుంచి 2019 మధ్య అధికారంలో ఉండగా టీడీపీ ప్రభుత్వం 16.73 లక్షల మంది విద్యార్థులకు రూ.1,778 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెట్టింది. వీటి చెల్లింపుల్లో నాటి ప్రభుత్వం అలసత్వం వహించడంతో కళాశాలలు ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. విద్యార్థులు సర్టిఫికెట్లు, హాల్ టికెట్ల కోసం అప్పులు చేసి డబ్బులు కట్టాల్సిన దుస్థితి వచ్చింది. దీన్ని దృష్టిలో పెట్టుకుని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదింటి బిడ్డల విద్యను బాధ్యతగా భావించి ఆ బకాయిల మొత్తాన్ని చెల్లించింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రాజకీయ కోణంలో చూస్తూ బాధ్యతను మరిచి వ్యవహరిస్తోంది. విద్యార్థులకు షెడ్యూల్ ప్రకారం అందాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై మీనమేషాలు లెక్కిస్తోంది. ఈ ఏడాది నుంచి ఫీజురీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని కళాశాలల ఖాతాల్లో జమ చేసే ఆలోచనలో భాగంగా.. 2023–24 విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ఇవ్వాల్సిన మొత్తాన్ని ఎగ్గొట్టేందుకు ప్రణాళిక వేస్తున్నట్టు తెలుస్తోంది.

గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇలా..

విద్యాసంస్థ	కోర్సు	ఫీజు
ట్రిపుల్ ఐటీ శ్రీసిటీ	బీటెక్(ఈసీఈ)	రూ.3,05,000
దామోదరం సంజీవయ్య లా వర్సిటీ	ఎల్ఎల్‌బీ(5ఏళ్లు)	రూ.2,45,900
ఎస్వీ అగ్రికల్చర్ కాలేజ్ తిరుపతి	ఎంబీఏ(అగ్రి బిజినెస్)	రూ.1,96,460
ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్	ఎంబీఏ	రూ.1,83,650
ఏఎన్‌యూ	ఎంఎస్సీ(ఫోరెన్సిక్ కెమిస్ట్రీ)	రూ.1,80,750
శ్రీ కృష్ణదేవరాయ కాలేజీ	బీఎస్సీ(హార్టికల్చర్)	రూ.1,73,090
ఏయూ ఫార్మాస్యూటికల్స్ సైన్స్	ఎంఫార్మా(స్పెషల్)	రూ.1,58,500
చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్స్	ఫార్మా-డీ	రూ.1,25,000

చెల్లింపులపై దుష్ప్రచారం..

ఐటీఐ నుంచి ఐఐటీ, వైద్య విద్య వరకు జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తూ విద్యార్థులకు వైఎస్ జగన్ అండగా నిలిచారు. వైఎస్సార్ సీపీ హయాంలో 29.65 లక్షల మంది విద్యార్థులకు రూ.12,609.68 కోట్లు జగనన్న విద్యాదీవెన కింద ట్యూషన్ ఫీజులు చెల్లించారు. 25.17 లక్షల మంది విద్యార్థులకు వసతి దీవెన కింద హాస్టల్-మెస్ చార్జీల కోసం మరో రూ.4,275.76 కోట్లు అందచేశారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం విద్యా దీవెన, వసతి దీవెనల కింద దాదాపు రూ.18,663 కోట్లకుపైగా (పాత బకాయిలతో కలిపి) వెచ్చించారు. ఎన్నికలకు ముందు షెడ్యూల్ ఇచ్చి మరీ నిధులు విడుదల చేసినా తల్లిదండ్రుల ఖాతాల్లో జమ కాకుండా నాడు ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ కుట్రలు చేసింది. విద్యార్థులకు అన్యాయం జరగకూడదని జగన్ ప్రభుత్వం కోర్టును ఆశ్రయించడంతో నిధుల విడుదలకు ఒక రోజు సమయం (పోలింగ్‌కు ముందు) ఇచ్చింది. దీనిపైనా మరోసారి టీడీపీ మద్దతుదారులు కోర్టుకు వెళ్లడంతో కేసు విచారణ జరిగేలోపే ఆ ఒక్కరోజు సమయం కాస్తా గడిచిపోయింది. ఫలితంగా ఈ చెల్లింపులు నిలిచిపోయాయి. అనంతరం కొంత మంది ఖాతాల్లో మాత్రమే ఫీజు రీయింబర్స్‌మెంట్ జమైంది. మిగిలిన మొత్తంతో పాటు జూన్‌లో ఇవ్వాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన మొత్తాన్ని చెల్లించే విషయంపై కూటమి ప్రభుత్వం ఇంతవరకూ ఒక్క ప్రకటన కూడా చేయలేదు. కొత్త ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించకపోగా గత ప్రభుత్వంపై నెపం వేసే యత్నం చేస్తోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ.1,300 కోట్లు, వసతి దీవెనతో రూ.1,100 కోట్లు చెల్లించకుండా దుష్ప్రచారం చేస్తూ ఎగ్గొట్టేలా వ్యవహరిస్తోంది. ఇదే జరిగితే విద్యార్థుల కుటుంబాలు అప్పులు ఊబిలో కూరుకుపోయి చదువులు గాలిలో దీపంలా మారే ప్రమాదం ఉందని విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆదాయ పరిమితి పెంపుతో లబ్ధి

వసతి ఖర్చులకు సంబంధించి 2014–19 మధ్య రూ.4 వేల నుంచి రూ.10 వేల స్లాబ్ పెట్టి ఇవ్వగా వైఎస్ జగన్ ఆ విధానాన్ని తొలగించి వసతి దీవెన ద్వారా అర్హత ఉన్న ప్రతి విద్యార్థికీ సమానంగా ఆర్థిక సాయం అందించారు. పేద విద్యార్థులకు భోజన వసతి ఖర్చుల కోసం ఏడాదికి ఐటీఐ విద్యార్థులకు రూ.10 వేలు, పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ.15 వేలు, డిగ్రీ, ఇంజనీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు అభ్యసించే వారికి రూ.20 వేల చొప్పున ఆర్థిక సాయాన్ని అందజేశారు. వీలైనంత ఎక్కువ మంది విద్యార్థులకు ప్రయోజనం కల్పించే లక్ష్యంతో కుటుంబ వార్షిక ఆదాయ పరిమితిని పెంచారు. గతంలో బీసీ, ఈబీసీ, కాపు, మైనార్టీలకు రూ.లక్ష, ఎస్సీ, ఎస్టీ, డీబ్ల్యూలకు రూ.2 లక్షలు పరిమితి ఉండగా అన్ని వర్గాల వారికి కుటుంబ వార్షిక ఆదాయ పరిమితిని రూ.2.5 లక్షలకు పెంచి ఎక్కువ మందికి లబ్ధి చేకూర్చారు.

ఎప్పుడొస్తుందో ఏమో...



భీమవరం డాక్టర్ సీఎస్ఎన్ డిగ్రీ కాలేజీలో బీఎస్సీ చదువుతున్నా. గత 8 పర్యాయాలు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఠంచనుగా వచ్చింది. ఈసారి ఇంతవరకూ రాలేదు. గత ప్రభుత్వ హయాంలో అన్నీ సకాలంలో అందేవి. నేడు రీయింబర్స్‌మెంట్ ఎప్పుడొస్తుందో తెలియడం లేదు.
– పచ్చిగోళ్ల లక్ష్మీ నర్సింహ శ్రీదత్త, బీఎస్సీ స్టూడెంట్, భీమవరం, పశ్చిమ గోదావరి జిల్లా

పీజీ సెట్‌లో ర్యాంకు వచ్చినా..



విశాఖ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ లా కాలేజీలో ఇటీవలే గ్రాడ్యుయేషన్ పూర్తి చేశా. ఏపీ పీజీ సెట్‌లో స్టేట్ 170వ ర్యాంకు వచ్చింది. గతేడాదికి సంబంధించి రూ.50 వేల వరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు రావాలి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే ఉంటే సకాలంలో మా ఖాతాల్లో జమ అయ్యేవి. ప్రభుత్వం మారటం వల్ల మాకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆలస్యం అవుతోంది. పీజీ సెట్‌లో ర్యాంకు వచ్చినా ఫీజు డబ్బులు చెలించాల్సి ఉన్నందున టీసీ తీసుకోలేని పరిస్థితి ఉంది. గత ప్రభుత్వంపై నిందలు మోపటం మానుకుని నాలాంటి విద్యార్థులకు భరోసా కల్పిస్తూ ఫీజుల డబ్బులు వెంటనే మంజూరు చేయాలి. – మేడూరి నవీన్ దాస్, విశాఖపట్నం

పేద విద్యార్థులను ఆదుకోవాలి..



మార్కాపురం ఎస్‌జీఐటీ పాలిటెక్నిక్ కళాశాలలో ఈఈఈ సెకండియర్ చదువుతున్నా. గతంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ తీసుకున్నా. చివరి విద్యా సంవత్సరానికి సంబంధించి రీయింబర్స్‌మెంట్ రావాల్సి ఉంది. నాన్న శ్రీనివాసులు లారీ డ్రైవర్, అమ్మ మహాదేవి గృహిణి. ఫీజులు చెల్లించాలని యాజమాన్యం ఒత్తిడి చేస్తోంది. మాలాంటి నిరుపేదలను దృష్టిలో ఉంచుకుని ఫీజు డబ్బులు వెంటనే విడుదల చేయాలి. – మోహన్, ఆదోని, కర్నూలు జిల్లా

చదువులు సజావుగా సాగాలంటే..



జగనన్న విద్యాదీవెన మా అబ్బాయి డిగ్రీ చదువుకునేందుకు ఎంతో దోహదపడింది. క్రమం తప్పకుండా నేరుగా నా ఖాతాలో జమ చేశారు. విద్యా దీవెన వల్ల ఇన్నాళ్లూ చదువులు ఎలాంటి ఇబ్బంది లేకుండా సాగాయి. ఇక మీదట కూడా పథకాన్ని కూటమి ప్రభుత్వం కొనసాగించాలి. నా బిడ్డ చదువు మరో రెండేళ్ల సజావుగా సాగాలంటే విద్యాదీవెన కొనసాగాలి.
– బోయిన లక్ష్మి, మరిపల్లి, సాలూరు మండలం

గతంలో ఎలాంటి ఇబ్బంది లేదు



గత ప్రభుత్వ హయాంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో అందేది. ఎలాంటి ఇబ్బందులు పడలేదు. కాలేజీల్లో సర్టిఫికెట్లు ఇవ్వడం లేదనే సమస్యే ఉండేది కాదు. మా అబ్బాయి బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. గత రెండేళ్ల రీయింబర్స్‌మెంట్ వచ్చింది.
– వాసుపల్లి ధనుంజయరావు, అవనిగడ్డ

నిర్లక్ష్యం తగదు...



ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోవడం వల్ల కళాశాల నుంచి సర్టిఫికెట్లు తీసుకోలేని పరిస్థితి ఏర్పడింది. గతంలో ఎలాంటి ఆటంకాలూ లేకుండా సర్టిఫికెట్లు ఇచ్చారు. ప్రస్తుత ప్రభుత్వం విద్యార్థులకు సర్టిఫికెట్ల జారీపై నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు చెల్లించాలి.
– పెంకే రవితేజ, విద్యార్థి జేఏసీ కన్వీనర్, కాకినాడ

ఫీజు కట్టలేదని టీసీ ఇవ్వలేదు



కడప కాలేజీలో బీకాం చదివా. నా కోర్సు పూర్తయినా ఫీజు డబ్బులను ప్రభుత్వం చెల్లించకపోవడంతో కాలేజీ యాజమాన్యం టీసీ ఇవ్వటం లేదు. గతంలో జగనన్న విద్యా దీవెన ద్వారా సకాలంలో ఫీజులు చెల్లించారు. కొత్త ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో తెలియడంలేదు.
– పి శివప్రసాద్, బీకాం, కడప, వైఎస్సార్ జిల్లా

ఇదేం విష సంస్కృతి!?

- పార్టీ ఆఫీసులు, ప్రభుత్వ భవనాలపై దాడులు సరికాదు
- మాజీమంత్రి బొత్స సత్యనారాయణ



విజయనగరం: పార్టీ ఆఫీసులు, ప్రభుత్వ భవనాలపై దాడులు, యూనివర్సిటీల్లో వీసీలను బెదిరించడం వంటి విషసంస్కృతి తన 30 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎప్పుడూ చూడలేదని మాజీమంత్రి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ తెలిపారు. దౌర్జన్యాలు, కిరాతక చర్యలకు ప్రజాస్వామ్యంలో తావులేదన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఇలాంటి దుశ్చర్యలు కొనసాగకూడదని హితవు పలికారు. అధికారంలో ఉన్న వారు సంయమనం పాటించాలని సూచించారు. విజయనగరంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..

ప్రైవేట్ ఆస్తులపై దాడులా?

టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చోటుచేసుకుంటున్న పరిణామాలు చాలా బాధాకరంగా ఉన్నాయి. ప్రజాస్వామ్యంలో ఇలాంటి పరిణామాలు ఉండకూడదు. అధికారంలో ఉన్న పార్టీ నేతలు, ఎమ్మెల్యేలు ఇటీవల విజయనగరంలో వైఎస్సార్‌సీపీ ఆఫీసుకు వచ్చి బెదిరించారు. గతంలో ఇలాంటి సంస్కృతి ఎప్పుడూలేదు. చట్టానికి విరుద్ధంగా ఉన్నాయంటే చట్టపరంగానే చర్యలు తీసుకోవాలి. పార్టీ ఆఫీసులను కూల్చేయడం, బెదిరించడం నా 30 ఏళ్ల రాజకీయ జీవితంలో చూడలేదు. ఇదిలాగే కొనసాగితే సివిల్ వార్‌గా మారే ప్రమాదముంది.

వీసీలను బెదిరిస్తారా?

యూనివర్సిటీల వీసీలను రాజీనామాలు చేయాలంటూ రాజకీయ ఒత్తిళ్లు చేయడం అస్సలు సమంజసం కాదు. వీసీగా నామినేట్ అయిన వ్యక్తి పనితీరు బాగా లేదనిపిస్తే విచారణ చేసుకోవాలి. ఎన్నికైన నేతలు 200–300 మందిని తీసుకుని ఆఫీసులకెళ్లి బెదిరింపులకు పాల్పడడం తప్పు. ఇక మా ప్రభుత్వంలో 6,100 పోస్టులతో డీఎస్సీ ప్రకటించాం. టెట్ కూడా నిర్వహించాం. ఆ సమయంలో 50 వేల పోస్టులు ఖాళీ ఉన్నాయని వారే చెప్పారు. మెగా డీఎస్సీ అని 25 వేల పోస్టులైనా ఇస్తారనుకున్నాం.. కానీ, 16 వేల పోస్టులకే ఎందుకు పరిమితమయ్యారో తెలీడంలేదు. మా ప్రభుత్వంలో ఒక్క డీఎస్సీ ఉద్యోగం కూడా ఇవ్వలేదనడం తప్పు. 15 వేల పోస్టుల వరకు ఇచ్చాం.

రుషికొండలోవి పూర్తిగా ప్రభుత్వ భవనాలే..

అలాగే, విశాఖ రుషికొండలో నిర్మించిన ప్రభుత్వ భవనాలను ఎలా ఉపయోగించుకుంటారో ప్రభుత్వంలో ఉన్న వారి ఇష్టం. రాష్ట్రపతి, ప్రధాని, గవర్నర్ విడిది కోసం వాటిని వాడుకోవచ్చు. అవి పూర్తిగా ప్రభుత్వ భవనాలే. ఇంతకుముందు ఉన్న భవనాల స్థానంలోనే అత్యాధునికంగా నిర్మించాం. ప్రస్తుత ప్రభుత్వం రూ.4,000 పింఛన్ పథకాన్ని అమలుచేయడాన్ని స్వాగతిస్తున్నామని, మిగిలిన ఐదు గ్యారంటీలు అమలుచేసే శక్తిని ఆ భగవంతుడు రాష్ట్ర ప్రభుత్వానికి ఇవ్వాలని కోరుకుంటున్నాం. సంక్రాంతి వరకు పాలన చూసిన తరువాత స్పందిస్తాం.

పోలవరం ప్రాజెక్టును పరిశీలించిన అంతర్జాతీయ నిపుణులు



ఎగువ కాఫర్ డ్యామ్ వద్ద పనులను పరిశీలిస్తున్న అంతర్జాతీయ నిపుణుల బృందం సభ్యులు

సాక్షి, అమరావతి/పోలవరం రూరల్: పోలవరం ప్రాజెక్టును అంతర్జాతీయ నిపుణులు డేవిడ్ బి.పాల్, గియాస్ ఫ్రాంకో డి సిస్కో, రిచర్డ్ డొన్నెల్లీ, సీస్ హించ్‌బెర్గర్, యాఫ్రి సంస్థ ప్రతినిధులు ఆదివారం పరిశీలించారు. కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) డైరెక్టర్ అశ్వనీకుమార్, జలవనరుల శాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, సీఈ నరసింహమూర్తి, సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్ రీసెర్చ్ స్టేషన్ (సీఎస్ఎంఆర్ఎస్), వ్యాప్కోస్ అధికారులతో కలిసి అంతర్జాతీయ నిపుణులు ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు, లీకేజీలను నిశితంగా పరిశీలించారు. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు కట్టడానికిముందు లీకేజీలకు అడ్డుకట్ట వేయడానికి జెట్ గ్రౌటింగ్ చేసిన విధానాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. వరద ఉధృతి గరిష్ఠంగా ఉన్నప్పుడు, కనిష్ఠంగా ఉన్నప్పుడు ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లలో లీకేజీల స్థాయి ఎంత ఉందని అడిగారు. కాఫర్ డ్యామ్‌ల లీకేజీలను తెలుసుకోవడానికి ఇప్పటిదాకా నిర్వహించిన పరీక్షల ఫలితాలపై ఆరా తీశారు. ఫొటో ఎగ్జిబిషన్‌ను చూసి, మ్యాప్ ద్వారా పనుల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల పరిస్థితిపై జలవనరులశాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, సీఈ నరసింహమూర్తి, అధికారులతో సమీక్షించారు. సోమవారం ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్–1, గ్యాప్–2లను పరిశీలించి, కోతకు గురైన ప్రాంతంలో ఇసుకను నింపి వైబ్రోకాంపాక్షన్ ద్వారా యథాస్థితికి తెచ్చిన పనులను తనిఖీ చేయనున్నారు. ఆ తర్వాత ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్–2లో కోతకుగురై దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్‌ను పరిశీలించనున్నారు.

నేటి భవితలో..

బ్యాంక్ జాబ్స్

బ్యాంక్ ఆఫ్ బరోడా.. కొలువుల పిలుపు

ప్రొఫెషనల్ కోర్సులు పూర్తి చేసి బ్యాంకింగ్ రంగంలో కెరీర్ కోరుకుంటున్న వారికి ప్రభుత్వ రంగ బ్యాంకు.. బ్యాంక్ ఆఫ్ బరోడా స్వాగతం పలుకుతోంది! ఎంఎంజీఎస్–2, 3, ఎస్ఎంజీఎస్–4 హోదాల్లో.. 168 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇది మేనేజ్‌మెంట్ పీజీ, సీఏ తదితర కామర్స్ ప్రొఫెషనల్ కోర్సులు పూర్తి చేసుకున్న అభ్యర్థులకు చక్కటి అవకాశం!!ఈ ఉద్యోగాలను సొంతం చేసుకోవడానికి బ్యాంక్ ఆఫ్ బరోడా నిర్వహించే ఎంపిక ప్రక్రియలో ప్రతిభ చూపాల్సి ఉంటుంది. బ్యాంక్ ఆఫ్ బరోడా తాజా జాబ్ నోటిఫికేషన్ వివరాలు, ఎంపిక విధానం, కెరీర్ స్కోప్, ఎంపిక ప్రక్రియలో రాణించేందుకు ప్రిపరేషన్ తదితర వివరాలు..

గ్రూప్1, గ్రూప్ 2 ప్రత్యేకం

ఇండియన్ పాలిటీ స్టడీ మెటీరియల్‌తో పాటు, విద్యా ఉద్యోగ సమాచారం..

నేటి భవిత పేజీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

వేస్ అండ్ మీన్స్, ఓడీ పరిమితుల పెంపు

- అన్ని రాష్ట్రాలకు, యూటీలకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.47,010 కోట్ల పరిమితి
- దీన్ని జూలై 1 నుంచి రూ.60,118 కోట్లకు పెంచిన ఆర్బీఐ
- ఏపీకి రూ.2,252 కోట్ల నుంచి రూ.2,921 కోట్లకు పెంపు
- కమిటీ సిఫార్సుల ఆధారంగా రాష్ట్రాలకు వెసులుబాటు

సాక్షి, అమరావతి : రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఆర్థిక వెసులుబాటు కల్పించేందుకు వేస్ అండ్ మీన్స్ అడ్వాన్స్ పరిమితులను రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) పెంచింది. ప్రస్తుతం అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు వేస్ అండ్ మీన్స్ అడ్వాన్స్ పరిమితి రూ.47,010 కోట్లు ఉండగా, జూలై 1 నుంచి ఈ పరిమితిని రూ.60,118 కోట్లకు పెంచుతున్నట్లు ఆర్బీఐ ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాల ఆర్థిక వెసులుబాటు కోసం వేస్ అండ్ మీన్స్ అడ్వాన్స్ పరిమితిని పెంచేందుకు ఆర్బీఐ ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాల ఆర్థిక శాఖ కార్యదర్శులతో ఏర్పాటుచేసిన కమిటీ సూచనల మేరకు ఈ పరిమితులను పెంచినట్లు ఆర్బీఐ పేర్కొంది. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు జారీచేసిన సెక్యూరిటీలలో పెట్టుబడుల పరిమాణం, ట్రెజరీ బిల్లుల వేలం, గ్యారెంటీ రిడెంప్షన్ ఫండ్ తదితరాల ఆధారంగా ఈ పరిమితులను పెంచినట్లు రిజర్వ్ బ్యాంకు తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వాల అత్యవసర వ్యయాలకు నిధులు లభ్యత లేని పక్షంలో ఆర్థిక వెసులుబాటుకు వేస్ అండ్ మీన్స్ అడ్వాన్స్‌లను, ఓవర్ డ్రాఫ్టల ద్వారా ఆర్బీఐ నుంచి తాత్కాలికంగా నిధులను పొందేందుకు వెసులుబాటు కల్పిస్తారు. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ప్రస్తుతం వేస్ అండ్ మీన్స్ అడ్వాన్స్ పరిమితి రూ.2,252 కోట్లు ఉండగా.. జూలై 1 నుంచి రూ.2,921 కోట్లకు పెంచుతూ ఆర్బీఐ నిర్ణయం తీసుకుంది. అలాగే, మిగతా రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు కూడా ఈ పరిమితులను పెంచింది.

పింఛన్ల పంపిణీకి ఆఫీసులోనే రాత్రి బస

- ఉ.6గంటలకు ప్రారంభించకపోతే క్రమశిక్షణ చర్యలు
- సచివాలయాల సిబ్బందికి ఉన్నతాధికారుల హెచ్చరిక
- నేడు పెనుమాకలో సీఎం చేతుల మీదుగా ప్రారంభం



సీఎం పింఛన్లు పంపిణీ చేయనున్న ప్రదేశంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న శశిభూషణ్‌కుమార్, ఎస్.నాగలక్ష్మి తదితరులు

సాక్షి, అమరావతి/తాడేపల్లి రూరల్: గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ద్వారా లబ్ధిదారుల ఇంటివద్దే పింఛన్ల పంపిణీని చేపడుతున్నందున ఉన్నతాధికారుల ఆదేశాలతో పలు జిల్లాల్లో సచివాలయాల సిబ్బంది ఆదివారం రాత్రి తాము పనిచేసే సచివాలయంలోనే బస చేశారు. ఆదివారం సెలవు రోజైనప్పటికీ పింఛన్ల పంపిణీ కోసం సిబ్బంది అంతా సచివాలయానికి హాజరై ఏర్పాట్లుచేసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. సోమవారం ఉ.6 గంటల నుంచే పింఛన్ల పంపిణీ కార్యక్రమాలు మొదలుపెట్టాల్సిన నేపథ్యంలో సిబ్బంది అంతా ఆదివారం రాత్రి సచివాలయం పరిధిలోనే బసచేయాలని పలుచోట్ల జిల్లాల ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారని.. దీంతో అత్యధిక శాతం మంది సచివాలయాల్లోనే బసచేశారని ఉద్యోగ ప్రతినిధులు తెలిపారు. ఉ.6 గంటలకు పింఛన్ల పంపిణీ ప్రారంభించని వారిపై క్రమశిక్షణ చర్యలు చేపడతామని కూడా హెచ్చరించారని వారన్నారు. కాగా, ఒకటో తేదీనే దాదాపు వీలైనంత ఎక్కువమందికి పింఛన్ల పంపిణీ పూర్తిచేయాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీచేసిన నేపథ్యంలో చాలా జిల్లాల్లో ఉన్నతాధికారులు సచివాలయాల వారీగా గంట గంటకు పంపిణీని పర్యవేక్షించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశారు. జిల్లా, రెవెన్యూ డివిజన్ స్థాయిలోనూ డీఎల్‌డీఓలు, డీపీఓలను పర్యవేక్షణ అధికారులుగా నియమించారు.

పంపిణీకి 30వేల మంది సిబ్బంది..

ఇదిలా ఉంటే.. సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా పంపిణీ చేసే పింఛన్ల కార్యక్రమానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ అన్నారు. తాడేపల్లి మండలం, పెనుమాక గ్రామంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా జూలై 1న ఉ.6 గంటలకు పింఛన్ల పంపిణీ ప్రారంభమవుతుందని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా అక్కడి ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. పింఛన్ల పంపిణీకి దాదాపు 30 వేల మంది ప్రభుత్వోద్యోగులను నియమించామన్నారు.

క్లుప్తంగా...

ప్రత్యేకహోదా సాధనకు కేంద్రంపై ఒత్తిడి తేవాలి

చంద్రబాబుకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్



తాడేపల్లి రూరల్: రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించేందుకు బిహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ లాగా ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విభజన జరిగి పదేళ్లయినా రాష్ట్ర అభివృద్ధి అంతంతమాత్రంగానే ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర విభజన సమయంలో పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదని, 2014 ఎన్నికల సందర్భంగా నరేంద్రమోదీ తిరుపతి వెంకన్న సాక్షిగా ఏపీకి పదేళ్లు ప్రత్యేకహోదా ఇస్తామన్న వాగ్దానం నీటిమూటగానే మిగిలిందని విమర్శించారు. ప్రస్తుతం నరేంద్రమోదీ ప్రధానిగా ఉన్న కేంద్ర ప్రభుత్వానికి 16 ఎంపీ స్థానాలతో తెలుగుదేశం, 12 ఎంపీ స్థానాలతో జేడీ (యు) మద్దతిస్తున్నాయని, కేంద్ర ప్రభుత్వ మనుగడకు ఈ పార్టీలు కీలకంగా మారాయని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో ఎన్డీఏ భాగస్వామి అయిన జేడీ (యు) బిహారుకు ప్రత్యేకహోదా లేదా ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ కోసం డిమాండ్ చేస్తూ తీర్మానం చేసిందని తెలిపారు. మన రాష్ట్ర అభివృద్ధి కోసం హోదా, విభజన చట్ట హామీల అమలుకు, రాష్ట్రానికి దక్కాల్సిన నిధుల విడుదల కోసం చంద్రబాబు ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

రాష్ట్రంలో విధ్వంస పాలన

ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి సదరుద్దీన్ ఖురేషి

సాక్షి, అమరావతి: సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రవ్యాప్తంగా విధ్వంస పాలన సాగుతోందని ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి సదరుద్దీన్ ఖురేషి ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని టీడీపీ ప్రభుత్వం కక్ష సాధింపునకు వినియోగిస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో అధికారం చేపట్టిన తొలి రోజు నుంచే వైఎస్సార్‌సీపీ కార్యాలయాలను కూల్చివేయడం, శిలాఫలకాలను ధ్వంసం చేయడం, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలను దహనం చేయడం వంటి దుశ్చర్యలకు దిగారని, వీటన్నింటినీ ప్రజలు గమనిస్తున్నారని హెచ్చరించారు. రాష్ట్రంలో మునుపెన్నడూ లేనివిధంగా టీడీపీ ప్రభుత్వ అరాచకాలు, విధ్వంసాలు సాగుతున్నాయన్నారు. టీడీపీ దుశ్చర్యలను ప్రజాస్వామ్యవాదులంతా ఖండించాలని విజ్ఞప్తి చేశారు.

వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాల పేరు మార్పు



ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంగా పేరు మార్చిన టీడీపీ ప్రభుత్వం

డోన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గ్రామాల్లో నిర్మించిన వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాల పేరును టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మార్చివేసింది. వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాల పేరును ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌గా మార్పు చేసింది. గత ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాలను నిర్మించి ప్రజల వద్దకే వైద్యసేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. 'ఫ్యామిలీ డాక్టర్' పేరుతో వైద్యులు, సిబ్బంది వారానికి రెండు రోజులు ఇంటింటికీ వెళ్లి రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేసేలా చూసింది. కానీ, ప్రస్తుత ప్రభుత్వం దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి పేరు, ఫొటో ఆరోగ్య కేంద్రాలపై కనిపించకూడదనే ఉద్దేశంతో వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాల పేరును ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌గా మార్పు చేసింది.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ శ్రేణుల దాడి



ఆస్పత్రిలో శ్రీనివాస్

ధర్మవరం: శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం మండలం గొట్లూరులో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ కార్యకర్తలు ఆదివారం రాత్రి దాడిచేశారు. రాళ్లు, కర్రలతో కొట్టి ముగ్గురిని తీవ్రంగా గాయపరిచారు. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్ శ్రీనివాసులు, కార్యకర్తలు ఫక్కీరప్ప, రామకృష్ణ కూలిపనులు చేస్తూ జీవిస్తుంటారు. వైఎస్సార్‌సీపీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత టీడీపీ కార్యకర్తలు రెచ్చిపోయారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దౌర్జన్యానికి దిగి గ్రామం వదిలి వెళ్లాలంటూ బెదిరించారు. ఈ క్రమంలోనే ఆదివారం రాత్రి శ్రీనివాసులు, ఫక్కీరప్ప, రామకృష్ణ రోజువారీ పనులు ముగించుకుని ద్విచక్రవాహనంపై ఇంటికి వెళుతుండగా గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయ సమీపాన టీడీపీ కార్యకర్తలు దాడిచేశారు. రాళ్లు, కర్రలతో కొట్టడంతో శ్రీనివాసులు, ఫక్కీరప్ప, రామకృష్ణ తీవ్రంగా గాయపడ్డారు. వారిని గ్రామస్తులు ఆటోలో ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతున్నారు. గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు తలారి చిరంజీవి, తలారి తిరుపాల్, చిన్నా, అంజి, తిరుమలేషు తమపై దాడిచేశారని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పుంగనూరుకు వెళ్లొద్దు

ఎంపీ మిథున్, ఎమ్మెల్యే పెద్దిరెడ్డిలపై ఆంక్షలు

- నియోజకవర్గంలో పర్యటించడానికి వీల్లేదన్న పోలీసులు
- పెద్దిరెడ్డి నివాసం గోడలు దూకి హడావుడి
- వకుళమాత ఆలయానికి కూడా వెళ్లనివ్వని వైనం
- ఇది కక్ష సాధింపు: ఎంపీ మిథున్‌రెడ్డి

సాక్షి, తిరుపతి టాస్క్‌ఫోర్స్: రాజంపేట పార్లమెంట్ పరిధిలోని పుంగనూరు ఎమ్మెల్యేగా గెలిచిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిని ఆ నియోజకవర్గంలో పర్యటించకుండా పోలీసులు అడ్డుకుంటున్నారు. శాంతి భద్రతల పేరుతో వారి పర్యటనలకు అడ్డు చెబుతున్నారు. కార్యకర్తల సమావేశంలో పాల్గొనడంతో పాటు కూటమి నేతల దాడుల్లో నష్టపోయిన వారిని పరామర్శించి, భరోసా కల్పించాలని ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి నిర్ణయించారు. ఆదివారం పార్లమెంట్ సమావేశాలు ఉండవు కాబట్టి ఢిల్లీ నుంచి తిరుపతి చేరుకున్నారు. ఇక్కడి నుంచి పుంగనూరుకు వెళ్లే సమయంలో పోలీసులు ఆదివారం ఆయన నివాసానికి చేరుకుని అక్కడికి వెళ్లడానికి వీల్లేదని హుకుం జారీ చేశారు. ఎంపీకి నోటీసులు ఇచ్చేందుకు గోడలు దూకి హడావుడి చేశారు. తిరుపతిలోని వకుళమాత ఆలయానికి కూడా వెళ్లడానికి వీలు లేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని హౌస్ అరెస్ట్ చేశారు. పర్యటిస్తే శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందని సాకు చెప్పారు. అంతటితో ఆగని పోలీసులు.. ఎమ్మెల్యే పెద్దిరెడ్డిని కలిసేందుకు వచ్చిన నియోజకవర్గ ప్రజలను సైతం లోనికి రానివ్వకుండా అడ్డుకున్నారు. వంద మీటర్ల దూరంలో బారికేడ్లు ఏర్పాటు చేసి, పెద్దిరెడ్డి నివాసంలోకి ఎవరూ వెళ్లేందుకు లేకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రజలను కలిసేందుకు కూడా ఒప్పుకోలేదు. ఇదే సమయంలో పుంగనూరు నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో పలువురు వైఎస్సార్‌సీపీ నేతలను అదుపులోకి తీసుకున్నారు. తమ ఆదేశాలను పాటించకపోతే కేసులు పెడతామని బెదిరించారు.

నా నియోజకవర్గానికి నేను వెళ్లకూడదా?

ఎన్నికల ఫలితాల అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై కూటమి నేతలు భౌతిక దాడులకు పాల్పడుతున్నారని, గతంలో ఎన్నడూ లేని సంస్కృతికి తెరలేపారని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి మండిపడ్డారు. తిరుపతిలోని తన నివాసంలో ఆదివారం ఉదయం ఆయన విలేకరుల సమావేశంలో కూటమి ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు దిగిందన్నారు. నియోజకవర్గంలో ఎలక్ట్రికల్ బస్సు కంపెనీ రాకుండా, పెట్టుబడులు రాకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఇన్ని గొడవల నేపథ్యంలో ఎలక్ట్రిక్ బస్సుల ఫ్యాక్టరీ యాజమాన్యం సందిగ్ధంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో పుంగనూరుకు ఏ పరిశ్రమలు రాకుండా కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. తన నియోజక వర్గంలో పర్యటించకుండా, ప్రజల్ని కలవకుండా అడ్డుకోవడం దారుణమని మండిపడ్డారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పేదల ఆస్తులను ధ్వంసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. జేసీబీలు తీసుకొచ్చి వైఎస్సార్‌సీపీ నాయకుల మామిడి తోటలు, ఆస్తులు, కుటుంబ సభ్యుల వాహనాలను ధ్వంసం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో పేదల ఆవులు కూడా ఎత్తుకెళ్లిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 'ఎన్నికల సమయంలో రాజకీయంగా పోరాడితే అందరం స్వాగతిస్తాం. కానీ పేదల ఇళ్లపై దాడులు చేయడం దారుణం. మా వారిని పరామర్శించడానికి వెళుతుంటే పోలీసులు అడ్డుకోవడం ఏమిటి? నా నియోజకవర్గంలో నేను పర్యటించకూడదా? ఈ విషయాన్ని స్పీకర్ దృష్టికి తీసుకెళ్తా. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టింది. వైఎస్సార్‌సీపీకి 40 శాతం మంది ఓటేశారని, వారందరినీ రాష్ట్రం నుంచి తరిమేస్తారా?' అని నిప్పులు చెరిగారు.

అరెస్టుకైనా, ప్రాణ త్యాగానికైనా సిద్ధం

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు, నాయకులకు అండగా ఉంటామని ఎంపీ మిథున్‌రెడ్డి స్పష్టం చేశారు. పార్టీ మారాలని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను బెదిరింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. తాను బీజేపీలోకి వెళ్తున్నానని బుద్ధి లేని వారు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. చల్లా బాబును అనేక సంవత్సరాల నుంచి చూస్తున్నప్పటికీ, ఇలాంటివి ఎప్పుడూ లేవని, బాబు ట్రాప్‌లో పడొద్దని హితవు పలికారు. గతంలో పోలీసులపై దాడి చేసిన చల్లా బాబు జైలుకు వెళ్లారన్న విషయాన్ని గుర్తు చేశారు. ప్రజల కోసం తాను అరెస్టుకైనా, ప్రాణ త్యాగానికైనా సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. మంత్రి పదవిని కాపాడుకోవడానికే రాంప్రసాద్ తమపై విమర్శలు చేస్తున్నారని చెప్పారు.

పుంగనూరులో ఉద్రిక్తత



పుంగనూరులో ఆందోళన చేస్తున్న కూటమి నేతలు

పుంగనూరు: ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యే, ఎంపీలు తమ సొంత నియోజకవర్గాలలో తిరగరాదని హెచ్చరికలు చేస్తూ టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు రోడ్లపై ధర్నాలు, రాస్తారోకోలు చేస్తున్న ఘటనలు ప్రజలను విస్మయానికి గురిచేస్తున్నాయి. ఆదివారం రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి పుంగనూరులో కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ విషయం తెలుసుకున్న కూటమి నేతలు పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో ధర్నా చేపట్టి, నల్లజెండాలతో నిరసనకు దిగారు. ఎమ్మెల్యే, ఎంపీలు రాకూడదంటూ దూషణల పర్వం కొనసాగించారు. సుమారు రెండు గంటల సేపు హైడ్రామా సాగింది. ఈ నెల15న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి పుంగనూరు పర్యటన సమయంలో కూడా కూటమి నేతలు ఇలాగే అడ్డుకున్నారు. కూటమి నేతల తీరుతో జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. పోలీసులు ఎంపీ మిథున్‌రెడ్డిని తిరుపతిలో హౌస్ అరెస్ట్ చేశామని తెలపడంతో కూటమి శ్రేణులు శాంతించారు.

భద్రత కోసమే ఎంపీ మిథున్‌రెడ్డిని అడ్డుకున్నారు

- అక్కడి ప్రజలు కోపోద్రిక్తులై ఉన్నందునే ఎస్పీ అనుమతించలేదు
- రవాణా మంత్రి మండిపల్లి ధ్వజం



గోపాలపట్నం (విశాఖ పశ్చిమ): పుంగనూరులో ఒక సంఘటన జరిగితే కార్యకర్తలను పరామర్శించేందుకు వెళ్తున్న ఎంపీ మిథున్ రెడ్డిని అనుమతించక పోవడం అక్కడి పరిస్థితుల రీత్యా సబబేనని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖా మంత్రి మండిపల్లి రామప్రసాద్‌రెడ్డి అన్నారు. అక్కడి ప్రజలు కోపోద్రిక్తులై ఉన్నందున శాంతి భద్రతల సమస్య తలెత్తుతుందని జిల్లా ఎస్పీ ముందు జాగ్రత్తగా ఎంపీని అనుమతించ లేదని చెప్పారు. దీన్ని రాజకీయం చేయడం తగదన్నారు. 11 మంది ఎమ్మెల్యేలతో వైఎస్సార్‌సీపీకి ప్రతిపక్ష హోదా కూడా దక్కలేదని, అలాంటి పార్టీ నాయకులు తమపై అభాండాలు వేసేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. నగరంలో పలు ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఆదివారం మధ్యాహ్నం ఆయన విశాఖ చేరుకున్నారు. ఈ సందర్భంగా విమానాశ్రయం టెర్మినల్ భవనంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై మూడు వారాలుగా తెలుగుదేశం పార్టీ కక్షకట్టి దౌర్జన్యాలు చేయిస్తోందని మీడియాలో ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కూటమి చారిత్రక విజయాన్ని జీర్ణించుకోలేకే ఇలా చేస్తున్నారని చెప్పారు. రాయలసీమ జిల్లాల్లో పెద్దిరెడ్డి కుటుంబం మాఫియాగా తయారైందన్నారు. రాష్ట్ర ఖజానా కొల్లగొట్టిన వారిలో జగన్‌మోహన్ రెడ్డి తర్వాత రామచంద్రారెడ్డి ఉన్నారన్నారు. పెద్దిరెడ్డి కుటుంబం 1985–90లో సామాన్య కుటుంబమని, ఇప్పుడు వేల కోట్ల రూపాయలు సంపాదించిందని ఆరోపించారు. 2024లో అక్రమంగా సంపాదించిన డబ్బులు నియోజకవర్గానికి రూ.100 కోట్లు చొప్పున ఇచ్చారన్నారు. రాష్ట్రంలో పెద్దిరెడ్డి మైనింగ్ దోపిడీ చేసి డబ్బు సంపాదించారని, పాదయాత్రలో జగన్ రెడ్డి బూట్లకు మిథున్‌రెడ్డి లేసులు కట్టాడని విమర్శించారు. లోకేశ్ యువగళం యాత్రలో టెంట్లు వేయనీయకుండా అడ్డుకున్నారన్నారని, కక్ష సాధించింది తాము కాదని తెలిపారు.

అవినీతిపై చట్టపరమైన చర్యలు

గత ప్రభుత్వంలో అవినీతికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి మండిపల్లి రామప్రసాద్‌రెడ్డి తెలిపారు. గత ఐదేళ్లలో జరిగిన అవినీతి అంతటినీ బయటకు తీస్తామని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గత ప్రభుత్వం హయాంలో 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమంలో అవినీతి జరిగిందని, దానిని వెలికి తీస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం త్వరలోనే ప్రారంభిస్తామని మంత్రి తెలిపారు. కర్ణాటక, తెలంగాణాలో ఇప్పటికే ఈ పథకం అమలవుతోందని, ఇందులో లోపాలు, ఇబ్బందులు గుర్తించి కొద్ది వారాల్లోనే అమలు చేస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ ఆర్టీసీని పూర్తి స్థాయిలో విలీనం చేయలేదని విమర్శించారు. త్వరలో ఎలక్ట్రిక్ బస్సు సర్వీసులు ప్రారంభిస్తామన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో టీడీపీ గూండాగిరీ

నవ దంపతులపై కార్యకర్తల దాడి.. సీఐ గదిలోంచి ప్రేమికుడిని లాక్కొచ్చి చితకబాదిన వైనం

- అడ్డుకున్న పోలీసులపైనా తిరగబడి దాడికి యత్నం
- కాల్చులు జరుపుతామంటూ సీఐ హెచ్చరించడంతో వెళ్లిపోయిన టీడీపీ శ్రేణులు
- భయంతో పారిపోయిన ప్రేమికుడి బంధువులు, స్నేహితులు



టీడీపీ శ్రేణులు దౌర్జన్యం చేసిన ఆళ్లగడ్డ రూరల్ పోలీస్ సర్కిల్ కార్యాలయం

ఆళ్లగడ్డ: అధికారం అండ చూసుకుని టీడీపీ శ్రేణులు పేట్రేగిపోతున్నాయి. పోలీసులు, పోలీస్‌స్టేషన్లన్నా లెక్కే లేకుండా పోయింది. పోలీస్‌స్టేషన్‌లో ఉన్న నవ దంపతులపై సాక్షాత్తు సీఐ ఎదురుగానే దాడికి దిగారు. ప్రేమికుడిని బయటకు లాక్కొచ్చి చితకబాదారు. పోలీసుల సమక్షంలోనే ఇష్టమొచ్చినట్లు కొట్టారు. ఈ ఘటన శనివారం రాత్రి నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. మండల కేంద్రం చాగలమర్రికి చెందిన సాయి అనే యువతి, వైఎస్సార్ జిల్లా మైదుకూరు పట్టణానికి చెందిన ప్రవీణ్ అనే యువకుడు మూడేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. పెళ్లి చేసుకుంటామని కోరగా, యువతి కుటుంబ సభ్యులు అడ్డు చెప్పారు. ఈ క్రమంలో వారం క్రితం ఇద్దరూ ఇంట్లో చెప్పకుండా బయటకొచ్చి పెళ్లి చేసుకున్నారు. ఈ నేపథ్యంలో తమ కుటుంబ సభ్యుల నుంచి తనకు, తన భర్తకు ప్రాణహాని ఉందని రెండు రోజుల క్రితం యువతి చాగలమర్రి పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించింది. అక్కడి ఎస్‌ఐ.. ఇరు కుటుంబాల వారిని పిలిపించి నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. సమస్య పరిష్కారం కాకపోవడంతో సీఐ వద్దకు వెళ్లి మాట్లాడుకోవాలని సూచించారు. దీంతో శనివారం మధ్యాహ్నం నవ దంపతులు స్థానిక సర్కిల్ కార్యాలయం వద్దకు వచ్చారు. యువతి కుటుంబ సభ్యులను పిలిపించి సీఐ మాట్లాడారు. కుటుంబ సభ్యుల వెంట వెళ్లనని, భర్త వెంటే ఉంటానని యువతి తెగేసి చెప్పింది. ఇద్దరూ మేజర్లు కావడంతో వారి ఇష్ట ప్రకారం పెళ్లి చేసుకునే హక్కు ఉందని, వారికి ఎటువంటి హాని తల పెట్టవద్దని సీఐ చెప్పారు. దీంతో యువతి సోదరుడు పట్టణంలోని టీడీపీ కార్యాలయం వద్దకు చేరుకుని అక్కడున్న వారికి విషయం చెప్పాడు. రెండు కార్లలో మనుషులను వెంటబెట్టుకుని సర్కిల్ కార్యాలయం చేరుకున్నాడు. వచ్చీ రాగానే టీడీపీ కార్యకర్తలంతా పోలీసులు చూస్తుండగానే యువకుడిపై విచక్షణా రహితంగా దాడి చేశారు. దెబ్బలు తట్టుకోలేక యువకుడు సీఐ గదిలోకి వెళ్లి దాక్కున్నప్పటికీ, బయటకు ఈడ్చుకు వచ్చి కొట్టారు. పోలీసులు అడ్డుకున్నప్పటికీ లెక్క చేయలేదు. అక్కడి పరిస్థితి చూసి.. యువకుడికి తోడుగా వచ్చిన బంధువులు, స్నేహితులు రోడ్డుపైకి పరుగులు తీసి చీకట్లో దాక్కున్నారు.

ఫైర్ ఓపెన్ చేసేందుకు యత్నించిన సీఐ

ప్రేమికులపై దాడి చేస్తున్న టీడీపీ శ్రేణులను పోలీసులు, సీఐ అడ్డుకుంటూ నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వారు ఏమాత్రం లెక్క చేయలేదు. పోలీసులపై తిరగబడే పరిస్థితి రావడంతో సీఐ హనుమంత నాయక్ ఫైర్ ఓపెన్ చేస్తానని రివాల్వర్ గురిపెట్టి హెచ్చరించారు. దీంతో వెనక్కు తగ్గిన వారు అక్కడి నుంచి బయటకు వచ్చారు. వారు వచ్చిన కార్ల దగ్గర నిల్చొని 'నువ్వు మా కార్యాలయం దగ్గరకు వస్తావు కదా.. అక్కడికి రా.. అప్పుడు నీ కథ ఉంటుంది' అని బహిరంగంగా సీఐ వైపు వేలు చూపిస్తూ బెదిరించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో నవ దంపతులను పోలీస్ వాహనంలో అక్కడి నుంచి తరలించారు. మనస్తాపానికి గురైన సీఐ, ఇతర అధికారులు విషయాన్ని జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. సీసీ కెమెరాల్లోని ఫుటేజీ తెప్పించుకుని పరిశీలించిన ఎస్పీ.. విషయాన్ని రాష్ట్ర స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఈ ఘటనపై సీఐ మాట్లాడుతూ.. ఇరు కుటుంబాలను కూర్చోబెట్టి కౌన్సెలింగ్ ఇస్తుండగా, ఇరు వర్గాలు ఘర్షణ పడటంతో అందరినీ అరిచి అక్కడి నుంచి పంపించామన్నారు.

కొనసాగుతున్న విధ్వంసకాండ

కర్నూలు జిల్లా కృష్ణగిరిలో వైఎస్సార్ విగ్రహం తల, చెయ్యి తొలగింపు

- తిరుపతి జిల్లా గోవర్ధనగిరిలో సచివాలయం, ఆర్బీకే, ప్రభుత్వ ఆస్పత్రి వద్ద శిలాఫలకాల ధ్వంసం
- తూర్పు గోదావరి జిల్లా తెలికిచెర్లలో సచివాలయం, ఆర్బీకే, నవరత్న పథకాల శిలాఫలకాల తొలగింపు
- నెల్లూరు జిల్లా కొత్తపాళెంలో శిలాఫలకాల్లో వైఎస్సార్‌సీపీ నేతల పేర్లపై పచ్చ రంగు



నెల్లూరు జిల్లా, కొత్తపాళెంలోని ప్రభుత్వాస్పత్రి వద్ద శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన దృశ్యం



కర్నూలు జిల్లా, కృష్ణగిరి బస్టాండ్‌లోని వైఎస్సార్ విగ్రహానికి తల, చెయ్యి తొలగించిన దృశ్యం

కృష్ణగిరి/నాగలాపురం/నల్లజర్ల/జలదంకి: టీడీపీ నాయకులు, కార్యకర్తల ఆగడాలు మితిమీరిపోయాయి. ఎన్నికల ఫలితాలు ప్రకటించిన రోజు నుంచి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు చేస్తూనే ఉన్నారు. వైఎస్సార్ విగ్రహాలను, గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన శిలాఫలకాలను పనిగట్టుకుని పగులగొడుతున్నారు. శనివారం రాత్రి కర్నూలు జిల్లా కృష్ణగిరిలోని బస్టాండ్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహంతోపాటు రైతు భరోసా కేంద్రం శిలాఫలకాన్ని కొందరు దుండగులు ధ్వంసం చేశారు. విగ్రహం తల, చెయ్యి తొలగించారు. ఆదివారం ఉదయం దీన్ని చూసిన స్థానికులు నాయకులకు సమాచారం ఇచ్చారు. ఈ విధ్వంసానికి పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నాయకులు కటారుకొండ మాధవరావు, శివ, వెంకటేశ్వర్లు, ఎరుకలచెర్వు ప్రహ్లాద, వెంకటరాముడు, అమకతాడు బాలు, మాధవస్వామి, కృష్ణగిరి జయరామిరెడ్డి, హుసేన్‌సాహెబ్, బాలమద్ది తదితరులు ఈ చర్యను ఖండించారు. తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గం పిచ్చాటూరు మండలంలోని గోవర్ధనగిరి గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఉన్న వైఎస్సార్‌సీపీ శిలాఫలకాన్ని శనివారం రాత్రి టీడీపీ కార్యకర్తలు ధ్వంసం చేశారు. వీటి ప్రారంభోత్సవ సమయంలో ఈ శిలాఫలకాలను ఏర్పాటు చేశారు. ఈ ఘటనతో గ్రామంలో అలజడి రేగింది. టీడీపీ కార్యకర్తలు రౌడీల్లా ప్రవర్తిస్తున్నారంటూ స్థానికులు ధ్వజమెత్తారు. దీనిపై గోవర్ధనగిరి వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్ మునిశేఖర్ పిచ్చాటూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలం తెలికిచెర్ల సచివాలయం–1 పరిధిలోని సచివాలయం, రైతు భరోసా కేంద్రాలకు సంబంధించి నవరత్న పథకాలు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోతో ఉన్న శిలాఫలకాలను ధ్వంసం చేశారు. 26 రోజులుగా సాగుతున్న దాడులు, దాష్టీకాలు చూస్తుంటే మనం ప్రజాస్వామ్య దేశంలో ఉన్నామా లేక ఆటవిక పాలనలో ఉన్నామా అని సందేహం కలుగుతోందని గ్రామ సర్పంచ్ బండి చిట్టి, ఉప సర్పంచ్ నక్కా పండు ధ్వజమెత్తారు. ఈ ఘటనలపై మానవ హక్కుల కమిషన్ తక్షణమే స్పందించి, తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

శిలాఫలకంపై పేర్లు తొలగింపు

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా జలదంకి మండలం కొత్తపాళెంలో 2023లో ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో అంతర్గత రోడ్ల నిర్మాణం, నూతన విద్యుత్ లైన్ల ఏర్పాటు, పంచాయతీ భవనం రీ మోడలింగ్ తదితర పనులను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దాదాపు రూ.20 లక్షలతో చేపట్టింది. ఇందుకు సంబంధించిన శిలాఫలకంలో స్థానికంగా ఉన్న ప్రజా ప్రతినిధులతో పాటు ఎంపీ, ఎమ్మెల్యేల పేర్లను ప్రొటోకాల్ నిబంధనల ప్రకారం ఏర్పాటు చేశారు. ఆదివారం గ్రామంలోని టీడీపీ నాయకులు ఈ శిలాఫలకంలో అప్పటి ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, స్థానిక సర్పంచ్, ఎంపీటీసీలతో పాటు వారికి నచ్చని పేర్లను పచ్చ పెయింట్‌తో తుడి చేశారు. శిలాఫలకం దిమ్మెలకు కూడా పచ్చ పెయింటింగ్ వేశారు. పంచాయతీ భవనం గోడపై సీబీఎన్ అని రాశారు. గతంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి పేరు మాత్రం తొలగించలేదు. ప్రస్తుతం ఆయన టీడీపీలో ఉన్నారు. ఈ ఘటనపై వైఎస్సార్‌సీపీ నేతలు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

అద్దేపల్లిలో వైఎస్సార్ విగ్రహం పునఃప్రతిష్ట



అద్దేపల్లిలో తగులపెట్టిన వైఎస్సార్ విగ్రహం స్థానంలో ఏర్పాటు చేసిన కొత్త విగ్రహానికి పూలమాలలు వేస్తున్న స్థానిక దళితవాడ వాసులు

అశోక్‌బాబుతో దీక్ష విరమింపజేసిన మాజీ ఎంపీ సురేష్

భట్టిప్రోలు: బాపట్ల జిల్లా భట్టిప్రోలు పంచాయతీ అద్దేపల్లిలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఆదివారం పునఃప్రతిష్ఠించారు. ఇక్కడ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని టీడీపీ వర్గీయులు పెట్రోలు పోసి దహనం చేసిన విషయం విదితమే. ఈ చర్యను నిరసిస్తూ, ఆ స్థానంలో మరో విగ్రహం ఏర్పాటు చేయాలంటూ వైఎస్సార్‌సీపీ వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు శనివారం రాత్రి మౌనదీక్షకు దిగారు. దీక్షను భగ్నం చేసేందుకు ప్రయత్నించిన పోలీసులు లాఠీచార్జి చేయడంతో పలువురు గాయపడ్డారు. డీఎస్పీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు అశోక్‌బాబును రేపల్లె తరలించారు. ఆయన రాత్రి 12 గంటల వరకు రేపల్లె పోలీస్‌స్టేషన్ వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. తాను దీక్ష విరమించేది లేదని చెప్పడంతో బాపట్ల ఎస్పీ వకుల్‌జిందాల్ ఆదేశాల మేరకు అశోక్‌బాబును పోలీసులు బలవంతంగా చెరుకుపల్లిలోని ఆదిశంకర వ్యాలీలోగల ఆయన నివాసానికి రాత్రి ఒంటిగంట సమయంలో తరలించారు. అశోక్‌బాబు ఆదివారం కూడా తన నివాసంలో దీక్షను కొనసాగించారు. ఆదివారం ఉదయం ధ్వంసమైన వైఎస్సార్ విగ్రహం స్థానంలో కొత్త విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. మధ్యాహ్నం మూడుగంటలకు దళితవాడ వాసులు పూలమాలలు వేసి విగ్రహాన్ని ఆవిష్కరించారు. దళిత హోంమంత్రి, దళిత డీజీపీని పెట్టి పోలీసులతో దళితులపై లాఠీఛార్జి చేయించిన ఘనత సీఎం చంద్రబాబుకే చెల్లుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్ విగ్రహాన్ని దహనం చేసిన నిందితులను, వారిని నడిపించిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబాను అరెస్టు చేయాలని అశోక్‌బాబు డిమాండ్ చేశారు. వైఎస్సార్ విగ్రహం ఏర్పాటు చేసిన వీడియో, ఫొటోలు చూసిన అనంతరమే దీక్షను విరమిస్తామని అశోక్‌బాబు చెప్పడంతో వాటిని చూపించారు. మాజీ ఎంపీ నందిగం సురేష్ నిమ్మరసం ఇచ్చి అశోక్‌బాబుతో దీక్ష విరమింపజేశారు.

ఆలయ దుకాణాల ధ్వంసానికి విఫలయత్నం



ఆలయ దుకాణాన్ని ధ్వంసం చేస్తున్న కూటమి నేత

చంద్రగిరి (తిరుపతి జిల్లా): ఎన్నికల ఫలితాలు వెలువడినప్పటి నుంచి చంద్రగిరి నియోజకవర్గంలో ఎక్కడో ఒక చోట దాడులు, దౌర్జన్యాలు పరిపాటిగా మారాయి. తాజాగా ఆదివారం మరోసారి కూటమి నేతలు దాడులకు తెగబడ్డారు. ఆస్తుల విధ్వంసానికి దిగారు. దీంతో కోపోద్రిక్తులైన స్థానికులు కూటమి నేతలను అడ్డుకున్నారు. స్థానిక కొత్తపేట జమండ్ల వీధి వద్ద సర్వే నంబర్ 99లో కొంత మేర ప్రభుత్వ భూమి ఉంది. గత ప్రభుత్వంలో ఆ భూమిని కబ్జా చేసేందుకు కొందరు యత్నించగా.. అప్పటి నాయకులు అడ్డుకున్నారు. భూమిని ఖాళీగా ఉంచితే మరోసారి ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటాయని స్థానికులందరూ కలసి శ్రీవరసిద్ధి వినాయక ఆలయ అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేశారు. అనంతరం ఆ ప్రదేశంలో మూడు దుకాణాలను ఏర్పాటు చేసి, ఆలయం పేరుతో రిజిస్ట్రేషన్ చేశారు. ఆలయ కమిటీ పేరుతోనే విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేశారు. ఆపై దుకాణాలను అద్దెకు ఇవ్వడం ద్వారా నెల నెలా వచ్చే అద్దెలను ఆలయ అభివృద్ధితో పాటు పండుగలు, విశేష పర్వదినాల్లో ఉత్సవాలను నిర్వహించేందుకు వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో కూటమి నేతలు ఉద్దేశ పూర్వకంగా ఆదివారం ఆ దుకాణాలను ధ్వంసం చేయడానికి పూనుకున్నారు. కూటమి నేతలు తొలుత సమ్మెటతో ప్రజలు చూస్తుండగానే పాక్షికంగా ధ్వంసం చేశారు. అనంతరం జేసీబీ తీసుకొచ్చి కూల్చేందుకు యత్నించారు. దీంతో జమండ్ల వీధికి చెందిన స్థానికులు పార్టీలకు అతీతంగా అక్కడకు చేరుకుని కూటమి నేతల దౌర్జన్యాలను అడ్డుకున్నారు. ఆలయ నిర్వాహణ, ఉత్సవాలు, విశేష పర్వదినాల కోసం దుకాణాల ద్వారా వచ్చే ఆదాయాన్ని వినియోగించుకుంటున్నామని, నాలుగేళ్లుగా లేని ఇబ్బందులు ఇప్పుడే వచ్చాయా అంటూ తిరగబడ్డారు. ఇదేమీ పట్టించుకోని కూటమి నేతలు జేసీబీతో కూల్చేందుకు యత్నించడంతో స్థానికులు అక్కడే బైఠాయించారు. దీంతో కూటమి నేతలు అక్కడి నుంచి వెనుదిరిగారు.

రామాపురంలో టీడీపీ నేత ఇసుక తవ్వకం

పెన్నా ఇసుక డంప్‌పై పోలీసుల దాడి



పెన్నానది నుంచి వస్తున్న ఇసుక ట్రాక్టర్

ప్రొద్దుటూరు: వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు మండలం రామాపురంలో టీడీపీ నేతలు ఇసుక అక్రమ తవ్వకాలు మళ్లీ మొదలుపెట్టారు. పార్టీ నాయకుడు పెన్నానది పరిధిలో ఏర్పాటుచేసిన ఇసుక డంప్‌పై ఆదివారం బ్లూకోల్ట్ పోలీసులు దాడి చేశారు. పెన్నానదిలో జేసీబీ ఏర్పాటు చేసి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను డంప్ చేస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ట్రాక్టర్లను వెంబడించడంతో పాటు పెన్నానదిలోకి వెళ్లారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే ప్రొద్దుటూరు మండలంలోని పలు గ్రామాల్లో ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు ఇసుక అక్రమ తవ్వకాలు మొదలుపెట్టారు. పలు గ్రామాల్లో ఇసుక తవ్వుతుండటంతో రెవెన్యూ అధికారులు పెన్నానది పరిసర ప్రాంతాల్లో గోతులు తవ్వారు. దీంతో వారం రోజులుగా ఇసుక తవ్వకాలు ఆగిపోయాయి. ఈ నేపథ్యంలో ఆదివారం రామాపురం వద్ద ఇసుక తవ్వకాలు మొదలుపెట్టారు. చాలాకాలంగా రామాపురానికి ఇసుక అక్రమ తవ్వకాల అడ్డాగా పేరుంది. గతంలో గ్రామ టీడీపీ నేతలు ఏకంగా తహసీల్దార్ భాస్కర్‌రెడ్డిని నడిరోడ్డుపై బెదిరించారు.



ప్రశ్నించలేని జవాబుల కన్నా, జవాబు లేని ప్రశ్నలు ఉండటానికి నేను ఇష్టపడతాను.
– రిచర్డ్ పి. ఫెయిన్‌మాన్

సాక్షి
సోమవారం, 1 జూలై 2024

చదువుల తొలకరి

వర్షరుతువు ఊరికే రాదు, చదువుల ఋతువును వెంటబెట్టుకుని వస్తుంది. వేసవి కర్ఫ్యూ నుంచి బయటపడి ఆడా, మగా పిల్లలు గుంపులుగా, అనేక రంగుల పూదోటల్లా వీథుల్లోకి ప్రవహించే దృశ్యం– దేహానికి తొలకరి లానే చూపులకు చందనమవుతుంది. పుస్తకాల బరువుతో బుడిబుడి అడుగుల బాలసరస్వతుల నవ్వుల తళతళలు, మాటల గలగలలు పరిసరాలకు సరికొత్త బాల్య శోభనిస్తాయి. చదువుల నిచ్చెన మీద పిల్లలూ, వాళ్లపై పెట్టుకున్న ఆశల నిచ్చెనపై కన్నవారూ ఏక కాలంలో కొత్తమెట్టు ఎక్కడం ఎల్లెడలా కనిపిస్తుంది.

చదువుల చరిత్రనే రాస్తే, అది మెరుపులు; మంచి చెడుల మలుపుల మీదుగా సాగిపోతుంది. ప్రాచీనకాలంలో ఋష్యాశ్రమాలే విద్యాలయాలు. అధికార, ధనబలాలలో తేడాలున్న క్షత్రియుల పిల్లలూ, బ్రాహ్మణుల పిల్లలూ కలసి చదువుకునేవారు. అలా చదువుకున్న ద్రుపద, ద్రోణాచార్యుల మధ్య ఆ తర్వాత వచ్చిన అంతస్తుల తారతమ్యాలు శత్రుత్వానికి దారితీసి మహాభారతంలో కొన్ని కీలక పరిణామాలకు కారణమయ్యాయి. వేటకొచ్చిన రాజులు పరివారాన్ని దూరంగా విడిచి పాదచారులై వెళ్ళి గౌరవప్రపత్తులతో ఋషిని దర్శించుకోవడం గురించి వింటాం. అలాంటి గురుస్థానం చిరుస్థానమై బతకలేని బడిపంతుల స్థాయికి కుదించుకోవడమూ చూశాం. అయితే, నాటి చదువుల వ్యవస్థలోని ఏ కాస్త వెలుగునూ హరించే చీకట్లూ లెక్కలేనన్నే. కొన్ని చదువుల్ని సార్వత్రికం చేయకపోవడం ఒకటైతే; చదువుల్లో ఎక్కువ, తక్కువ తేడాలు ఇంకొకటి. 'కమ్మరి కొలిమీ, కుమ్మరి చక్రం, జాలరి పగ్గం, సాలెల మగ్గం, శరీరకష్టం స్ఫురింపజేసే గొడ్డలి, రంపం, కొడవలి, నాగలి, సహస్రవృత్తుల సమస్త చిహ్నా'లలో వేటికవే చదువుల తల్లి సిగ పువ్వులన్నది నేటి అవగాహన. సాధారణ విద్యపై సాంకేతిక విద్యది పైచేయి కావడం చూస్తూనే ఉన్నాం.

అలా కాలక్రమంలో చదువుల నిర్వచనమూ, ప్రయోజనమూ కూడా మారిపోయాయి. హిరణ్యకశిపుడు రాక్షసుడే అనుకున్నా చదువుల ప్రయోజనం గురించి ఆనాటి అవగాహనతోనే మాట్లాడతాడు. 'చదవనివాడు అజ్ఞాని అవుతాడు, చదివితే సదసద్వివేచన కలుగుతుంది' అని కొడుకు ప్రహ్లాదుడితో అంటాడు. 'సదసద్వివేచన' అనే మాటకు ఎన్ని అర్థాలైనా చెప్పుకోవచ్చు. మంచి చెడుల వివేచన ఒక అర్థమైతే; పారలౌకికంగా సత్యాసత్యాలు, నిత్యానిత్యాలనేవి మరికొన్ని. చదువుకుని వచ్చి ప్రహ్లాదుడు తండ్రికి చెప్పిన సమాధానమూ దానికి దీటుగానే ఉంటుంది. 'ధర్మార్థాలతో సహా ముఖ్యశాస్త్రాలనే కాదు, చదువులలోని మర్మమంతా చదివేశా'నంటాడు. చదువులలోని మర్మమంటే అతని ఉద్దేశం – భక్తి, ఆధ్యాత్మికతలనే!

ఆనాడు చదువంటే కేవలం ఉద్యోగానికి ఓ అర్హత కాదు; బ్రహ్మచర్యం, గృహస్థం,వానప్రస్థం, సన్యాసమనే నాలుగు ఆశ్రమాల మీదుగా సాగాల్సిన జీవనయానంలో తొలి అంకం. నాడు రాజాస్థానాల్లో గణకులు, వ్రాయసకాండ్ర వంటి ఉద్యోగాలున్నా వాటి అందుబాటు పరిమితం. దాచుకున్న ధనమూ; పురుషుడికి రూపమూ, కీర్తీ, భోగమూ కలిగించేదీ, విదేశబంధువూ, విశిష్ట దైవమూ, రాజపూజితమూ అంటూ ఏనుగు లక్ష్మణకవి చేసిన అభివర్ణన అన్ని విద్యలకూ వర్తించేదే అయినా పెద్ద పీట వేదశాస్త్రాలదే. ఈ విద్యార్హతలున్నవారు 'సర్టిఫికెట్' పుచ్చుకుని ఉద్యోగం వేటలో పడాల్సిన అవసరమే లేదు; గుర్తింపు, గౌరవం, మడిమాన్యాలు అన్నీ వాళ్ళ దగ్గరికే వచ్చేవి. భాషలో అపర శేషువూ; యజ్ఞయాగాదుల్లో, వేదాధ్యాపనలో మునిగితేలేవాడే అయినా సంపన్నుడు కనుక; రాజులేమైనా ఇవ్వబోతే సాలగ్రామాన్ని సైతం పుచ్చుకోడానికి నిరాకరించే 'మనుచరిత్ర'లోని ప్రవరాఖ్యుడూ కనిపిస్తాడు. వేదాలకు గాదెగా, శాస్త్రాలకు పుట్టిల్లుగా, కళాకలాపాల రచ్చగా తెనాలి రామకృష్ణుడు తన 'పాండురంగ మాహాత్మ్యం'లో పరిచయం చేసిన సభాపతి అనే ఆయన పశు శిశు దాసీజనం కలిగిన ధనికుడు; ఆపైన వడ్డీవ్యాపారం, సేద్యం కూడా చేస్తూ రాజు దగ్గరికి రాకపోకలు సాగిస్తూ ఉంటాడు. తన పేరును నేతిబీరను చేస్తూ చెడు తిరుగుళ్లు మరిగిన నిగమశర్మ ఇతని కొడుకే! ఈ పండితపుత్రుడు ఆగమవాదాల్లో నోరువిప్పడు కానీ విటుల వివాదాలను తీర్చడంలో మాత్రం మహా చురుకని– కవి చురక.

బ్రిటిష్ ఏలుబడిలో డిగ్రీ చదువులొచ్చి ఉద్యోగంతో లంకె పడ్డాయి. స్వతంత్ర భారతంలో ఆ లంకె ఇంకా బిగిసింది తప్ప సడలలేదు. అదే సమయంలో దాదాపు అన్ని చదువులూ సార్వత్రికమై మేలూ చేశాయి. సంధిదశలో రెంటికీ చెడ్డ రేవళ్ళను గిరీశం, వెంకటేశం పాత్రల ద్వారా గురజాడ 'కన్యాశుల్కం'లో బొమ్మ కట్టారు. నాలుగు ఇంగ్లీష్ ముక్కలు నేర్చి రికామీగా తిరిగేవాడు గిరీశమైతే, 'మీ వల్ల నాకు ఒచ్చిందల్లా చుట్ట కాల్చడం ఒక్కటీ. పాఠం చెప్పమంటే ఎప్పుడూ కబుర్లు చెప్పడమే' నని వాపోయినవాడు వెంకటేశం. ఇంగ్లీషు చదువులు కుదురుకొని చదువు బడులు సమాజాన్ని చదువుకునే బడులుగా మారుతున్న వైనాన్ని కొడవటిగంటి కుటుంబరావు 'చదువు' నవలలో అద్భుతంగా చిత్రిస్తారు. చదువుల సారమైన సదసద్వివేచన అడుగంటి చదువు వ్యాపారమై వందలాది కోచింగ్ సెంటర్లను, వేలాది చీటింగ్ తుంటర్లను సృష్టించింది. నీతి తప్పిన 'నీట్' ద్రోహంతో కొత్త విద్యాసంవత్సరం మొదలవడం ఈ దుఃస్థితికి ప్రతీకాత్మక అభివ్యక్తి. నిఖిలదేశం హర్షించే మంచికాలం రహించాలని చదువులమ్మను కోరుకుందాం.

కల్తీ మద్యం కట్టడి ఎప్పుడు?!

కామెంట్



కరణ్ థాపర్

తమిళనాడులోని కళ్లకురిచ్చి జిల్లా కరుణాపురంలో కల్తీ సారా తాగి 60 మందికి పైగా మృతి చెందటం, మృతుల సంఖ్య నానాటికీ పెరుగుతూ ఉండటం యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురి చేస్తోంది. జూన్ మూడో వారంలో వెలుగు చూసిన ఈ ఘటనకు సంబంధించి సీబీసీఐడీ పోలీసులు ఇప్పటి వరకు అనేక మందిని అరెస్టు చేశారు. సరిహద్దు ప్రాంతాల్లో నిఘా ఉంచారు. ప్రజలు, పలు రాజకీయ పార్టీలకు చెందిన వారు, సామాజిక కార్యకర్తలు కల్తీ సారా విక్రయాలను అడ్డుకోటానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఇంతకీ – దేశంలో తరచూ జరుగుతున్న ఇలాంటి దుర్ఘటనలకు బాధ్యులెవరు? తప్పు... కల్తీ సారా తాగిన వారిదా? లేక కల్తీ సారాను కట్టడి చేయలేకపోతున్న వారిదా?

నిజం ఏమిటంటే కల్తీ సారా సేవించటం వల్ల సంభవించే మరణాలు రెట్టింపుగా విషాదకరమైనవి. అవి భయానకమైనవి మాత్రమే కాదు, పూర్తిగా నివారించగలిగినవి కూడా! మనిషి వల్ల సంభవించే ఆ మరణాలను మనిషే సంభవించకుండానూ చూడగలడు. అందుకు కావలసిందల్లా వాస్తవికతలోని పచ్చి నిజాన్ని అంగీకరించటమే! అందరు మనుషులూ మద్యం సేవించనివాళ్లు కాదు. చాలా మంది తాగాలనుకుంటారు. తాగటంలో ఆనందాన్ని అనుభవిస్తారు. ముసుగు లేకుండా చెప్పాలంటే – ఏ పరిణతి చెందిన, వివేకవంతమైన, ప్రజాస్వామ్య సమాజంలోనైనా అందుకు వారికి కాదనలేని హక్కు ఉంది. ఆ హక్కును నిరాకరించటానికి, ఆమోదయోగ్యం కాని ఆంక్షలు విధించటానికి ఆ సమాజం చేసే ప్రయత్నాలు సమస్యకు కారణం అవుతాయి.

మద్యం కనుక సురక్షితమైన, నాణ్యత గలిగిన, చవకైన లేదా సరసమైన ధరలో... చట్టం అంగీకరించిన, ఆమోదించిన నియమ నిబంధనలకు లోబడి వయోజనులందరికీ లభించినట్లయితే కల్తీ సారాకు ప్రాణాన్ని పణంగా పెట్టుకునేవారెవరూ ఉండరు. మద్యం సేవించేవారిలో అత్యధికులు తీవ్ర అసంతృప్తితో నిరాశకు గురై ఆత్మహత్యను ఆశ్రయించే మనఃస్థితిని కలిగి ఉన్నవారు కాదు. వారు కేవలం ఉపశమనాన్ని కోరుకునేవారు. ఒత్తిడి నుంచి, అలసట నుంచి కాస్త సేదతీరాలని, లేదా ఆహ్లాదకరమైన సాయంత్రాలను గడపాలనీ అనుకునేవారు. వారు కోరుకున్నది కొనలేకపోయినందు వల్లనే ప్రమాదకరమైన, ప్రాణం తీసే అవకాశం ఉన్న వాటిని వారు ఆశ్రయిస్తారు. అంతేతప్ప, మరణించటం ఎప్పుడూ కూడా వారి ఉద్దేశం కాదని గుర్తుంచుకోండి. అది కేవలం ఉద్దేశపూర్వకం కాని పరిణామం. పరిస్థితులు బలవంతంగా వారిపై వచ్చి పడ్డ పర్యవసానం.

అసలు సమస్యంతా మద్యం చెడ్డదని, అందువల్ల మద్యపానాన్ని నిలువరించాలని, కనీసం తీవ్రస్థాయిలో అందుకు విముఖత కలిగించాలని ఉన్న మన మూల భావనలోనే ఉంది. ''ఔషధాల వినియోగానికి మినహా... ఆరోగ్యానికి హాని కలిగించే మత్తుపానీయాలు, మత్తు పదార్థాల వాడకాన్ని నిషేధించేందుకు ప్రభుత్వం కృషి చేయాలి'' అని రాజ్యాంగంలోని 47వ అధికరణం చెబుతోంది.



బాధితుల్ని పరామర్శిస్తున్న తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్

మితిమీరిన మద్యపానం చెడు చేస్తుందనటంలో సందేహం లేదు. బుద్ధిహీనులైన వారు మాత్రమే ఈ మాటను కాదంటారు. మితిమీరితే మద్యమేం కర్మ... పంచదార, వెన్న, మీగడ, అంతెందుకు వ్యాయామం కూడా ఆరోగ్యానికి హానికరమైనవే! మోతాదుల్లో తీసుకుంటే అది వేరే సంగతి. సరే, ఏదైనా ఎవరికి వారే నిర్ణయించుకోవాలి. వారి సొంత తప్పుల్ని కూడా! అయితే మద్యనిషేధం అన్నది ఒక ప్రభుత్వ విధానంగా (బిహార్, గుజరాత్‌లలో మాదిరిగా) పౌర హక్కులను ఉద్దేశపూర్వకంగా నిరాకరించటం మాత్రమే కాదు, పౌర 'శిశుపాలన' కూడా చేస్తుంది. పౌరుల్ని పిల్లలుగా చూసే దేశానికి ఏది సరైనదో తెలియదు. అయితే ప్రజల్ని నర్సరీ పిల్లల్లా చూసే ప్రభుత్వాలు ఈ మాటను అంగీకరించవు.

ఏదేమైనా ఇక్కడొక లోతైన సమస్య ఉంది. మద్యం పట్ల అది మన వైఖరిని వివరిస్తుంది. అందుకే మహాత్మా గాంధీ వంటి నాయకులు, కొన్నిసార్లు మన వంటి రాజ్యాంగాలు మానవ బలహీనతగా లేదా అనైతికమైనదిగా భావించే వాటి నుంచి ప్రజల్ని దూరంగా ఉంచాలని కోరుకోవటం జరుగుతుంది. ప్రజల్ని సద్వర్తన కలిగినవారిగా తీర్చిదిద్దాలనుకోవటం, కనీసం అలా చేయటానికి ప్రయత్నించాలనుకోవటం నా దృష్టిలో ఒక తప్పుడు అభిప్రాయపు తపన. నైతిక కోణం నుంచి చూసినప్పుడు ఆ ప్రయత్నం అర్థవంతమైనదిగా కనిపించవచ్చు. బహుశా ఆచరణాత్మక దృక్కోణం నుంచి అది కొన్ని సమస్యల్ని నివారించవచ్చు. కానీ మానవ దృక్కోణం నుండి చూసినప్పుడు అధికారంలో ఉన్న వ్యక్తి సరైనదని నిర్ణయించినదాన్ని మీరు విభేదించినప్పుడు మీరు సరికాదు అనే భావన ఏర్పడుతుంది.

మహాత్మా గాంధీ; బిహార్, గుజరాత్ ప్రభుత్వాలు మద్యాన్ని ఎలా చూడటం జరిగిందన్న విషయంలో ఇది నిజం. ఫలానా సంవత్సరం తర్వాత పుట్టిన వాళ్లందరికీ ధూమపాన నిషేధం విధించాలన్న రిషీ సునాక్ మూర్ఖపు ప్రతిపాదన విషయంలో కూడా ఇది నిజం. మనుషుల్ని వారి స్వీయాకర్షణల నుంచి రక్షించగలిగితే పరివర్తన చెందుతారని వారి నమ్మకం. కానీ అది తప్పు.

నిజమైన పరివర్తన మీ తప్పుల నుండి మీరు నేర్చుకోవటం వల్ల వస్తుంది. అయితే నేర్చుకోటానికి ముందుగా మీరు ఆ తప్పుల్ని చేసి ఉండాలి. పొగ తాగటం మానేసినవారికి, మానేయాలని ఎప్పుడూ అనుకోనివారికి మధ్య వ్యత్యాసం ఇదే! అదిలిస్తే కదిలిన దాని కన్నా అనుభవం నుండి నేర్చుకున్నది గట్టి పాఠం అవుతుంది. ఎప్పటికీ మనసులో ఉండిపోతుంది.

మద్యానికి సంబంధించి నిజంగా విచిత్రమైన సంగతి... మన సంస్కృతిలో, ప్రాచీన సంప్రదాయాలలో అది భాగమై ఉండటం! సోమరసం దేవతలకు అమృతం. ముఖ్యంగా ఇంద్రుడికి ప్రీతికరమైనది. మరోవైపు నిషేధం అన్నది విదేశీయులది. అమెరికా 1920లలో మద్య నిషేధానికి ప్రయత్నించి విఫలం అయింది. అది మనం పరిష్కరించవలసిన మరికొన్ని సమస్యల్ని ఉత్పన్నం చేసింది. మనమెందుకు దేవతల మార్గాన్ని అనుసరించకూడదు? అలా చేయటం సంపూర్ణ స్వదేశీ అవుతుంది. అందుకు బదులుగా మనం ఎందుకని అమెరికా మార్గాన్ని అనుకరిస్తున్నాం?

ఈ వ్యాసంలోని నీతి సరళమైనది, సూటియైనది. చట్టం రాసి ఉంచిన 'మందు' చీటీని అనుసరించి ప్రజలు నిజాయితీగా, సురక్షితమైన మద్యాన్ని సేవించేలా చూడటంలో సుపరిపాలన ఉంటుంది. దుష్పరిపాలన దానిని కష్టతరం చేస్తుంది, లేదంటే అసాధ్యమైనదిగా మార్చి ప్రజల్ని తరచూ తమ ప్రాణాల్ని హరించే ప్రత్యామ్నాయాల వైపు నెట్టివేస్తుంది.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

పాపం అమెరికా!



అమెరికన్ల దుస్థితి పట్ల మనం బాధపడాలి. అధికారంలో ఉన్న అధ్యక్షుడు ఒక వాక్యాన్ని సరిగ్గా పూర్తిచేయలేడు; ఆయన పోటీదారేమో శిక్షపడిన మహాపరాధి.

– టెంజింగ్ లామ్‌సాంగ్, సంపాదకుడు

పురోగామి వైఖరి



మత సహనంతో కూడిన అక్బర్ యుగపు పాలనతో పోల్చినప్పుడు, అదే కాలంలో యూరప్‌లో మత నరమేధాలు, పీడన చోటు చేసుకున్నాయి. మత సామరస్యం పట్ల గల అక్బర్ పురోగామి వైఖరిని ఇది నొక్కి చెబుతోంది.

– డి.ఎన్.ఝా, చరిత్రకారుడు

వెనకబడిపోయాం!



యుద్ధాలు, వివాహాలు, ముజ్రా నాట్యాలు, రాజసౌధాల మీద మొఘలులు (1526–1757) దృష్టి పెట్టిన కాలంలో, పాశ్చాత్య ప్రపంచం పునరుజ్జీవనం, శాస్త్రీయ విప్లవం, పారిశ్రామిక విప్లవాలకు లోనై అమితమైన పురోగతిని సాధించింది. ఈ భారీ చారిత్రక బకాయిని మనం దాటాల్సి ఉంది.

– దిలీప్ మండల్, సంపాదకుడు

ఎందుకు లాగుతారు?



సభలో నెహ్రూను ప్రధాని మోదీతో పోల్చడం దుర్మార్గమైనది. వాళ్లిద్దరూ భిన్నమైన వ్యక్తులు, భిన్న కాలాల్లో పనిచేశారు. ఒకాయన స్వాతంత్ర్యం తర్వాత దేశాన్ని పునాది నుంచి నిర్మించారు; మరొకాయనేమో దాన్ని కొనసాగించడానికి సతమతం అవుతున్నారు. నెహ్రూను బరిలోకి లాగకుండా పాలించండి.

– ఎస్.ఇర్ఫాన్ హబీబ్, చరిత్రకారుడు

మాట్లాడతారంతే!



ముఖ్యంగా రాజధాని ఢిల్లీ ప్రాంతంలో నేను మాట్లాడే యువతీ యువకుల సంగతి మీరు వినాలి. వాళ్లు జమ్ము కశ్మీర్‌లో ఏ జిల్లానూ గుర్తించలేరు; కానీ కశ్మీర్‌కు ఆజాదీ ఉండాలంటారు. తాజ్ ముంబయి దాడులు లోలోపలి పని అనుకుంటారు; కానీ కసబ్ వాజ్మూలం పట్ల కలవరపడతారు. బ్రాహ్మణీయ పితృస్వామ్య ఆధిపత్యం అంటూ పదజాలం గుప్పిస్తారు; కానీ రాజకీయ రాడికల్ ఇస్లాం మాత్రం పితృస్వామికం అనుకోరు.

– అర్మియా మాలిక్, కాలమిస్ట్

పాశ్చాత్య జాబితా



దక్షిణాఫ్రికా అధ్యక్షుడిగా ఉన్నప్పుడు కూడా నెల్సన్ మండేలా అమెరికా తీవ్రవాద జాబితాలో ఉన్నారు. పాశ్చాత్య ప్రపంచానికి... ఆఫ్రికా స్వాతంత్ర్య సమరయోధులు తీవ్రవాదులు.

– అడేమోలా, పాన్–ఆఫ్రికనిస్ట్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

గొత్తికోయల ఘోష వినరా?

'స్వేచ్ఛా ఫలాలు సామాన్యులకూ అందాలి... అన్నింట్లో అందరికీ సమానావకాశాలు దక్కాలి. స్వతంత్ర భారతం సుసంపన్న, ప్రజాస్వామ్య, పురోగామి దేశం కావాలి'. తొలి స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో తొలి ప్రధాని నెహ్రూ అభిలాష ఇది. అలాగే డా॥ అంబేడ్కర్ కూడా రాజ్యాంగ ప్రవేశికలోనే ప్రజలందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం అందాలని కోరుకొన్నారు. రాజ్యాంగంలోని 38 (1)వ అధికరణ ప్రజలందరి సంక్షేమాన్ని దృష్టిలో వుంచుకొని, న్యాయబద్ధమైన సామాజిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థలను నెలకొల్పాలని చెబుతున్నది. చట్టం అందరికీ సమానమే అని రాజ్యాంగం చెబుతోంది. కానీ అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు ఈ పదేళ్ల కాలంలో గొత్తికోయల వంటి ఆదివాసీలకు కనీస అవసరాలను కూడా తీర్చకుండా అన్యాయం చేశాయి.

తెలంగాణలో పదేళ్లు పాలించిన కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం 'గొత్తికోయలు మన వారు కాద'ని ప్రకటించింది. వారిపై దాడులు చేసింది. 2006లో వచ్చిన అటవీ హక్కుల చట్టాన్ని 'తలా తోక లేని చట్టం' అని ప్రకటించారాయన. గొత్తికోయలను శత్రువులుగా చూశారు. పోలీసులు, అటవీ అధికార్లు వారిని దాడులు చేసి వేధించారు. ఇది అన్యాయం. గొత్తికోయలు విదేశీయులేం కాదు. భారతీయులే. ఒకప్పటి సిరివంచ సంస్థానంలో, ఆ తరువాత మధ్యప్రదేశ్ రాష్ట్రంలో, నేటి ఛత్తీస్‌గఢ్‌లో వారు ఎస్టీలుగా గుర్తింపు ఉన్నవారు. అటువంటివారు... నేడు తెలుగు రాష్ట్రాల్లో 60 వేల మంది ఏ గుర్తింపూ లేకుండా వందలాది గ్రామాల్లో అడ్రసులేని వారుగా బిక్కుబిక్కుమని బతుకుతున్నారు. రోగాలు, నొప్పులతో, ఉపాధిలేక, పోడు భూములపై హక్కులు లేకుండా అటవీ అధికార్ల దాడులు, దౌర్జన్యాలు భరిస్తూ బతుకుతున్నారు.

వారికి కుల ధృవీకరణ (ఎస్టీ) సర్టిఫికెట్లు లేకపోవడం వల్ల ఎస్టీ నియోజకవర్గాల్లో ఎన్నికల్లో పోటీ చేసే హక్కు లేదు. పైచదువులు చదవడానికీ, ఉద్యోగాలు పొందడానికీ అవకాశాలు సన్నగిల్లాయి. వారు నివసించే చోట రహదారి సౌకర్యాలు కానీ, వైద్య సౌకర్యాలు కానీ లేవు. కరెంటు అసలే లేదు. రక్షిత మంచినీరు కాదు... కనీసం బోరు నీరు కూడా లేక కొండ కాల్వల్లోని కలుషిత నీరు తాగి రోగాల పాలవుతున్నారు. అటవీ అధికార్లు బోర్లు వేయనీయరు. వేస్తే కేసు పెడతారు. ధ్వంసం చేస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలంలో బాటన్న నగర్‌లో ఇదే జరిగింది. మనసున్న రెవెన్యూ అధికార్లు ప్రయత్నిస్తే, అటవీ అధికార్లు అడ్డగిస్తున్నారు. ఇలా చేయటమేకాక, కొండ కాల్వల్లో నీళ్ల సెలిమెలు (గుంటలు) తీసుకొని నీళ్లు వాడుకుంటే వాటిల్లో మానవ విసర్జితాలు వదలి దుర్మార్గాన్ని చాటిన సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్ర కొండ మండలంలో జరిగింది. ఇలా చెబుతూ పోతే చాలా వున్నాయి. ఈ అమానవీయ పరిస్థితుల నుంచి గొత్తికోయలు బయటపడేదెప్పుడు?

– కెచ్చెల రంగారెడ్డి, సీపీఐ (ఎమ్ఎల్) మాస్ లైన్ రాష్ట్ర నాయకులు

రాచరికం నుంచి ప్రజాస్వామ్యం దాకా...


కర్నూలు ప్రాంతాన్ని పరిపాలించని ఉత్తర, దక్షిణ భారత ప్రసిద్ధ రాజవంశాలు లేవంటే అతిశయోక్తి కాదు. క్రీస్తుపూర్వం ఈ ప్రాంతాన్ని మౌర్యులు పాలించారు. తర్వాతి కాలంలో చాళుక్యులు, పల్లవులు, చోళులు, రాష్ట్రకూటులు, కాకతీయులు, రెడ్డి రాజులు, విజయనగర రాజులు పాలించారు. విజయనగర రాజుల పాలన ఈ ప్రాంతానికి స్వర్ణయుగంగా చెప్పవచ్చు. 1565లో జరిగిన తళ్ళికోట యుద్ధంలో విజయనగర సామ్రాజ్యం ఓటమి తరువాత ముస్లిం పాలకులు: బీజాపుర్ సుల్తానులు, మొఘల్ చక్రవర్తులు, గోల్కొండ నవాబులు, కర్నూలు నవాబులు దాదాపు 275 ఏళ్లు పాలించారు.

ఈస్ట్ ఇండియా కంపెనీ పాలనపై మొదట 1801లో ముత్తుకూరు గౌడప్ప నాయకత్వంలో తెర్నేకల్ గ్రామం పన్నులు కట్టడానికి నిరాకరించింది. బ్రిటీష్ సైనికుల ముట్టడిలో అనేకమంది గ్రామస్థులు మరణించారు. బ్రిటిష్ వారిని ఎదిరించి తిరుగుబాటు చేసిన మొదటి గ్రామంగా తెర్నేకల్‌ను చెప్పవచ్చు.

ప్రసిద్ధి చెందిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిన్నవయసులోనే బ్రిటిష్ ప్రభుత్వ కఠినమైన పరిపాలనా విధానానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేశాడు. ఈ తిరుగుబాటు అతి త్వరగా 66 గ్రామాలకు వ్యాపించింది. 1846–1847 మధ్య కాలంలో ఈయన సాహసోపేతమైన ప్రతిఘటన జనరల్ ఆండర్సన్ ఆధ్వర్యంలోని ఆంగ్లేయ దళాలను గడగడ లాడించింది. అయితే అపారమైన బ్రిటిష్ సైన్యం ముందు ఓటమి తప్పలేదు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డిని బంధించి ఉరితీసింది కంపెనీ ప్రభుత్వం.

1800వ సంవత్సరంలో నిజాం నవాబు ఈస్టిండియా కంపెనీ వారికి సైనిక ఖర్చుల కోసం ఇవ్వవలసిన సొమ్ముకు బదులుగా బళ్ళారి, కడప జిల్లాలను పూర్తిగానూ; కర్నూలు జిల్లాలోని కంభం, మార్కాపురం, కోయిలకుంట్ల, పత్తికొండ తాలూకాలను ఇచ్చాడు. ఇలా వారికి ధారాదత్తం చేయడంతో ఈ ప్రాంతాలకు 'దత్త మండలాలు' అనే పేరు వచ్చింది. ఈస్టిండియా కంపెనీ పాలనలో కర్నూలు ప్రాంతం 1800వ సంవత్సరం నుంచి 1857వ సంవత్సరం వరకు కొనసాగింది.

దత్తమండలాలకు ప్రధాన కలెక్టరుగా థామస్ మన్రో 1800–1807 వరకు సేవలను అందిచాడు. కర్నూలు ప్రాంతాన్ని పాలించిన మొదటి కలెక్టరు ఆయనే. రైత్వారీ భూవిధానం వంటి వ్యవస్థాగతమైన మార్పులతో ఉత్తమ పాలన సాగింది. మన్రో నివేదికను అమలు



చేస్తూ రెవిన్యూ పరిపాలన సౌలభ్యం కోసం 1808వ సంవత్సరంలో రెండు జిల్లాలు ఏర్పడ్డాయి. అవి కడప, బళ్ళారి జిల్లాలు. అనంతపురం ప్రాంతం బళ్ళారి జిల్లాలో, కర్నూలు ప్రాంతం కడప జిల్లాలో భాగంగా ఉండేవి. కర్నూలు పరిధిలోని రామళ్లకోట, నంద్యాల, సిరివెల్, నందికొట్కూరు తాలూకాలతో పాటు కడప జిల్లా నుంచి దూపాడు (మార్కాపురం), కంభం, కోయిలకుంట్ల; బళ్లారి జిల్లా నుంచి పత్తికొండ తాలూకాను కలిపి మొత్తం 8 తాలూకాలతో 1858 జూలై 1న కర్నూలు జిల్లా అవతరించినది. స్వాతంత్ర్యం సిద్ధించే వరకు ఈ జిల్లాలో ఎలాంటి మార్పులూ సంభవించలేదు. అయితే 2022 ఏప్రిల్ 4న జరిగిన జిల్లాల పునర్వ్యవస్థీకరణ తరువాత కర్నూలు జిల్లా రెండుగా... అంటే కర్నూలు, నంద్యాల జిల్లాలుగా విభజితమయ్యింది.

ప్రస్తుతం జనాభా విషయంలో నంద్యాల జిల్లా కంటే ఎక్కువగా, వైశాల్యం, రెవిన్యూ విషయంలో నంద్యాల జిల్లా కంటే తక్కువ స్థాయితో కర్నూలు మారిన పరిస్థితిని గమనించగలం.

– ఆచార్య మన్సూర్ రహ్మాన్
సామాజిక – ఆర్థిక విశ్లేషకులు । 9441067984
(కర్నూలు జిల్లా 166వ అవతరణ దినోత్సవం నేడు)

వరమైన జీవిత సత్యం

జెన్ గురువుల ఉపదేశాలు, బోధనలు విని వాటి పట్ల ఆకర్షితులైన వారందరూ వారిని తమ జీవితకాలంలో ఒక్కసారైనా చూడాలనుకోవడం అతిశయోక్తి కాదు. అంతేకాదు, వారిని కలిసి వారితో తమ సమస్యలకు పరిష్కారాన్ని ఆశించడమూ కద్దు. అటువంటివారిలో రాజులూ ఉంటారు.

ఒక రోజు షెన్‌హాయ్ అనే గురువును వెతుక్కొంటూ ఓ రాజు వచ్చి 'నాకు ఓ అంతిమమైన మాట రాసివ్వండి. ఆ మాట ఎలా ఉండాలంటే జీవిత సత్యాన్ని ప్రతిఫలించేట్టుగా ఉండా'లన్నాడు. రాజు చెప్పిందంతా విన్న జ్ఞాని ఓ కాగితంపై ఈ కింది చిన్న కవిత రాసిచ్చాడు:

'తండ్రీ మరణిస్తాడు / కొడుకూ మరణిస్తాడు
ఆ తర్వాత మనవడూ మరణిస్తాడు'

జ్యోతిర్మయం

అది చదివి రాజు ఆశ్చర్యపడి దీని అంతరార్థం చెప్పమన్నాడు.

అప్పుడు జ్ఞాని ఓ నవ్వు నవ్వాడు. 'నువ్వు అడిగింది జీవిత సత్యాన్ని! ఇది ఎప్పటికీ చెరిగిపోని జీవిత సత్యం. మీ తాత ఎప్పుడో చనిపోయాడు. నీ తండ్రీ కొన్ని రోజుల క్రితం చనిపోయాడు. నువ్వూ ఓ రోజు చనిపోబోతున్నావు. నీ కుమారుడూ ఓ రోజు కచ్చితంగా చనిపోతాడు' అన్నాడు. 'పుట్టిన వారందరూ మరణిస్తారు అనేది అందరికీ తెలుసు. కానీ మీ వంటి జ్ఞాని ప్రజలకు వరప్రసాదం లాంటి మాట చెప్పకుండా శాపం లాంటి అపశకునపు మాటల్ని రాసివ్వడం బాధ కలిగిస్తోంద'న్నాడు రాజు.

'ఇది శాపమా... ఇది పెద్ద వరం. శుభశకునం. బాగా ఆలోచించి చూడు. ముందుగా తండ్రి మరణిస్తాడు. ఆ తర్వాత బిడ్డలు చనిపోతారు. అనంతరం మనవళ్ళు మరణిస్తారు. ఇదేగా ఓ క్రమపద్ధతి. నీ పెద్దలు తమ అంత్యక్రియలను నువ్వు చెయ్యాలనేగా అనుకుంటారు. నువ్వు మరణించి నీ కొడుకు నీకు అంతిమ సంస్కారాలు చేయడం సహజం. అలా కాకుండా నువ్వుండి నీ కొడుకు మరణించి నువ్వు అతని అంత్యక్రియలు చెయ్యవలసి వస్తే అది ఎలా ఉంటుందో ఆలోచించు! అలా జరిగితే అది శాపం. కానీ నువ్వు మరణించి నీ అంత్యక్రియలు నీ కొడుకు చెయ్యడం అనేది వరం. మరణం అనేది సహజం. అందులో వింతేమీ లేదు. పుట్టిన ప్రతి ఒక్కరూ ఏదో ఓ రోజు మరణించాల్సిందే. అయితే అది సహజ పద్ధతిలో జరిగితే వరం. అది దైవమిచ్చిన వరం. అంతా శుభమే!' జ్ఞాని వివరంగా చెప్పిన మాటలన్నీ విన్న తర్వాత రాజు ఆ కవితను కళ్ళకు అద్దుకుని ఒకటికి రెండు సార్లు చదువుకుని ఆయనకు నమస్కరించి వెనుతిరిగాడు. ఇటువంటి జెన్ గురువులు సమకాలీన సమాజం ప్రశాంతంగా నడవడానికి ఎంతగానో తోడ్పడ్డారు.

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం

శ్రీక్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు; జ్యేష్ఠ మాసం; **తిథి:** బ.దశమి ఉ.10.59 వరకు, తదుపరి ఏకాదశి; **నక్షత్రం:** అశ్విని ఉ.7.40 వరకు, తదుపరి భరణి; **వర్జ్యం:** సా.4.46 నుండి 6.17 వరకు; **దుర్ముహూర్తం:** ప.12.30 నుండి 1.22 వరకు, తదుపరి ప.3.07 నుండి 3.59 వరకు; **అమృత ఘడియలు:** రా.1.44 నుండి 3.12 వరకు ; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు; **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు; **సూర్యోదయం:** 5.32 ; **సూర్యాస్తమయం:** 6.14

క్లుప్తంగా...

6 నుంచి ఇంద్రకీలాద్రిపై ఆషాఢ మాసోత్సవాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో జూలై ఆరో తేదీ నుంచి ఆషాఢ మాసోత్సవాలు ప్రారంభం కానున్నాయని ఈవో కె.ఎస్.రామారావు ఆదివారం తెలిపారు. ఆగస్టు నాలుగో తేదీ వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆషాఢంలో తెలుగు రాష్ట్రాల భక్తులు అమ్మవారికి సారెను సమర్పిస్తారని తెలిపారు. ఆరు నుంచి 15వ తేదీ వరకు ఆలయంలో వారాహి నవరాత్రులను తొలిసారిగా ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని శ్రీమహంకాళీ జాతర బోనాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ అమ్మవారికి బోనాలను సమర్పించనుందన్నారు. 26వ తేదీ దుర్గగుడి దేవస్థానం తరఫున ఆయా దేవాలయాలకు పట్టువస్త్రాలను సమర్పించనున్నట్లు తెలిపారు.19వ తేదీ నుంచి 21వ తేదీ వరకు అమ్మవారి సన్నిధిలో శాకంబరీదేవి ఉత్సవాలు జరుగుతాయన్నారు.

టీటీడీ వెబ్ సైట్లో బోర్డు నిర్ణయాలు

తిరుమల: భక్తుల సౌకర్యార్థం టీటీడీ తీసుకుంటున్న పలు నిర్ణయాలకు సంబంధించి మరింత పారదర్శకతను పాటించడానికి టీటీడీ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా 2023 ఆగస్టు 07 నుంచి 2024 మార్చి 11 వరకు ధర్మకర్తల మండలి సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలను టీటీడీ వెబ్ సైట్లో అప్ లోడ్ చేశారు. కాగా, టీటీడీ ధర్మకర్తల మండలి లేదా స్పెసిఫైడ్ అథారిటీలు 1993 మే 10 నుంచి 2023 జూన్ 19 వరకు తీసుకున్న నిర్ణయాలను ఇదివరకే టీటీడీ వెబ్ సైట్లో అప్ లోడ్ చేశారు. ఆ తర్వాత తీసుకున్న అంశాలను అప్ లోడ్ చేయలేదు.

దుర్గమ్మ సేవలో డీజీపీ తిరుమలరావు



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు ఆదివారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి కుటుంబ సమేతంగా విచ్చేసిన ద్వారకా తిరుమలరావుకు ఆలయ ఈవో కె.ఎస్.రామారావు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, ఆలయ ఈవో అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

ఎంఎస్ఎంఈలకు యాక్సిస్ బ్యాంక్ చౌక రుణాలు

ప్రాసెసింగ్ ఫీజులో 50 శాతం రాయితీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరగతి సంస్థల(ఎంఎస్ఎంఈ)ను ప్రోత్సహించేందుకు చౌక రుణాలను మంజూరు చేస్తున్నట్లు యాక్సిస్ బ్యాంక్ ప్రకటించింది. సెక్యూర్డ్ వర్కింగ్ క్యాపిటల్ ఉత్పత్తులపై ప్రాసెసింగ్ ఫీజులో 50 శాతం డిస్కౌంటుతో పాటు మెరుగైన రేట్లకే రుణాలను అందించనున్నట్లు యాక్సిస్ బ్యాంక్ ప్రెసిడెంట్ అండ్ హెడ్ (బ్రాంచ్ బ్యాంకింగ్) అర్నికా దీక్షిత్ తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థలో కీలకపాత్ర పోషిస్తున్న ఎంఎస్ఎంఈలను ప్రోత్సహించడంలో యాక్సిస్ బ్యాంక్ ముందుంటుందని చెప్పారు. జూన్ 27న అంతర్జాతీయ 'ఎంఎస్ఎంఈ డే' సందర్భంగా రాష్ట్రంలోని 250 ఎంఎస్ఎంఈ కస్టమర్లను యాక్సిస్ సన్మానించింది. ఈ సందర్భంగా ఎంఎస్ఎంఈలకు రుణాలు మంజూరు చేయడంలో ప్రతిభ కనబరిచిన అధికారులను ప్రశంసాపత్రాలతో సత్కరించింది. నియో ఫర్ బిజినెస్ పేరుతో ఎంఎస్ఎంఈలకు సులభంగా రుణాలు, ఇతర సేవలను అందిస్తున్నట్లు బ్యాంకు ఓ ప్రకటనలో పేర్కొంది. ప్రస్తుతం ఎంఎస్ఎంఈ రుణాల్లో యాక్సిస్ బ్యాంక్ 8.4 శాతం వాటాను కలిగి ఉందని, రానున్న కాలంలో ఈ సంఖ్యను మరింతగా పెంచాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు తెలిపింది.

కుంటలో పడి ఇద్దరు బాలురు మృతి



మణికంఠ, రాఘవేంద్ర మృతదేహాలు

దర్శి: బహిర్భూమికి వెళ్లి వాగు కుంటలో పడి ఇద్దరు బాలురు మృతిచెందిన ఘటన ప్రకాశం జిల్లా, దర్శి మండలం, తూర్పువీరాయపాలెం గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి... చీమకుర్తి మండలం మర్రిచెట్లపాలెం గ్రామానికి చెందిన బాలచంద్రుడు కుమారుడు దార్నాసి మణికంఠ (11), అద్దంకి మండలం, వేలమూరిపాడుకు చెందిన శ్రీను కుమారుడు పులిమి రాఘవేంద్ర (12) అన్నదమ్ములు. దర్శి మండలం, తూర్పు వీరాయపాలెంలోని అమ్మమ్మ ఇంటికి వచ్చారు. ఆ దగ్గరలో ఉన్న వాగు వద్దకు తెల్లవారు జామున బహిర్భూమికి ఈ ఇద్దరూ మరో బాలుడితో కలిసి వెళ్లారు. తరువాత నీళ్ల కోసం మణికంఠ, రాఘవేంద్ర ఇద్దరూ ఒకేసారి వెళ్లడం, వర్షానికి నేల బాగా తడిసి ఉండటంతో జారి కుంటలోకి పడిపోయారు. అది గమనించిన మూడో బాలుడు గ్రామంలోకి వెళ్లి విషయం చెప్పాడు. గ్రామస్తులు హుటాహుటిన వచ్చి వారిని బయటకు తీసే సమయానికి మృతి చెందారు. మృతులు ఇద్దరూ ఆరో తరగతి చదువుతున్నారు. వీరు ఒకే కుటుంబానికి చెందిన వారు.

సీట్లు పెరిగినా.. సీఎస్ఈకే డిమాండ్

జాతీయ కాలేజీల్లో పెరిగిన 2,765 ఇంజనీరింగ్ సీట్లు

- ఎన్ఐటీల్లో కొత్త కంప్యూటర్ కోర్సులు... ఐఐటీల్లో స్వల్పంగా సీట్ల పెంపు
- అన్నిచోట్ల సీఎస్ఈకే విద్యార్థుల మొగ్గు... ఓపెన్ కేటగిరీలో ర్యాంకర్ల మధ్య పోటీ
- ఈశాన్య రాష్ట్రాల్లో పోటీ అంతంత మాత్రమే



సాక్షి, హైదరాబాద్: జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో ఈసారి సీట్లు భారీగా పెరిగాయి. ఇప్పటివరకూ రెండు దశల కౌన్సెలింగ్ చేపట్టారు. వీటిల్లో 59,917 సీట్లు అందుబాటులోకి వచ్చాయి. గత ఏడాది 57,152 సీట్లు మాత్రమే ఉన్నాయి. దీంతో పోలిస్తే ఈ సంవత్సరం 2,765 సీట్లు పెరిగాయి. ఐఐటీల్లో స్వల్పంగా సీట్లు పెరిగితే, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, ప్రభుత్వ నిధులతో నడిచే జాతీయ కాలేజీల్లో కొత్త కోర్సులను చేర్చారు. వీటిల్లోనూ ఎక్కువగా కంప్యూటర్ సైన్స్ కోర్సులే ఉన్నాయి. మరికొన్ని కోర్సులకు అనుమతి రావాల్సి ఉంది. కొన్ని జాతీయ కాలేజీల్లో కొత్త కోర్సులతో ప్రత్యేక సెక్షన్లు ఏర్పాటు చేసే వీలుంది. దీంతో ఆఖరి దశ కౌన్సెలింగ్ నాటికి మరికొన్ని సీట్లు అందుబాటులోకి వచ్చే వీలుంది. దీనిపై త్వరగా నిర్ణయం వెల్లడించాలని అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఒకవైపు సీట్లు పెరిగినా... ప్రధాన కాలేజీల్లో డిమాండ్ మాత్రం తగ్గలేదు. ముఖ్యంగా కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ కోసం అన్ని ప్రాంతాల్లోనూ విద్యార్థులు పోటీ పడుతున్నారు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మంచి ర్యాంకు సంపాదించిన వారి మధ్య కూడా ఈసారి పోటీ కన్పిస్తోంది.

జాతీయ స్థాయిలో డిమాండ్

జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ (సీఎస్ఈ)కు భారీగా డిమాండ్ కన్పిస్తోంది. జాయింట్ సీట్ అలకేషన్ అథారిటీ (జోసా) కౌన్సెలింగ్‌లో ఇది స్పష్టంగా కన్పిస్తోంది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)ల్లో ఎక్కువ మంది సీఎస్ఈకే దరఖాస్తు చేశారు. గత ఏడాది కన్నా కటాఫ్ పెరిగినప్పటికీ టాప్ కాలేజీల్లో పోటీ మాత్రం ఈసారి కాస్త ఎక్కువగానే కన్పిస్తోంది. వాస్తవానికి దేశంలోని 23 ఐఐటీల్లో గత ఏడాది 17,385 ఇంజనీరింగ్ సీట్లు ఉంటే, ఈ సంవత్సరం 17,740 సీట్లు అందుబాటులోకి వచ్చాయి. జాతీయ కాలేజీల్లోనూ ఈసారి కొన్ని కొత్త కోర్సులను ప్రవేశ పెడుతున్నారు. వీటిల్లో కొన్నింటికి అనుమతులు రాగా.. మరికొన్నింటికి రావాల్సి ఉంది. ఆఖరి దశ కౌన్సెలింగ్ వరకూ ఎన్ఐటీల్లో సీట్లు పెరిగే వీలుందని అంచనా వేస్తున్నారు. ఇప్పటివరకూ ఉన్న సమాచారం ప్రకారం 121 విద్యాసంస్థల్లో ఈ ఏడాది 59,917 సీట్లు భర్తీ చేయబోతున్నారు. ఇప్పటికే రెండు దశల కౌన్సెలింగ్ పూర్తికాగా, మరో మూడు దశలు ఉంది.

టాప్ కాలేజీల్లోనూ...

దేశంలోని ప్రధాన ఐఐటీలు, ఎన్ఐటీల్లో కంప్యూటర్ సైన్స్‌కు పోటీ ఎక్కువగా ఉంది. అయితే, దూర ప్రాంతాలు, ఈశాన్య రాష్ట్రాల్లోని జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో పెద్దగా పోటీ కన్పించలేదు. ఈ ప్రాంతాల్లో లక్షల్లో ర్యాంకులు వచ్చిన వాళ్లకూ సీట్లు దక్కుతున్నాయి. తిరుపతి ఐఐటీలో సీట్లు ఈసారి 244 నుంచి 254కు పెరిగాయి. అయితే, సీఎస్ఈ ఓపెన్ కేటగిరీలో బాలురకు 4,522, బాలికలకు 6,324 ర్యాంకు వరకే సీట్లు వచ్చాయి. ఈసారి ఇక్కడ నాలుగేళ్ల ఇంజనీరింగ్ ఫిజిక్స్ కోర్సును అందుబాటులోకి తెచ్చారు. అయినప్పటికీ సీఎస్ఈ వైపే పోటీ కన్పించింది. వరంగల్ ఎన్ఐటీలో కూడా సీట్లు 989 నుంచి 1049కు పెరిగాయి. ఇక్కడ 60 సీట్లతో ఏఐ అండ్ డేటా సైన్స్ కోర్సును ప్రవేశ పెట్టారు. అయితే, సీఎస్ఈకి ఇక్కడ బాలురకు ఓపెన్ కేటగిరీలో 201, బాలికలకు 3,527 ర్యాంకు వరకే సీట్లు వచ్చాయి. ఐఐటీ గాంధీనగర్‌లో 288 నుంచి 370కు గత ఏడాదే పెంచారు. ఈసారి కొత్తగా 30 సీట్లు అదనంగా ఇచ్చారు. ఇక్కడ కూడా 90 శాతం మంది సీఎస్ఈకే దరఖాస్తు చేశారు. ఐఐటీ బాంబే 1,358 నుంచి 1,368కి, ధార్వాడ్‌లో 310 నుంచి 385కు, భిలాయ్‌లో 243 నుంచి 283కు, భువనేశ్వర్‌లో 476 నుంచి 496కు, ఖరగ్‌పూర్‌లో 1,869 నుంచి 1,889కి, జోధ్‌పూర్‌లో 550 నుంచి 600కు, పట్నాలో 733 నుంచి 817కు, గువాహటిలో 952 నుంచి 962కు సీట్లు పెరిగాయి. ఈ పెరిగిన సీట్లతో పోలిస్తే సీఎస్‌సీ కోసం పోటీ పడిన విద్యార్థుల సంఖ్య రెట్టింపు కన్పిస్తోంది.

ప్రధాన ఐఐటీల్లో ఓపెన్ కేటగిరీలో సీఎస్ఈలో సీట్లు వచ్చిన గరిష్ట ర్యాంకులు

ఐఐటీ	సీట్లు వచ్చిన ర్యాంకులు	
	బాలురు	బాలికలు
భువనేశ్వర్	3454	7457
బాంబే	68	421
ఢిల్లీ	116	556
ఖరగ్‌పూర్	414	1579
హైదరాబాద్	652	1809
మద్రాస్	159	757
గువాహటి	612	2095
పాలక్కాడ్	5556	9127
తిరుపతి	4522	6324
ఎన్ఐటీలు		
జలంధర్	16090	19732
అలహాబాద్	5787	9060
అగర్తలా	18974	32956
ఢిల్లీ	10950	16763
మేఘాలయ	31545	198857
మిజోరం	548303	544345
రూర్కెల	2824	4593
ఏపీ	14707	16697

జాతీయ ఇంజనీరింగ్ సంస్థల్లో సీట్లు ఇలా...

సంస్థ	2022	2023	2024
ఐఐటీలు	16,598	17,385	17,740
ఎన్ఐటీలు	23,994	17,385	17,740
ట్రిపుల్ ఐటీలు	7,126	7,746	8,546
కేంద్ర నిధులతో నడిచే సంస్థలు	6,759	8,067	9,402
మొత్తం సీట్లు	54,477	57,152	59,917

మేం ఓడిపోయాం.. ప్రజలు మోసపోయారు..

- ఒక రకం పింఛన్లు మాత్రమే పెంచారు
- వలంటీర్ల వ్యవస్థకు మంగళం పాడినట్లేనా?
- నిరుద్యోగ యువతకు మోసం
- మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



ప్రొద్దుటూరు: గత ఎన్నికల్లో తాము ఓడిపోయామని, చంద్రబాబును నమ్మి ప్రజలు మోసపోయారని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి చెప్పారు. వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వాస్తవానికి ఇంకో ఏడాది వరకు ప్రతిపక్ష నేతగా తమకు పని ఉండదని భావించామని, అయితే ఎన్‌డీఏ ప్రభుత్వం తమకు అంత సమయం ఇవ్వలేదని పేర్కొన్నారు. నెలరోజులు కాకముందే ప్రజాసమస్యలను ప్రస్తావించాల్సి వస్తోందన్నారు. ఎన్నికల సందర్భంగా చంద్రబాబు రూ.3 వేలు ఉన్న వృద్ధాప్య పింఛన్‌ను రూ.4 వేలకు పెంచడంతోపాటు ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన వ్యత్యాసాన్ని కలిపి రూ.7 వేలు జూలై 1న చెల్లిస్తామని చెప్పారని గుర్తుచేశారు. ఈ ఒక్క పింఛన్లు మాత్రమే జూలై నెలలో పంపిణీ చేస్తున్నారని తెలిపారు. ఈ ప్రకారం దివ్యాంగుల పింఛన్‌ను రూ.3 వేలు నుంచి రూ.6 వేలకు పెంచడంతోపాటు మూడు నెలల వ్యత్యాసాన్ని కలిపి రూ.15 వేలు చెల్లించాల్సి ఉందన్నారు. మంచానికే పరిమితమైన వారి పింఛన్‌ను రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచుతామని చెప్పడంతోపాటు మూడునెలల వ్యత్యాసాన్ని కలిపి రూ.25 వేలు చెల్లిస్తామని చెప్పారన్నారు. డయాలసిస్ పేషెంట్లకు రూ.10 వేలు ఉన్న పింఛన్‌ను రూ.15 వేలకు పెంచుతామని తెలిపారని, ఈ ప్రకారం మూడునెలల వ్యత్యాసాన్ని కలిపి రూ.30 వేలు చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. చంద్రబాబు చెప్పిన ప్రకారం ఈ నెల వివిధ రకాలు పెంచి ఇవ్వాల్సి ఉండగా కేవలం వృద్ధాప్య, వితంతు పింఛన్లు మాత్రమే పెంచి మూడునెలల వ్యత్యాసాన్ని కలిపి ఇస్తున్నారన్నారు. మిగతా పింఛన్లను పెంచలేదని స్వయంగా అధికారులు చెబుతున్నారని తెలిపారు. నిరుద్యోగులు చంద్రబాబు మాటలు నమ్మి ఓట్లు వేశారని, మళ్లీ వారికి మోసమే జరిగిందని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం వస్తే వలంటీర్లకు రూ.10 వేలు వేతనం పెంచి ఇస్తామని చెప్పిన చంద్రబాబు ప్రస్తుతం సచివాలయ ఉద్యోగులతో పింఛన్లు పంపిణీ చేయిస్తున్నారన్నారు. దీన్నిబట్టి వలంటీర్ల వ్యవస్థకు మంగళం పాడినట్లేనన్న అనుమానం వ్యక్తమవుతోందని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీముని పల్లి లక్ష్మీదేవి పాల్గొన్నారు.

సీఎంను కలవాలంటే ఫోన్‌చేయాలి

- టోల్‌ఫ్రీ నంబరు 7306299999
- టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసేందుకు వస్తున్న ప్రజల కోసం ప్రత్యేక వ్యవస్థను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. మంగళగిరి టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎక్కువమంది ప్రజలు టీడీపీ కార్యాలయానికి వస్తుండడంవల్ల ఇబ్బంది వస్తోందన్నారు. అందుకే టోల్ ఫ్రీ నంబరు 7306299999 ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఆ నంబరుకి ఫోన్‌చేస్తే ప్రాధాన్యత ప్రకారం సీఎంను కలిసే ఏర్పాటు చేస్తామన్నారు. 500 మంది విజ్ఞప్తులకు వరకు ఇబ్బంది ఉండదని, అంతకంటే ఎక్కువమంది వస్తే ఇబ్బంది ఉంటుందని తెలిపారు. తమ విజ్ఞప్తులను స్థానికంగా ఉన్న మంత్రులు, ఎమ్మెల్యేలకు ఇవ్వాలని, అక్కడ పరిష్కారం కాని సమస్యలు ఉన్నప్పుడే టీడీపీ కేంద్ర కార్యాలయానికి రావాలని సూచించారు. ఫొటోలు తీసుకోవడానికి వస్తున్న యువత, జనం వలన సమస్యల కోసం వస్తున్నవారు ఇబ్బంది పడుతున్నారని, అందుకే గ్రీవెన్స్‌ను సక్రమంగా నిర్వహించేందుకు టోల్ నంబరు పెడుతున్నామని తెలిపారు. సీఎం చంద్రబాబు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తున్నారని చెప్పారు.

వెంకయ్య రాజకీయ జీవితం భావితరాలకు స్ఫూర్తి

- ఉపరాష్ట్రపతిగా, కేంద్రమంత్రిగా ఆయన సేవలు అపూర్వం: ప్రధాని నరేంద్రమోదీ
- వెంకయ్యనాయుడుపై రచించిన మూడు పుస్తకాలను వర్చువల్‌గా ఆవిష్కరించిన పీఎం

సాక్షి, హైదరాబాద్: మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు రాజకీయ జీవితం భావితరాలకు స్ఫూర్తిదాయకమని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ కొనియాడారు. వెంకయ్యనాయుడు జీవితంపై రచించిన మూడు పుస్తకాలను ఆవిష్కరించే కార్యక్రమం హైదరాబాద్‌లోని అన్వయ కన్వెన్షన్‌లో ఆదివారం జరిగింది. ప్రధాని మోదీ ఈ పుస్తకాలను న్యూఢిల్లీలోని తన కార్యాలయం నుంచి వర్చువల్‌గా ఆవిష్కరించి ప్రసంగించారు. సోమవారంతో 75 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న వెంకయ్యనాయుడును అభినందించారు. వెంకయ్యతో సుదీర్ఘకాలం కలిసి పనిచేసే అవకాశం తనకు లభించిందన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా, కేంద్రమంత్రిగా, ఉప రాష్ట్రపతిగా, రాజ్యసభలో సభాపతిగా సేవలు అందిస్తున్నప్పుడు ఆయన అనుభవం నుంచి తాను చాలా నేర్చుకున్నానని చెప్పారు. ఏపీ, తెలంగాణలో బీజేపీ ఎదుగుదలకు బలమైన పునాది వేశారన్నారు. వాజ్‌పేయి ప్రభుత్వంలో గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రిగా వెంకయ్య తనను తాను నిరూపించుకున్నారన్నారు. ఆయన ప్రారంభించిన స్వచ్ఛభారత్ మిషన్, స్మార్ట్ సిటీమిషన్, అమృత్ యోజన దేశానికి ఎంతో మేలు చేశాయని మోదీ గుర్తు చేశారు. రాజ్యసభలో 370 ఆర్టికల్ రద్దు బిల్లు ఆమోదం విషయంలో వెంకయ్య కృషి ఎంతో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ, తెలంగాణలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు. ది హిందూ మాజీ రెసిడెంట్ ఎడిటర్ ఎస్.నగేష్ కుమార్ రచించిన వెంకయ్యనాయుడు లైఫ్ ఇన్ సర్వీస్‌తోపాటు మాజీ ఉపరాష్ట్రపతి కార్యదర్శి డాక్టర్ ఐవీ.సుబ్బారావు రూపొందించిన ఫొటో క్రానికల్ 'సెలబ్రేటింగ్ భారత్ – ది మిషన్ అండ్ మెసేజ్ ఆఫ్ ఇండియా', సంజయ్ కిషోర్ రచించిన మహానేత–లైఫ్ అండ్ జర్నీ ఆఫ్ ఎం. వెంకయ్యనాయుడు పేరుతో జీవిత చరిత్ర పుస్తకాలను ప్రధాని ఆవిష్కరించారు.

మా పాపను బతికించండి... సాయం చేయండి

- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు 'పల్లా'ను కోరిన రాజమండ్రి దంపతులు
- క్రౌడ్ ఫండింగ్‌తో విరాళాలు సేకరిస్తామన్న నేత
- వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో నేరుగా ప్రభుత్వమే సాయం

సాక్షి, అమరావతి: అరుదైన వ్యాధితో బాధపడుతున్న తమ కుమార్తెకు రూ.16 కోట్ల విలువైన ఇంజక్షన్ చేయించాలని, తక్షణమే సాయం అందించాలని రాజమండ్రికి చెందిన ప్రీతమ్, గాయత్రి దంపతులు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కోరారు. ఆదివారం టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ విజ్ఞప్తిని స్వీకరించారు. తొమ్మిది నెలల తమ చిన్నారి హితైషి అరుదైన ప్రాణాంతక వ్యాధి (స్పైనల్ మస్కులర్ ఎట్రాఫి టైప్–1)తో బాధపడుతోందని, ఎలాగైనా కాపాడాలని వేడుకున్నారు. దీనికి ఆయన స్పందిస్తూ చిన్నారికి అవసరమైన మొత్తాన్ని సేకరించడం కోసం క్రౌడ్ ఫండింగ్ చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం, టీడీపీ కూడా స్పందిస్తుందని, రాష్ట్ర ప్రజలు సహృదయంతో సాయం చేయాలని పల్లా శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో...

ఇదిలా ఉంటే... గతంలో ఇదే తరహా కేసు మాజీ సీఎం వైఎస్ జగన్ దృష్టికి వచ్చింది. గతేడాది జూన్ 30న సీఎం హోదాలో వైఎస్ జగన్ తూర్పుగోదావరి జిల్లా పర్యటనకు వెళ్లినప్పుడు నిడదవోలు ప్రాంతానికి చెందిన సూర్యకుమారి తన బిడ్డ దయానా శాంతి ప్రాణాంతక స్పైనల్ మస్కులర్ ఎట్రాఫి టైప్–2 వ్యాధితో బాధపడుతోందని, తక్షణమే రూ.16 కోట్ల విలువైన ఇంజక్షన్ చేయించాలని, ప్రభుత్వం ఆదుకోకపోతే తన బిడ్డ చనిపోతుందని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన వైఎస్ జగన్ తక్షణమే నిధులు విడుదల చేస్తూ.. ఆ ఇంజక్షన్‌ను చిన్నారికి చేయించే వరకూ పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. అంతేకాకుండా ఆ చిన్నారికి రూ.15వేల పింఛను కూడా మంజూరు చేశారు.

ఎన్టీఆర్ జిల్లా మాజీ కలెక్టర్ ఢిల్లీరావుకు జాతీయ పురస్కారం



సాక్షి ప్రతినిధి, విజయవాడ: బాలల హక్కుల సంరక్షణలో రెండేళ్లపాటు విశేష కృషి చేసి ఎన్టీఆర్ జిల్లాను అత్యుత్తమ ప్రగతి సాధించిన జిల్లాగా నిలిపినందుకు అప్పటి కలెక్టర్ ఎస్.ఢిల్లీరావుకు జాతీయస్థాయి పురస్కారం లభించింది. ఆదివారం న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎన్‌సీపీసీఆర్), నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్‌రాయ్ చేతుల మీదుగా ఢిల్లీరావు అవార్డు అందుకున్నారు. బాలల భవితవ్యానికి హక్కుల సంరక్షణతో బంగారు బాటలు వేయడంలో చిత్తశుద్ధితో చేసిన కృషి భేష్ అంటూ ప్రశంసలు అందుకున్నారు.

నిత్య నూతనంగా, వినూత్నంగా...

మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాను అడ్డుకోవడంలో అత్యుత్తమ పనితీరు కనబరుస్తూ, చిన్నారులు చెడు అలవాట్ల వైపు మళ్లకుండా వినూత్న కార్యక్రమాలు అమలు చేయడంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌గా రెండేళ్లలో ఢిల్లీరావు విశేష కృషి చేశారు. ఎన్‌సీపీసీఆర్, ఎన్‌సీబీల ఉమ్మడి కార్యాచరణ (జేఏపీ) అమల్లోనూ తనదైన ముద్ర వేశారు. ఎప్పటికప్పుడు వినూత్నంగా ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్లి.. మెరుగైన ఫలితాలు సాధించారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాపై ఉక్కు పాదం మోపారు. విక్రయదారులకు కళ్లెం వేసేందుకు నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లు సత్ఫలితాలిచ్చాయి. చిన్నారులు మత్తుపదార్థాలు, మాదకద్రవ్యాలు ఉచ్చులో చిక్కుకోకుండా పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అంతేకాదు.. లైంగిక వేధింపులపై అవగాహన కల్పిస్తూ.. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు పాటుపడుతూ బాల్య వివాహాలను అరికట్టడంలో సఫలీకృతులయ్యారు.

సత్యదేవుని సన్నిధిలో జస్టిస్ రవీంద్రబాబు



అంతర్వేదిలో జస్టిస్ రవీంద్రబాబుకు స్వామి చిత్రపటం అందజేత

అన్నవరం/సఖినేటిపల్లి: కాకినాడ జిల్లా అన్నవరం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంతర్వేది ఆలయాలను రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ రవీంద్రబాబు కుటుంబసభ్యులతో కలసి ఆదివారం సందర్శించారు. అన్నవరంలో రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆయనకు తూర్పు రాజగోపురం వద్ద పండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారి దర్శనానంతరం పండితులు వేద ఆశీర్వచనం పలుకగా, సత్యదేవుని ప్రసాదాలు, చిత్రపటాన్ని దేవస్థానం ఈవో కె.రామచంద్ర మోహన్ అందజేశారు. అలాగే అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు



ఆలయం వెలుపల మేఘాలయ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి వైద్యనాథన్



ఆలయం వెలుపల శ్రీలంక మంత్రి విజయ్ దశ రాజపక్ష

తిరుమల: తిరుమల శ్రీవారిని కేంద్ర మంత్రి జితిన్ ప్రసాద, శ్రీలంక మంత్రి విజయ్ దశ రాజపక్స, మేఘాలయ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్.వైద్యనాథన్ ఆదివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు పలుకగా.. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు. కాగా, శ్రీవారిని దర్శించుకున్నవారిలో ఎంపీలు గురుమూర్తి, అప్పలనాయుడు, రాష్ట్ర మంత్రి పార్థసారథి, తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు నక్కా ఆనందబాబు, దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, మాజీ క్రికెటర్ గౌతమ్ గంభీర్, సినీనటి ప్రియా ఆనంద్, ఐపీఎస్ అధికారి పరమేశ్వర్ రెడ్డి ఉన్నారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు అన్నీ నిండాయి. క్యూ టీబీసీ వద్దకు చేరింది. శనివారం అర్ధరాత్రి వరకు 80,404 మంది స్వామివారిని దర్శించుకున్నారు. కానుకల రూపంలో హుండీలో రూ.3.83 కోట్లు సమర్పించారు. దర్శన టికెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది.

టెర్రకోట బొమ్మలపై విదేశీయుల ఆసక్తి



బుద్ధ విగ్రహాల కోసం టెర్రకోట హబ్‌కు వచ్చిన చైనా దేశస్తులతో ఇక్కడి నిర్వాహకుడు రామకృష్ణ

పలమనేరు(చిత్తూరు జిల్లా): చిత్తూరు జిల్లా పలమనేరు పట్టణ సమీపంలోని టెర్రకోట హబ్, సీఎఫ్‌సీ(కామన్ ఫెసిలియేట్ సెంటర్)లను చైనా నుంచి వచ్చిన న్యామా, ప్రేమాతో పాటు యూఎస్ఏకు చెందిన కొందరు ఆదివారం సందర్శించారు. ఇక్కడి హస్త కళాకారులు తయారు చేస్తున్న పలు రకాల మట్టిబొమ్మలు, కళాఖండాలను చూశారు. ముఖ్యంగా ఇంటీరియల్ డిజైన్‌కు చెందిన కంబా(సేంద్రియ డస్ట్‌బిన్లు) చాలా బాగున్నాయని కితాబిచ్చారు. చైనాకు చెందిన వారు రెండు వేల బుద్ధ విగ్రహాలను ఆర్డర్ ఇచ్చారు. ఆపై ఆన్‌లైన్ ద్వారా మిగిలిన వస్తువుల వ్యాపారాన్ని చేస్తామని హామీ ఇచ్చారు. అమెరికా దేశస్తులు సైతం పలు రకాల వాల్ డిజైన్లను పెద్ద ఎత్తున కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్టు ఇక్కడి టెర్రకోట కళాకారుల సంఘ నాయకులు రామకృష్ణ తెలిపారు. అంతేగాక ఇక్కడ లభించే పలు రకాల డిజైన్లను పరిశీలించి తమ దేశాల్లో వీటి విక్రయాల కోసం ప్లాన్ చేస్తున్నామని విదేశీయులు పేర్కొన్నారు. తమకు మైసూరులోని ఓ హ్యాండిక్యాఫ్ట్స్, వేస్ట్‌మేనేజ్‌మెంట్ స్వచ్ఛంద సంస్థ ద్వారా పలమనేరులో ఇలాంటి వస్తువులున్నట్టు తెలుసుకొని వీటిని వీక్షించేందుకు ఇక్కడికి వచ్చినట్టు వారు వివరించారు.

తెలంగాణ

కార్టూనిస్టుల కోసం మెగా వర్క్‌షాప్

హాజరైన రెండు రాష్ట్రాల కార్టూనిస్టులు


పంజగుట్ట (హైదరాబాద్): యువ కార్టూనిస్టులకు ఉపయోగపడేలా ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలుగు కార్టూనిస్టుల మెగా వర్క్‌షాప్ నిర్వహించారు. తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు వందకు పైగా కార్టూనిస్టులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ పొలిటికల్, సోషల్ కార్టూనిస్టులు తమ అనుభవాలను పంచుకున్నారు. హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ సౌజన్యంతో నిర్వహించిన ఈ వర్క్‌షాప్‌లో ప్రముఖ కార్టూనిస్టు శంకర్, సుభాని, నర్సిం, మృత్యుంజయ్, శంకు, సురేంద్రలు పాల్గొన్నారు. సైలెంట్ కార్టూన్లు ఎందుకు వెయ్యాలి, కార్టూన్‌కు బొమ్మ ముఖ్యమా లేక ఐడియా ముఖ్యమా? సోషల్ కార్టూన్లు వేసేవారు పొలిటికల్ కార్టూన్లు వెయ్యాలంటే ఎలాంటి సాధన చెయ్యాలి, కార్టూన్ సిండికేషన్ అంటే ఏమిటి, అది కార్టూనిస్టులకు ఎలా ఉపయోగపడుతుంది, లైవ్ డ్రాయింగ్, పాకెట్ కార్టూన్ వంటి అంశాలను యువ కార్టూనిస్టులకు వారు వివరించారు. వర్షాకాలంలో సిటీ జీవితం అనే అంశంపై స్పాట్ కార్టూన్ డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ప్రముఖ యోగా శిక్షకురాలు సంగీత నిర్వహించిన ఈ కార్టూన్ పోటీలో బెస్ట్ ఎంట్రీలు ప్రదర్శనలో ఉంచారు. విజేతలకు జ్ఞాపిక, బహుమతులు అందించారు. కార్యక్రమ నిర్వహణకు దోహదపడిన కార్టూనిస్టులు రాజశేఖర్, హరికృష్ణ, నాగేశ్వరం, అశ్వక్, సి.ఆర్.రాజు, హరగోపాల్, నందులను ఘనంగా సత్కరించుకున్నారు.

గోవా గవర్నర్ సాహితీ నైపుణ్యం భేష్

తెలంగాణ గవర్నర్ రాధాకృష్ణన్

పంజగుట్ట (హైదరాబాద్): గోవా గవర్నర్ పి.ఎస్.శ్రీధరన్ పిళ్లై రచనల్లో తన సాహిత్య నైపుణ్యాన్ని ప్రదర్శించడమే కాకుండా, ఆలోచింపజేసే కథలతో పాఠకులను కట్టిపడేశారని తెలంగాణ, జార్ఖండ్ గవర్నర్, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ సి.పి.రాధాకృష్ణన్ అన్నారు. గోవా గవర్నర్, రచయిత శ్రీధరన్ పిళ్లై రచించిన «రామచిలుక» తెలుగు అనువాద పుస్తకాన్ని ఆదివారం రాజ్‌భవన్‌లో రాధాకృష్ణన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణన్ మాట్లాడుతూ ఎల్.ఆర్.స్వామి తెలుగు అనువాదం, అసలు రచన సారాంశాన్ని పూర్తిగా ప్రతిబింబించిందని చెప్పారు. కార్యక్రమంలో గవర్నర్ ప్రధానకార్యదర్శి బుర్రా వెంకటేశం, గోవా గవర్నర్ కార్యదర్శి ఎం.ఆర్.ఎం.రావు, ప్రొఫెసర్ కొలకలూరి ఇనాక్, కవి శివారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎస్.రాంచందర్‌రావు, ఎల్.ఆర్.స్వామి పాల్గొన్నారు.

ఆర్మీ చీఫ్‌గా జనరల్ ఉపేంద్ర ద్వివేది



న్యూఢిల్లీ: చైనా, పాకిస్తాన్‌లతో సరిహద్దుల్లో సుదీర్ఘ కార్యాచరణ అనుభవమున్న లెఫ్టినెంట్ జనరల్ ఉపేంద్ర ద్వివేది 30వ ఆర్మీ చీఫ్‌గా ఆదివారం బాధ్యతలు చేపట్టారు. నాలుగు దశాబ్దాలకు పైగా సేవలందించిన ఆర్మీ చీఫ్ జనరల్ మనోజ్ పాండే రిటైరయ్యారు. జనరల్ ఉపేంద్ర ద్వివేది ఈ ఏడాది ఫిబ్రవరి 19వ తేదీ నుంచి ఆర్మీ వైస్ చీఫ్‌గా పనిచేస్తున్నారు. అంతకుముందు 2022–2024 సంవత్సరాల మధ్య ఆయన జనరల్ ఆఫీసర్ కమాండ్ ఇన్ చీఫ్ ఆఫ్ నార్తర్న్ కమాండ్‌గా ఉన్నారు. మధ్యప్రదేశ్‌లోని రేవా సైనిక స్కూల్ విద్యార్థి అయిన జనరల్ ద్వివేది 1984లో జమ్మూకశ్మీర్ రైఫిల్స్ రెజిమెంట్‌లో చేరారు. పరమ విశిష్ట సేవ, అతి విశిష్ట సేవ పతకాలు పొందారు.

ఆర్మీ చీఫ్, నేవీ చీఫ్ క్లాస్‌మేట్స్

దేశ సైనిక చరిత్రలోనే మొట్టమొదటిసారిగా ఆర్మీకి, నేవీకి సారథ్యం వహిస్తున్న ఇద్దరూ క్లాస్‌మేట్స్ కావడం విశేషం. లెఫ్టినెంట్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, అడ్మిరల్ దినేశ్ త్రిపాఠీ మధ్యప్రదేశ్‌లోని రేవా సైనిక్ స్కూల్‌లో సహాధ్యాయులు. 1970లలో వీరిద్దరూ అక్కడ ఐదో తరగతి నుంచి కలిసి చదువుకున్నారు. వీరిద్దరి రోల్ నంబర్లు కూడా దగ్గరదగ్గరగా ఉన్నాయి. జనరల్ ద్వివేది రోల్ నంబర్ 931 కాగా, అడ్మిరల్ త్రిపాఠీ నంబర్ 938. పాఠశాల దశలో మొదలైన వీరి స్నేహబంధం ఇప్పటికీ కొనసాగుతోంది. వేర్వేరు బాధ్యతల్లో ఉన్నప్పటికీ వీరి మైత్రి చెక్కుచెదరలేదు. రెండు నెలల వ్యవధిలోనే ఈ ఏడాది మేలో అడ్మిరల్ త్రిపాఠీ నేవీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టగా, తాజాగా లెఫ్టినెంట్ జనరల్ ఉపేంద్ర ద్వివేది ఆర్మీ చీఫ్ అయ్యారు.

మహారాష్ట్ర తొలి మహిళా సీఎస్‌గా సుజాతా సౌనిక్ రికార్డు



ముంబై: మహారాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారిణి సుజాతా సౌనిక్ నియమితులయ్యారు. ఐఏఎస్ అధికారి నితిన్ కరీర్ పదవీ విరమణ అనంతరం సుజాతా సౌనిక్‌కు బాధ్యతలు అప్పగించారు. దక్షిణ ముంబైలోని రాష్ట్ర సచివాలయం మంత్రాలయంలో ఆదివారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో సౌనిక్ బాధ్యతలను స్వీకరించారు. రాష్ట్ర చరిత్రలో అత్యున్నత పదవిని చేపట్టిన మొదటి మహిళగా రికార్డు సృష్టించారు. 1987 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన సుజాత మరో ఏడాది పాటు పదవిలో ఉంటారు. ఆమె భర్త మనోజ్ సౌనిక్ కొన్నేళ్ల క్రితం ప్రధాన కార్యదర్శిగా చేశారు. ఇప్పుడు రాష్ట్ర హోంశాఖ అదనపు ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు.

అంటార్కిటికాలో 'కరిగిన నీటి' ముప్పు



లండన్: వాతావరణ మార్పులు, అధిక ఉష్ణోగ్రతలతో సముద్రాలు వేడెక్కుతున్నాయి. మంచు కరిగిపోతోంది. సముద్ర మట్టాలు క్రమంగా పెరుగుతున్నాయి. ఈ పరిణామం ఇలాగే కొనసాగితే మరికొన్ని దశాబ్దాల్లో సముద్ర తీర ప్రాంతాల్లోని నగరాలు జల సమాధి కావడం తథ్యమన్న హెచ్చరికలు ఇప్పటికే వినిపిస్తున్నాయి. అతిపెద్ద మంచు కొండలకు నిలయమైన అంటార్కిటికా సముద్రంలో వాతావరణ మార్పుల ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. అంటార్కిటికా మంచు కొండలపైనా, అంతర్భాగంలో కరిగిన నీరు, మంచు మిశ్రమం(స్లష్) గతంలో అంచనా వేసిన దానికంటే అధికంగా ఉన్నట్లు బ్రిటన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ కేంబ్రిడ్జ్ పరిశోధకులు తాజా అధ్యయనంలో గుర్తించారు. ఈ అధ్యయనం పూర్తి వివరాలను నేచర్ జియోసైన్స్ పత్రికలో ప్రచురించారు. కృత్రిమ మేధ(ఏఐ) సాంకేతికతతో స్లష్ పరిమాణాన్ని తేల్చారు. అంటార్కిటికాలో వేసవి తీవ్రత అధికంగా ఉన్న సమయంలో కరిగిన నీరు 57 శాతం స్లష్ రూపంలో, మిగతా 43 శాతం చెరువులు, కుంటల పైభాగంలో ఉన్నట్లు గుర్తించారు. మంచు కొండలపై ఉన్న నీరంతా సముద్రంలోకి చేరితే అంటార్కిటికా నీటి మట్టం మరింత పెరుగుతుందని కేంబ్రిడ్జ్ యూనివర్సిటీకి చెందిన స్కాట్ పోలార్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ప్రతినిధి డాక్టర్ రెబెక్కా డెల్ వివరించారు. ఇప్పటిదాకా ఉన్న అంచనాల కంటే 2.8 రెట్లు అధికంగా స్లష్ ఉన్నట్లు తెలిపారు. ఉష్ణోగ్రతలు మరింత పెరిగితే మంచు కొండలపై కరిగిన నీటి పరిమాణం వేగంగా పెరుగుతుంది. దాంతో బరువు పెరిగి మంచు కొండలు కూలిపోవడం, ముక్కలు కావడం మొదలవుతుంది. నీరంతా సముద్రంలోకి చేరుతుంది.

జన స్పందనకు వందనం

సార్వత్రిక ఎన్నికల్లో 65 కోట్ల మందికిపైగా ఓటేశారు • రాజ్యాంగం, ప్రజాస్వామ్య ప్రక్రియల పట్ల విశ్వాసం వ్యక్తం చేశారు

మన్ కీ బాత్‌లో ప్రధాని

- పారిస్ ఒలింపిక్స్‌కు వెళ్తున్న మన ఆటగాళ్లను ప్రోత్సహించాలని ప్రజలకు సూచన
- తల్లి పేరిట మొక్కలు నాటాలని పిలుపు



న్యూఢిల్లీ: ప్రపంచంలోనే అతిపెద్ద ఎన్నికలైన భారత సార్వత్రిక ఎన్నికల్లో 65 కోట్ల మందికిపైగా ప్రజలు ఓటు వేశారని, దేశ రాజ్యాంగం, ప్రజాస్వామ్య ప్రక్రియల పట్ల తిరుగులేని విశ్వాసం వ్యక్తం చేశారని ప్రధాని మోదీ కొనియాడారు. ఎన్నికల్లో పాల్గొన్న ఓటర్లకు కృతజ్ఞతలు తెలియజేశారు. విజయవంతంగా ఎన్నికలు నిర్వహించిన కేంద్ర ఎన్నికల సంఘానికి అభినందనలు తెలిపారు. వరుసగా మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మోదీ ఆదివారం తొలి 'మన్ కీ బాత్' కార్యక్రమంలో దేశ ప్రజలను ఉద్దేశించి దాదాపు 30 నిమిషాలపాటు మాట్లాడారు. విభిన్నమైన అంశాలను ప్రస్తావించారు. తన అభిప్రాయాలు పంచుకున్నారు. వచ్చే నెలలో పారిస్ ఒలింపిక్స్‌లో పోటీ పడబోతున్న భారత క్రీడాకారులకు ముందస్తుగా శుభాకాంక్షలు తెలిపారు. మన ఆటగాళ్లను ప్రోత్సహిస్తూ సోషల్ మీడియాలో 'ఛీర్4భారత్' హ్యాష్‌ట్యాగ్‌తో పోస్టులు పెట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. టోక్యోలో జరిగిన గత ఒలింపిక్స్‌లో భారత ఆటగాళ్ల ప్రదర్శన ప్రతి ఒక్కరి హృదయాలను దోచుకుందని ప్రశంసించారు. పారిస్ ఒలింపిక్స్‌కు రెట్టించిన ఉత్సాహంతో సిద్ధమవుతున్న మనవాళ్లకు మద్దతు తెలపాలని సూచించారు. ఎన్నో రకాల క్రీడల్లో భారత ఆటగాళ్లు విశేషమైన ప్రతిభ చూపుతున్నారని హర్షం వ్యక్తంచేశారు. ఒలింపిక్స్‌కు వెళ్తున్న మన వాళ్లను త్వరలో కలుస్తానని, భారతీయులందరి తరపున వారికి ప్రోత్సాహం అందిస్తానని పేర్కొన్నారు. మన్ కీ బాత్‌లో మోదీ ఇంకా ఏమన్నారంటే..

నా తల్లి పేరిట మొక్క నాటాను

''పర్యావరణ పరిరక్షణ కోసం అడవుల పెంపకంపై మనమంతా దృష్టి పెట్టాలి. ఇందులో భాగంగా ప్రపంచ పర్యావరణ దినం సందర్భంగా 'తల్లి పేరిట ఒక మొక్క' కార్యక్రమం ప్రారంభించుకున్నాం. నా మాతృమూర్తికి గుర్తుగా మొక్క నాటాను. తల్లి పేరిట, తల్లి గౌరవార్థం మొక్కలు నాటే కార్యక్రమం వేగంగా ప్రజల్లోకి వెళ్తుండడం ఆనందంగా ఉంది. అమ్మతో కలిసి మొక్కలు నాటిన చిత్రాలను జనం సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్నారు. కన్నతల్లిలాంటి భూగోళాన్ని కాపాడుకోవడానికి ఈ కార్యక్రమం దోహదపడుతుంది.

సంస్కృత భాషను గౌరవించుకుందాం

ఆలిండియా రేడియోలో సంస్కృత వార్తల బులెటిన్‌కు 50 ఏళ్లు నిండాయి. ప్రాచీన భాషకు ప్రాధాన్యం ఇస్తున్న ఆలిండియా రేడియోకు నా అభినందనలు తెలియజేస్తున్నా. భారతీయ విజ్ఞానం, శాస్త్రాల పురోగతి వెనుక సంస్కృత భాష కీలక పాత్ర పోషించింది. సంస్కృత భాషను మనమంతా గౌరవించుకోవాలి. నిత్య జీవితంలో ఈ భాషతో అనుసంధానం కావాలి. బెంగళూరులోని ఓ పార్కులో స్థానికులు ప్రతి ఆదివారం కలుసుకుంటారు. సంస్కృత భాషలోనే మాట్లాడుకుంటారు. మరోవైపు దేశవ్యాప్తంగా గిరిజనులు ఈరోజు(జూన్ 30) 'హూల్ దివస్' జరుపుకుంటున్నారు. 1855లో సంథాల్ గిరిజన యోధులు వీర్ సింధూ, కాన్హూ అప్పటి బ్రిటిష్ పాలకులపై తిరగబడ్డారు. పరాయి పాలనకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమించారు. వీర్ సింధూ, కాన్హూకు నివాళులు అర్పిస్తున్నా.

వోకల్ ఫర్ లోకల్

మన స్వదేశీ ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ పెరుగుతోంది. మన వద్ద తయారైన ఉత్పత్తులు అంతర్జాతీయ స్థాయికి చేరుకున్నాయంటే అది మనందరికి గర్వకారణమే. కేరళలోని అట్టప్పాడీ గ్రామంలో గిరిజన మహిళలు తయారు చేస్తున్న కార్తుంబీ గొడుగులకు అంతర్జాతీయ ఖ్యాతి లభించింది. ఈ గొడుగుల ప్రస్థానం ఒక చిన్న కుగ్రామం నుంచి బహుళజాతి సంస్థల దాకా చేరుకుంది. 'వోకల్ ఫర్ లోకల్'కు ఇంతకంటే పెద్ద ఉదాహరణ ఏముంటుంది? లోకల్ ఉత్పత్తులను గ్లోబల్‌కు చేర్చడంలో జమ్మూకశ్మీర్ కూడా తక్కువేం కాదు. చలి వాతావరణంలో పండించే బఠాణీలు పుల్వామా నుంచి గత నెలలో లండన్‌కు ఎగుమతి అయ్యాయి. జమ్మూకశ్మీర్ సాధించిన ఈ ఘనత అందరికీ స్ఫూర్తిదాయకం. ఈ విజయం జమ్మూకశ్మీర్ అభివృద్ధికి కొత్త ద్వారాలు తెరుస్తుంది.

మన సంస్కృతికి ప్రపంచవ్యాప్తంగా ఆదరణ

భారతీయ సంస్కృతికి ప్రపంచవ్యాప్తంగాఎనలేని ఆదరణ లభిస్తోంది. ఇండియన్ కల్చర్‌పై కువైట్ ప్రభుత్వం కువైట్ నేషనల్ రేడియోలో ప్రతి ఆదివారం అరగంటపాటు హిందీ భాషలో ప్రత్యేక కార్యక్రమం ప్రసారం చేస్తోంది. మన సినిమాలు, కళలపై అక్కడ పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. తుర్కమెనిస్తాన్‌లో ఈ ఏడాది మే నెలలో ఆ దేశ అధ్యక్షుడు 24 మంది ప్రపంచ ప్రఖ్యాత కవుల విగ్రహాలను ఆవిష్కరించారు. అందులో గురుదేవ్ రవీంద్రనాథ్ ఠాగూర్ విగ్రహం కూడా ఉంది. ఇది గురుదేవ్‌తోపాటు భారత్‌కు కూడా ఒక గొప్ప గౌరవమే. కరీబియన్ దేశాలైన సురినామ్, సెయింట్ విన్సెంట్, గ్రెనాడైన్స్‌లో ఇటీవల భారతీయ వారసత్వ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. అంతేకాదు 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జూన్ 21న ప్రపంచమంతటా అమితోత్సాహంతో నిర్వహించుకున్నారు. సౌదీ అరేబియా, ఈజిప్టులో మహిళలు యోగా కార్యక్రమాలను ముందుండి నడిపించారు'' అన్నారు.

ప్రజా సమస్యలపై ప్రస్తావనేది: విపక్షాలు

'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ ప్రజా సమస్యలను ప్రస్తావించలేదని కాంగ్రెస్ పార్టీ మీడియా, ప్రచార విభాగం చైర్మన్ పవన్ ఖేరా ఆదివారం విమర్శించారు. నీట్–యూజీ పరీక్షలో అక్రమాలు, రైల్వే ప్రమాదాలు, మౌలిక సదుపాయాల ధ్వంసంపై ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. ఢిల్లీ ఎయిర్‌పోర్టులో పైకప్పు కూలిపోయి ఒకరు మరణించారని, దీనిపై మోదీ నోరెత్తలేదని మండిపడ్డారు. నీట్–యూజీ పేపర్ లీకేజీ, అక్రమాలపై జనం దృష్టిని మళ్లించడానికి కేరళలో తయారయ్యే గొడుగుల గురించి మోదీ ప్రస్తావించారని విమర్శించారు. ప్రజల మనసులో మాటను మోదీ తెలుసుకోవాలని పవన్ ఖేరా హితవు పలికారు.

నివాసాలు ఖాళీ చేయండి

- ఓడిపోయిన ఎంపీలకు కేంద్రం ఆదేశాలు
- జాబితాలో తెలుగు రాష్ట్రాల ఎంపీలు

సాక్షి, న్యూఢిల్లీ: తాజా లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోయిన పార్లమెంటు సభ్యులు తమ అధికార నివాసాలను ఖాళీ చేయాలని కేంద్రప్రభుత్వం ఆదేశించింది. జూలై 11వ తేదీ లోపు ప్రభుత్వం కేటాయించిన బంగ్లాలను ఖాళీ చేయాలని ఎంపీలకు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ పరిధిలోని డైరెక్టరేట్ ఆఫ్ ఎస్టేట్స్ నోటీసులు జారీ చేసింది. ఎన్నికల్లో ఓడిపోయిన సిట్టింగ్ ఎంపీలు నెల రోజుల్లో బంగ్లాను ఖాళీ చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం రెగ్యులర్ నోటీసులు జారీ చేస్తారు. ఈ నోటీసు అందిన 30 రోజుల్లోగా ఖాళీ చేయాలి. లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించిన సిట్టింగ్ ఎంపీలు తమకు క్రితం కేటాయించిన నివాసాల్లో అలాగే కొనసాగుతారు. ప్రభుత్వ బంగ్లాలను ఖాళీ చేయాల్సినవారి జాబితాలో తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎంపీలతో పాటు కేంద్ర మంత్రులు కూడా ఉన్నారు. ఎన్నికల్లో ఓడిపోయిన కేంద్ర మంత్రుల్లో స్మృతీ ఇరానీ, ఆర్.కె. సింగ్, అర్జున్ ముండా, రాజీవ్ చంద్రశేఖర్, వి.మురళీధరన్, సాధ్వి నిరంజన్ జ్యోతి, భగవంత్ ఖుబా, భారతీ పవార్ తదితరులతోపాటు ఈ సారి బీజేపీ నుంచి టికెట్ దక్కని కేంద్ర మంత్రి మీనాక్షి లేఖి లాంటి వారు కూడా ఉన్నారు.



ఫ్రాన్సు ముందస్తు ఎన్నికల తొలి రౌండ్‌లో ఆదివారం పారిస్‌లో ఓటేస్తున్న అధ్యక్షుడు మాక్రాన్. రెండో రౌండ్ పోలింగ్ జులై 7న జరగనుంది. ఈ ఎన్నిక ఫలితాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ప్రతిపక్ష నాయకురాలు లీ పెన్ సారథ్యంలోని నేషనల్ ర్యాలీ పార్టీదే పైచేయి కావచ్చని పరిశీలకులు భావిస్తున్నారు.

హిందూ ధర్మమే నాకు స్ఫూర్తి

బ్రిటన్ ప్రధానమంత్రి రిషి సునాక్ • భార్య అక్షతతో స్వామి నారాయణ్ మందిర్‌లో పూజలు



లండన్: హిందూ ధర్మమే తనకు ప్రేరణను, సాంత్వనను అందిస్తుందని భారత సంతతికి చెందిన బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ చెప్పారు. ''భగవద్గీతపై పార్లమెంట్ సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేసినందుకు గర్వంగా ఉంది. ఫలితాన్ని గురించి ఆలోచించకుండా మన కర్తవ్యాన్ని నిర్వర్తించాలని భగవద్గీత బోధిస్తుంది' అని ఆయన అన్నారు. ఆదివారం రిషి సునాక్ భార్య అక్షతా మూర్తితో కలిసి లండన్‌లోని నియాస్డెన్ ప్రాంతంలో ఉన్న స్వామి నారాయణ్ మందిరాన్ని సందర్శించుకున్నారు. వచ్చే 4వ తేదీన బ్రిటన్ పార్లమెంట్‌కు ఎన్నికలు జరగనున్న వేళ వారు ఆలయంలో పూజలు చేశారు. అంతకుముందు రిషి సునాక్ దంపతులకు ఆలయంలోకి ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా జై స్వామినారాయణ్ అంటూ ప్రసంగాన్ని ప్రారంభించిన సునాక్ టీ20 ప్రపంచ కప్‌ను భారత జట్టు గెలుచుకున్న విషయాన్ని ప్రస్తావించడం విశేషం. చీర ధరించిన అక్షతా మూర్తి అక్కడి మహిళలు, చిన్నారులతో ముచ్చటించారు. ఎన్నికల ప్రచారం తుది అంకానికి చేరుకుంటున్న వేళ ప్రతిపక్ష లిబరల్ పార్టీ నేత కీర్ స్టార్మర్ హిందూ ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు శుక్రవారం లండన్‌లోని కింగ్స్‌బరీ ప్రాంతంలో ఉన్న స్వామి నారాయణ్ ఆలయాన్ని సందర్శించుకున్నారు. జై స్వామి నారాయణ్ అంటూ స్టార్మర్ ప్రసంగించారు. అధికారంలోకి వస్తే భారత్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తామని ప్రకటించారు. 2021 గణాంకాల ప్రకారం బ్రిటన్‌లో హిందువులు సుమారు 10 లక్షల మంది ఉన్నారు. దాంతో ప్రధాన పార్టీలు హిందువుల ఓట్లపై కన్నేశాయి.

జార్ఖండ్‌లో కూలిన గిర్డర్

ఆర్గా నదిపై నిర్మిస్తున్న వంతెనపై ఘటన

జార్ఖండ్: జార్ఖండ్‌లో పెను ప్రమాదం తప్పింది. గిరిధ్ జిల్లాలోని ఆర్గా నదిపై నిర్మాణంలో ఉన్న వంతెన గిర్డర్ ఒకటి కూలిపోయింది. రాష్ట్ర రాజధాని రాంచీకి 235 కిలోమీటర్ల దూరంలో ఉన్న డియోరీ బ్లాక్‌లో శనివారం రాత్రి ఈ ఘటన జరిగింది. భారీ వర్షం కారణంగా గిర్డర్ కూలిపోయిందని, పిల్లర్ కూడా వంగిపోయిందని ఈఈ వినయ్‌కుమార్ తెలిపారు. 5 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న ఈ వంతెన జార్ఖండ్‌లోని గిరిధ్, బిహార్‌లోని జమూయి జిల్లాలను కలుపుతుంది.

మహారాష్ట్రలో జలపాతంలో కొట్టుకుపోయిన కుటుంబం

పుణె: మహారాష్ట్రలో ప్రముఖ పర్యాటక ప్రాంతం భూషీ ఆనకట్ట దిగువన ఉన్న జలపాతంలో వద్ద ఒక కుటుంబం కొట్టుకుపోయింది. ఎగువ ప్రాంతంలో భారీగా వర్షాలు కురవడంతో వరదనీటి ప్రవాహం జలపాతం వద్ద పోటెత్తింది. హదాప్సార్ నుంచి వచ్చిన అన్సారీ కుటుంబం ఇదే సమయంలో జలపాతం వద్ద ఉంది. ప్రవాహం ధాటికి అంతా కొట్టుకుపోయారు. ఈ ఘటనలో 36 ఏళ్ల శహిష్ట అన్సారీ, 13 ఏళ్ల అమీమా, ఎనిమిదేళ్ల ఉమేరాల మృతదేహాలను దిగువన కనుగొన్నారు. ఇద్దరి జాడ గల్లంతైంది.

తప్పుకోవాలంటూ బైడెన్‌పై ఒత్తిళ్లు

ససేమిరా అంటున్న అమెరికా అధ్యక్షుడు

వాషింగ్టన్: అట్లాంటాలో టీవీలో ముఖాముఖి చర్చలో రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ ధాటికి చేతులెత్తేసిన డెమొక్రటిక్ అభ్యర్థి, అధ్యక్షుడు జో బైడెన్‌పై సొంత పార్టీలోనే వ్యతిరేకత ఎక్కువవుతోంది. 81 ఏళ్ల వయసున్న ఆయన అధ్యక్ష రేసు నుంచి తప్పుకోవాలని డిమాండ్లు పెరుగుతున్నాయి. ఆయన మాత్రం తాను తప్పుకునే ప్రసక్తే లేదని పునరుద్ఘాటించారు! ట్రంప్‌తో చర్చలో బైడెన్ పేలవ ప్రదర్శనను పలు మీడియా సంస్థలు సంపాదకీయాల్లో ఏకిపారేశాయి. సోషల్ మీడియాలో మీమ్స్‌కు కొదువే లేదు. ఈ విమర్శలపై బైడెన్ స్పందించారు. ''బరాక్ ఒబామా మాదిరి ప్రత్యర్థిని నేను వాగ్ధాటితో ఇరుకున పెట్టలేకపోయిన మాట వాస్తవమే. దీనిపై నా మద్దతుదారులు, పార్టీలోనూ కొంత అసంతృప్తి నెలకొందని తెలుసు. కానీ ట్రంప్‌పై మరింతగా పోరాడతా' అని అన్నారు.



డెమొక్రటిక్ ముఖ్యుల్లో పెరిగిన అసంతృప్తి

ట్రంప్‌తో డిబేట్ తర్వాత బైడెన్ అభ్యర్థిత్వంపై చాలా మంది డెమొక్రటిక్ నేషనల్ కమిటీ(డీఎన్‌సీ) సభ్యుల్లో అసమ్మతి పెరిగింది. యువనేతకు అవకాశమివ్వాలన్న డిమాండ్ తెరపైకి వస్తోంది. షికాగోలో ఆగస్ట్ 19న జరిగే డెలిగేట్ల భేటీలో దీనిపై కీలక నిర్ణయం తీసుకోవచ్చని పార్టీ వర్గాల కథనం.

భారత జీవజాలం జాబితా సిద్ధం

ప్రపంచంలోనే తొలిసారిగా ఆవిష్కరించిన ఇండియా

న్యూఢిల్లీ: దేశంలోని అన్ని జాతుల జీవుల జాబితాను కేంద్ర ప్రభుత్వం సిద్ధంచేసింది. ఇలా 1,04,561 జాతుల జీవాల జాబితాను రూపొందించిన తొలి దేశంగా భారత్ రికార్డ్ నెలకొల్పింది. జీవవైవిధ్యాన్ని డాక్యుమెంట్ రూపంలోకి తెచ్చిన ఘనత భారత్‌కే దక్కిందని కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ అన్నారు. ఆదివారం కోల్‌కతాలో జువాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా 109వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా 'ఫానా ఆఫ్ ఇండియా చెక్‌లిస్ట్ పోర్టల్'ను మంత్రి ఆవిష్కరించారు. డాక్యుమెంట్‌లో 36 జంతు కుటుంబాలకు చెందిన 121 జీవ వర్గాలను విభజించి వాటి సంఖ్యను లెక్కగట్టారు. స్థానిక జాతులు, పరిరక్షించాల్సిన జంతువుల వివరాలు, అంతరించిపోతున్న జాతులకు డాక్యుమెంట్‌లో చోటు కల్పించారు.

భూస్వామ్య శక్తులను తరిమేద్దాం: సోరెన్

భోగ్‌నదిహ్ (సాహిబ్‌గంజ్): జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్ భూస్వామ్య శక్తులపై తిరుగుబాటు ప్రకటించారు. బీజేపీని ఇండియా కూటమి దేశం నుంచే తరిమికొడుతుందన్నారు. ఇటీవల జైలు నుంచి విడుదలైన సోరెన్ ఆదివారం సాహిబ్‌గంజ్‌లో ర్యాలీలో మాట్లాడారు. ''బ్రిటిష్ పాలకులపై సంథాల్‌ల మాదిరిగానే హూల్ తిరుగుబాటుతో భూస్వామ్య శక్తులను జార్ఖండ్ నుంచే గాక దేశం నుంచే వెళ్లగొట్టాలి'' అని సోరెన్ పిలుపునిచ్చారు. ''నేను జైలు నుంచి వచ్చి రెండు రోజులే. బీజేపీలో ఇప్పటికే వణుకు మొదలైంది. నాపై మళ్లీ కుట్రలు పన్నుతున్నారు'' అని ఆరోపించారు.

గూగుల్ మ్యాప్స్ అనుసరిస్తూ నదిలోకి..

కాసర్‌గోడ్: అత్యవసరంగా ఆస్పత్రికి బయల్దేరిన ఇద్దరు యువకులు అనూహ్యంగా మృత్యువు అంచులదాకా వెళ్లొచ్చారు. పొరుగు రాష్ట్రం కర్ణాటకలోని ఆస్పత్రికి గూగుల్ మ్యాప్స్‌లో చూపించే మార్గంలో బయల్దేరి మార్గమధ్యంలో కారును నదిలోకి పోనిచ్చారు. నది ప్రవాహంలో కారు అదృష్టవశాత్తు ఒక చెట్టుకు చిక్కుకోవడంతో బయటికొచ్చి ప్రాణాలు కాపాడుకోగలిగారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కేరళలోని కాసర్‌గోడ్ జిల్లాలోని పల్లాంచి ప్రాంతంలో ఇద్దరు యువకులు ఆదివారం తెల్లవారుజామున కర్ణాటకలోని ఆస్పత్రికి కారులో బయల్దేరారు. ''గూగుల్ మ్యాప్స్ ప్రకారం వెళ్తుంటే ఎదురుగా నీళ్లు కనిపించాయి. రోడ్డుపై నీళ్లు నిలిచాయేమోనని అలాగే వెళ్లాం. అది నదిలో లోతట్టు ప్రాంతంలో కట్టిన వంతెన అని తర్వాత అర్థమైంది. ఇరువైపుల రక్షణ గోడ లేదు. నది ఉప్పొంగి పై నుంచి ప్రవహిస్తోంది. ప్రవాహం ధాటికి మా కారు కొట్టుకుపోయింది. ఒడ్డువైపుగా ఒక చెట్టుకు చిక్కుకుని ఆగింది. పోలీసులకు మా లొకేషన్ షేర్ చేయడంతో సమయానికి వచ్చి కాపాడారు. మాకిది నిజంగా పునర్జన్మ'' అని యువకుల్లో ఒకరైన అబ్దుల్ రషీద్ చెప్పారు. సంబంధిత వీడియో వైరల్‌గా మారింది.

అమెరికాలో పోలీసుల కాల్పులు.. 13 ఏళ్ల బాలుడి దుర్మరణం

న్యూయార్క్: అమెరికాలో 13 ఏళ్ల పిల్లాడు పోలీసు తూటాకు బలయ్యాడు. తుపాకీ చూపించి డబ్బులు దోచుకుంటున్న ఒక ముఠా గురించి గాలిస్తున్న పోలీసు బృందం అనూహ్యంగా పిల్లాడిని పొట్టనబెట్టుకుంది. స్థానిక మీడియా, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యుటికాలో శుక్రవారం రాత్రి సైకిల్‌పై వెళ్తున్న ఇద్దరు టీనేజర్లను పోలీసులు ఆపి 'మీ దగ్గర ఎలాంటి ఆయుధాలు లేవు కదా?' అని అడిగారు. వారిలో 13 ఏళ్ల న్యాహ్ ఎంవా ఒక్కసారిగా పరుగెత్తడంతో పోలీసులు వెంటపడ్డారు. దాంతో పిల్లాడు తన దగ్గరున్న బొమ్మ పెల్లెట్ గన్‌తో బెదిరించాడు. దాన్ని నిజమైన గన్‌గా భావించి ప్యాట్రిక్ హష్నే అనే పోలీసు పిల్లాడిని కిందపడేసి పట్టుకోబోయాడు. మరో ఇద్దరు పోలీసులు పిడిగుద్దులు కురిపించారు. పెనుగులాటలో పిల్లాడిని ప్యాట్రిక్ షూట్ చేశాడు. ఛాతిలో తూటా దిగడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పిల్లాడు చనిపోయాడు. మొత్తం ఉదంతం పోలీసు అధికారి బాడీ కెమెరాలో రికార్డయింది. వారి అతి జాగ్రత్తలు అమాయక పౌరులను బలితీసుకుంటున్నాయని పిల్లాడి సంతాప సభలో స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేశారు. దీనిపై నిష్పాక్షిక దర్యాప్తు జరుపుతామని సిటీ మేయర్ హామీ ఇచ్చారు. అంతర్గత కలహాలతో రగిలిపోతున్న మయన్మార్ నుంచి పిల్లాడి కుటుంబం ఎనిమిదేళ్ల క్రితం అమెరికాకు వలసవచ్చింది.

నేటి నుంచి అమల్లోకి కొత్త నేర చట్టాలు

- రాజద్రోహం నుంచి దేశద్రోహంగా మార్పు
- ఉగ్రవాద కార్యకలాపాలకు కొత్త నిర్వచనం
- ఫిర్యాదుల నుంచి సమన్ల వరకు ఆన్‌లైన్‌లోనే
- ఇక స్టేషన్‌తో సంబంధం లేకుండా జీరో ఎఫ్‌ఐఆర్



న్యూఢిల్లీ: బ్రిటిష్ కాలం నాటి చట్టాలకు తెర పడింది. భారత న్యాయ వ్యవస్థలో మూడు కొత్త నేర చట్టాలు భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియం నేటినుంచి అమల్లోకి రానున్నాయి. భారత శిక్షా స్మృతి (ఐపీసీ), కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్(సీఆర్‌పీసీ), భారత సాక్ష్యాధార చట్టాల స్థానంలో ఇవి అమలు కానున్నాయి. కొత్త చట్టాలతో జీరో ఎఫ్‌ఐఆర్, ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం, ఎస్ఎంఎస్ వంటి ఎలక్ట్రానిక్ పద్ధతిలో సమన్లు పంపడం, హేయమైన నేరాలకు సంబంధించిన క్రైమ్ సీన్లను తప్పనిసరి వీడియోల్లో బంధించడం వంటి ఆధునిక పద్ధతులు న్యాయ వ్యవస్థలో రానున్నాయి. బ్రిటిష్ కాలం నాటి చట్టాల మాదిరిగా శిక్షకు కాకుండా, న్యాయం అందించేందుకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చినట్లు కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. చట్టాల పేరు మాత్రమే కాదు, వాటి సవరణలు పూర్తి భారతీయ ఆత్మతో రూపొందించామన్నారు. కొత్త చట్టాలు రాజకీయ, ఆర్థిక, సామాజిక న్యాయాన్ని అందిస్తాయని చెప్పారు.

- భారతీయ శిక్షాస్మృతిలోని రాజద్రోహాన్ని ఇప్పుడు దేశద్రోహంగా మార్చారు. కులం, మతం వంటి కారణాలతో సామూహిక దాడులు, హత్యకు పాల్పడితే ఐపీసీ ప్రకారం ఏడేళ్ల శిక్ష పడుతుంది. దీన్నిప్పుడు యావజ్జీవంగా మార్చారు. హేయమైన నేరాలకు సంబంధించిన క్రైమ్ సీన్ల వీడియో చిత్రీకరణ తప్పనిసరి చేశారు.
- నకిలీ నోట్ల తయారీ, వాటి స్మగ్లింగ్ ఉగ్రవాదం పరిధిలోకి వస్తుంది. విదేశాల్లో మన ఆస్తుల ధ్వంసాన్నీ ఉగ్రవాదంగా నిర్వచించారు. డిమాండ్ల సాధనకు వ్యక్తులను బంధించడం, కిడ్నాప్ చేయడాన్ని ఉగ్రవాదం పరిధిలోకి చేర్చారు.
- మహిళలు, పిల్లలపై నేరాలపై కొత్త అధ్యాయాన్ని జోడించారు. పిల్లల్ని కొనడం, అమ్మడం ఘోరమైన నేరంగా మార్చారు. మైనర్‌పై సామూహిక అత్యాచారానికి మరణశిక్ష లేదా జీవిత ఖైదు నిబంధన తెచ్చారు. పెళ్లి చేసుకుంటానన్న తప్పుడు వాగ్దానాలతో లైంగిక సంబంధాలు పెట్టుకుని మహిళలను వదిలేయడం వంటి కేసులకు కొత్త నిబంధన పెట్టారు. మహిళలు, పిల్లలపై నేరాల్లో బాధితులకు అన్ని ఆస్పత్రుల్లో ప్రథమ చికిత్స లేదా ఉచిత వైద్యం అందించాలి. మహిళలు, 15 ఏళ్ల లోపు, 60 ఏళ్లు పైబడిన వ్యక్తులు, వికలాంగులు, తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్నవారు ఇంటినుంచే పోలీసు సాయం పొందవచ్చు. కోర్టు అనుమతి లేకుండా లైంగిక దాడి గురించి ప్రచురిస్తే రెండేళ్ల జైలు శిక్ష, జరిమానా నిబంధన చేర్చారు.
- కొత్త చట్టాల ప్రకారం ఫిర్యాదుల నుంచి సమన్లదాకా అన్నీ ఆన్‌లైన్‌లో జరగనున్నాయి. పోలీసు స్టేషన్‌కు వెళ్లే పని లేకుండా ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. ఎస్ఎంఎస్ ద్వారా కూడా సమన్లు పంపవచ్చు. పరిధితో సంబంధం లేకుండా ఏ పోలీస్ స్టేషన్‌లో అయినా ఎఫ్‌ఐఆర్ దాఖలు చేసే జీరో ఎఫ్‌ఐఆర్ విధానం ప్రవేశపెట్టారు. అరెస్టయిన వ్యక్తి కుటుంబానికి, స్నేహితులకు సమాచారాన్ని పంచుకునే వీలు కల్పించడంతో పాటు వివరాలను పోలీస్ స్టేషన్లలో ప్రదర్శిస్తారు.

కేదార్‌నాథ్ సమీపంలో భారీ హిమపాతం

రుద్రప్రయాగ్: కేదర్‌నాథ్‌లో దైవదర్శనం కోసం విచ్చేసిన భక్తులకు అద్భుత దృశ్యం ఆహ్వానం పలికింది. హిమాలయ పర్వత శిఖరాల నుంచి భారీ ఎత్తున మంచు కిందకు కూలుతున్న 'హిమపాతం' దృశ్యం అక్కడి వారిని ఆశ్చర్యం, ఒకింత ఆందోళనకు గురిచేసింది. ఆదివారం ఉదయం ఉత్తరాఖండ్‌లోని కేదర్‌నాథ్ ఆలయం వెనకవైపు నాలుగు కిలోమీటర్లదూరంలోని పర్వతం నుంచి ఒక్కసారిగా భారీ ఎత్తున మంచు విరిగిపడటం ప్రారంభమైంది. భక్తులు ఒకింత భయపడుతూనే ఆ దృశ్యాలను మొబైళ్లలో బంధించేందుకు పోటీపడ్డారు. మేరు–సుమేరు పర్వతశ్రేణుల్లోని చోరాబారీ హిమానీనదం పరిధిలో గాంధీ సరోవర్‌పై హిమపాతం పడింది. మంచంతా లోయలో పడిపోవడంతో కేదర్‌నాథ్ ఆలయం దాకా దూసుకురాలేదు. దీంతో భక్తులు ఊపిరిపీల్చుకున్నారు. దాదాపు ఐదు నిమిషాలపాటు గుట్టలకొద్దీ మంచు కిందకు పడుతున్న వీడియో వైరల్‌గా మారింది.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
సోమవారం ; 1 ; జూలై ; 2024



గూడు ధ్వంసం

తీర జిల్లాల్లో వర్షాలకు పాత ఇళ్లు కూలిపోతున్నాయి. ఆదివారం మంగళూరు వద్ద పల్లకెరెలో పడిపోయిన ఓ ఇల్లు

న్యూస్‌రీల్

జోరుగా వంటల పోటీలు



చిక్కబళ్లాపురం: చిక్కబళ్లాపురం నగరంలోని వాసవి ధర్మశాలలో ఆర్యవైశ్య మహిళల పిండి వంటల మేళా ఉత్సాహంగా జరిగింది. మహిళలు పలురకాల వంటకాలను తయారు చేసి అక్కడే విక్రయించారు. దోసెలు, ఓళిగ, కుడుములు తదితర వంటకాలను తయారు చేశారు. ఈ సందర్భంగా ఆటలు, పాటల పోటీలు ఆకట్టుకున్నాయి.

బంతి హైకమాండ్ కోర్టుకు

- ఖర్గేతో డీసీఎం భేటీ



ఢిల్లీలో ఖర్గేతో డీకే సమావేశం

శివాజీనగర: ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం పదవులపై గొడవల నేపథ్యంలో ఆదివారం డిప్యూటీ సీఎం, కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను ఢిల్లీలో కలిశారు. రాష్ట్ర రాజకీయాల గురించి చర్చించారు. శుక్రవారమే సీఎం సిద్దు, ఖర్గేతో భేటీ అయ్యారు. కేపీసీసీ అధ్యక్ష మార్పు ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది. సీఎం, డీసీఎం సహా కేపీసీసీ పదవులు బెంగళూరు, మైసూరు వాసుల చేతిలో ఉన్నాయి. కాబట్టి ఉత్తర కర్ణాటక నేతలకు పార్టీ పదవిని ఇవ్వాలని కొందరు డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. అయితే త్వరలో బెంగళూరు పాలికె, జడ్పీ, టీపీ తదితర ఎన్నికలు రాబోతున్నాయి. అవి ముగిసేవరకు మార్పు చేయరాదని ఖర్గేని డీకే కోరినట్లు తెలుస్తోంది. తనకు వ్యతిరేకంగా కొందరు మంత్రుల మాటలు, సీఎం ధోరణి గురించి డీకే చర్చించినట్లు సమాచారం. బెంగళూరులో ఆదివారం హోం మంత్రి జీ.పరమేశ్వర్ మాట్లాడుతూ ఏదైనా మార్చాలనుకుంటే హై కమాండ్ ఆ పనిచేస్తుందని అన్నారు.

కోస్తా జిల్లాలకు భారీ వర్షసూచన



ఆదివారం కలబుర్గిలో వర్షం

దొడ్డబళ్లాపురం: రాష్ట్రంలోని కోస్తా జిల్లాల్లో రాబోయే 5 రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఉడుపి, ఉత్తరకన్నడ, దక్షిణ కన్నడ, శివమొగ్గ, కొడగు జిల్లాల్లో జూలై 4 వరకూ భారీ వర్షాలు కురిసే అవకాశముంది. ఈ జిల్లాల్లో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎల్లో అలర్ట్ ప్రకటించారు. భారీ వర్షాలతోపాటు బలమైన ఈదురు గాలులు వీస్తాయని, సముద్రంలోకి మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని తెలిపారు. ఆదివారం కలబుర్గి పరిసర ప్రాంతాల్లో జోరు వాన కురిసింది.

షాకిస్తోంది.. కరెంటు తీగ



కొడగు వద్ద వర్షాలకు కూలిపోయిన కరెంటు స్తంభం



బెళగావిలో ఇంట్లో కరెంటు తీగలు తగిలి ముగ్గురు మృతి (ఫైల్)

- రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ ప్రమాదాలు
- గత మూడేళ్లలో 1,519 మంది మృత్యువాత
- నియంత్రణ చర్యలు అంతంతే



అజాగ్రత్తగా ఉంటే అపాయమే

బనశంకరి: నేటి రోజుల్లో విద్యుత్ లేకపోవడాన్ని ఊహించలేం. మానవ జీవితానికి విద్యుత్ ఇంధనంగా మారింది. అయితే నాణేనికి మరోవైపు ఉంది. రాష్ట్రంలో తరచూ విద్యుత్ ప్రమాదాలు జరుగుతూ ప్రాణనష్టానికి కారణమవుతున్నాయి. మనషులే కాదు, ఏనుగులు, చిరుతలు వంటి అరుదైన వన్యజీవులు కూడా ప్రాణాలు కోల్పోతున్నాయి. ఇక విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదాలు జరిగి తరచూ లక్షల రూపాయల ఆస్తి నష్టమూ జరుగుతోంది. ఇందులో విద్యుత్‌శాఖ నిర్లక్ష్యం ఎంతో ఉందని ఆరోపణలు ఉన్నాయి.

ఘోర దుర్ఘటనలు

రాష్ట్రంలో గత మూడేళ్లలో కరెంటు ప్రమాదాల వల్ల 1,519 మంది మరణించారు. ఆవులు, ఎద్దులు తదితర 1,574 ప్రాణులు మృతి చెందాయి. గతేడాది నవంబరు ఆఖరులో వైట్‌ఫీల్డ్ మెయిన్‌రోడ్డులో తెగిపడిన కరెంటు తీగను తొక్కడంతో తల్లీ, కూతురు సజీవ దహనం కావడం తెలిసిందే. ఈ ఘోరానికి బెస్కాం నిర్లక్ష్యమే కారణమని ప్రజలు మండిపడ్డారు. బెళగావిలోనూ ఇంట్లో కరెంటు షాక్‌తో ముగ్గురు మరణించారు. 2023–24 లో 473 ప్రమాదాల్లో 481 మంది చనిపోగా, 643 ప్రాణులు విగతజీవులు కావడం ఆందోళన కలిగిస్తోంది. రోజురోజుకు విద్యుత్ వినియోగదారుల పెరగడంతో కరెంటు స్తంభాలు మారుమూల ప్రాంతాలలోకి వస్తున్నాయి. సురక్షిత నిర్వహణ, వినియోగం పెద్ద సవాల్‌గా మారింది.

ఇలా అధికంగా ప్రమాదాలు

- అధిక సంఖ్యలో విద్యుత్ ప్రమాదాలు విద్యుత్ వైర్లు తెగి కిందపడటం లేదా, వైర్లు వేలాడుతుండటంతో సంభవిస్తున్నాయి.
- రోడ్ల పక్కన గల కరెంటు స్తంభాల వైర్లు తెగిపడిన ప్రమాదాల్లో గత మూడేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 143 మంది మృతి చెందగా 24 మంది గాయపడ్డారు. 513 ప్రాణులు చనిపోయాయి.
- విద్యుత్ పరికరాల కనెక్షన్ల వద్ద షాక్ కొట్టి 782 మంది ప్రాణాలు కోల్పోగా 148 పశువులు కన్నుమూశాయి.
- చెట్లు, కొమ్మలు, విద్యుత్ వైర్లపై పడటం, గాలివానలకు విద్యుత్ స్తంభాలు కూలిపోవడం, అనధికార కనెక్షన్లతో ప్రమాదాలు వంటివి ఎక్కువగా జరుగుతున్నాయి.



చిక్కమగళూరులో కరెంటు తీగలు తగిలి ఏనుగు బలి

సురక్షతా వారోత్సవాలు

విద్యుత్ సురక్షిత వినియోగం గురించి ప్రజల్లో జాగృతం చేయడం, విద్యుత్ ప్రమాదాల సంఖ్యను తగ్గించడానికి విద్యుత్ పర్యవేక్షణాలయ శాఖ చర్యలు చేపట్టింది. జూన్ 26 నుంచి జూలై 2 వరకు జాతీయ విద్యుత్ సురక్షతా వారోత్సవాలను నిర్వహిస్తోంది. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో ప్రజలకు, రైతులకు, విద్యాలయాలు, పరిశ్రమలు, మాల్స్, సినిమా థియేటర్లు తదితర ప్రాంతాల్లో జాగృతి కార్యక్రమాలను నిర్వహిస్తారు.

వినియోగం విస్తరించి..

అన్ని రంగాల్లో విద్యుత్ వినియోగం విస్తరించింది, విద్యుత్ రంగం విస్తరించడంతో ప్రమాదాల సంఖ్య పెరుగుతోంది. విద్యుత్ పర్యవేక్షణాలయ శాఖ ఆధ్వర్యంలో జాతీయ విద్యుత్ సురక్షతా వారోత్సవం నిర్వహిస్తామని అన్ని వర్గాల వారిని విద్యుత్‌శాఖ సిబ్బంది జాగృతం చేసి విద్యుత్ ప్రమాదాల సంఖ్య తగ్గించడమే లక్ష్యమని బెంగళూరు విద్యుత్‌శాఖ అధికారిణి బీపీ శశికళ తెలిపారు.

కబ్బన్ పార్కులో సంస్కృత వికాసం

- మన్ కీ బాత్‌లో ప్రధానిచే ప్రశంసలు



సంస్కృత గోష్టిలో యువత

శివాజీనగర: బెంగళూరులోని కబ్బన్ పార్కులో జరిగే వీకెండ్ సంస్కృత కార్యక్రమం ప్రధాని నరేంద్ర మోదీ దృష్టికి వెళ్లింది. ప్రతి ఆదివారం కబ్బన్ పార్కులో ఈ కార్యక్రమంలో చేరే ప్రజలు సంస్కృతంలో మాట్లాడుతారు. పెద్దలు తమ బిడ్డలు, మనమళ్లతో వచ్చి సంస్కృత భాషలోనే సంభాషించడం ద్వారా పిల్లలకు కూడా భాష వచ్చేలా చూస్తారు. సంస్కృత భాష పరిరక్షణ కోసం వారు చేస్తున్న కృషిని ఆదివారం మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ ప్రస్తుతించారు. ప్రజలు స్వయం ప్రేరేపణతో ఇక్కడికి వచ్చి సంస్కృత భాషను మాట్లాడి ఆనందిస్తారని తెలిపారు. గతంలో సంస్కృత భాష మాట్లాడే శివమొగ్గ జిల్లా మత్తూర ను ప్రధాని కొనియాడారు.

యువత మక్కువ

ఈ కార్యక్రమాన్ని సమష్టి గుబ్బి అనే మహిళ ప్రారంభించారు. కిం భూ అని ఈ భేటీలను పిలిచేవారు. ఏమిటీ విషయం అని దీని అర్థం. ఈ ప్రయత్నం బెంగళూరు వాసులను అమితంగా ఆకర్షించింది. ఎంతోమంది సంస్కృత భాషా ప్రియులు రావడం మొదలైంది. భాషా నిపుణులు మెళకువలను బోధిస్తే మిగతావారు నేర్చుకునేవారు. ఎక్కువమంది ఐటీ బీటీ, బ్యాంకు ఉద్యోగులు, యువత రావడం మొదలైంది. అలా ఒక సంస్కృత వికాస వేదికగా మారింది.

మొయిలీ కుమార్తె హంస కన్నుమూత

- బహుముఖ ప్రజ్ఞాశాలిగా గుర్తింపు



వీరప్ప మొయిలీ, కుమార్తె హంస (ఫైల్)

బొమ్మనహళ్లి: కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత వీరప్ప మొయిలీ కూతురు హంస మొయిలీ (46) అనారోగ్యంతో కన్నుమూశారు. పార్టీ పనిపై ఛత్తీస్‌గడ్‌లో ఉన్న మొయిలీ వెంటనే బెంగళూరుకు చేరుకున్నారు. సోమవారం ఉదయం అంత్యక్రియలు జరుపుతారు. మొయిలీ మూడవ కుమార్తె అయిన హంస సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనేవారు. బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేరుగాంచారు. ఆమె మొదటి నుంచి భరతనాట్య కళాకారిణి. అనేక ప్రదర్శనలు ఇచ్చారు. 2007లో దేవదాసీల జీవిత చరిత్రతో తమిళంలో నిర్మించిన శృంగారం అనే సినిమాలో ఆమె నటించారు. నాటకాలలోనూ నటించారు, కవితల సంపుటిని కూడా రచించడంతో పాటు యోగా సాధకురాలిగా ఉన్నారు. అయితే గత కొన్ని నెలల నుంచి అనారోగ్యంగా ఉన్న హంస ఇటీవలే బెంగళూరులోని ఓ ఆస్పత్రిలో చేరారు. పరిస్థితి విషమించి ఆదివారం తెల్లవారుజామున కన్నుమూసినట్లు వైద్యులు తెలిపారు. అనేకమంది ప్రముఖులు ఆమె మృతి పట్ల సంతాపాన్ని వ్యక్తంచేశారు.



కార్యక్రమంలో పాల్గొన్న యోగా అభ్యాసకులు. సీనియర్ యోగా అభ్యాసకులకు సన్మానం

యోగా ఉత్సవం



బాలల నాట్య ప్రతిభ

మైసూరు: యోగా స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మైసూరు నగరంలోని మైసూరు విశ్వవిద్యాలయంలోని యోగా భవనంలో ఆదివారం రాష్ట్ర స్థాయి యోగా పోటీలను నిర్వహించారు. వివిధ జిల్లాల నుంచి సుమారు 500 మందిక పైన యోగాసాధకులు ఆసనాలు వేశారు. 8 సంవత్సరాల నుంచి 21 సంవత్సరాల వయసు మధ్య బాలలు, యువతకు పోటీలు నిర్వహించారు. చివరగా నృత్య ప్రదర్శనలు అలరించాయి.

లోయలోకి పడ్డ ఆర్టీసీ బస్సు

- 25 మందికి గాయాలు

మైసూరు: కేఎస్ ఆర్టీసీ బస్సు వేగంగా వెళుతూ అదుపు తప్పి పల్టీలు కొట్టిన ప్రమాదంలో 25 మందికి పైగా ప్రయాణికులు గాయపడ్డారు. ఈ సంఘటన జిల్లాలోని నంజనగూడు తాలూకాలోని మరడిహుండి గ్రామంలో ఆదికారం జరిగింది. బస్సు బిళిగాళి గ్రామం నుంచి ఎస్.హోసకోటె మీదుగా మైసూరుకు వెళ్తోంది. ఘటనాస్థలం దగ్గర డ్రైవర్ అదుపుతప్పడంతో బస్సు లోయలోకి పల్టీలు కొడుతూ పడిపోయింది. ఈ ప్రమాదంలో 25 మందికి పైన ప్రయాణికులకు గాయాలు కాగా, స్థానికులు, పోలీసులు కలిసి వారిని బయటకు తీసి వాహనాలలో మైసూరులోని ఆస్పత్రులకు తరలించారు. బస్సు డ్రైవర్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. వరుణ పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

మేకెదాటుకు, ఎగువభద్రకు సాయం చేయరూ

- ప్రధాని మోదీకి సీఎం సిద్దు వినతులు

శివాజీనగర: ముఖ్యమంత్రి సిద్దరామయ్య శనివారం సాయంత్రం ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీని భేటీ చేశారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న మౌలిక సదుపాయాల పథకాల నిధుల విన్నవించినట్లు సిద్దు ఎక్స్‌లో తెలిపారు. బెంగళూరుకు తాగు నీరు అందించే, 400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే మేకెదాటు డ్యాం కు రూ.9000 కోట్ల నిధులు, డీపీఆర్ నివేదికకు కేంద్ర జల కమిషన్ నుంచి అనుమతి పెండింగ్‌లో ఉన్నాయి, వాటిని మంజూరు చేయాలని కోరారు. ఎగువ భద్రాకు రూ.5,300 కోట్లు విడుదల చేయాలని, కళసా బండూరి ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వాలని విన్నవించారు. బెంగళూరు నగర ట్రాఫిక్ ఒత్తిడి పరిష్కారానికి 60 కి.మీ.సొరంగ మార్గానికి రూ.3 వేల కోట్లు ఖర్చు కానుంది. ఇది హైవే4, 7ను తాకుతుంది, దీనికి కేంద్ర జాతీయ రహదారి ప్రాధికార సహాయం చేయాలని అడిగారు. మెట్రో రైలు 3వ దశలో 44.65 కి.మీల నిర్మాణానికి రూ.15,611 కోట్ల ఖర్చు అవుతుందని నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించగా, అనుమతి పెండింగ్ ఉంది. త్వరగా అనుమతి జారీ చేయాలని కోరారు.

పరిశోధనల కోసం పరుగు



బనశంకరి: వైద్య రంగంలో పరిశోధనల పట్ల జాగృతం చేయడానికి ఆదివారం హెచ్‌ఎస్‌ఆర్ లేఔట్ క్రీడా మైదానంలో రన్ 4 రీసెర్చ్ పేరుతో పరుగు నిర్వహించారు. ఇండియన్ సొసైటీ ఫర్ క్లినికల్ రీసెర్చ్ సభ్యులు, బీటీ ఉద్యోగులు పాల్గొన్నారు. పరిశోధనల ద్వారా కొత్త ఔషధాలు, టీకాల అభివృద్ధి సాధ్యమని అన్నారు.



కలువ కుతూహలం

కలువ, లేదా తామర పువ్వులంటే అందరికీ ఇష్టమే. ఆదివారం చిక్కబళ్లాపురం వద్ద ముక్తిహళ్లి చెరువులో తామర పుష్పాలు సేకరించిన పర్యాటకులు



ఈసారి షావర్మాపై వేటు?

- అందులో హానికారక బ్యాక్టీరియాలు గుర్తింపు
- ఇటీవల బొంబై మిఠాయి, గోబీ, చికెన్ పకోడాపై ఆంక్షలు



పానీపూరిలో క్యాన్సర్ కారకాలని ప్రకటన



రంగులు వాడి చేసే గోబీ విక్రయించరాదు



ఇప్పుడు షావర్మా హానికారకమని వెల్లడి

శివాజీనగర: ఆరోగ్యానికి హానికరమంటూ రాష్ట్రంలో రంగులు వాడి చేసే గోబి మంచూరియా, బొంబై మిఠాయి, చికెన్ కబాబ్‌లను సర్కారు నిషేధించడం తెలిసిందే. పానీపూరిలో క్యాన్సర్ కారక పదార్థాలు ఉన్నాయని, త్వరలో చర్యలను ప్రకటిస్తామని తెలిపింది. ఈ జాబితాలో అరబ్ దేశాల వంటకమైన చికెన్ షావర్మా కూడా చేరనుంది. ఆహార భద్రత, వైద్య అధికారులు రాష్ట్రవ్యాప్తంగా సేకరించిన పలు షావర్మా నమూనాలలో అనారోగ్యానికి కారణమయ్యే బ్యాక్టీరియా, ఈస్ట్‌లు బయటపడ్డాయి. కాబట్టి వాటి విక్రయాలను నిషేధించాలని ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు.

17 నమూనాలను పరీక్షించగా

కొంతకాలంగా బెంగళూరు, మంగళూరు వంటి నగరాలలో షావర్మా షాపులు వెలిశాయి. చికెన్‌ను పెద్ద గోపురం మాదిరిగా ఏర్పాటు చేసి వేడి చేసి ముక్కలుగా కత్తిరించి, చపాతీలో చుట్టి ఇస్తారు. దీనిని సేవించి అస్వస్థతకు గురైన కేసులు అధికమయ్యాయి. ఈ నేపథ్యంలోనే ఆరోగ్య శాఖ రాష్ట్రవ్యాప్తంగా 17 చోట్లలో శాంపిల్స్‌ను సేకరించగా, 8 శాంపిల్స్‌లో బ్యాక్టీరియా, ఈస్ట్‌లు బయటపడ్డాయి. దీంతో షావర్మా అసురక్షితం అని నిర్ధారించారు. ఆహారాన్ని ఎక్కువసేపు నిల్వ ఉంచితే బ్యాక్టీరియాలు, ఈస్ట్‌లు ఏర్పడతాయి. కేరళలో షావర్మా తిని పలువురు చనిపోయారు కూడా. షావర్మ వ్యాపారులు తప్పనిసరిగా ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐలో నమోదు చేసుకోవాలని నిబంధన ఉంది. షాపులో ఆ రిజిస్ట్రేషన్ పత్రం పెట్టకపోతే అమ్మకాన్ని బ్యాన్ చేస్తామని హెచ్చరించినట్లు ఓ అధికారి తెలిపారు.





బొంబై మిఠాయి, చికెన్ కబాబ్‌లలో ఉపయోగించే రంగుల వల్ల అనారోగ్య ప్రాప్తి

ఫిలింసిటీ నిర్మిస్తాం: సీఎం

శివాజీనగర: కన్నడ ఓటీటీ వేదిక నిర్మించేందుకు పరిశీలించి చర్యలు తీసుకొంటామని, ఫిలిం సిటీ నిర్మాణంతో పాటుగా కన్నడ చలనచిత్ర రంగ ప్రగతికి అన్ని వసతులూ కల్పిస్తామని సీఎం సిద్దరామయ్య తెలిపారు. ఆదివారం నగరంలోని శివానంద సర్కిల్ వద్ద నిర్మించిన చలచిత్ర నిర్మాతల సంఘం నూతన భవనాన్ని ప్రారంభించి మాట్లాడారు. డాక్టర్ రాజకుమార్ కన్న కలలులాగా ఫిలింసిటీ నిర్మిస్తామన్నారు. నిర్మాతలు ఉత్తమ సినిమాలను నిర్మించడంతో పాటు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. నిర్మాత సా.రా.గోవిందు మాట్లాడుతూ గుండురావు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో 50 శాతం పన్ను రాయితీనిచ్చారు. దేవేగౌడ రాష్ట్ర ఆర్థిక మంత్రిగా ఉన్నపుడు పూర్తి పన్ను రాయితీనిచ్చారు. 2019 నుండి ఇప్పటి వరకు నిర్మాతలకు సబ్సిడీ రాలేదు. పురస్కారాలు లేవు అని అసంతృప్తి వ్యక్తంచేశారు. పలు రకాల డిమాండ్లను వినిపించారు. ఈ కార్యక్రమంలో సాధుకోకిల, మంత్రి భైరతి సురేశ్, ఎమ్మెల్యే రిజ్వాన్ హర్షద్, సినీ నటుడు డాక్టర్ శివరాజ్‌కుమార్, జగ్గేశ్ తదితరులు పాల్గొన్నారు.

సర్కారు పతనం నిజం: బొమ్మై

బనశంకరి: లోక్‌సభ ఎన్నికల ఫలితాల తరువాత రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పతనమౌతుందని చెప్పాను, ఇప్పుడు గమనిస్తే అదేవిధంగా ఉందని బీజేపీ ఎంపీ బసవరాజ బొమ్మై అన్నారు. ఆదివారం నగరంలో విలేకరులతో మాట్లాడుతూ కుర్చీ కోసం కీచులాట మొదలైందని, నాకు తెలిసి ఇంత అనుభవం కలిగిన ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం, మంత్రులు కుర్చీల కోసం గొడవ పడడం రాష్ట్ర శ్రేయస్సుకు మంచిది కాదన్నారు. రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని, కాంగ్రెస్ ఎమ్మెల్సీ సలీం అహ్మద్‌కు తెలిసినప్పటికీ తెలియనట్లు ఉన్నారని, ఇతడిని చూస్తే జాలివేస్తుందన్నారు. రాష్ట్రంలో కలరాతో పాటు వివిధ అంటురోగాలు ప్రబలుతున్నాయని, దీనికి అధికారుల నిర్లక్ష్యమే కారణమని బొమ్మై ఆరోపించారు. డెంగీ తీవ్రరూపం దాల్చిందని చెప్పారు.

యాత్రికులకు సాయానికి వెసులుబాటు

బనశంకరి: రాష్ట్ర దేవాదాయశాఖ తీర్థయాత్రలకు వెళ్లే యాత్రికులకు సహాయ ధనం చెల్లించే వ్యవస్థను సరళీకృతం చేసింది. దేవాదాయ శాఖ ద్వారా చేపట్టే చార్‌ధామ్ యాత్రకు ఒకరికి రూ.30,000, కైలాస మానస సరోవర యాత్ర కు రూ.20,000 కాశీ యాత్రలో గయతో కలిపి రూ.5,000 సహాయ ధనం లభిస్తుంది. యాత్రికులు తాము యాత్రకు వెళ్లేలా రుజువులు చూపడానికి మొబైల్ యాప్ ద్వారా నమోదు చేసుకుని జియో లొకేషన్ జత చేసి సెల్ఫీ ఫోటోలు పంపాలి. అందులో ఆయా యాత్రస్థలాలు స్పష్టంగా కనబడాలని తెలిపారు. దేవస్థానానికి 5 కిలోమీటర్ల లోపల నమోదు ప్రక్రియ చేయాలి. అలాగే సీ కేటగిరికి చెందిన దేవస్థానాలు అర్చకులు, ఉద్యోగులు, వారి కుటుంబసభ్యుల్లో ఒకరికి ఏడాదిలో ఒకసారి ఉచిత కాశీయాత్రకు అవకాశం కల్పించారు.

క్లుప్తంగా

మొక్కలు నాటి సంరక్షించాలి



విద్యార్థులతో మొక్కలను నాటిస్తున్న ఉపాధ్యాయులు

హొసపేటి: మానవుల స్వార్థంతో చెట్ల నరికి వేస్తున్నారని, ఇది పర్యావరణానికి పెను ప్రమాదమని పాఠశాల ఎస్డీఎంసీ అధ్యక్షుడు ముద్దన్న తెలిపారు. కూడ్లిగి తాలూకాలోని మాకనడకు గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ విషయంలోనూ విద్యార్థులపై చాలా బాధ్యత ఉందని, పాఠశాలలో ప్రతి చిన్నారి ఒక మొక్కను నాటి, వాటిని సంరక్షించాలని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సభ్యులు తిప్పేస్వామి, బోరేష్, ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, ప్రశాంత్‌కుమార్, భాగ్యలక్ష్మీ శుభమంగళ, ఏసీఎంసీ ఉపాధ్యక్షులు, ప్రధాన ఉపాధ్యాయులు, సభ్యులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా టెట్ పరీక్షలు



రాయచూరు రూరల్: జిల్లాలో ఉపాధ్యాయ అర్హత పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఆదివారం ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలను అదనపు జిల్లాధికారి దురుగేశ్, జిల్లా విద్యాశాఖాధికారి బడిగేర, తాలూకా విద్యాశాఖాధికారులు చంద్రశేఖర్, సుఖదేవ్‌లు పరిశీలించారు. జిల్లాలో 110 కేంద్రాలలో పరీక్షలు నిర్వహించారు. 5560 అభ్యర్థులకు గాను 724 మంది గైర్హాజరైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి బడిగేర తెలిపారు.

జిల్లాలో 38 డెంగీ కేసులు నమోదు

రాయచూరు రూరల్: జిల్లాలో డెంగీ కేసులు నమోదవుతున్నాయి. దోమకాటుతో సోకే డెంగీ రోగులు రోజు రోజుకు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. సింధనూరు తాలూకా కణూరులో ఆరేళ్ల బాలిక సాక్షికి డెంగీ లక్షణాలు ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. దీంతో హుటాహుటిన జిల్లా ఆరోగ్య అధికారి సురేంద్రబాబు వైద్య బృందాన్ని గ్రామానికి తరలించారు. జిల్లాలో వ్యాప్తంగా 38 డెంగీ కేసులు నమోదైనట్లు సమాచారం.

కరియప్ప తాత విగ్రహం ఆవిష్కరణ

రాయచూరు రూరల్: నేటి ఆధునిక సమాజంలో భక్తులు దారి తప్పుతున్నారని, వారిని ఆధ్యాత్మిక దారిలో నడిపించాలని కిల్లే బ్రహన్మఠ మఠాధిపతి శాంతమల్ల శివాచార్యులు పేర్కొన్నారు. ఆదివారం తాలూకాలోని వద్లూరులో లచ్చాణి కమరిమఠ కరియప్ప తాత మహరాజ్ విగ్రహావిష్కరణ చేసి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో వృషభ లింగస్వామి, లింగప్పతాత, మహంతయ్య, సంగయ్య, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

2.50 లక్షల మెట్రిక్ టన్నుల చెరుకు క్రషింగ్ లక్ష్యం



నిప్పంటించి బాయిలర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి చెలువరాయస్వామి

మండ్య: మైసూరు చెక్కర పరిశ్రమలో 2024–25 సంవత్సరంలో 2.50 మెట్రిక్ టన్నుల చెరుకును క్రషింగ్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వ్యవసాయ, మండ్య జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఎన్.చెలువరాయ స్వామి అన్నారు. చెరకు క్రషింగ్ మొదలు కానున్న నేపథ్యంలో పరిశ్రమలోని బాయిలర్‌కు ఆదివారం ఆయన పూజలు చేశారు. అనంతరం బాయిలర్‌ను ఆన్ చేశారు. అనంతరం కార్మికులు, రైతులతో ముచ్చటించి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ గత ఏడాది ప్రభుత్వం రూ.50 కోట్లు విడుదల చేయడంతో చక్కెర పరిశ్రమలో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. సుమారు 2,41,305 మెట్రిక్ టన్నుల చెరుకును క్రషింగ్ చేశామన్నారు. రైతులకు త్వరలో బిల్లులు చెల్లిస్తామన్నారు. ఈ యేడాది ఇప్పటి వరకు సుమారు1,90,000 మెట్రిక్ టన్నుల చెరుకుకు ఆర్డర్ ఇచ్చామన్నారు.

ట్రేడింగ్‌లో నష్టపోయి ఆత్మహత్య

మైసూరు: షేర్‌మార్కెట్‌లో నష్టపోయి యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈఘటన పిరియా పట్టణ తాలూకా సిడిలు మల్లికార్జున బెట్టలో చోటుచేసకుంది. కేఆర్ నగర తాలూకా హెబ్బాలు కొప్పలు గ్రామానికి చెందిన యతీష్(25) బెంగళూరు నగరంలో డెలివరి బాయ్‌గా పని చేస్తున్నాడు. క్రెడిట్ కార్డుతో పర్సనల్ లోన్ తీసుకొని షేర్ మార్కెట్‌లో రూ.3లక్షలు పెట్టుబడి పెట్టాడు. లాభాలు రాకపోవడంతోపాటు కంతులు చెల్లించలేకపోయాడు. దీంతో మనోవేదనకు గురై ఇంటికి వచ్చి సూసైడ్ నోట్ రాసి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బెట్టదపుర పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

అంజూర సాగు.. ఆదాయం బాగు

- అంజూర పండ్ల తోటలతో రైతన్నలకు లాభాలు
- నాటిన ఆరునెలల నుంచి ఫలసాయం
- జిల్లాలో విస్తరిస్తున్న సాగు



బళ్లారి జిల్లాలో సాగు చేసిన అంజూర



ఒక్కసారి సాగుచేస్తే ఏడాదంతా ఫలసాయం

సాక్షి,బళ్లారి: జిల్లాలో నీటి పారుదల భూముల్లో వరి, మిరప, మొక్కజొన్న తదితర పంటలతో తక్కువ లాభాలు గడిస్తున్న ఒక్కోసారి పెట్టుబడులు కూడా రాని పరిస్థితి. సకాలంలో వర్షం కురవక, కురిసినా తెగుళ్లు చుట్టుముట్టడం, తీరా పంట చేతికి వచ్చాక ధర లేక రైతులు దిగాలు చెందడం చూస్తూనే ఉంటాం. దీంతో రైతులు అప్పుల పాలవుతున్నారు. ఈ క్రమంలో జిల్లాలో కొందరు రైతులు అంజూర సాగు చేపట్టారు. పండ్ల తోటలను పెంచుతూ ఆర్థిక ప్రగతి సాధిస్తున్నారు.

ఏడాదిపాటు ఫలసాయం :

ఈ ఏడాది పాటు అంజురా పండ్లు కాయడం ద్వారా రైతులకు ప్రతి రోజు ఆదాయాన్ని పొందవచ్చు. జిల్లాలో అంజుర పండ్లకు అధిక డిమాండ్ ఉంది. ప్రస్తుత మార్కెట్‌లో కిలో రూ.150 పై మాటే పలుకుతుండటంతో రైతులకు పెట్టుబడులు పోను ఎకరాకు ఏడాది రూ.2 లక్షలకు పైగా ఆదాయం వస్తుంది. జిల్లాలో కురుగోడు, లక్ష్మీపుర, కల్కంబ, ముష్టగట్టి, బాదనహట్టి, సిరిగేరి, కంప్లి, మించేరి తదితర గ్రామాల్లో రైతులు అధిక సంఖ్యలో అంజుర పండ్లను సాగు చేస్తూ మంచి ఆదాయాన్ని పొందుతున్నారు. ఇక్కడ పండించిన అంజూరను పొరుగు రాష్ట్రాలు తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, మహరాష్ట్ర, తదితర ప్రాంతాలకు పెద్ద ఎత్తున్న ఎగుమతులు చేస్తున్నారు.

అంజూరతో ఆరోగ్యం :

ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేసే అంజూరలో ఔషధ గుణాలు ఉండటంతో ఎక్కువ మంది తింటున్నారు. అంజూరు పండుగానే కాకుండ ఎండబెట్టి కూడా వినియోగిస్తున్నారు. అంజురా చెట్లకు మందులు తక్కువ వాడటం వల్ల ఆరోగ్యానికి కూడా ఈ పండు రామబాణంలా పనిచేస్తుంది. ముఖ్యంగా మలబద్ధక నివారణకు ఎంతో ఉపయోగపడుతుందని వైద్యులు చెబుతున్నారు. బళ్లారి జిల్లాలో దాదాపు 5 వేల ఎకరాలలో అంజూర సాగు చేస్తున్నారు. దీంతో ఇతర ప్రాంతాలకు జిల్లా నుంచి ఎగుమతులు పెరగడంతో అంజుర పండ్లు పెట్టింది పేరుగా జిల్లా ఖ్యాతికెక్కింది. అంజూరాను ప్రత్యేక ప్యాకింగ్ చేస్తూ ఎగుమతి చేస్తున్నారు. రైతులతో పాటు వ్యవసాయ కూలీలకు పనులు దొరుకుతున్నాయి. జిల్లాలో ఒక్కొ రైతు ఏటా రూ.10 నుంచి 20 లక్షల వరకు ఆదాయం పొందుతున్నారు. అంజూరాతో అధిక లాభాలు రావడంతో సంతోషంగా ఉందని రైతులు పేర్కొన్నారు. ఒక ఎకరాకు ఏడాది పొడవున రూ.3 లక్షల వరకు ఆదాయం వస్తుందన్నారు. పెట్టుబడులు తక్కువ ఆదాయం ఎక్కువగా ఉందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఔషధ గుణాలు కలిగిన పండు

దళితులను ఆదుకునే మఠాలు లేవు

మండ్య: ఒక్కలిగ, లింగాయత్ వర్గాలను ఆదుకునేందుకు మఠాలు, స్వామీజీలు ఉన్నారని, అయితే దళితుల సంక్షేమాన్ని కాంక్షించే మఠాలు ఒక్కటి కూడా లేవని మళవల్లి ఎమ్మెల్యే పి.ఎం.నరేంద్ర స్వామి ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో దళితులు, వెనుకబడి వర్గాల తరపున గొంతు విప్పే మఠాధిపతులు లేరన్నారు. దళితులకు అంబేడ్కరే పెద్ద దిక్కు అని అన్నారు. అన్ని వర్గాల వారు ముఖ్యమంత్రులు అయ్యారని, దళితులకు ఆ పదవి అందని ద్రాక్షగా మారిందన్నారు.

కెంపేగౌడను స్ఫూర్తిగా తీసుకోవాలి



నాడప్రభు విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

మండ్య: కెంపేగౌడను స్ఫూర్తిగా తీసుకొని బెంగళూరులోని చెరువులను కాపాడుకోవాలని సీనియర్ సాహితీవేత్త తైలూరువెంకటకృష్ణ అన్నారు. మండ్యలోని అంబేడ్కర్ భవన్‌లో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన కెంపేగౌడ జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కెంపేగౌడ విగ్రహానికి నివాళులర్పించి మాట్లాడారు. బెంగళూరు వాసుల అవసరాల కోసం కెంపేగౌడ వందలాది చెరువులు నిర్మించారన్నారు. అవన్నీ కబ్జాకు గురయ్యాయన్నారు. దీంతో బెంగళూరు వాసులకు నీటి ఇక్కట్లు మొదలయ్యాయన్నారు. 1985లో 390కిపైగా చెరువులు ఉండగా నేడు పదుల సంఖ్యలో కూడా కనిపించడం లేదన్నారు. ఉన్నచెరువులనైనా కాపాడుకోవాలన్నారు. కెంపేగౌడ పాలనను ఆదర్శంగా తీసుకోవాలని పాలకులకు సూచించారు.

కాంగ్రెస్ పెద్దలు మనసు పెడితే ఆయనే సీఎం

మైసూరు: కాంగ్రెస్ అధిష్టానం, ముఖ్యమంత్రి సిద్దరామయ్య కలిసి మనసు పెడితె డి.కే.శివకుమార్ తప్పకుండా ముఖ్యమంత్రి అవుతారని జేడీఎస్ కోర్ కమిటీ అధ్యక్షుడు ఎమ్మెల్యే జీ.టి.దేవెగౌడ అన్నారు. ముఖ్యమంత్రిని మార్పుపై కాంగ్రెస్‌లో చర్చ జరుగుతున్న నేపథ్యంలో ఆయన పైవిధంగా వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్‌లో అనేక మంది ఎమ్మెల్యేలు, ఒక్కలిగ సముదాయ ప్రజలు డి.కే.శివకుమార్‌కు మద్దతుగా ఉంటూ ఆయన్ను సీఎం చేయాలని కోరుతున్నారని జీటీ దేవెగౌడ అన్నారు.

జేడీఎస్ మాజీ ఎమ్మెల్యే హల్‌చల్

దొడ్డబళ్లాపురం: ట్రాఫిక్ పోలీసులను జేడీఎస్ మాజీ ఎమ్మెల్యే బెదిరించిన ఘటన బెంగళూరు–మాగడి రోడ్డులో చోటుచేసుకుంది. చెన్నపట్టణ సోమేశ్వర కాలనీలో హెల్మెట్ ధరించని వాహనదారులకు ట్రాఫిక్ పోలీసులు జరిమానాలు వేశారు. ఈ సమయంలో వాహనదారులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. అదే సమయంలో అటుగా వచ్చిన జేడీఎస్ మాజీ ఎమ్మెల్యే మంజునాథ్ వాహనదారులకు జరిమానాలు విధించవద్దని హుకుం చేశారు. చేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని, అంతు చూస్తానంటూ బెదిరించారు. రూల్స్ ఫాలో అవుతున్నామని పోలీసులు సర్దిచెప్పబోతే ఏమున్నా ఎస్పీతో మాట్లాడతానన్నారు.

ప్రణాళికలు లేకుండా రోడ్ల నిర్మాణం



మాట్లాడుతున్న విశ్రాంత ఇంజినీర్ ఉద్దిహాళ్

బళ్లారి టౌన్: నగరంలో ప్రణాళికలు లేకుండా రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నారని నీటి పారుదల శాఖ రిటైర్డ్ ఇంజినీర్ ఉద్దిహాళ్ ఆరోపించారు. ఆదివారం బళ్లారి నాగరిక పోరాట సమితి స్థానిక గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన నగర మౌలిక సదుపాయాల కోసం చేపట్టిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... నగరంలో కొద్ది పాటి వర్షం వస్తే చాలు ఇళ్లలోకి నీరు చొరబడుతున్నాయన్నారు. రోడ్లు నిర్మించేటప్పుడు డ్రైనేజీల నిర్మాణం చేపట్టడం లేదన్నారు. ఇటీవల కురిసిన కొద్ది పాటి వర్షాలతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయన్నారు. సర్జన్ డాక్టర్.అరవిందపాటిల్ మాట్లాడుతూ... ప్రస్తుతం బళ్లారి నగరం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోందని, అయితే మౌలిక సదుపాయాలు అనుగుణంగా లేవన్నారు. దోమల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో నాగరిక పోరాట సమితి జిల్లా కన్వీనర్ సోమశేఖర్‌గౌడ, విశ్రాంత ఇంజినీర్ మృతుజసాబ్, డాక్టర్.గోవర్ధనరెడ్డి, ప్రమోద్, యోగనందా రెడ్డి, నరసన్న, శ్యాంసుందర్ గురురాజ పాల్గొన్నారు.

నివృత్త ఉపన్యాసకుడికి ఘనంగా వీడ్కోలు



గోపికృష్ణన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

కోలారు: నివృత్త ఉపన్యాసకుడు జీఎం గోపీకృష్ణన్‌కు ఆదివారం నగరంలోని బాలికల జూనియర్ కళాశాలలో ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆగ్నేయ ఉపాధ్యాయ నియోజకవర్గం పరిషత్ సభ్యుడు డిటి శ్రీనివాస్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం జులైలోనే 7వ వేతన కమీషన్ నివేదికను అమలు చేయడం ద్వారా ఉపాధ్యాయులు, ప్రభుత్వ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేస్తామన్నారు. నివృత్త ఉపన్యాసకుడు గోపికృష్ణన్ అందించిన సేవలు అపారమన్నారు. వైస్ ప్రిన్సిపాల్ బాలకృష్ణ, రోటరీ సెంట్రల్ అధ్యక్షుడు శ్రీనాథ్, ఇంటర్ విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ రామచంద్రప్ప, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

హెచ్ఎంకు ఘన సన్మానం

కోలారు: తాలూకాలోని నరసాపుర హోబలి కే.బి. హొసబళ్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉద్యోగ విరమణ చేయగా ఉపాధ్యాయులు ఆయన్ను ఘనంగా సన్మానించి ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. పాఠశాల పీటీఏ అధ్యక్షులు ప్రకాష్, ఉపాధ్యాయులు ఆక్తిరిబేగం, సంధ్యారాణి, చంద్రు, చాయాకుమారి పాల్గొన్నారు.

సొంతదారులకు సొత్తు అప్పగింత

హొసపేటి: జిల్లాలో వివిధ చోరీ కేసుల్లో రికవరీ అయిన సొత్తును పోలీసులు సొంతదారులకు అప్పగించారు. దాదాపు రూ. 1.78 కోట్లకు పైగా విలువైన సొత్తును స్వాధీనం చేసుకుని బాధితులకు అప్పగించామని జిల్లా ఎస్పీ శ్రీహరిబాబు తెలిపారు. శనివారం సాయంత్రం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన అసెట్ రిటర్న్ కార్యక్రమంలో వాటిని అందజేసి మాట్లాడారు. గత ఏడాది జరిగిన వివిధ కేసుల్లో బంగారు నగలు, మొబైళ్లు, బైక్‌లు రికవరీ చేశామని, వాటిని విచారణ చేసి సొంతదారులకు అప్పగించామన్నారు. కార్యక్రమంలో అదనపు పోలీసులు సూపరింటెండెంట్ సలీం పాషా, హరపనహళ్లి ఇన్‌చార్జి డీఎస్పీ మహంతేశ సజ్జన్, కూడ్లిగి డీఎస్పీ మల్లేష్ బైలాపూర్, హొస్పేట్ డీఎస్పీ మంజునాథ్ తల్వార్, సీపీఐలు గురురాజా, వెంకటస్వామి, పీఎస్ఐలు పాల్గొన్నారు.



బాధితురాలికి చైన్ అందజేస్తున్న ఎస్పీ

ప్రాణం తీసిన అతివేగం



భీతావహంగా ఘటన స్థలం

- కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని ఇద్దరు మృతి
- మరో ఐదుగురికి తీవ్ర గాయాలు
- కూడ్లిగి పట్టణ శివారులో ప్రమాదం

సాక్షి బళ్లారి/హొసపేటి: విజయనగర జిల్లా కూడ్లిగి పట్టణ శివారులోని 50వ జాతీయ రహదారిలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వాయు వేగంతో వెళ్తున్న కారు అదుపుతప్పడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో కారు డ్రైవర్ వినయ్ (27), చెన్న బసవ (27) అక్కడికక్కడే మృతి చెందారు. రాయచూరులోని లింగసుగూరు నుంచి స్నేహితుల బృందం కేరళలోని వయనాడ్‌కు కారులో బయలుదేరారు. స్నేహితులు గాఢ నిద్రలో ఉండగా కారు డ్రైవర్ వినయ్ వాహనాన్ని అతి వేగంగా నడపడం వల్ల అదుపుప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొని ఐదుసార్లు పల్టీలు కొట్టింది. డ్రైవర్‌తో పాటు చెన్న బసవ మృతి చెందగా కారులో ఉన్న మరో ఐదుగురు సచిన్ (28), కార్తీక్ (27), గౌతమ్ (26), ప్రభు (28), సాగర్ (27) అనే వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని సమీపంలోని కొప్పళ జిల్లా ఆస్పత్రికి తరలించారు. కూడ్లిగి పోలీసులు కేసు నమోదు చేశారు.



మృతుడు

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

సలాన్ ఛాయాచిత్ర ప్రదర్శన అద్భుతం



సలాన్ ఛాయాచిత్ర ప్రదర్శనను వీక్షిస్తున్న సందర్శకులు



విజేతలకు అవార్డులు ప్రదానం చేస్తున్న రాజారాం తదితరులు

బనశంకరి: బెంగళూరులోని చిత్రకళాపరిషత్‌లో జరుగుతున్న యూత్ ఫొటోగ్రాఫిక్ బెంగళూరు, అంతర్జాతీయ సలాన్ –2024 ఛాయాచిత్ర ప్రదర్శన అట్టహాసంగా ముగిసింది. ఫొటోగ్రఫీ, ఛాయాచిత్ర కళలో ఆసక్తి ఉన్నవారిని ప్రోత్సహించేందుకు ఈ ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు వైపీఎస్ మాజీ అధ్యక్షుడు రాజారాం, వైపీఎస్ అధ్యక్షుడు మంజువికాస్ శాస్త్రి అన్నారు. దేశవ్యాప్తంగా 206 మంది పోటీలో పాల్గొనగా 2753 ఛాయాచిత్రాలు పంపించారని, 563 చిత్రాలను స్వీకరించి 60 ఛాయాచిత్రాలను న్యాయనిర్ణేతలు ఎంపికచేశారన్నారు. కలర్, మోనోక్రోమ్, నేచర్, ట్రావెల్ ప్రతి విభాగంలో ముగ్గురు విజేతలుగా నిలిచారు. గోల్డ్ విభాగంలో కార్తీక కరగల్లు, కే.సూర్యప్రకాశ్‌రావు, విశాఖగురు, అభిషేక్, రెండో విభాగంలో సౌరబ్‌సిరోహియా, సురేశ్‌బంగేరా, కేసీ.లోకేశ్, సుదీర్‌నజరె, సిల్వర్ విభాగంలో సుధీర్‌నజె, కార్తీక్‌శ్రీధరన్, రవీంద్రకాంబ్లి, సాగర్‌దేవాడిగ విజేతలుగా నిలిచారు. యువనైపుణ్య అవార్డును చైతన్యమూర్తి, వీ.శారిక దక్కించుకున్నారు. ఆదివారం సెలవురోజు కావడంతో సందర్శకులు పెద్ద ఎత్తున విచ్చేసి ఛాయాచిత్రప్రదర్శనను వీక్షించారు. ఉపాధ్యక్షుడు గిరీశ్‌అనంతమూర్తి, కార్యదర్శి ప్రేమ కాకడే పాల్గొన్నారు.

అధికారికి రూ. 25 వేల జరిమానా

మైసూరు: సమాచారహక్కు చట్టం నిబంధనలు ఉల్లంఘించిన అధికారికి రూ.25వేల జరిమానా విధిస్తూ సమాచారం చట్టం కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. వివరాలు..సదానందగౌడ అనే సమాచార హక్కు చట్టం కార్యకర్త ఒక అంశానికి సంబంధించి సమాచారం కావాలని బెంగళూరు నగరంలోని ఎం.ఎస్.బిల్డింగ్‌లో ఉన్న ఉద్యానవన శాఖ సమాచార అధికారి ఎం.డి.గుడుదప్పకు దరఖాస్తు చేసుకున్నాడు. అయితే సమాచారం ఇవ్వకుండా నిర్లక్ష్యం చేశారు. దీంతో బాధితుడు సమాచార హక్కు కమిషన్‌కు ఫిర్యాదు చేశాడు. విచారణ జరిపించిన కమిషన్... గుడుదప్పకు రూ.25వేల జరిమానా విధించింది.

కోలారు వార్తలు...

ప్రశాంతంగా టెట్



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అక్రం పాషా

కోలారు: నగరంలోని 14 కేంద్రాలలో ఆదివారం ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)ను సజావుగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ అక్రం పాషా పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. ఉదయం పరీక్షకు 2141మంది అభ్యర్థులకు గాను 251 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం రెండవ అవధికి జరిగిన పరీక్షకు 3394 మంది నమోదు చేసుకోగా ఇందులో 3125 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ప్రతి పరీక్షా కేంద్రంలోను సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వెబ్‌కాస్టింగ్ నిర్వహించారు. విద్యుత్ అంతరాయం ఏర్పడడంతో జనరేటర్ వ్యవస్థను కల్పించారు. పరీక్షా కేంద్రాల చుట్టూ 144 సెక్షన్ విధించారు. పరీక్షా కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో జిరాక్స్ కేంద్రాలను మూసి వేయించారు. డీఈఓ కృష్ణమూర్తి, నోడల్ అధికారి కృష్ణప్పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

భక్తి శ్రద్ధలతో అణ్ణమ్మ దేవికి పూజలు



కోలారు నగర సమీపంలోని కొండరాజనహళ్లి ఏపీఎంసీ మార్కెట్ ఆర్ఎంవి మండీ యజమాని చలపతి తన నివాసంలో బెంగుళూరు నగర దేవత అణ్ణమ్మ దేవికి విశేష పూజలు నిర్వహించారు. లోక కళ్యాణం కోసం జిల్లాలో బాగా వర్షాలు కురిసి ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుతూ అణ్ణమ్మ దేవికి విశేష పూజలు నిర్వహించినట్లు తెలిపారు. విధాన పరిషత్ మాజీ ఉప సభాపతి వీఆర్ సుదర్శన్, తాపం మాజీ అధ్యక్షురాలు విజయలక్ష్మి, వందల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మార్కెట్ కార్మికులకు అన్న సంతర్పణ నిర్వహించారు.

సేంద్రియ ఎరువుల యూనిట్ పరిశీలన

కోలారు: సేదియ ఎరువులను విరివిగా వాడడం ద్వారా భూ మాలిన్యాన్ని నివారించడానికి సాధ్యం అవుతుందని ట్రైబల్ ఉమన్ ఇంటర్నేషనల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ చైర్‌పర్సన్ డాక్టర్ వాణి తెలిపారు. ఆదివారం మహిళా రైతు సుజాత నిర్మించిన సేంద్రియ ఎరువుల తయారీ యూనిట్‌ను పరిశీలించి మాట్లాడారు. రసాయనిక ఎరువుల వాడకం, కీటక నాశకాలను మితిమీరి ఉపయోగించడం వల్ల భూసారం తగ్గిపోయి పంట దిగుబడి పడిపోతుందన్నారు. దీనిని తప్పించడానికి సేంద్రియ ఎరువుల వాడకం తప్పనిసరి అన్నారు. సేంద్రియ ఎరువుల వాడకం ద్వారా ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలను పండించడానికి సాధ్యం అవుతుందన్నారు. అతిగా రసాయనిక పదార్థాలను ఉపయోగించడం ద్వారా మట్టి కలుషితమవుతుంది, అందునా కోలారు జిల్లాలో టమాట పంటలకు అనేక రోగాలు సోకాయని, దిగుబడి సమస్య తలెత్తింది. మల్బరీ ఆకులకు కూడా రసాయనిక ఎరువులను ఉపయోగించడం వల్ల పట్టు పురుగులు పెరగక నాణ్యమైన పట్టు ఉత్పత్తి సాధ్యం కావడం లేదన్నారు. ఈ సమస్యల నివారణకు సేంద్రియ ఎరువుల వినియోగం ఒక్కటే మార్గమని తెలిపారు. ప్రగతిపర రైతు సుజాత మాట్లాడుతూ... తమ తోటలో రసాయనిక ఎరువులను ఉపయోగించకుండా కేవలం సేంద్రీయ ఎరువుల ద్వారానే పంటలను పండిస్తున్నట్లు తెలిపారు.



పరిశీలన చేస్తున్న దృశ్యం

ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనాలి

మాలూరు: ప్రతి ఒక్కరు ఆధ్మాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనాలని శ్రీ క్షేత్ర కైవార ధర్మాధికారి ఎంఆర్ జయరాం తెలిపారు. మాస్తి ఫిర్కా రాజేనహళ్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ యోగి నారేయణ స్వామి, శ్రీ అమర నారేయణస్వామి, నవగ్రహ సమేత నూతన శిలావిగ్రహ ప్రతిష్టాపనా కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఆయన పాల్గొని భక్తులను ఆశీర్వదించి మాట్లాడారు. ధర్మ సేవ అపారంగా కలిగిన కైవారం తాతయ్యను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కైవార తాతయ్య జీవిత చరిత్రను అందరూ తెలుసుకోవాలన్నారు. త్రికాల జ్ఞాని కైవార తాతయ్య భవిష్యవాణిని చెప్పారని అన్నారు. ఆయన చెప్పిన భవిష్యవాణి ఒక్కొక్కటే నిజం అవుతున్నాయన్నారు. తాతయ్య మఠం కార్యదర్శి బాలకృష్ణ భాగవతార్, మఠం ఉపాధ్యక్షుడు విభాకర రెడ్డి, దేవాలయ సమితి అధ్యక్షుడు తానప్ప, కార్యదర్శి మురళి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ధర్మాధికారి జయరాం



అభినందిస్తున్న దృశ్యం

పదాధికారుల ఎంపిక ఏకగ్రీవం

శ్రీనివాసపురం: శ్రీనివాసపురం తాలూకా గ్రామ పంచాయతీ పాలనాధికారుల సంఘం నూతన పదాధికారుల ఎంపిక ఏకగ్రీవంగా జరిగింది. పట్టణంలోని ప్రభుత్వ ఉద్యోగుల భవనంలో ఆదివారం సంఘానికి నూతన పదాధికారులను ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా ఎస్ శంకర్, గౌరవ అధ్యక్షుడిగా వి. చలపతి, ప్రధాన కార్యదర్శిగా ఎస్ మురళి, ఉపాధ్యక్షుడుగా ఎంఎస్ హరీష్ బాబు, మహిళా విభాగం ఉపాధ్యక్షురాలిగా నిర్మలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన పదాధికారులను పలువురు అభినందించారు.

చరిత్రకు దర్పణం.. కిత్తూరు కోట


కిత్తూరు రాణి చెన్నమ్మ విగ్రహం


కిత్తూరు రాణి చెన్నమ్మకోట

- రాణి చెన్నమ్మ ధైర్య సాహసాలకు ప్రతీక
- బ్రిటిష్‌వారి దాడుల్లో శిథిలం

బనశంకరి: బెళగావి నగర పరిధిలో ఉండే కిత్తూరు కోట కర్ణాటకలో ప్రధాన చారిత్రక కట్టడాల్లో ఒకటి కాగా ప్రముఖ పర్యాటక ఆకర్షణల్లో ఒకటిగా చెప్ప వచ్చు. స్వాతంత్ర్య సంగ్రామంలో ఇదో మణిమకుటం. కిత్తూరు కోటను కిత్తూరు చెన్నమ్మకోట అని కూడా పిలుస్తారు. ఎందుకంటే ఇక్కడ నుంచే ఆంగ్లేయుల సింహస్వప్నం కిత్తూరు చెన్నమ్మ రాణిగా పరిపాలన చేపట్టింది. పాత రాజభవనాలు, స్మారక చిహ్నాలు విగ్రహాలతో ఉండే కిత్తూరు కోటను చూడాలని దేశం నలుమూలలా నుంచి పర్యాటకులు విచ్చేస్తారు. రాణిచెన్నమ్మ నేతృత్వంలో దేశంలో మొదటి స్వాతంత్ర్య పోరాటం ఇక్కడే జరిగిందని ప్రతీతి.

కిత్తూరు కోట చరిత్ర ఇదీ

కిత్తూరు కోటను క్రీ.శ. 1660 నుంచి 1691 వరకు కిత్తూరును ఏలిన ఐదో పాలకుడు అల్లప్పగౌడ సర్దేశాయ్ నిర్మించారు. 23 ఎకరాల విస్తీర్ణంలో ఉండే కోట లోపల తన నివాసంగా గొప్ప ప్యాలస్, ఆలయాలు, విజయ చిహ్నాలు, మండపాలను నిర్మించారు. కిత్తూరు పరిసర ప్రాంతాల్లో పుష్కలంగా లభించిన నల్లబసాల్ట్ శిలలను ఈ కట్టడాలకు ఉపయోగించారు. తరువాత చెన్నమ్మ ఈ కోట కేంద్రంగా చుట్టుపక్కల ప్రాంతాలను పరిపాలించింది. ఆనాటి బ్రిటిష్ పాలకులు అధిక పన్నులు వేసి ప్రజలను పీల్చిపిప్పి చేయడంపై చెన్నమ్మ ఆగ్రహించింది. 1824 సంవత్సరంలో బ్రిటిష్ పాలకులపై యుద్ధం చేసింది. మూడు రోజుల భీకర యుద్ధం తరువాత 1824 డిసెంబరు 5 బ్రిటిష్ పాలకులు చేతిల్లోకి కిత్తూరు కోట వెళ్లింది. రాణిచెన్నమ్మను బంధించి బైలహొంగల్ జైలుకు తరలించారు. ఆనాటి యుద్ధంలో ఉపయోగించిన ఫిరంగులు ఇప్పటికీ అక్కడే దర్శనమిస్తాయి.

తెల్లదొరలచే కోట లూటీ, ధ్వంసం

చాప్లిన్ అనే అప్పటి బ్రిటిష్‌కమిషనర్ కిత్తూరు కోట నుంచి 16 లక్షల రూపాయలు, విలువైన నగలు, వస్తువులను జప్తుచేశాడు. ఈ పోరాటంలో ఎంతోమంది బ్రిటిష్ సైనికాధికారులు ప్రాణాలు కోల్పోయారు. ఆ కోపంతో జాన్ థాకరే అనే ఉన్నతాధికారి కిత్తూరు కోట, ప్యాలెస్‌ను ధ్వంసం చేశాడు. బ్రిటిష్ సైనికులు కోట, రాజభవనాన్ని లూటీ చేశారు. ప్యాలెస్ చెక్క తలుపులు, కిటికీలను కూడా వదలకుండా దోచుకున్నారు. ఇలా తెల్లదొరల చేతిలో కోట పూర్తిగా ధ్వంసమై నేడు కనిపించే రూపానికి పరిమితమైంది. చెన్నమ్మ జైలులో స్వేచ్ఛా భారతం కోసం పరితపిస్తూ 1829లో తుదిశ్వాస విడిచింది.

చారిత్రక అవశేషం

కిత్తూరుకోట ప్యాలెస్ పేష్వా- ఇస్లామిక్ శైలిలో నిర్మించబడింది. ప్యాలెస్ మూడు అంతస్తుల నిర్మాణం, దానిలోపల అనేక గదులు ఉన్నాయి. ప్యాలెస్ గదుల్లో చర్చా గదులు, పూజగదులు వంటశాలలు ఇతర గదులు ఉన్నాయి. నేడు కిత్తూరుకోట గొప్ప వారసత్వ అవశేషాలను ఇప్పటికీ చూడవచ్చు. కిత్తూరు ప్యాలెస్, వాచ్‌టవర్, నీటి తొట్టెలు కనిపిస్తాయి. వారి రోదసి విజ్ఞానానికి గుర్తుగా పోల్‌స్టార్ విజన్ అనే గది ఉంది. అక్కడి నుంచి ఆకాశంలో ధృవతారను వీక్షిస్తూ సమయం లెక్కించేవారని చెబుతారు. కోటలో లభించిన ప్రాచీన వస్తువులతో మ్యూజియం ఏర్పాటైంది. ప్రతి ఏటా కిత్తూరు చెన్నమ్మ జ్ఞాపకార్థం జిల్లా యంత్రాంగం ఈ కోటలో ఉత్సవాలను నిర్వహిస్తుంది.


విజయ చిహ్నం


కోటను వీక్షిస్తున్న పర్యాటకులు


కోట ముందు ఫిరంగులు

క్లుప్తంగా

ఘనంగా ఉరుసు


స్వామివారిని దర్శించుకునేందుకు విచ్చేసిన ఎమ్మెల్యే, భక్తులు

కృష్ణరాజపురం : హొసకోటెలోని సంతెగేట్ వద్ద కొలువైన సయ్యద్ ఖాద్రీ దర్గా ఉరుసు వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే, కియోనిక్స్ అధ్యక్షుడు శరత్ బచ్చేగౌడ, హోసకోటె పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బి.వి.బైరేగౌడ, పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించి చక్కెర చదివించారు. భక్తులకు ఉరుసు నిర్వాహకులు ప్రసాదాలు పంచి పెట్టారు.

పౌర కార్మికులకు దుస్తుల పంపిణీ


కార్మికులకు దుస్తులు అందజేస్తున్న ఎమ్మెల్యే సతీష్‌రెడ్డి తదితరులు

బొమ్మనహళ్లి : నాడప్రభు కెంపేగౌడ ఎంతో ముందు చూపుతో బెంగళూరు నగరాన్ని నిర్మించడంతో నేడు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిందని బొమ్మనహళ్లి ఎమ్మెల్యే ఎం.సతీష్ రెడ్డి అన్నారు. హొంగసంద్ర వార్డులోని అంజనేయస్వామి ఆలయ ఆవరణలో ఒక్కలిగ సముదాయ నాయకులు ఆదివారం కెంపేగౌడ జయంతిని నిర్వహించారు. ఎమ్మెల్యే ఎం.సతీష్‌రెడ్డి, హొంగసంద్ర వార్డు బీజేపీ అధ్యక్షుడు బాబు రెడ్డి, సమాజ సేవకుడు రూపేష్ రెడ్డి పాల్గొని 200 మంది బీబీఎంపి పౌరకార్మికులకు నూతన వస్త్రాలు పంపిణీ చేసి అన్నదానం చేశారు.

ఉక్కు కర్మాగారం పరిశీలన


కర్మాగారాన్ని పరిశీలిస్తున్న కుమారస్వామి

శివమొగ్గ: శివమొగ్గ జిల్లాలోని భద్రావతి నగరంలో ఉన్న కేంద్ర ప్రభుత్వ విశ్వేశ్వరయ్య ఇనుము, ఉక్కు కర్మాగారం (విఐఎస్‌ఎల్)కు ఆదివారం కేంద్ర భారీ పరిశ్రమల శాఖ, ఉక్కు పరిశ్రమల మంత్రి హెచ్‌డీ కుమారస్వామి పరిశీలన జరిపారు. పరిశ్రమలో ఉన్న వివిధ విభాగాల గురించి తెలుసుకున్నారు. సంస్థ అధికారులతో పాటు సిబ్బందితో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో శివమొగ్గ జిల్లా ఎంపీ బీవై రాఘవేంద్ర, ఎమ్మెల్యే బీ.కే.సంగమేశ్వర్, నాయకులు, అధికారులు పాల్గొన్నారు. నిధుల కొరత, నష్టాల వల్ల ఈ కర్మాగారం చాలా ఏళ్ల కిందటే మూతపడింది. త్వరలో పునఃప్రారంభిస్తారని చాలాకాలం నుంచి వార్తలు వస్తున్నాయి.

కొడగు జిల్లాలో భారీ వాహనాల సంచారం నిషేధం

దొడ్డబళ్లాపురం: కొడగు జిల్లాలో కూడా భారీ వర్షాలు కురుస్తుండటంతో ముందు జాగ్రత్త చర్యగా భారీ వాహనాల సంచారాన్ని నిషేధిస్తూ జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. వర్షాలకు రోడ్లు కుంగిపోయే ప్రమాదం ఉండటంతో 18, 500కేజీల పైబడి సామర్థ్యం ఉన్న వాహనాల సంచారం నిషేధించారు. నగర శివార్లలో భారీ వాహనాలు ప్రవేశించకుండా పోలీసులు తీవ్ర నిఘా ఉంచారు. అయితే పాలు, ఇంధనం వాహనాలకు ఈ నిబంధనల నుంచి మినహాయింపు ఇచ్చారు.

మిన్నంటిన సంబరాలు


సంబరాల్లో పాల్గొన్న యువత

శివమొగ్గ : వెస్టిండిస్‌లో జరిగిన టీ-20 ప్రపంచ కప్ క్రికెట్ పోటీల్లో భారత్ ఘన విజయం సాధించడంతో నగరంలో సంబరాలు మిన్నంటాయి. శనివారం రాత్రి జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా జట్టుపై భారత్ విజయం సాధించినట్లు టీవీల్లో వీక్షించిన అభిమానులు పెద్ద సంఖ్యలో రోడ్లపైకి చేరుకున్నారు. నృత్యాలు చేస్తూ పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. బాణ సంచా కాల్చి మిఠాయిలు పంచి పెట్టారు. ఆదివారం ఉదయం ఎమ్మెల్సీ ఆరుణ్ యువతతో కలిసి సంబరాలు నిర్వహించారు.

మూడాలో అవినీతిపై ధర్నా

మైసూరు : మైసూరు నగరాభివృద్ధి ప్రాధికారలో ఇళ్ల స్థలాల పంపిణీలో జరిగిన కుంభకోణంపై విచారణ నిర్వహించాలని కర్ణాటక సేనాపడె సభ్యులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం మైసూరులోని నగరాభివృద్ధి ప్రాధికార కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఇంటి స్థలాల పంపిణీలో రూ. వందల కోట్ల అవినీతి జరిగిందన్నారు. బాధ్యులను గుర్తించి అవినీతి సొమ్ము కక్కించాలని డిమాండ్ చేశారు.

ముగిసిన అన్నపూర్ణేశ్వరీ దేవి బ్రహ్మోత్సవాలు

గౌరిబిదనూరు: పట్టణంలో మూడు రోజులుగా జరుగుతున్న ఆదిశక్తి అన్నపూర్ణేశ్వరీ దేవి సప్తమ బ్రహ్మోత్సవాలు శనివారం రాత్రి ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా అమ్మవారి ఉత్సవ మూర్తిని అలంకరించి పూల పల్లకీలో ఉంచి ఊరేగింపు నిర్వహించారు. సిద్దరబెట్ట వీరభద్ర శివాచార్య స్వామీజీ, కొరటగెరె తాలూకా ఎలేరాంపుర హనుమంతనాథ స్వామీజీలు ధార్మిక కార్యక్రమాలు, దైవ ప్రార్థనలపై భక్తులకు బోధించారు. పల్లకీ ఉత్సవంలో డ్రమ్ వాదన, వీరగాసె తదితర జానపద కళాకారుల ప్రదర్శన పట్టణవాసులను ఆకట్టుకుంది. ఆలయ ధర్మాధికారి నారాయణప్ప, పట్టణవాసులు పాల్గొన్నారు.


పూల పల్లకీలో అన్నపూర్ణేశ్వరీ దేవి ఊరేగింపు

అర్ధరాత్రి దాటిన తర్వాత మృత్యుపంజా

- వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

బనశంకరి: బెంగళూరు నగరంలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకున్న రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. హెబ్బాళ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కాంక్రీట్ మిక్సర్ లారీని బైకు ఢీకొని ముత్యాలనగరకు చెందిన జనార్ధన్(25) అనే వ్యక్తి మృతి చెందాడు. ఇతను శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత 2.30 గంటల సమయంలో విధులు ముగించుకొని బైక్‌పై వెళ్తుండగా హెబ్బాల వద్ద రోడ్డు పక్కన నిలిపిన కాంక్రీట్‌మిక్సర్ లారీని వెనుక నుంచి ఢీకొట్టాడు. ప్రమాదంలో తలకు బలమైన గాయమైన అతన్ని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

బైక్ స్కిడ్ కావడంతో యువకుడు....

బొమ్మనహళ్లి ఆక్స్‌ఫర్డ్ కళాశాల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కుమార్(30) అనే యువకుడు మృతి చెందాడు. ఇతను నవీన్ అనే యువకుడితో కలిసి శనివారం అర్ధరాత్రి 1.30గంటల సమయంలో బైక్‌పై వెళ్తుండగా ఆక్స్‌ఫర్డ్ కళాశాల వద్దకురాగానే వాహనం స్కిడ్ అయ్యి కింద పడ్డారు. కుమార్ మృతిచెందగా తీవ్రంగా గాయపడిన నవీన్‌ను ఆస్పత్రికి తరలించారు. కుమార్ మృతదేహాన్ని శవపరీక్షల నిమిత్తం సెయింట్‌జాన్స్ ఆసుపత్రికి తరలించారు. మడివాళ ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ప్రైవేటులో కన్నడిగులకే ప్రాధాన్యత ఇవ్వాలి

- నేడు రాష్ట్రవ్యాప్తంగా 'కరవే' ఆందోళన

శివాజీనగర: ప్రైవేట్ రంగంలో కన్నడిగులకు ఉద్యోగ రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా కర్ణాటక రక్షణా వేదిక రాష్ట్రాధ్యక్షుడు టీ.ఏ.నారాయణగౌడ నేతృత్వంలో భారీ ఎత్తున ఆందోళన చేపట్టనున్నారు. బెంగళూరుతో పాటుగా అన్ని జిల్లా కేంద్రాల్లో ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు భారీ ఎత్తున ధర్నాలు నిర్వహించనున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి ఉద్యోగాల కోసం బెంగళూరు వైపు వలస వచ్చేవారి సంఖ్య అధికమవుతోంది. దీంతో కన్నడిగులకు అన్యాయం జరుగుతోందని, ప్రైవేట్ రంగంలో సీ.డీ శ్రేణి ఉద్యోగాల్లో 100 శాతం, ఇతర గ్రూపుల్లో 80 శాతం కన్నడిగులకు రిజర్వేషన్ కల్పించాలని, సరోజిని మహిషి నివేదిక అమలుపరచాలని డిమాండ్‌తో ఈ ఆందోళన చేపట్టనున్నారు.

ఇంజినీర్ల సేవలు వెలకట్టలేనివి


మాట్లాడుతున్న కలెక్టర్ శుభకల్యాణ్

తుమకూరు : సమాజానికి ఇంజినీర్లు చేస్తున్న సేవలు వెలకట్టలేనివని కలెక్టర్ శుభకళ్యాణ్ అన్నారు. తుమకూరులోని పర్యాటకమందిరంలో తుమకూరు గ్రామీణ ప్రజాపనుల శాఖ ఉప విభాగం కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ చెందిన సహాయ ఇంజినీర్ పీ.డి. కృష్ణమూర్తి, డి.నరసింహమూర్తిలకు ఆదివారం ఏర్పాటు చేసిన వీడ్కోలు సభలో కలెక్టర్ పాల్గొని మట్లాడారు. పట్టణాలు, నగరాలు, గ్రామాల్లో రోడ్లు, వంతెనలు, భవనాలు, జలాశయాల నిర్మాణంలో ఇంజినీర్లు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. అనంతరం వారిని ఘనంగా సన్మానించారు.

ప్రత్యేక నిధులతో అభివృద్ధి పనులు

గౌరిబిదనూరు: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయించి తాలూకా అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కె.హెచ్.పుట్టస్వామి గౌడ అన్నారు. నగరగెరె, తొండేబావి, హోసూరు హోబళీలలో రూ.5 కోట్లతో చేపట్టిన రోడ్ల అభివృద్ధి పనులకు ఆదివారం ఆయన భూమిపూజ చేశారు. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సహకారంతో నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. విశ్వేశ్వరయ్య జల నిగమ నుంచి రూ. 5 కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. మట్టావులహళ్లి-బందార్లహళ్లి రోడ్డుకు రూ.1.40 కోట్లు, మట్టావులహళ్లి- నరసింహారెడ్డి హళ్లి రోడ్డుకు రూ. 90 లక్షలు, తోకలహళ్లి బోవికాలనీకి రూ. 1.40 కోట్లు, బొమ్మసంద్ర-సింగానహళ్లి-అలీపురం రోడ్డుకు రూ.1.50 కోట్లు ఖర్చు చేయ నున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాగేంద్ర, ఆర్ఆర్ రెడ్డి, మహేశ్, నవీన్, రామచంద్రారెడ్డి, ఆదినారాయణరెడ్డి, మంజునాథరెడ్డి, ప్రతాప్, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.


రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుట్టస్వామిగౌడ

నాటుసారాను నిర్మూలించాలి

కెలమంగలం: నాటుసారా నిర్మూలనపై ఆదివారం డెంకణీకోట డీఎస్పీ శాంతి అధ్యక్షతన సమీక్షా సమావేశం జరిగింది. డీఎస్పీ మాట్లాడుతూ డెంకణీకోట తాలూకాలో నాటుసారా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, గ్రామీణ ప్రాంతాల్లో నాటుసారా కాచి విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. తాలూకాలోని గ్రామాధికార్లు నాటుసారా తయారీ కాకుండా నిఘా పెట్టాలని సూచించారు. గ్రామాధికార్లు, ప్రభుత్వ అధికార్లు, గ్రామపంచాయతీల కార్యదర్శులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగి కిడ్నాప్

బనశంకరి: బెంగళూరులో మరో కిడ్నాప్ కేసు వెలుగులోకి వచ్చింది. శంకరపుర పోలీసుల కథనం మేరకు.. నగరంలోని ఓ బ్యాంకులో పనిచేస్తున్న మంజునాథ్ అనే వ్యక్తిని కన్నడపర సంఘటన అధ్యక్షుడు ప్రకాష్ అలియాస్ కన్నడ ప్రకాష్ లేడీ గ్యాంగ్‌తో కలిసి కిడ్నాప్ చేశారు. అనంతరం అతన్ని ప్రకాష్‌కు చెందిన కార్యాలయానికి తీసుకెళ్లి చితకబాదారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందుకున్న పోలీసులు ప్రకాష్, మంజుల, చలపతితో పాటు 6 మందిపై కేసు నమోదు చేశారు.

త్వరలో కాలువలకు సాగు జలాలు

మండ్య : కృష్ణరాజసాగర జలాశయం నుంచి కాలువలకు నీటిని విడుదల చేసేందుకు ఎలాంటి ఇబ్బందవులు లేవని మంత్రి చెలువరాయస్వామి అన్నారు. మండ్యలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొన్ని కాలువల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో కాలువలకు నీరు విడుదల చేస్తే ప్రయోజనం ఉండదన్నారు. త్వరలో పనులు పూర్తవుతాయని, ఆ వెంటనే నీటిని విడుదల చేస్తామని తెలిపారు. నీటి విడుదలలో జాప్యం జరుగుతోందని విపక్షాలు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు.

19 నుంచి కైవారలో సంగీతోత్సవాలు


పోస్టర్లకు పూజలు చేస్తున్న ధర్మాధికారి జయరాం

చింతామణి: తాలుకాలోని ప్రసిద్ధ యాత్రాస్థలమైన కైవార క్షేత్ర యోగినారేయణ మఠం ఆవరణలో ఈనెల 19నుంచి 21వరకు నిరంతర జాతీయ స్థాయి సంగీత్సోవం, గురుపూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించనున్నట్టు కైవార ధర్మాధికారి డాక్టర్ జయరాం తెలిపారు. ఈమేరకు సంగీత్సోవ పోస్టర్లను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. 72 గంటల పాటు నిరంతరం కచేరీలు నిర్వహిస్తామని, ఇందులో దేశ నలుమూలలనుంచి ప్రఖ్యాత విద్యాంసులు పాల్గొంటారని తెలిపారు. సంకీర్తన సంయోజకులు బాలకృష్ణ భాగవతార్, విభాకర్ రెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

అణ్ణమ్మదేవికి ప్రత్యేక పూజలు

బొమ్మనహళ్లి : బెంగళూరు నగరం బొమ్మనహళ్లి నియోజకవర్గం పరిధిలోని జరగనహళ్లి వార్డులో బెంగళూరు నగర దేవత అణ్ణమ్మదేవి 6వ వార్షికోత్సవాన్ని బీజేపీ నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే ఎం.సతీష్ రెడ్డి, నాయకులు కృష్ణప్ప యాదవ్, మునిరాము, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నదానం చేసి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

బస్సులో ప్రయాణిస్తూ హఠాన్మరణం

దొడ్డబళ్లాపురం: బస్సు ప్రయాణికుడు హఠాన్మరణం చెందిన ఘటన పుత్తూరులో చోటుచేసుకుంది. మైసూరుకు చెందిన మంజునాథ్(57) మైసూరులోని జయదేవ ఆస్పత్రిలో గుండెకు సంబంధించి చికిత్స పొందాడు. పనిపై ఈయన మంగళూరు వెళ్లాడు. తిరిగి మైసూరుకు కేఎస్ ఆర్టీసీ బస్సులో వస్తూ పుత్తూరు వద్దకు చేరుకోగానే అస్వస్థతకు గురయ్యాడు. డ్రైవర్, కండక్టర్ ఆయన్ను పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాలని ప్రయత్నిస్తుండగా అప్పటికే మంజునాథ్ మృతిచెందాడు. పుత్తూరు పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఎన్ఆర్ఐ కోటా కింద 15 శాతం సీట్లు కేటాయించండి

- జాతీయ వైద్య కమిషన్‌కు రాష్ట్ర వైద్య విద్య శాఖ మంత్రి లేఖ

బనశంకరి: ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ప్రవేశాలకు సంబంధించి 2025-26 విద్యాసంవత్సరం నుంచి ఎన్ఆర్ఐ కోటా కింద 15శాతం సీట్లు మంజూరుచేయాలని వైద్యవిద్య శాఖ మంత్రి డాక్టర్ శరణప్రకాష్‌పాటిల్ ఆదివారం జాతీయ వైద్య కమిషన్ అధ్యక్షులకు లేఖ రాశారు. రాష్ట్రంలోని 22 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ప్రవేశాల కోసం 508 అదనపు న్యూమనరీ ఎంబీబీఎస్ సీట్లు సృష్టించి 15 శాతం ఎన్ఆర్ఐ కోటా మంజూరుచేయాలని మనవిచేశారు. ప్రస్తుతం వైద్య విద్యశాఖ పరిధిలో 22 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు 2023-24లో 3,450 సీట్ల కలిగి ఉన్నాయి. అందులో 85 శాతం (2929 సీట్లు) కర్ణాటక కోటా 521 అంటే 15 శాతం అఖిల భారతకోటా ఉంది. ఇప్పటికే రాజస్థాన్, హర్యానా, పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్, పుదుచ్చేరి ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 7-15 శాతం ఎన్ఆర్ఐ కోటా అందించారని మంత్రి శరణప్రకాష్‌పాటిల్ ఆ లేఖలో పేర్కొన్నారు.

హోసూరు వార్తలు..

కోర్టు ఏర్పాటుకు పరిశీలన

క్రిష్ణగిరి: తాలూకా కేంద్రంగా స్థాయికి పెరిగిన సూళగిరి పట్టణంలో కోర్టు ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు పలు సంవత్సరాల నుంచి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఉన్నారు. అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కోర్టు నిర్మాణానికి అనుమతి తీసుకొచ్చారు. తాలూకాలోని ప్రజలు వివిధ సమస్యల పరిష్కారం కోసం హోసూరు, క్రిష్ణగిరి కోర్టులకు వెళ్లవలసి ఉందని, ఇక్కడే కోర్టును నిర్మించాలని ప్రజలు ఎంతోకాలంగా కోరుతున్నారు. ఈ నేపథ్యంలో చెన్నై హైకోర్టు జడ్జి, క్రిష్ణగిరి జిల్లా జడ్జిలు, న్యాయవాదులు సూళగిరికి చేరుకొని కోర్టు ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. చైర్పర్సన్ లావణ్యామధు, బీడీవో అధికార్లు, తహసీల్దార్ తదితరులు ఉన్నారు.


పరిశీలన చేస్తున్న న్యాయమూర్తులు

ప్రేమ వంచకుడు అరెస్టు

కెలమంగలం: ప్రేమించి పెళ్లి చేసుకొంటానని తీరా మోజు తీరాక పెళ్లికి నిరాకరించిన వంచకున్ని డెంకణీకోట మహిళా పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల మేరకు సూళగిరి తాలూకా ఉద్దనపల్లికి చెందిన 19 ఏళ్ల యువతిని అదే ప్రాంతానికి చెందిన డ్రైవర్ అజిత్‌కుమార్ (23) ఐదేళ్లుగా ప్రేమిస్తూ వచ్చాడు. పెళ్లి చేసుకోవాలని యువతి ఒత్తిడి చేయడంతో అతడు తిరస్కరించాడు. ఈ ఘటనపై యువతి ఫిర్యాదు మేరకు డెంకణీకోట మహిళా పోలీసులు కేసు నమోదు చేసుకొని అజిత్‌కుమార్‌ను అరెస్ట్ చేసి విచారణ చేపట్టారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

హోసూరు: పరిశ్రమల కార్మికుల కోసం కావేరి ఆస్పత్రి, హోసూరు పరిశ్రమల సంఘం ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు హోసూరు ఆదియమ్మాన్ కళాశాల క్రీడా మైదానంలో ప్రారంభమయ్యాయి. సుందరయ్య, అరవింద్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వరుసగా నాలుగు ఆదివారాలు మ్యాచ్‌లు జరుగుతాయి. 32 పరిశ్రమల నుంచి ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు. ఆఖరి రోజున గెలుపొందే జట్టులకు మొదటి బహుమతిగా రూ. లక్ష, రెండో బహుమతి రూ. 75 వేలు, మూడవ బహుమతి రూ. 50 వేలు అందజేయనున్నట్లు తెలిపారు.

భర్త పెడదారి.. భార్య ఆత్మహత్య

హోసూరు: భర్త వేరొక మహిళతో వివాహేతర సంబంధం ఏర్పరుచుకొన్నాడని భార్య ఆత్మహత్య చేసుకొన్న ఘటన కురుబరపల్లి పరిధిలో చోటు చేసుకొంది. ధర్మపురి జిల్లా కారిమంగలం ప్రాంతానికి చెందిన మేఘనాథ్ (30) మోనిష (27) దంపతులు. వీరు క్రిష్ణగిరి సమీపంలోని చెన్నసంద్రం గ్రామంలో అద్దె ఇంట్లో నివాసముంటూ కాయగూరల వ్యాపారం చేస్తున్నారు. మేఘనాథ్ అదే ప్రాంతానికి చెందిన మహిళతో సంబంధం ఏర్పరుచుకోవడంతో మోనిషా విరక్తి చెంది శనివారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొంది. కురుబరపల్లి పోలీసులు శవాన్ని స్వాధీనపరుచుకొని ఆస్పత్రికి తరలించారు. భర్తపై కేసు నమోదు చేశారు.

వ్యాపారవేత్త దుర్మరణం

క్రిష్ణగిరి: బైక్‌ని గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యాపారవేత్త మరణించిన ఘటన సూళగిరి పరిధిలో చోటు చేసుకొంది. వివరాల మేరకు సూళగిరి కేసిసి నగర్‌కు చెందిన తిరుమలై (57) హోసూరు సిడ్కో ప్రాంతంలో ఓ పరిశ్రమ నడుపుతున్నాడు. శనివారం పనిపై బైక్‌లో క్రిష్ణగిరికి వెళ్లి సాయంత్రం తిరిగి వస్తుండగా సూళగిరి సమీపంలోని సామలపల్లం వద్ద ఏదో వాహనం ఢీకొని వెళ్లిపోయింది. తీవ్ర గాయాలేర్పడిన తిరుమలై ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. సూళగిరి పోలీసులు కేసు నమోదు చేశారు.

బురద రోడ్లపై నరకమే




బురదమయంగా మారిన రోడ్డుపై వాహనదారుల అవస్థలు

కెలమంగలం: డెంకణీకోట తాలూకా అయ్యూరు అటవీ ప్రాంతంలోని కుగ్రామాలకు తారురోడ్డు ఏర్పాటు చేయాలని, మట్టి రోడ్లపై తీవ్ర ఇబ్బందు లెదుర్కొంటున్నామని స్థానిక ప్రజలు తెలిపారు. అయ్యూరు సమీపంలోని మేలూరు నుంచి పళయూరు, గుల్లట్టి, దొడ్డదేవనహళ్లి, కల్‌బండయూరు తదితర గ్రామాల్లో 500 కుటుంబాలకు పైగా నివాసముంటున్నారు, ప్రతి రోజూ ఉద్యోగ, వ్యాపార నిమిత్తం అటవీ ప్రాంత గ్రామాల ప్రజలు పట్టణాలకు వెళ్లి వస్తుంటారు. మట్టి దారులు కొంచెం వాన పడగానే బురదమయం అవుతాయి. ద్విచక్రవాహనాలు, ఆటోలు బురదలో ఇరుక్కుపోతుంటాయి. రోడ్ల వసతులు లేకపోవడంతో విద్యార్థులు కూడా పై చదువులకు వెళ్లలేక చదువును మానేస్తుంటారు. ప్రభుత్వం వెంటనే అటవీ ప్రాంత గ్రామాలకు తారు రోడ్లను వేయాలని కోరారు.

నెల్లూరులో 8.4 కిలోల గంజాయి స్వాధీనం

ముగ్గురి అరెస్టు

నెల్లూరు (క్రైమ్): ఒడిశా, ఏవోబీ ప్రాంతాల నుంచి గంజాయి తీసుకొచ్చి శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో విక్రయిస్తున్న ముగ్గురిని ఎస్ఈబీ అధికారులు అరెస్ట్ చేశారు. వారివద్ద నుంచి 8.430 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరులో ఆదివారం రాత్రి ఏఎస్పీ, సెబ్ ఇన్‌చార్జి సీహెచ్ సౌజన్య ఈ వివరాలు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం గంజామ్ జిల్లా నారాయణపూర్‌కు చెందిన రంజిత్‌నాయక్, బందాగూడకు చెందిన బుద్ధానాయక్, చాసాముహిల్లికి చెందిన రాబినాయక్ బంధువులు. వీరు గతంలో నెల్లూరు రూరల్ మండలం కొత్తకాలువ సెంటర్‌లోని ఓ రైస్‌మిల్లులో పనిచేశారు. ఆ సమయంలో వీరు ఒడిశా నుంచి గంజాయి తీసుకువచ్చి కొత్తకాలువ పరిసర ప్రాంతాల్లో విక్రయించి సొమ్ము చేసుకున్నారు. ఇది లాభసాటిగా ఉండడంతో వ్యాపారాన్ని విస్తృతం చేశారు. ఈ నేపథ్యంలో ఎస్ఈబీ నెల్లూరు-1 ఇన్‌స్పెక్టర్ ఆర్.విజయభాస్కర్, డీఎస్‌ఈవో పోలీసు టీం వారి కదలికలపై నిఘా ఉంచారు. నిందితులు ఆదివారం ఆత్మకూరు బస్టాండు వద్ద ఉండగా అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 8.430 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి సరఫరా చేసిన వ్యక్తిపై సైతం కేసు నమోదు చేసినట్లు ఏఎస్పీ వెల్లడించారు.

వలంటీర్లను కరివేపాకులా తీసేశారు

మాజీ ఎంపీ చిమటా సాంబు

చీరాల అర్బన్: రాష్ట్ర ప్రజలకు వలంటీర్లు గడచిన ఐదేళ్లపాటు సేవలందించారని, ప్రస్తుత ప్రభుత్వం వారిని కరివేపాకులా తీసివేయడం విడ్డూరంగా ఉందని మాజీ ఎంపీ చిమటా సాంబు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తానని, వారి గౌరవవేతనాన్ని రూ.5వేల నుంచి రూ.10వేలకు పెంచి ఒక గుర్తింపు ఇస్తానని వాగ్దానం చేశారని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చాక వలంటీర్ల విషయంలో మీనమేషాలు లెక్కపెడుతున్నారని విమర్శించారు. నెలలో మొదటి రోజున వలంటీర్ల ద్వారా ఇచ్చే పెన్షన్‌ను గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా పంపిణీ చేయడం వెనుక ఆంతర్యం ఏమిటో అర్థం కావడంలేదన్నారు. వలంటీర్ల ద్వారానే పెన్షన్‌ను అందించాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఎవరిపైనా కక్ష సాధింపు చర్యలు ఉండవని చెబుతూనే వలంటీర్లను పక్కన పెట్టడం దారుణమన్నారు. రాజీనామా చేసిన వలంటీర్లను కూడా విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రైల్వే ఉద్యోగాల పేరిట టోకరా

ఏటీవీఎం ఫెసిలిటేటర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని బురిడీ

- రైల్వే శాఖ నోటిఫికేషన్‌ను వక్రీకరిస్తూ ఘరానా మోసం
- నకిలీ వెబ్‌సైట్లతో దరఖాస్తుల స్వీకరణ
- అభ్యర్థుల నుంచి రూ.లక్షల్లో వసూలు
- అవి రెగ్యులర్ ఉద్యోగాలు కావన్న రైల్వే శాఖ



సాక్షి, అమరావతి: రైల్వే ఉద్యోగం అంటే ఆసక్తి చూపంది ఎవరు? దాదాపు ప్రతి ఒక్కరూ ఆసక్తి చూపుతారు. ఇప్పుడు దీన్నే అస్త్రంగా చేసుకున్న కొందరు మోసగాళ్లు భారీ మోసానికి తెరతీశారు. రైల్వేలో ఉద్యోగాలిస్తామని అభ్యర్థుల నుంచి రూ.లక్షలు దండుకుంటున్నారు. నిరుద్యోగులను నిలువునా ముంచుతున్నారు. రైల్వే శాఖ ఫెసిలిటేటర్ పేరుతో ఇచ్చిన నోటిఫికేషన్‌ను వక్రీకరిస్తూ.. నిరుద్యోగుల నుంచి భారీ వసూళ్లకు తెరతీశారు. కాస్త ఆలస్యంగా గుర్తించిన రైల్వే అధికారులు అసలు అది ఉద్యోగమే కాదని స్పష్టం చేశారు. ప్రస్తుతం విజయవాడ రైల్వే డివిజన్‌లోఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మోసగాళ్లు సాగిస్తున్న దందా ఇదీ..

'ఏటీవీఎం ఫెసిలిటేటర్' కోసం రైల్వే శాఖ నోటిఫికేషన్..

రైల్వే స్టేషన్లలో టికెట్లు జారీ చేసే 'ఆటోమేటిక్ టికెట్ వెండింగ్ మెషిన్లు (ఏటీవీఎం) ఫెసిలిటేటర్ల' కోసం దక్షిణ మధ్య రైల్వే ఇటీవల నోటిఫికేషన్ జారీ చేసింది. విజయవాడ డివిజన్ పరిధిలోని 26 రైల్వే స్టేషన్లలో 59 మంది ఫెసిలిటేటర్లను నియమిస్తామని అందులో పేర్కొంది. రైల్వే స్టేషన్ల వద్ద ఏర్పాటు చేసే ఈ ఏటీవీఎం మెషిన్లలో వివరాలు నమోదు చేసి క్రెడిట్ / డెబిట్ కార్డుతో టికెట్ కొనుగోలు చేయొచ్చు. టికెట్ కౌంటర్లలో క్యూలలో నిలబడాల్సిన అవసరం లేకుండా టికెట్లు పొందేందుకు ఈ ఏటీవీఎం మెషిన్లను ఏర్పాటు చేస్తున్నారు. కాగా వృద్ధులు, నిరక్షరాస్యులు తదితరులు ఈ మెషిన్లలో వివరాలు సరిగా నమోదు చేయలేరు. అందుకోసం మెషిన్ల వద్ద సహాయకులను నియమించాలని రైల్వే శాఖ భావించింది. మెషిన్ల ద్వారా ఫెసిలిటేటర్లు జారీ చేసే టికెట్లపై వారికి కమీషన్ చెల్లించాలని నిర్ణయించింది. విజయవాడ 9, అనకాపల్లి 3, అనపర్తి 1, బాపట్ల 1, భీమవరం టౌన్ 1, కాకినాడ టౌన్ 1, చీరాల 1, కాకినాడ పోర్ట్ 2, ఏలూరు 2, గూడూరు 4, కావలి 1, మచిలీపట్నం 2, నిడదవోలు 1, నిడుబ్రోలు 2, నెల్లూరు 5, నరసాపురం 1, ఒంగోలు 1, పిఠాపురం 1, పాలకొల్లు 1, రాజమహేంద్రవరం 5, సింగరాయకొండ 2, సామర్లకోట 1, తాడేపల్లిగూడెం 2, తెనాలి 5, తుని 2, యలమంచిలిలో 2 ఖాళీలకు నోటిఫికేషన్ జారీ చేసింది.

బోగస్ వెబ్‌సైట్లతో టోకరా..

రైల్వే శాఖ ఇచ్చిన ఈ నోటిఫికేషన్‌ను కొందరు మోసగాళ్లు తప్పుదోవ పట్టించారు. ఏటీవీఎం ఫెసిలిటేటర్ ఉద్యోగాలు రైల్వేలో రెగ్యులర్/కాంట్రాక్టు ఉద్యోగాలు అని నిరుద్యోగులను నమ్మిస్తూ మోసానికి పాల్పడుతున్నారు. అందుకోసం ఏకంగా బోగస్ వెబ్‌సైట్లను సృష్టించి యువతను మభ్యపెడుతున్నారు. రైల్వే అధికారులు ఇచ్చిన నోటిఫికేషన్‌ను మార్ఫింగ్ చేసి ఆ నకిలీ వెబ్‌సైట్లలో అందుబాటులో ఉంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఒక్కో పోస్టు కోసం రూ.లక్షల్లోనే వసూళ్లకు పాల్పడుతున్నారు. అంతేకాకుండా రాష్ట్రంలోని ఇతర రైల్వే స్టేషన్లలో కూడా ఏటీవీఎం ఫెసిలిటేటర్ పోస్టులకు త్వరలోనే నోటిఫికేషన్ జారీ చేస్తారని చెబుతూ భారీగా నిరుద్యోగుల నుంచి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ ముఠాలో కొందరు రైల్వే ఉద్యోగులు కూడా కీలకంగా వ్యవహరిస్తున్నారని సమాచారం. దీంతో వారు అడిగినంత డబ్బులు ఇస్తే తమకు ఉద్యోగాలు వస్తాయని పలువురు నిరుద్యోగులు, వారి తల్లిదండ్రులు నమ్మి మోసపోతున్నారు. ఇప్పటికే భారీ సంఖ్యలో నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేసినట్టు సమాచారం. ఇప్పటికే డబ్బులు చెల్లించిన పలువురు ఆ పోస్టుల భర్తీ గురించి రైల్వే ఉన్నతాధికారులను వాకబు చేస్తుండటం గమనార్హం.

అవి ఉద్యోగాలు కానే కావు.. రైల్వే జీతాలు ఇవ్వదు

రైల్వే శాఖ స్పష్టీకరణ

ఏటీవీఎం ఫెసిలిటేటర్ల కోసం తాము ఇచ్చిన నోటిఫికేషన్ ఉద్యోగాల భర్తీ కోసం కాదని రైల్వే శాఖ స్పష్టం చేసింది. ఆ ఫెసిలిటేటర్ అనేది అసలు ఉద్యోగం కానే కాదని తేల్చిచెప్పింది. ఫెసిలిటేటర్‌కు రైల్వే జీతాలు ఇవ్వదని.. ఇతర ఎలాంటి ఉద్యోగ సంబంధమైన ప్రయోజనాలు కల్పించదని వెల్లడించింది. కేవలం రిటైర్డ్ రైల్వే సిబ్బంది / నిరుద్యోగుల కోసం జారీ చేసిన ఈ నోటిఫికేషన్‌ను కొందరు వక్రీకరిస్తున్నారని పేర్కొంది. ఏటీవీఎంల ద్వారా టికెట్లు జారీ చేసే ఫెసిలిటేటర్‌కు ఆ టికెట్ల మొత్తంలో గరిష్టంగా 3 శాతం కమీషన్ మాత్రమే రైల్వే చెల్లిస్తుందని తెలిపింది. అది కూడా గరిష్టంగా 150 కి.మీ.లోపు దూరం ఉన్న స్టేషన్లకే ఏటీవీఎం మెషిన్ల ద్వారా టికెట్లు జారీ చేయడం సాధ్యపడుతుందని వెల్లడించింది. అంటే ఏటీవీఎం ఫెసిలిటేటర్లకు కమీషన్ మొత్తం నామమాత్రంగా ఉంటుందని స్పష్టం చేసింది. కాబట్టి ఏటీవీఎం ఫెసిలిటేటర్ పోస్టులు అనేవి రెగ్యులర్ ఉద్యోగాలో, కాంట్రాక్టు ఉద్యోగాలో కాదనే విషయాన్ని నిరుద్యోగులు గుర్తించాలని విజయవాడ రైల్వే డీఆర్ఎం కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. రైల్వేలో ఉద్యోగాల కోసం రైల్వే శాఖ అధికారిక వెబ్‌సైట్ www.scr. indianrailways.gov.inను సంప్రదించాలని సూచించింది.

తెలంగాణ

డీఎస్‌కు అంతిమ వీడ్కోలు

అధికార లాంఛనాలతో నిజామాబాద్‌లో అంత్యక్రియలు



డీఎస్ భౌతిక కాయం వద్ద నివాళులు అర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

ఖలీల్‌వాడి(నిజామాబాద్ అర్బన్): పీసీసీ మాజీ చీఫ్ ధర్మపురి శ్రీనివాస్‌కు కుటుంబ సభ్యులు, అభిమానులు అశ్రునయనాలతో అంతిమ వీడ్కోలు పలికారు. ఆదివారం మధ్యాహ్నం నిజామాబాద్‌లోని వ్యవసాయ క్షేత్రంలో డీఎస్ అంత్యక్రియలు పూర్తయ్యాయి. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఇతర నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొని నివాళి అర్పించారు. శనివారం తెల్లవారు జామున 3 గంటలకు డీఎస్ కన్నుమూసిన విష యం తెలిసిందే. శనివారం సాయంత్రమే ఆయన భౌతికకాయాన్ని నిజామాబాద్‌లోని ప్రగతినగర్‌లో ఉన్న నివాసానికి తరలించారు. ఆదివారం మధ్యా హ్నం 12 గంటలకు డీఎస్ అంతిమయాత్ర ప్రారంభమైంది. కోర్టు చౌరస్తా, రైల్వే కమాన్, కంఠేశ్వర్ ప్రాంతాల మీదుగా వ్యవసాయ క్షేత్రం వరకు యాత్ర సాగింది. డీఎస్ అభిమానులు, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. వ్యవసాయక్షేత్రంలో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. పోలీసులు గాలిలోకి కాల్పులు జరిపి శ్రద్ధాంజలి ఘటించారు. డీఎస్ పెద్ద కుమారుడు సంజయ్ చితికి నిప్పంటించారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



మాట్లాడుతున్న కేంద్రసహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు

కొరిటెపాడు(గుంటూరు): రైతులకు ఇబ్బంది లేకుండా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, రుణాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఆదేశించారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆదివారం గుంటూరులో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ఎరువులు, విత్తన షాపుల వద్ద స్టాక్ బోర్డు, ధరల పట్టికను తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆదేశించారు. సబ్సిడీ విత్తనాలు రైతులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అరికట్టేందుకు విజిలెన్స్, వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఫిర్యాదుల కోసం ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలని.. దీనిని ప్రతి వ్యాపార సంస్థ వద్ద ప్రదర్శించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం రైతుల కోసం ప్రవేశ పెట్టిన పథకాలను అమలు చేస్తూ సత్ఫలితాలను సాధిస్తున్న రాష్ట్రాలకు సంబంధించిన వివరాలను సేకరించి, వాటిని అనుసరించేందుకు అవసరమైన నివేదిక అందించాలన్నారు. జీడీసీసీ బ్యాంకులో జరిగిన అవకతవకలపై విచారణను వేగవంతం చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో గుంటూరు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, రామాంజనేయులు, తెనాలి శ్రావణకుమార్ పాల్గొన్నారు.

దుస్తులు చింపి, జుత్తు పట్టుకుని ఈడ్చి

- హోం మంత్రి అనిత ఇలాకాలో కీచక పర్వం
- ఇద్దరు మహిళలపై టీడీపీ నాయకుల దౌర్జన్యం
- స్థల కబ్జాను అడ్డుకోవడమే పాపమైన వైనం

సాక్షి, అనకాపల్లి: గత ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేదంటూ గొంతు చించుకుని తీవ్రస్థాయిలో దుష్ప్రచారం చేసిన ప్రస్తుత హోం మంత్రి వంగలపూడి అనిత సొంత నియోజకవర్గంలోని కోటవురట్లలో టీడీపీ నాయకులు ఇద్దరు మహిళలపై దాడి చేశారు. అధికార మదంతో, ప్రభుత్వం మాదే అంటూ విర్రవీగుతూ ఒంటరిగా ఉన్న మహిళ దుస్తులు చింపి, జుత్తు పట్టుకుని ఈడ్చి కొట్టారు. ఈ అమానవీయ ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. బాధిత మహిళలు స్థానిక పోలీసు స్టేషన్‌లో తమ గోడు వెళ్లబోసుకుని ఫిర్యాదు చేశారు. కోటవురట్ల శివారు మర్రిచెట్టు ప్రాంతంలో మెయిన్ రోడ్డును ఆనుకుని మాడెం వరలక్ష్మి ఇల్లు కట్టుకుని నివసిస్తోంది. ఆమె ఇంటి ముందు స్థలాన్ని ఆక్రమించేందుకు బీసీ కాలనీకి చెందిన టీడీపీ నాయకులు ప్రణాళిక రచించారు. ఇదివరకే ఒకసారి పాక వేయగా, బాధిత మహిళ ఫిర్యాదుతో రెవెన్యూ అధికారులు తొలగించారు. ఇప్పుడు అధికారం మాదే కదా అంటూ టీడీపీ నాయకులు ఆక్రమణలకు తెరలేపారు. ఆ స్థలాన్ని కబ్జా చేసేందుకు ఆదివారం మరోసారి ప్రయత్నం చేశారు. తమ ఇంటి ముందు పాక వేయడానికి కుదరదని వరలక్ష్మి, ఆమె తోటికోడలు లక్ష్మి.. ఇద్దరూ కలిసి టీడీపీ నాయకుల ఆక్రమణను అడ్డుకున్నారు. దీంతో ఆగ్రహించిన టీడీపీ నాయకులు మహిళలని కూడా చూడకుండా వారిపై విచక్షణా రహితంగా దాడి చేశారు. దుస్తులు చింపి తీవ్రంగా గాయపరిచారు. బీసీ కాలనీకి చెందిన సుమారు 50 మంది వ్యక్తులు అదే కాలనీకి చెందిన జవ్వాది ఈశ్వరరావు, జవ్వాది కిష్టమ్మ, జవ్వాది కుమారి, పబ్బు మహలక్ష్మి, జవ్వాది రమేష్, బత్తుల అప్పారావు, బత్తుల నరసింహమూర్తి, పబ్బు తుత్రయ్య తదితరులు తమపై దాడి చేసి దుస్తులు చింపి, తాకరాని చోట్ల అసభ్యంగా తాకుతూ కొట్టి గాయ పరిచారని బాధితురాలు మాడెం వరలక్ష్మి స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రమణయ్య తెలిపారు.

అరకు కాఫీకి సలాం!

మన్‌కీ బాత్‌లో ప్రధాని మోదీ ప్రశంసల జల్లు

- అరకు కాఫీకి కొత్త రుచి తీసుకొచ్చింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే
- 2014–19 మధ్యలో కాఫీ రైతులను నిర్లక్ష్యం చేసిన టీడీపీ సర్కార్
- వైఎస్సార్‌సీపీ హయాంలో 2,258 ఎకరాల కాఫీ తోటలకు సేంద్రీయ ధ్రువీకరణ
- విదేశాలకు సొంత బ్రాండ్‌తో అరకు కాఫీని ఎగుమతి చేసే స్థాయికి జీసీసీ
- చింతపల్లిలో ఇంటిగ్రేటెడ్ కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణ పనులు
- కాఫీకి మార్కెటింగ్ సౌకర్యం కల్పించిన జగన్ ప్రభుత్వం



సాక్షి, విశాఖపట్నం : ''మన దేశంలో స్థానిక ఉత్పత్తులు ప్రపంచ స్థాయి గుర్తింపును సాధిస్తుండడం భారతీయులంతా గర్వించదగ్గ విషయం. అలాంటి ఉత్పత్తుల్లో అరకువ్యాలీ కాఫీ ప్రథమ శ్రేణిలో ఉంటుంది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో అరకు కాఫీని గిరిజనులు అధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. శ్రేష్టమైన అరోమా రుచి గల ఇక్కడ పండే అరకు కాఫీ మంచి గుర్తింపు ఉంది. లక్షా 50 వేల మంది ఆదివాసీ కుటుంబాలు అరకు కాఫీ సాగు, ఉత్పత్తి, విక్రయాలతో ఆర్థిక సాధికారత సాధిస్తున్నారు. కాఫీకి గ్లోబల్ గుర్తింపు తీసుకురావడంలో విశేషమైన కృషి చేస్తున్న జీసీసీ.. ఆదివాసీ రైతు సోదర,సోదరీమణుల్ని ఒక తాటిపైకి తీసుకువచ్చి, కాఫీ సాగుకు ప్రోత్సహిస్తోంది. ఈ ప్రక్రియలో గిరిజనుల ఆదాయం గణనీయంగా పెరగడంతో పాటు గౌరవనీయమైన జీవనాన్ని సాగిస్తున్నారు. అరకు కాఫీ రుచి గురించి చెప్పాల్సిన అవసరం లేదు..అద్భుతంగా ఉంటుంది. అరకు కాఫీకి ప్రపంచస్థాయి అవార్డులు ఎన్నో వచ్చాయి. గతేడాది సెప్టెంబర్‌లో ఢిల్లీలో జరిగిన జి 20 సమ్మిట్ లో కూడా అరకువ్యాలీ కాఫీకి ప్రాచుర్యం లభించింది. మీకు ఎప్పుడు వీలు దొరికినా అరకువ్యాలీ కాఫీ రుచిని ఆస్వాదించండి''

ఆదివారం నిర్వహించిన మన్ కీ బాత్ కార్యక్రమంలో దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ఏపీలో గిరిజనులు సాగు చేస్తున్న అరకువ్యాలీ కాఫీ గురించి ప్రధాని మోదీ ప్రస్తావించిన మాటలివీ. ప్రధాని ప్రశంసల వెనుక కాఫీకి రుచి తీసుకొచ్చి.. ప్రపంచ గుర్తింపు తీసుకురావడంలో గత ఐదేళ్లలో అనేక కృషి సల్పింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం.

2014–19 కాలంలో రాష్ట్రంలోని ప్రతి విభాగాన్ని నిర్వీర్యం చేసిన చంద్రబాబు.. గిరిజన సహకార సంస్థ (జీసీసీ)కీ అదే దుస్థితి పట్టించారు. ఇక కోలుకోలేదనుకున్న సంస్థకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కొత్త ఊపిరి పోసింది. జీసీసీనే నమ్ముకున్న గిరిజనుల జీవితాలకు కొత్త వెలుగులు తీసుకొచ్చింది. ఉత్పత్తుల కొనుగోలు దగ్గర నుంచి.. విక్రయాల వరకూ తిరుగులేని శక్తిగా అభివృద్ధి పథంలోకి దూసుకుపోయింది. కాఫీ తోటలకు పునరుజ్జీవం పోశారు. ఫలితంగా చంద్రబాబు కాలంలో టర్నోవర్ కంటే.. ఈ ఐదేళ్లలో రెట్టింపు టర్నోవర్‌ని జీసీసీ సొంతం చేసుకుంది. తొలిసారిగా కాఫీతోటలకు సేంద్రీయ ధృవీకరణ లభించడంతో పాటు.. ఐదు జాతీయ అవార్డులు సొంతం చేసుకుంది. త్వరలోనే విదేశాలకు కాఫీని సొంతంగా ఎగుమతి చేసేందుకూ సిద్ధమవుతోంది. 2014–15 నుంచి 2018–19 వరకూ రూ.1209 కోట్లు మాత్రమే ఉన్న జీసీసీ టర్నోవర్ ఒక్కసారిగా గేర్ మార్చింది. గత సీఎం వైఎస్ జగన్ జీసీసీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించడంతో 2019–20 నుంచి 2023–24 మధ్య కాలంలో రెట్టింపై ఏకంగా టర్నోవర్ రూ.2,303 కోట్లకు చేరుకుంది.

మేడిన్ ఆంధ్రా పేరుతో...

ఓ వైపు అరకు కాఫీ టేస్టీగా ఉండటమే కాకుండా.. ఆర్గానిక్‌గా పండించడం వల్ల గిరాకీ సొంతం చేసుకుంది. అల్లూరి జిల్లాలో మొత్తం 2.27 లక్షల ఎకరాల్లో కాఫీ తోటలు విస్తరించాయి. ఈ తోటల్లో ఏడాదికి 71, 258 మెట్రిక్ టన్నుల కాఫీపండ్లు ఉత్పత్తి అవుతున్నాయి. ఇందులో ప్రస్తుతానికి రెండు క్లస్టర్లలో 2,258.55 హెక్టార్ల విస్తీర్ణంలో ఆర్గానిక్ పద్ధతుల్లో కాఫీని పండిస్తున్నారు. చింతపల్లి క్లస్టర్ వరుసగా మూడో ఏడాది కూడా నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ ఆర్గానిక్ ప్రొడక్షన్ (ఎన్‌పీవోపీ) స్టాండర్డ్స్ సర్టిఫికెట్ తీసుకోగా.. జీకేవీధి క్లస్టర్ ఇప్పటికే రెండుసార్లు స్కోప్ సర్టిఫికెట్ దక్కించుకుంది. మూడో ఏడాదీ సేంద్రీయ సాగుకు సంబంధించి స్కోప్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకుంది. ప్రస్తుతం కాఫీ గింజల క్యూరింగ్, ప్రాసెసింగ్ అంతా బెంగళూరులోని అవుట్ సోర్సింగ్ ఏజెన్సీతో టై-అప్ కారణంగా కాఫీ ప్రాసెసింగ్ వ్యయం పెరుగుతూ వస్తోంది. డౌనూరులో క్యూరింగ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటైతే ఈ ఖర్చులు తగ్గే అవకాశం ఉంటుంది. పాడేరు ఏజెన్సీలోని 11 మండలాల్లో 2,27,021 ఎకరాల విస్తీర్ణంలో కాఫీ తోటలున్నాయి. మొత్తం 93,521 మంది గిరిజనులు కాఫీ సాగులో పాల్గొంటున్నారు, వీరిలో 2,600 మంది రైతులు టాప్ గ్రేడ్ రకాన్ని సాగు చేస్తున్నారు. వీరి వద్ద నుంచి సేకరించిన బీన్స్‌ని ఫిల్టర్ కాఫీ ఉత్పత్తి కోసం బెంగళూరుకు, ఇన్‌స్టెంట్ కాఫీ పౌడర్ ఉత్పత్తి, రిటైల్ మార్కెటింగ్ కోసం ఏలూరుకు పంపిస్తుంటారు. ఇకపై ఇక్కడి నుంచే చేసేలా క్యూరింగ్ వ్యవస్థ సిద్ధమవుతోంది. త్వరలోనే మేడ్ ఇన్ ఆంధ్రప్రదేశ్ పేరుతో అరకు కాఫీ ఉత్పత్తుల్ని మార్కెట్‌లోకి పంపించేందుకు అవకాశం ఉంది.

తొలిసారిగా భారీగా ధరలు పెంపు

గిరిజన రైతుల జీవనోపాధి, ఆదాయ స్థాయిల్ని కాఫీ తోటల పెంపకం ద్వారా మెరుగుపరచడమే ప్రధాన లక్ష్యంగా సీఎంగా ఉన్న సమయంలో వైఎస్ జగన్ పాడేరు ఏజెన్సీ పరిధిలోని 11 మండలాల్లో సుమారు లక్షకు పైగా ఎకరాల్లో కాఫీ ప్లాంటేషన్ ఏర్పాటు చేశారు. గిరిజనులు పండించిన కాఫీకి జీసీసీ ద్వారా మార్కెటింగ్ సౌకర్యాన్ని కల్పించారు. ఎన్నడూ లేని విధంగా గిరిజన రైతు పండించిన కాఫీని జీసీసీ భారీ మద్దతు ధరకు కొనుగోలు చేసింది. పార్చ్‌మెంట్ కాఫీ కిలోకి రూ.285, చెర్రీ కాఫీ కిలోకి రూ.145 మార్కెట్ ధరగా ప్రకటించి కొనుగోలు చేయడంతో మధ్యవర్తుల దోపిడిని నిరోధించింది. 2023–24లో ఇప్పటి వరకూ 564.48 మెట్రిక్ టన్నుల ముడి కాఫీని రైతుల నుంచి జీసీసీ కొనుగోలు చేసి రూ.13.39 కోట్లు కాఫీ రైతు బ్యాంకు ఖాతాలకు నేరుగా జమ చేసింది.

2019-24 మధ్యలో అరకు కాఫీ ఎదిగిందిలా..

- 2018–19 కాలంలో రూ.799.58 లక్షల కాఫీ కొనుగోలు చేయగా.. 2023–24 నాటికి రూ.1339.05 లక్షల కాఫీ కొనుగోలు చేసింది.
- డౌనూరులో ఇంటిగ్రేటెడ్ కాఫీ ప్రాసెసింగ్ యూనిట్‌ని స్థాపించేందుకు రూ.3 కోట్లుని ప్రభుత్వం మంజూరు చేయగా 2023 అక్టోబర్ 20న అప్పటి మంత్రులు శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం పనులు చురుగ్గా సాగుతున్నాయి.
- కాఫీ తోటల నిర్వహణకు జీసీసీ ద్వారా గిరిజన రైతులకు ఏటా రూ.1.05 కోట్ల రుణాల్ని, వ్యవసాయ కార్యక్రమాల అమలుకు రూ.1.06 కోట్ల క్రెడిట్ రుణాల్ని పంపిణీ చేశారు.
- వివిధ నగరాలు, పట్టణాల్లో అరకు కాఫీ పేరుతో అవుట్‌లెట్స్ ఏర్పాటు చేశారు.
- దేశానికి వచ్చే వివిధ దేశాల అతిథులకు, రాష్ట్రానికి వచ్చే ప్రముఖులకు అరకు కాఫీతో పాటు జీసీసీ ఉత్పత్తులు బహుమతులుగా అందించేలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రోత్సహించింది. విశాఖ వేదికగా నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు హాజరైన దేశ, విదేశీ పెట్టుబడిదారులకు అరకు కాఫీతో పాటు జీసీసీ ఉత్పత్తులతో కూడిన కిట్స్ అందించారు.
- సేంద్రీయ పద్ధతుల్లో పండుతున్న కాఫీ ఘుమఘుమలకు విదేశీయులు ఫిదా అవుతోంది. విదేశీ విపణిలో పెరుగుతున్న డిమాండ్‌ని దృష్టిలో పెట్టుకొని ఇకపై సొంతంగా ఎగుమతులు చేపట్టాలని జీసీసీ భావిస్తోంది. ఇప్పటికే ఎక్స్‌పోర్ట్ సంస్థలతో అధికారులు సంప్రదింపులు జరిపారు.

గిరిజనుల ఆర్థిక సాధికారతకు ఊతమిస్తున్న అరకు కాఫీ

అల్లూరి జిల్లాలో అరకు వ్యాలీ సాగు, గిరిజనులకు రాష్ట్ర ప్రభుత్వం, జీసీసీ అందిస్తున్న ప్రోత్సాహాన్ని ప్రధానినరేంద్ర మోడి మన్ కి బాత్ లో ప్రత్యేకంగా ప్రస్తావించడం గర్వంగా ఉంది. సీఎం చంద్రబాబుతో కలిసి అరకు కాఫీ తాగానని చెప్పారు. ప్రధాని స్ఫూర్తివంతమైన వ్యాఖ్యలు, ప్రశంస గిరిజన కాఫీ రైతులకు, జీసీసీ సిబ్బందికి, కాఫీ సాగుతో ముడిపడి వున్న అన్ని ప్రభుత్వ శాఖల సిబ్బంది, వర్గాల వారికీ ఎంతగానో ఉత్తేజాన్ని, ఉత్సాహాన్ని, ప్రోత్సాహాన్ని ఇచ్చింది. గిరిజనుల ఆర్థిక సాధికారతకు అరకు కాఫీ ఎంతగానో ఊతమిస్తోంది.

–జి. సురేష్ కుమార్, జీసీసీ ఉపాధ్యక్షుడు, ఎండీ

ఆయిల్‌పామ్.. ధర పతనం

- గతేడాదితో పోల్చితే సగానికి పడిపోయిన టన్ను ధర
- 2022లో రూ.26 వేలు పలికిన ధర
- ప్రస్తుతం టన్ను ధర రూ.13,180
- దేశంలోనే ఏలూరు జిల్లా సాగులో మొదటి స్థానం
- ఏటా జిల్లాలో పెరుగుతున్న ఆయిల్‌పామ్ సాగు
- రాష్ట్రవ్యాప్తంగా సాగులో 80 శాతం ఒక్క ఏలూరు జిల్లాలో
- ధరలు తిరోగమనంలో ఉన్నా పెరుగుతున్న సాగు



ఆయిల్‌పామ్ ధరలు తిరోగమనం బాట పట్టాయి. క్రూడ్ ఆయిల్‌పై కేంద్రం దిగుమతి సుంకం రద్దు చేయడం, ఇతర కారణాలతో ఆయిల్‌పామ్ ధరలు భారీగా పడిపోతున్నాయి. గతేడాదితో పోల్చితే 40 శాతం మేర ధర తగ్గింది. అంతర్జాతీయంగా వచ్చే 30 ఏళ్ల వరకు ఆయిల్‌పామ్‌కు విపరీతంగా డిమాండ్ ఉన్న నేపథ్యంలో సాగు విస్తీర్ణం ఏటా పెరుగుతుండగా దానికి విరుద్ధంగా ధరలు పతనమవుతున్నాయి. ఐదేళ్ల నుంచి వరుసగా ధరలు పెరుగుతూ వచ్చి మళ్లీ ఈ ఏడాది రివర్స్‌లో పయనిస్తున్నాయి. ఆయిల్‌పామ్ సాగులో దేశంలోనే ఏలూరు జిల్లా మొదటి స్థానంలో నిలుస్తుంది.

సాక్షి ప్రతినిధి, ఏలూరు: వాణిజ్య పంటల్లో అగ్రగామిగా ఉన్న ఆయిల్‌పామ్ సాగు ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో అధికంగా ఉంది. దేశంలోనే సాగు విస్తీర్ణం, ఉత్పత్తిలో మొదటి స్థానంలో ఉంది. రాష్ట్రవ్యాప్తంగా 1.62 లక్షల హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగు జరుగుతుండగా ఒక్క ఏలూరు జిల్లాలోనే 48,968.8 హెక్టార్లలో, పశ్చిమగోదావరి జిల్లాలో 3 వేల హెక్టార్లు సాగులో ఉంది. సుమారుగా ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలు కలిపి 1.30 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్, కోకో, కొబ్బరి, మిరియాలు, ఇతర సుగంధ ద్రవ్యాలు అంతర పంటగా వేసుకునే వీలు ఆయిల్‌పామ్‌కు ఉండటంతో లక్షా 30 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్‌తో పాటు అత్యధిక శాతం కోకో అంతర పంటగా ఉంది. ప్రధానంగా గోదావరి పరీవాహక ప్రాంతం కావడంతో గాలిలో 85 శాతం తేమ ఉండటంతో ఆయిల్‌పామ్ సాగుకు జిల్లా పూర్తి అనుకూలంగా ఉంటుంది. ఇసుకతో కూడిన ఎర్రని నేలలు కావడం, కృష్ణా, గోదావరి డెల్టా మధ్య ప్రాంతం కావడంతో గాలిలో తేమ శాతం ఉండటం వాతావరణం పూర్తి అనుకూలంగా ఉండటంతో ఆయిల్‌పామ్ సాగు అత్యధికంగా సాగుతుంది. మార్కెట్ ధరలతో నిమిత్తం లేకుండా దీర్ఘకాలిక పంటగా దీన్ని అత్యధిక శాతం సాగు చేస్తున్నారు.

తిరోగమనంలో ధరలు

ఆయిల్‌పామ్ ధరలు తిరోగమనంలో కొనసాగుతున్నాయి. 2017లో సగటున రూ.8 వేలు ఉన్న ధర అంతర్జాతీయ పరిణామాలు డిమాండ్ కారణంగా 2022 నాటికి టన్ను ధర అత్యధికంగా రూ.26 వేలకు చేరింది. ఆ తరువాత క్రూడ్ ఆయిల్‌పై దిగుమతి సుంకం రద్దు చేయడంతో ఆయిల్‌పామ్ ధర తిరోగమన బాట పట్టి గతేడాది రూ.23 వేలు సగటున ఉండగా ప్రస్తుతం రూ.13,180కు పరిమితమైంది. రెండేళ్ల క్రితం వరకు కేంద్ర ప్రభుత్వం ఆయిల్‌పామ్ ఇంపోర్ట్‌పై డ్యూటీ (దిగుమతి సుంకం) విధించింది. ఐదేళ్ల క్రితం వరకు ఇంపోర్ట్ డ్యూటీ 30 శాతం ఉండగా తర్వాత 20 శాతానికి తగ్గించారు. గతేడాది పూర్తిగా రద్దు చేయడంతో దేశంలోని ప్రధాన కంపెనీలు దిగుమతులపై ఆధారపడుతున్నాయి. వాస్తవానికి 10 లక్షల టన్నులు ఏటా డిమాండ్ ఉంటే 2 లక్షల టన్నులు కూడా ఉత్పత్తి లేని పరిస్థితి. ఈ క్రమంలో డిమాండ్ అధికంగా ఉండాలి. అయితే ఇంపోర్ట్ డ్యూటీ పూర్తిగా రద్దు చేయడంతో దిగుమతుల పైనే అత్యధికంగా ఆధారపడటంతో స్థానిక మార్కెట్‌లో ధరలు పూర్తిగా పతనమయ్యాయి. ఈ ఏడాది మళ్లీ ఇంపోర్టు డ్యూటీ విధించే అవకాశం ఉంది. ఇంపోర్ట్ డ్యూటీ అమలులోకి వస్తే ఆయిల్‌పామ్ ధరలు కొంతైనా పెరిగే అవకాశం ఉంది.

ఏలూరు జిల్లాలో భారీగా సాగు

ఏలూరు జిల్లాలో 14 మండలాల్లో అత్యధికంగా ఆయిల్‌పామ్ సాగు జరుగుతుంది. 2019–20లో 72,860 హెక్టార్లు, 2020–21లో 70,963 హెక్టార్లు, 2022023లో 48,836 హెక్టార్లు, 2023–24లో 48,968.8 హెక్టార్లలో సాగు విస్తీర్ణంలో ఉంది. ప్రధానంగా టి.నర్సాపురం మండలంలో 16190 ఎకరాలు, కామవరపుకోట మండలంలో 16,078 ఎకరాలు, ద్వారకాతిరుమల మండలంలో 17,504 ఎకరాలు, చింతలపూడి మండలంలో 18,304 ఎకరాలు, జంగారెడ్డిగూడెం మండలంలో 8,422 ఎకరాల సాగు విస్తీర్ణం ఉంది. హెక్టారుకు నాలుగేళ్లు కలిపి రూ.71 వేలు సబ్సిడీ రూపంలో ఇవ్వడం, 30 ఏళ్ల పాటు దిగుబడి వచ్చే పంట కావడంతో ఆయిల్‌పామ్ సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. స్థానికంగా ఉత్పత్తి అయ్యే ఆయిల్‌పామ్‌ను పామాయిల్ పరిశ్రమలు తక్కువ గాను, కాస్మొటిక్స్ ఇతర అనుబంధ పరిశ్రమలకు ఎక్కువగా వినియోగిస్తున్నారు.



మంచి మాట

సౌశీల్యం అంటే,,?

రాముడి పదహారు గుణాలలో ప్రత్యేక గుణం అని చెప్పదగినది సౌశీల్యం. శ్రీరామచంద్రుడు అరణ్యవాసానికి బయలుదేరి వెడుతున్నప్పుడు గుహుడి రాజ్యంలో ప్రవేశించాడు. అప్పుడు గుహుణ్ణి ''ఆత్మవత్సఖః'' అంటాడు. అంటే గుహుడు రాముడికి ఎంత అంటే తనతో సమానమైన వాడు. అరమరికలు లేకుండా ఎవరితో ఉండ గలడో అతడు. రాముడు వస్తున్నాడని తెలిసి గుహుడు వద్ధులైన మంత్రులతో కలిసి రాముడికి ఎదురు వెళ్ళాడు స్వాగతం చెప్పటానికి. రాముడు తానే ముందుగా అతడిని పలుకరించి కౌగిలించుకున్నాడు. రాముడు చక్రవర్తి కుమారుడు. గుహుడు సరిహద్దు ప్రాంతంలో ఉన్న ఒక సామాన్యమైన వనచర రాజ్యానికి అధిపతి మాత్రమే. రాముడికి అటువంటి భేదాలు లేవు.

రాముడికి పట్టాభిషేకం అని ప్రకటించిన తరువాత సుమంత్రుడు రాముడి అంతఃపురంలో ప్రవేశించటానికి అనుమతి అడుగుతుంటే అటువంటిది అవసరం లేదు అంటాడు. తాను కాబోయే రాజు అయినా చిన్నతనం నుండి ఎత్తుకుని ఆడించిన వాడు కనుక తారతమ్యం చూపించ లేదు.

జటాయువుని పక్షి అని చూడకుండా అంత్యక్రియలు నిర్వర్తించాడు. దశరథుడు కూడా అటువంటి సౌశీల్యం కల వాడు కనుకనే జటాయువుతో మైత్రి నెరపాడు. దేవతలు దశరథుడితో మైత్రి కలిగి ఉండటానికి ఈ గుణమే కారణమేమో!

"మహతః మందై స్సహ నీరంధ్రేణ సంశ్లేషః సౌశీల్యం" జాతి చేత విద్య చేత ఐశ్వర్యం చేత చాలా గొప్ప వాడైనా తన కంటే తక్కువ వారితో అరమరికలు లేక కలిసి ఉండటం సౌశీల్యం.

కృష్ణ సుధాముల మైత్రి కూడా ఇటువంటిదే. పైగా కుచేలుడుగా ప్రఖ్యాతి పొందిన సుధాముడు కృష్ణుడి ఐశ్వర్యాన్ని చూసి చనువుగా ఉండటానికి కొంచెం సందేహిస్తుంటే, తానే ఎదురు వెళ్ళి, తీసుకు వచ్చి, కాళ్ళు కడిగి, సకల మర్యాదలు చేసి, అతడిలో ఉన్న ఆ కాస్త బెరుకుని పోగొట్టటానికి గురుకులంలో గడిపిన కాలాన్ని గుర్తు చేస్తాడు. పైగా అతడికి ఏమీ ఇచ్చి పంపలేదు వెళ్లేటప్పుడు. అతడి లేమిని ఎత్తి చూపి, తన ఆధిక్యం చూపించుకున్నట్టు అవుతుంది అని. ఇంటికి చేరే సరికి గుట్టు చప్పుడు కాకుండా అన్నీ సమకూర్చాడు. ఎంతటి సౌశీల్యం!

దీనికి భిన్నమైన ఉదాహరణలు కూడా ఉన్నాయి. ద్రుపదుడు విద్యాభ్యాస సమయంలో ఇచ్చిన మాట తప్పి తనను చూడటానికి వచ్చిన ద్రోణుణ్ణి అవమాన పరుస్తాడు. తగిన ఫలం అనుభవించాడు. లోకంలో తరచుగా ఇటువంటివారే ఎక్కువగా కనపడుతూ ఉంటారు. స్నేహానికి కూడా అంతస్తు చూస్తారు. అవసరానికి స్నేహం నటించటం ఉంటుంది. పని అయిపోయిన తరువాత అంతకు ముందు ఉన్న సుహృద్భావం కనపడదు. అవసరం వచ్చి నప్పుడు అడ్డు రాని అంతస్తులు, హోదాలు, పదవులు, ఆర్థిక వ్యత్యాసాలు అప్పుడు కనపడతాయి.

ఒక్కసారి మైత్రి ఏర్పడిన తరువాత అది జిడ్డు లాగా అంటుకు పోతుంది. అందుకే దానిని స్నేహం అన్నారు. స్నేహం అంటే నూనె, పట్టుకుంటే వదలని జిడ్డు అని అర్థం. చిన్నతనంలో ఇటువంటి తేడాలు తెలియవు కనుక అందరితో కలిసి మెలిసి ఉంటారు. ఎదుగుతున్న కొద్దీ దూరం జరుగుతూ ఉంటారు. కానీ, సజ్జనులు అటువంటి భావాలని దారికి రానీయరు.

మరొక ప్రధానమైన గుణం – మిత్రులు తక్కువ స్థాయిలో ఉన్నారు కనుక వారిని తమ స్థాయికి తీసుకు రావటానికి ప్రయత్నం చేయరు. అంటే, వారి స్థాయిని గుర్తించినట్టే కదా! అది వారిని అవమానించినట్టే అవుతుంది. వారు ఉన్న స్థితి వారికి నచ్చినది, తృప్తి కలిగించేది. వారికి కావలసినది ప్రేమ, ఆత్మీయత, ఆదరణ. దానిని చూపించటమే సౌశీల్యం. ఈ లక్షణం ఎంత అపురూపమో కదా!

– డా. ఎన్. అనంత లక్ష్మి

బౌద్ధవాణి

ఇంద్రియాలతో జాగ్రత్త !

రుషిరుణం తీరడానికి బ్రహ్మచర్య ఆశ్రమం సరిపోతుంది. కానీ పితృరుణం, దేవరుణం తీరాలంటే గృహస్థాశ్రమ స్వీకారం తప్పదు. పితరుణం అంటే... తండ్రి మనకు ఒక జన్మనిచ్చాడు... సరే... దీని వెనుక ఉన్న తాత్విక ఏమిటి ? ఇప్పుడు మన శరీరానికి ఒక పేరుంది. వచ్చేటప్పుడు ఆ పేరుతో భూమి మీదకు రాలేదు. వచ్చిన తరువాత పెద్దలు పేరు పెట్టారు. కానీ ఈ జీవుడు ఇప్పుడు కాదు సనాతనంగా అలా వస్తూనే ఉన్నాడు. ఎన్ని శరీరాలు పొందాడో!!! ఎన్ని వదిలాడో !!! పునరపి జననం పునరపి మరణం/పునరపి జననీ జఠరే శయనం/ఇహ సంసారే బహుదుస్తారే/కృపయా పారే పాహి మురారే. ఇలా మారిపోతున్నప్పుడు ఒక్కొక్క జన్మలో ఒక్కొక్క అనుబంధం.. తల్లిదండ్రులు, భార్య, పిల్లలు... ఒక్కొక్క జన్మలో ఒక్కొక్కరు తల్లిదండ్రులు...అలా మారిపోతుంటారు.

కానీ చేసిన పాపాలున్నాయి. అవి అనుభవం చేత పోతాయి. అనుభవం దుఃఖమయం కావాలి. పుణ్యం సుఖ రూపంలో పోవాలి. నిజానికి సుఖదుఃఖాలు రెండూ కూడా అనుభవాలే..ఒకటి బాగున్నట్లుంటుంది, మరొకటి బాధపెట్టినట్లుంటుంది. మొత్తానికి పుణ్యమో పాపమో క్షయమయిపోతుండాలి. అది మానసికంగా అనుభవించడం కుదరదు. శరీరం ఉంటే తప్ప దుఃఖాన్ని అనుభవించడం కుదరదు. అలాగే సుఖాన్ని కూడా అనుభవించడం వీలు కాదు. కాబట్టి ధర్మానుష్ఠానం చేయాలి అంటే శరీరం ఉండాలి. కాళిదాస మహాకవి అంతటి వాడు 'శరీరమాద్యం ఖలు ధర్మ సాధనమ్' అన్నాడు. జీవుడు ఈ శరీరాన్ని తొడుక్కుని రాలేదనుకోండి. అప్పుడు ఆ జీవుడికి పాపపుణ్యాలు పోగొట్టుకోవడం కుదరదు. అసలు పాపపుణ్యాలు లేవనుకోండి. ఇక శరీరం పొందాల్సిన అవసరమే ఉండదు. పాపం క్షయమైపోయి పుణ్యం బాగా సంపాదించుకోవాలి, సుఖంగా ఉండాలనుకుంటే దానికి శరీరం తప్పనిసరి.

కాబట్టి శరీరం అనేది అత్యంత ప్రధానం. దీనిని జీవుడు పొందాడు అంటే... అది తల్లిదండ్రుల మహోపకారం. వాళ్ళిద్దరి అనుగ్రహంగా ఈ శరీరం లభించింది. అంటే తండ్రి ఏబాటలో ప్రయాణించాడో కొడుకు కానీ, కూతురు కానీ అదేబాటలో ప్రయాణించాలి. అంటే వేరొకరికి జన్మనివ్వాలి. సంతానం పెరగాలి. అయితే ఇక్కడ ఒక ధర్మసంక్లిష్టత వస్తుంది. సంతానాన్ని పొందడం.. అన్నప్పుడు కామం సహజంగా శరీరంలో పొటమరిస్తుంది. ఈ విషయంలో విశంఖలత్వం పనికిరాదు. అది ధర్మంచేత కట్టుబడాలి. అది చేయనప్పుడు ఇంద్రియాలు ఎప్పుడు కాటేస్తాయో తెలియదు.

గడ్డిలో నడుచుకుంటూ పోతున్నాం. అనుకోకుండా కాలు అక్కడున్న పాము పడగ్గై పడింది. మిగిలిన శరీరంతో అది కాలును చుట్టేసింది. అది మనల్ని కాటువేయలేదు..కారణం ...దాని తల మన కాలి కింద ఉంది కనుక. కాటువేయలేదు కాబట్టి మనం సురక్షితంగా ఉన్నాం ...అనుకుంటూ ప్రశాంతంగా ఉండగలమా ? ఎప్పుడు పాదం తొలిగితే అప్పుడు కాటేయడానికి పాము కాచుకుని ఉంటుంది. దీని బారినుంచి ఎప్పుడు తప్పుకుందామా అని మనం చూస్తుంటాం. మనం కానీ, అది కానీ క్షేమంగా మాత్రం లేము, ఉత్కంఠ అటూ ఉంది.. ఇటూ ఉంది. మన ఇంద్రియాలు కూడా అంతే. కాలుకింద పాము తల అణిగి ఉన్నట్లు అణిగి ఉంటాయి. సమయం చూసి కాటేస్తాయి. వాటిని నిగ్రహించడం అంత తేలిక కాదు.





బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

ఆధ్యాత్మికథ

శేషాచలంలో సాగర ఘోష!

ఉత్తర భారతదేశంలోని సంగీత సాధకులు కొందరు తిరుమలకు వెళ్ళి స్వామి వారి దర్శనం చేసుకోదలిచారు. అదే విషయం తమ సంగీత విద్వాంసుడికి చెప్పారు. ఆ విద్వాంసుడు చాలా సంతోషించి 'అలాగే, అక్కడి శేషాచలం కొండల్లోని సముద్రాన్ని చూసి రమ్మని' చెప్పి పంపాడు.

ప్రయాణం మొదలైనప్పటినుంచీ ఆ సాధకుల్లో ఓ సందేహం మొదలయ్యింది. 'తిరుమల శేషాచలం కొండల దగ్గర సముద్రం ఉందని ఎన్నడూ వినలేదు, మరి గురువు ఎందుకు అలా చెప్పాడో...' అని. ఎన్ని పుస్తకాలు తిరగేసినా, ఎందరో పండితులను విచారించినా తిరుమల కొండ సమీపంలో సముద్రం ఏదీ లేదని తెలుసుకున్నారు. 'అయినా గురువు తప్పు చెప్పడు కదా!' అని ఆలోచించారు. 'ఎలాగూ వెళ్తున్నాము కదా, కొండ పరిసరాల్లో వెదికి చూద్దాం!' అనుకున్నారు.

అలిపిరి మెట్ల నుంచి కాలినడకన తిరుమలకు చేరుకున్నారు. గుండు గీయడమంటే పాపాలు పోగొట్టుకోవడమే అని నమ్మిన ఆ సాధకులు స్వామికి తలనీలాలు సమర్పించారు. పుష్కరిణిలో స్నానం చేసి స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. లడ్డు ప్రసాదం స్వీకరిస్తూ ఉంటే, వారికి గురువు చెప్పింది గుర్తుకొచ్చింది. కనిపించిన భక్తులతో సముద్రం గురించి ఆరా తీశారు. వారు సమాధానం ఇవ్వకపోగా వీరి వైపు వింతగా చూశారు.



'తిరుమల కొండల పైన సముద్రం కాకపోయినా, సముద్రం లాంటిదేమైనా ఉంటుందేమో చూద్దామని' బయలుదేరారు. ఆకాశగంగ, పాపవినాశనం, జాపాలి, పాండవ తీర్థం లాంటి ప్రదేశాలన్నీ గాలించారు. వారికెక్కడా సముద్రం ఆనవాలు కనిపించలేదు. గురువు పొరపాటుగా చెప్పినట్లున్నారని తీర్మానించుకుని కొండ దిగడం ప్రారంభించారు.

వారికి దారిలో ఏడవ మైలు వద్ద ఆకాశం ఎత్తు శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహం కనిపించింది. భక్తితో నమస్కరించి కళ్ళు మూసుకుని, ప్రశాంతంగా కూర్చున్నారు.

వారి చెవులకు... లీలగా... మైకులో నుంచి 'అదివో అల్లదివో శ్రీహరి వాసము... పదివేల శేషుల పడగల మయము' అనే అన్నమాచార్య కీర్తన వినిపించింది. వారి ఒళ్ళు పులకరించింది. ముఖాల్లో నేతి దీపాల మెరుపు మొదలయ్యింది. గురువు చెప్పిన 'సముద్రం' లోతు తెలిసింది. ఏడు స్వరాలు ఏడు కొండలై అన్నమయ్య సంగీత స్వరంతో ప్రవహించడం గమనించారు.

'మనమనుకునే ఉప్పు నీటి సముద్రం శేషాచలం కొండల్లో లేదు కానీ అన్నమయ్య గానామృత సముద్రం ఈ కొండల దగ్గర ఉంది' అని తెలుసుకున్నారు. పండితులను, పామరులను సైతం ఓలలాడించే ముప్పది రెండువేల సంకీర్తనలు తెలుగులో అందించిన ఆ పదకవితా పితామహుడికి మనస్సులోనే ధన్యవాదాలు తెలిపారు. గోవింద నామస్మరణలు చేస్తూ కొండ దిగారు.

– ఆర్.సి. కృష్ణస్వామి రాజు

సినిమా



● ప్రభాస్

అక్టోబరులో ఆరంభం

ప్రభాస్ హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనుంది. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ ఈ మూవీ నిర్మించనున్నారు. ఈ సినిమాలో హీరోయిన్లుగా మృణాల్ ఠాకూర్, రష్మికా మందన్న పేర్లు వినిపిస్తున్నాయి. వివేక్ సాగర్ ఈ మూవీకి సంగీతం అందించనున్నారు. వార్ బ్యాక్‌డ్రాప్‌తో సాగే ఈ లవ్‌స్టోరీ మూవీ ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ చివరి దశకు చేరుకున్నాయి. దీంతో ఈ ఏడాది అక్టోబరులో ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభించేలా సన్నాహాలు చేస్తున్నారట హను రాఘవపూడి. ప్రస్తుతం వెకేషన్‌లో భాగంగా ప్రభాస్ విదేశాల్లో ఉన్నారు. ఆయన తిరిగొచ్చిన తర్వాత 'రాజాసాబ్' సినిమా చిత్రీకరణలో పాల్గొంటారు. ఆ సినిమా పూర్తయిన తర్వాత హను రాఘవపూడి దర్శకత్వం వహించే సినిమా షూటింగ్‌లో ప్రభాస్ పాల్గొంటారనే టాక్ వినిపిస్తోంది.

అయితే సందీప్ రెడ్డి వంగా డైరెక్షన్‌లో 'స్పిరిట్' అనే సినిమాకి కమిట్ అయ్యారు ప్రభాస్. ఈ సినిమా చిత్రీకరణ కూడా ఈ ఏడాది చివర్లోనే ప్రారంభం కానుందట. మరి.. హను రాఘవపూడి, సందీప్ రెడ్డి వంగా దర్శకత్వాల్లోని సినిమాల చిత్రీకరణలో ప్రభాస్ ఏకకాలంలో పాల్గొంటారా? లేదా? అనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది.

అందుకే వెనకడుగు వేశా!

విలక్షణ నటుడు కమల్ హాసన్ హీరోగా నటించిన తాజా చిత్రం 'భారతీయుడు 2'. కమల్ హాసన్, దర్శకుడు శంకర్ కాంబోలో 1996లో వచ్చిన హిట్ మూవీ 'భారతీయుడు'కి సీక్వెల్‌గా 'భారతీయుడు 2' రూపొందింది. లైకా ప్రొడక్షన్స్, రెడ్ జెయింట్ బ్యానర్‌పై సుభాస్కరన్ నిర్మించిన ఈ మూవీ తెలుగులో 'భారతీయుడు 2', తమిళంలో 'ఇండియన్ 2', హిందీలో 'హిందుస్థానీ 2' పేరుతో ఈ నెల 12న విడుదల కానుంది. రిలీజ్ డేట్‌కి సమయం దగ్గరపడటంతో జోరుగా ప్రమోషన్స్ చేస్తున్నారు మేకర్స్. తాజాగా ఓ ఇంటర్వ్యూలో కమల్ హాసన్ పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు.

''ఐ-రోబో' అనే ఇంగ్లిష్ నవలను సినిమాగా తెరకెక్కిస్తే బాగుంటుందని నేను, శంకర్, రచయిత సుజాత (ఎస్. రంగరాజన్) 90ల్లోనే అనుకున్నాం. నా పాత్ర లుక్ టెస్ట్ కూడా పూర్తయింది. కానీ, ఆ ప్రాజెక్టు పట్టాలెక్కలేదు. ఇండస్ట్రీలో బడ్జెట్, పారితోషికం, డేట్స్, మార్కెట్.. ఇలా ఎన్నో లెక్కలు ఉంటాయి. అప్పటి మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకుని ఆ సినిమా చేయకపోవడమే మంచిదనిపించింది. అందుకే నేను వెనకడుగు వేశా. కానీ, నా స్నేహితుడు శంకర్ మాత్రం వదల్లేదు. సరైన సమయంలో రజనీకాంత్‌తో 'రోబో' సినిమా తీసి, బ్లాక్ బస్టర్ అందుకున్నాడు. అలాగే '2.0' మూవీలో విలన్ పాత్ర కోసం నన్ను సంప్రదించారు శంకర్. అయితే కొన్నాళ్ల పాటు నేను హీరోగా ఉండాలనుకుంటున్నానంటూ నవ్వుతూ శంకర్‌కు చెప్పాను'' అన్నారు కమల్ హాసన్. అయితే రజనీకాంత్ హీరోగా నటించిన '2.0' మూవీలో విలన్‌గా అక్షయ్ కుమార్ నటించారు.



● కమల్ హాసన్

కథ విన్నారా?

హీరో వెంకటేష్ నుంచి మరో కొత్త సినిమా కబురు వినే సమయం ఆసన్నమైందనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. ప్రస్తుతం 'రానా నాయుడు' అనే వెబ్‌సిరీస్ నెక్ట్స్ సీజన్స్ చిత్రీకరణతో బిజీగా ఉన్నారు వెంకటేష్. ఈ సిరీస్ షూటింగ్‌ను పూర్తి చేసుకున్న తర్వాత అనిల్ రావిపూడి దర్శకత్వం వహించనున్న సినిమా సెట్స్‌లో ఆయన జాయిన్ అవుతారని తెలుస్తోంది. కాగా 'సామజవరగమన' వంటి హిట్ మూవీకి రైటింగ్ టీమ్‌లో పనిచేసిన నందు అనే వ్యక్తి ఓ కథను వెంకటేష్‌కి వినిపించడంతో, ఆయన సానుకూలంగా స్పందించారట. దీంతో ఈ కథకు తుది మెరుగులు దిద్ది మళ్లీ వెంకటేష్‌కి వినిపించనున్నారట నందు. అన్నీ కుదిరితే ఈ సినిమాపై అధికారిక ప్రకటన త్వరలోనే వచ్చే అవకాశం ఉందని ఫిల్మ్‌నగర్ భోగట్టా.



● వెంకటేశ్

హీరోయిన్ రకుల్‌ప్రీత్ సింగ్‌ది చిత్ర పరిశ్రమలో దాదాపు పదిహేనేళ్ల ప్రయాణం. 2009లో 'జిల్లీ' అనే కన్నడ సినిమాతో కథానాయికగా పరిచయమయ్యారు ఈ బ్యూటీ. ఆ తర్వాత తెలుగు, తమిళ్, హిందీ సినిమాలు చేసి స్టార్ హీరోయిన్లలో ఒకరిగా పేరు తెచ్చుకున్నారు. తాజాగా రకుల్‌ప్రీత్ నటించిన చిత్రం 'భారతీయుడు 2'. కమల్ హాసన్ హీరోగా శంకర్ దర్శకత్వం వహించిన 'భారతీయుడు 2' మూవీలో కీలక పాత్ర పోషించారామె. ఈ నెల 12న ఈ మూవీ పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ అవుతోంది. కాగా తాజాగా ఓ ఇంటర్వ్యూలో **రకుల్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ–**

ఆయన నుంచి చాలా నేర్చుకున్నా – రకుల్ ప్రీత్ సింగ్

''భారతీయుడు 2' సినిమాలో నటించడం గౌరవంగా భావిస్తున్నా. ఈ చిత్రం కోసం విలక్షణ నటులు కమల్ హాసన్ సర్‌తో, గొప్ప దర్శకుడైన శంకర్ సర్‌తో కలిసి పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నా. షూటింగ్ సమయంలో శంకర్ సర్ నుంచి చాలా విషయాలు నేర్చుకున్నా. ఆయన ఎంతో ప్రతిభ ఉన్న దర్శకుడు. తెరపై కథలని, పాత్రలను ఆయన చూపించే విధానం అద్భుతం. శంకర్‌సర్ ఆలోచనా విధానం, సృజనాత్మకత గురించి ఎంత చెప్పినా తక్కువే'' అన్నారు. ఇదిలా ఉంటే.. రకుల్ ప్రస్తుతం హిందీలో 'మేరీ పత్నీకా రీమేక్, దే దే ప్యార్ దే 2' వంటి సినిమాల్లో నటిస్తున్నారు. కాగా నటుడు, నిర్మాత జాకీ భగ్నానీతో రకుల్ వివాహం ఈ ఫిబ్రవరి 21న జరిగిన విషయం తెలిసిందే. అటు వ్యక్తిగత జీవితం, ఇటు సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నారు రకుల్‌ప్రీత్.



జెట్ స్పీడ్‌తో...

తమిళంలో మరో కొత్త సినిమాకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు హీరోయిన్ అనుపమా పరమేశ్వరన్. ఇప్పటికే ఈ యంగ్ బ్యూటీ ప్రస్తుతం 'బైసన్', 'లాక్‌డౌన్' అనే రెండు తమిళ చిత్రాలతో బిజీగా ఉన్నారు. తాజాగా 'లవ్‌టుడే' ఫేమ్ ప్రదీప్ రంగనాథన్ హీరోగా అశ్వత్ మరిముత్తు దర్శకత్వంలో రూపొందుతున్న తమిళ సినిమా 'డ్రాగన్'లో ఓ హీరోయిన్‌గా అనుపమ నటిస్తున్నట్లు తెలుస్తోంది. ఓ కాలేజీలో ప్రదీప్–అనుపమల మధ్య చిత్రీకరిస్తున్న రొమాంటిక్ సన్నివేశాల విజువల్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఏజీఎస్ ఎంటర్‌టైన్మెంట్స్ సంస్థ ఈ సినిమా నిర్మిస్తోంది. ఇదిలా ఉంటే.. అనుపమ నటించిన 'జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ, ది పెట్ డిటెక్టివ్, పరదా' చిత్రాలు విడుదలకు సిద్ధం అవుతున్నాయి. ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో 'ఆక్టోపస్' (ప్రచారంలో ఉన్న టైటిల్), బెల్లకొండ సాయిశ్రీనివాస్ 'కిష్కిందపురి' (ప్రచారంలో ఉన్న టైటిల్) చిత్రాల్లో ఆమె నటిస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. ఇలా అరడజనుకుపైగా సినిమాలతో అనుపమా జెట్ స్పీడ్‌తో దూసుకెళుతున్నారు.



● అనుపమ

సాహసాల సారా

ఆది సాయికుమార్ హీరోగా నటిస్తున్న డివోషనల్ థ్రిల్లర్ మూవీ 'షణ్ముఖ'. ఈ చిత్రంలో అవికా గోర్ కథానాయికగా నటిస్తున్నారు. షణ్ముగం సాప్పని దర్శకత్వం వహిస్తున్నారు. సాప్పని బ్రదర్స్ సమర్పణలో తులసీరామ్ సాప్పని, షణ్ముగం సాప్పని, రమేష్ యాదవ్ నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ పూర్తయింది. ఆదివారం(జూన్ 30) అవికా గోర్ బర్త్ డే. ఈ సందర్భంగా 'షణ్ముఖ' చిత్రంలో ఆమె సారా పాత్రలో నటిస్తున్నట్లు వెల్లడించి, ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. ''సినిమాలో కథ రీత్యా లక్ష్య సాధనలో ఉన్న హీరో ఆదికి సపోర్ట్ చేసే పాత్రలో అవిక నటించారు. సాహసోపేతమైన పనులు చేసే శక్తివంతమైన సారాగా ఆమెను చూస్తారు ప్రేక్షకులు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. గ్రాఫిక్స్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాం. ఆడియన్స్‌కు ఈ చిత్రం విజువల్ వండర్‌లా ఉంటుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది.



● అవికా గోర్

ఎవడి కోసం తగ్గాలి!

'ఏయ్.. ఎవడి కోసం తగ్గాలి... ఎందుకు తగ్గాలి' అంటున్నారు హీరో 'అల్లరి' నరేష్. ఆదివారం (జూన్ 30) ఆయన పుట్టినరోజు. ఈ సందర్భంగా నరేష్ నటిస్తున్న 'బచ్చల మల్లి' మూవీ నుంచి గ్లింప్స్ విడుదల చేశారు మేకర్స్. అలాగే నరేష్ నటించనున్న 63వ సినిమా ప్రకటన కూడా వచ్చింది. సుబ్బు మంగదేవి దర్శకత్వంలో 'అల్లరి' నరేష్, అమృతా అయ్యర్ జంటగా నటిస్తున్న చిత్రం 'బచ్చల మల్లి'. హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా, బాలాజీ గుత్తా నిర్మిస్తున్నారు. కాగా ఆదివారం నరేష్ పుట్టినరోజు సందర్భంగా గ్లింప్స్ విడుదల చేసింది యూనిట్. 'ఏయ్.. ఎవడి కోసం తగ్గాలి... ఎందుకు తగ్గాలి' అంటూ నరేష్ చెప్పిన డైలాగ్ గ్లింప్స్‌లో ఉంది. ఈ సినిమా సెప్టెంబర్‌లో విడుదలకానుంది.

తప్పించుకోలేరు...

'అల్లరి' నరేష్ హీరోగా సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ 'ఏ ఎన్ 63'(వర్కింగ్ టైటిల్) అనే నూతన చిత్రాన్ని ప్రకటించింది. 'ఫ్యామిలీ డ్రామా' ఫేమ్ మెహర్ తేజ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌పై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. 'మీరు అతని కంటి నుండి తప్పించుకోలేరు' అంటూ విలక్షణమైన కాన్సెప్ట్ పోస్టర్‌తో 'ఏ ఎన్ 63' మూవీ ప్రకటన చేశారు మేకర్స్.



● 'అల్లరి' నరేష్

సాక్షి
సోమవారం
1-7-2024

స్పోర్ట్స్



'జీవితకాలపు జ్ఞాపకమిది'

'నా ఆనందాన్ని వ్యక్తపరిచేందుకు మాటలు రావడం లేదు. కఠిన పరిస్థితుల్లో పోరాడిన ఈ జట్టు పట్ల గర్వంగా ఉన్నా. 6 ఓవర్లలోపు 3 వికెట్లు కోల్పోయిన స్థితి వారికి పరీక్ష పెట్టింది. కానీ ఆటగాళ్లు తమపై తాము నమ్మకం ఉంచారు. నేను పూర్తి స్థాయిలో ప్రయత్నించినా సరే ఆటగాడిగా ట్రోఫీ గెలిచే అదృష్టం దక్కలేదు. ఇదంతా క్రీడల్లో భాగం. అయితే వెస్టిండీస్‌లోనే 2007 వన్డే వరల్డ్ కప్ పరాజయానికి ఇలా ఊరట దక్కిందనేది సరైంది కాదు. అసలు అలాంటి మాటలను నేను విశ్వసించను. నాకు తెలిసి ఎంతో మంది గొప్ప ఆటగాళ్లు ట్రోఫీ నెగ్గలేకపోయారు. కోచ్‌గా నాకు దక్కిన అవకాశంతో కుర్రాళ్లకు మార్గనిర్దేశనం చేశా. కోచ్‌గా నా ఉద్యోగ బాధ్యతను నిర్వర్తించానంతే. ఈ ప్రయాణం చాలా గొప్పగా సాగింది. రెండేళ్ల శ్రమ తర్వాత దక్కిన ఈ గెలుపు జీవితకాల జ్ఞాపకం. మాకు ఈ విజయంలో కొంత అదృష్టం కూడా కలిసొచ్చింది. జట్టు సాధించిన ఘనత పట్ల ఆనందంగా ఉన్నా. వచ్చే వారంనుంచి నేను నిరుద్యోగిగా మారిపోతున్నా. ఏమైనా ఆఫర్‌లు ఉంటే చెప్పండి.'


-రాహుల్ ద్రవిడ్, భారత హెడ్ కోచ్

జడేజా కూడా...

అంతర్జాతీయ టి20లకు గుడ్‌బై



బ్రిడ్జ్‌టౌన్: వరల్డ్ కప్ విజయం తర్వాత రోహిత్ శర్మ, విరాట్ కోహ్లిల బాటలోనే భారత జట్టులో మరో సీనియర్ సభ్యుడు రవీంద్ర జడేజా కూడా రిటైర్మెంట్ ప్రకటించాడు. అంతర్జాతీయ టి20లనుంచి తప్పుకుంటున్నట్లు అతను వెల్లడించాడు. 'టి20 ప్రపంచ కప్ గెలవాలనే కల నెరవేరింది. నా అంతర్జాతీయ టి20 కెరీర్‌లో ఇది అత్యుత్తమ క్షణం. ఎన్నో మధుర జ్ఞాపకాలు నా వెంట ఉన్నాయి. జట్టు కోసం నా అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చేందుకు ప్రయత్నించా. ఇకపై ఇతర ఫార్మాట్‌లలో దానిని కొనసాగిస్తా' అని జడేజా పేర్కొన్నాడు. ఈ మెగా టోర్నీలో భారత్ తరఫున అన్ని మ్యాచ్‌లూ (8) ఆడిన జడేజా పెద్దగా ప్రభావం చూపలేకపోయాడు. 5 ఇన్నింగ్స్‌లలో కలిపి 22 బంతులే ఎదుర్కొన్న అతను 35 పరుగులు చేశాడు. 14 ఓవర్లు మాత్రమే బౌలింగ్ చేసి 7.57 ఎకానమీతో ఒకే ఒక వికెట్ పడగొట్టాడు. 2009లో భారత్ తరఫున తొలి అంతర్జాతీయ టి20 మ్యాచ్ ఆడిన జడేజా 74 మ్యాచ్‌లలో 127.16 స్ట్రయిక్‌రేట్‌తో 515 పరుగులు చేశాడు. 7.13 ఎకానమీతో 54 వికెట్లు పడగొట్టాడు.



'హార్దికానందం'

వన్డే వరల్డ్ కప్ మ్యాచ్‌లో గాయంతో ఆటకు దూరం... తిరిగొచ్చాక ఐపీఎల్‌లో ఎక్కడికి వెళ్లినా హేళనలు... వ్యక్తిగత జీవితంలో ఆటుపోట్లు... గత ఆరు నెలల కాలంలో హార్దిక్ పాండ్యా అన్ని విధాలుగా తీవ్ర వేదన అనుభవించాడు. కానీ మళ్లీ పైకి లేచేందుకు జీవితం మరో అవకాశాన్ని ఇస్తుంది. హార్దిక్‌కు టి20 వరల్డ్ కప్ రూపంలో అలాంటి చాన్స్ దక్కింది. ఐపీఎల్ సమయంలో అతడిని వెంటాడి, మాటలతో వేధించిన వారి ఇప్పుడు ప్రశంసలు కురిపిస్తున్నారు. 'లీగ్‌లో మీరు మరో జట్టుకు మద్దతు ఇవ్వడంలో తప్పు లేదు. కానీ చూడండి ఇదే హార్దిక్ రేపు టీమిండియాను గెలిపిస్తాడు' అని అండగా నిలిచిన వారంతా గర్వపడేలా అతను ఆడి చూపించాడు. అటు బ్యాటింగ్‌లో, ఇటు బౌలింగ్‌లో తన విలువను ప్రదర్శించాడు. ఫైనల్లోనైతే దక్షిణాఫ్రికాను గెలుపు దిశగా తీసుకెళుతున్న క్లాసెన్, మిల్లర్‌లను అవుట్ చేసి తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టాడు. అందుకే విజయానంతరం అతను కన్నీళ్లు ఆపుకోలేకపోయాడు. ముఖ్యంగా రోహిత్ తనను ఎత్తుకొని గుండెలకు హత్తుకున్నప్పుడు వాటిని నియంత్రించుకోవడం అతనికి సాధ్యం కాలేదు. చివరకు తనలో గూడుకట్టుకున్న బాధను అతను బయటకు చూపించాడు. 'ఆ ఆరు నెలలు... నేను కోల్పోయిన ఆ ఆరు నెలలు నాకు కావాలి. అసలు ఏం జరిగిందో కూడా నేను గుర్తించలేకపోయా. నన్ను నేను ఎంతో నియంత్రించుకున్నా. ఒక దశలో ఏడవాలని అనుకున్నా ఏడవలేకపోయాను. నా బాధను చూసిన సంతోషించిన వారికి మరింత ఆనందం ఇవ్వరాదని అనుకున్నా. ఇప్పుడు అదృష్టం చూడండి. నేను ఊహించని విధంగా చివరి ఓవర్లో అలాంటి అవకాశం వచ్చింది. నా గురించి ఒక్క శాతం కూడా తెలియనివారు ఏవేవో మాట్లాడారు. కష్టకాలం ఎప్పుడూ ఉండదు. గెలిచినా, ఓడినా ఒకేలా ఉండటం ముఖ్యం. నా ఆటనే నమ్ముకున్నా. ఇలాంటి ప్రదర్శన, గెలుపు రాసిపెట్టి ఉన్నాయి' అని పాండ్యా వ్యాఖ్యానించాడు. రోహిత్ రిటైర్మెంట్ నేపథ్యంలో మున్ముందు భారత టి20 జట్టుకు పాండ్యానే నాయకత్వం వహించే అవకాశాలు ఉన్నాయి.

క్వార్టర్ ఫైనల్లో జర్మనీ



డార్ట్‌మండ్: యూరో కప్ ఫుట్‌బాల్ టోర్నీలో ఆతిథ్య జర్మనీ జట్టు క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. ఆదివారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో జర్మనీ 2-0 గోల్స్ తేడాతో డెన్మార్క్ జట్టును ఓడించింది. ఆట 53వ నిమిషంలో హావెర్ట్జ్ గోల్‌తో ఖాతా తెరిచిన జర్మనీ... 68వ నిమిషంలో ముసియాలా గోల్‌తో తమ ఆధిక్యాన్ని 2-0కు పెంచుకుంది. ఆ తర్వాత ఈ ఆధిక్యాన్ని కాపాడుకొని ఈ టోర్నీలో పదోసారి క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. మరోవైపు డిఫెండింగ్ చాంపియన్ ఇటలీ జట్టు కథ ప్రిక్వార్టర్ ఫైనల్లోనే ముగిసింది. స్విట్జర్లాండ్ 2-0తో ఇటలీ జట్టును బోల్తా కొట్టించి క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది.

'అద్భుత క్షణాలివి'



పదిహేడేళ్ల క్రితం... 20 ఏళ్ల కుర్రాడిగా రోహిత్ శర్మ తొలి టి20 వరల్డ్ కప్ విన్నింగ్ టీమ్‌లో సభ్యుడిగా సంబరాలు చేసుకున్నాడు. అనంతరం ఇంతింతై... భారత జట్టులో కీలక సభ్యుడిగా ఎదిగాడు. ఆ తర్వాత టీమిండియా ఆడిన ఏడు నాకౌట్ వరల్డ్ కప్ మ్యాచ్‌లలో సభ్యుడిగా ఉన్నాడు. కానీ ప్రతీసారి ఓటమి బాధే. అందులో చివరిదైతే మరింత గుండెకోతను మిగిల్చింది. ఇప్పుడు మరోసారి అలాంటి అవకాశం రావడంతో సహజంగానే ఆ 'ఒక్క విజయం' కోసం ఎంతో కోరుకున్నాడు. చివరకు దానిని సాధించగలిగాడు... 37 ఏళ్ల వయసులో రోహిత్ చిన్న పిల్లాడిగా మైదానంలో నేలపై పంచ్‌లతో తన భావోద్వేగాన్ని ప్రదర్శించాడు. తనకు ఈ విజయం అందించిన ఆనందం ఎలాంటిదో చూపించాడు. సగర్వంగా ట్రోఫీని అందుకొని మైమరచిపోయిన అతను తన తీపి విజయాన్ని అందరితో పంచుకున్నాడు. ఈ గెలుపుతో అంతర్జాతీయ టి20లనుంచి తప్పుకుంటున్నట్లుగా కూడా రోహిత్ ప్రకటించాడు.

టి20 వరల్డ్ కప్ విజయంపై రోహిత్ శర్మ భావోద్వేగం

- గెలవాలని ఎంతో కసిగా కోరుకున్నామని వ్యాఖ్య
- కెరీర్‌లోనే అది పెద్ద ఘనతగా అభివర్ణించిన కెప్టెన్
- అంతర్జాతీయ టి20లకు వీడ్కోలు

బ్రిడ్జ్‌టౌన్ (బార్బడోస్): సారథిగా టి20 వరల్డ్ కప్‌ను గెలుచుకోవడం తన కెరీర్‌లో అతి పెద్ద ఘనతగా భారత కెప్టెన్ రోహిత్ శర్మ వ్యాఖ్యానించాడు. ఈ విజయాన్ని ఎంతగానో కోరుకున్నామని, అందుకే ఇది మరింత ఆనందాన్ని పంచుతోందని అతను అన్నాడు. వ్యక్తిగతంగా తాను సాధించిన పరుగులు, రికార్డులకు విలువ లేదని, జట్టు ట్రోఫీలు గెలవడమే అన్నింటికంటే ముఖ్యమని అతను అన్నాడు. 'టైటిల్ గెలవాలని నేను ఎంతో కోరుకున్నాను. అందుకే కావచ్చు ఈ ఫలితం చాలా గొప్పగా అనిపిస్తోంది. ఇవి అద్భుత క్షణాలని చెప్పగలను. ఇన్నేళ్లలో నేను చేసి పరుగులు పెద్ద విషయం కాదు. నేను గణాంకాలను కూడా పట్టించుకునే వ్యక్తిని కాను. ప్రతీసారి జట్టుకు ట్రోఫీని గెలిపించేందుకే చూశాను. ఇప్పుడు అది నా పక్కనే ఉంది. నా దృష్టిలో ఇది కచ్చితంగా అన్నింటికంటే గొప్ప ఘనత' అని రోహిత్ చెప్పాడు.

మాటల్లో చెప్పలేను...

మైదానంలో కింద పడిపోయి తాను చేసుకున్న సంబరాల గురించి చెప్పమంటే రోహిత్ ఉద్వేగంగా స్పందించాడు. 'దీనిని నేను ఎంతో కోరుకున్నాను. ఆ ఆనందాన్ని వర్ణించేందుకు తగిన మాటలు నా వద్ద లేవు. సరిగ్గా ఆ సమయంలో నా మనసులో ఏమనిపించిందో చెప్పలేను కానీ చాలా భావోద్వేగ సమయమది. ఆ క్షణాలను నేనే ఫొటోలో స్వయంగా బంధించగలిగితే బాగుండేదేమో. అది సాధ్యం కాదని తెలుసు కానీ దానిని ఎప్పటికీ మరచిపోలేను. ఇలాంటివాటి కోసమే ఎంతగానో ఎదురు చూస్తాం. దీనికి సన్నద్ధత అంటూ ఉండదు. అలా జరిగిపోతాయంతే. జీవితంలో కొన్ని కావాలని ఎంతో తపిస్తాం. ఇదీ అలాంటిదే. ఎట్టకేలకు గెలుపు గీత దాటడం చాలా ఆనందంగా ఉంది' అని 'హిట్ మ్యాన్' తన సంతోషాన్ని వ్యక్తం చేశాడు.

రిటైర్ కావాలనుకోలేదు కానీ...

అంతర్జాతీయ టి20లకు గుడ్‌బై చెబుతున్నట్లు ఫైనల్ తర్వాత రోహిత్ ప్రకటించాడు. నిజానికి తాను ఇది ముందుగా అనుకోలేదని అతను వెల్లడించాడు. 'నా భవిష్యత్తు గురించి ఇలాంటి నిర్ణయాలు ముందుగా తీసుకోను. ఆ సమయంలో మనసులో ఏది అనుకుంటే అది చేస్తా. వన్డే వరల్డ్ కప్ తర్వాత కూడా ఈ వరల్డ్ కప్ ఆడతానా లేదా అని ఆలోచించలేదు. అంతర్జాతీయ టి20ల నుంచి అప్పుడే రిటైర్ కావాలనుకోలేదు. అయితే ఇప్పుడు పరిస్థితి అలాంటిది వచ్చింది. ఇది సరైన సమయంగా అనిపించింది. వరల్డ్ కప్ గెలిచి తప్పుకోవడంకంటే సరైన సమయం ఏముంటుంది' అని రోహిత్ అన్నాడు.

అంతా రాసి పెట్టి ఉంది...

ఇంతటి విజయం దక్కాలంటే అన్ని కలిసి రావాలని రోహిత్ వ్యాఖ్యానించాడు. 17 ఏళ్ల కెరీర్‌లో ఎంతో నేర్చుకున్నానని అతను చెప్పుకొచ్చాడు. 'ఏది రాసిపెట్టి ఉంటే అది జరుగుతుంది. ఇది మాకు రాసిపెట్టి ఉందని మాత్రం తెలుసు. అయితే అది ఎప్పుడు జరుగుతుందో తెలీదు. అందుకే ప్రయత్నం చేస్తాం. లేదంటే మాకు రాసి పెట్టి ఉంది కాబట్టి జరుగుతుంది అని కూర్చుండిపోయే వాళ్లం. ఫైనల్లో అన్నీ సరిగ్గా సరిపోయాయి. ఒకదశలో వారు సునాయాసంగా గెలుస్తున్నారని అనిపించింది. 2007లో టి20 వరల్డ్ కప్ విజయంతోనే నా ప్రయాణం మొదలై ఇప్పుడు టి20 వరల్డ్ కప్‌తోనే ముగియడం చాలా బాగుంది' అని అతను గుర్తు చేసుకున్నాడు.

రోహిత్ అంతర్జాతీయ టి20 కెరీర్ గ్రాఫ్

ఆడిన మ్యాచ్‌లు: 159	స్ట్రయిక్‌రేట్: 140.89
చేసిన పరుగులు: 4231	మొత్తం ఫోర్లు: 383
అత్యధిక స్కోరు: 121	మొత్తం సిక్స్‌లు: 205
సెంచరీలు: 5	క్యాచ్‌లు: 65
అర్ధ సెంచరీలు: 32	తీసిన వికెట్లు: 1

62 రోహిత్ 2017 నుంచి 2024 మధ్య 62 మ్యాచ్‌ల్లో భారత జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. రోహిత్ నాయకత్వంలో టీమిండియా 49 మ్యాచ్‌ల్లో గెలిచి, 12 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. వర్షం కారణంగా ఒక మ్యాచ్ రద్దయింది.

హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్‌పై...

వరల్డ్ కప్ విజయంలో కోచ్‌గా రాహుల్ ద్రవిడ్ ఎంతో కీలక పాత్ర పోషించాడని రోహిత్ ప్రశంసించాడు. అతను జట్టు కోసం గత మూడేళ్లుగా ఎంతో కష్టపడ్డాడని కెప్టెన్ అభిప్రాయపడ్డాడు. 'మా అందరి కంటే కూడా ఈ ట్రోఫీని అందుకోగల అర్హత ద్రవిడ్‌కే ఉంది. ఆటగాడి రోజుల నుంచి జట్టు కోసం ఎంతో చేసిన ద్రవిడ్ కోసం టైటిల్ గెలవడం మా అందరికీ సంతోషంగా ఉంది. కొన్నిసార్లు ఆయన ఆలోచనను ఆటగాళ్లు అర్థం చేసుకోలేని పరిస్థితి వచ్చినప్పుడు ఎలాంటి భేషజాలు లేకుండా తనే వెనక్కి తగ్గి ప్లేయర్ల మాటకే విలువిచ్చాడు. ఆటగాళ్లకు వారి పాత్రపై చాలా స్పష్టతనిచ్చాడు. టీమ్‌లోని లేని ప్లేయర్లతో కూడా ఆయన మాట్లాడుతూ ఉండేవాడు. మళ్లీ జట్టులోకి వస్తే ఏం చేయాలో సూచించేవాడు' అని కోచ్‌పై రోహిత్ గౌరవం ప్రదర్శించాడు. అయితే కొన్నిసార్లు అభిప్రాయ భేదాలు సహజమన్న రోహిత్... ఫైనల్లో టాస్ గెలిస్తే బ్యాటింగ్ తీసుకోవాలని తానే పట్టుబట్టి తన మాటను చెల్లించుకున్నానని మాత్రం వెల్లడించాడు.



అందరి దృష్టి జొకోవిచ్‌పైనే

- 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌పై గురి
- నేటి నుంచి వింబుల్డన్ టోర్నీ

లండన్: టెన్నిస్ చరిత్రలోనే అత్యధిక గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్ నెగ్గిన ప్లేయర్‌గా రికార్డు సృష్టించేందుకు సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్ మరోసారి ప్రయత్నించనున్నాడు. ఇప్పటికే కెరీర్‌లో 24 గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ నెగ్గిన జొకోవిచ్ ఆస్ట్రేలియా క్రీడాకారిణి మార్గరెట్ కోర్ట్ (24 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్) పేరిట ఉన్న రికార్డును సమం చేశాడు. నేడు మొదలయ్యే సీజన్ మూడో గ్రాండ్‌స్లామ్ టోర్నీ వింబుల్డన్‌లో జొకోవిచ్ ఫేవరెట్‌గా బరిలోకి దిగనున్నాడు. ఇటీవల మోకాలి గాయం నుంచి కోలుకున్న జొకోవిచ్‌కు ప్రస్తుత ప్రపంచ నంబర్‌వన్ యానిక్ సినెర్ (ఇటలీ), డిఫెండింగ్ చాంపియన్ అల్‌కరాజ్ (స్పెయిన్) నుంచి గట్టిపోటీ ఎదురుకానుంది. ఏడుసార్లు వింబుల్డన్ టైటిల్ నెగ్గిన జొకోవిచ్, రెండుసార్లు రన్నరప్‌గా నిలిచాడు. ఈసారి తొలి రౌండ్‌లో క్వాలిఫయర్, ప్రపంచ 123వ ర్యాంకర్ విట్ కొప్రివా (చెక్ రిపబ్లిక్)తో జొకోవిచ్ తలపడతాడు. మరోవైపు భారత నంబర్‌వన్, ప్రపంచ 72వ ర్యాంకర్ సుమిత్ నగాల్ సోమవారం జరిగే తొలి రౌండ్‌లో కెచ్‌మనోవిచ్ (సెర్బియా)తో ఆడతాడు.



ఆస్ట్రియా గ్రాండ్‌ప్రి విజేత రసెల్

స్పీల్‌బర్గ్: ఫార్ములావన్ తాజా సీజన్‌లో జోరు మీదున్న రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్‌కు చుక్కెదురైంది. ఆదివారం జరిగిన ఆస్ట్రియా గ్రాండ్‌ప్రిలో 'పోల్ పొజిషన్'తో రేసును ఆరంభించిన వెర్‌స్టాపెన్ ఐదో స్థానంతో సరిపెట్టుకున్నాడు. నిర్ణీత 71 ల్యాప్‌ల రేసును మెర్సిడెస్ జట్టు డ్రైవర్ జార్జి రసెల్ అందరికంటే ముందుగా ఒక గంటా 24 నిమిషాల 22.798 సెకన్లలో ముగించి విజేతగా నిలిచాడు. ఈ సీజన్‌లో మెర్సిడెస్ జట్టుకిది తొలి విజయంకాగా, రసెల్ కెరీర్‌లో ఇది రెండో టైటిల్. ఆస్కార్ పియాస్ట్రి (మెక్‌లారెన్) రెండో స్థానంలో, కార్లోస్ సెయింజ్ (ఫెరారీ) మూడో స్థానంలో, హామిల్టన్ (మెర్సిడెస్) నాలుగో స్థానంలో నిలిచారు. 24 రేసుల ఈ సీజన్‌లో 11 రేసులు ముగిశాక వెర్‌స్టాపెన్ 237 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. సీజన్‌లోని తదుపరి రేసు బ్రిటిష్ గ్రాండ్‌ప్రి ఈనెల 7న జరుగుతుంది.

రూ. 125 కోట్ల నజరానా

భారత జట్టుకు నగదు పురస్కారం ప్రకటించిన బీసీసీఐ

ముంబై: టి20 వరల్డ్ కప్‌లో విజేతగా నిలిచిన భారత జట్టుపై బీసీసీఐ కనకవర్షం కురిపించింది. అసాధారణ రీతిలో ఏకంగా రూ. 125 కోట్ల నగదు పురస్కారాన్ని ప్రకటించింది. ఈ విషయాన్ని బోర్డు కార్యదర్శి జై షా వెల్లడించారు. తమ స్ఫూర్తిదాయక ప్రదర్శనతో ఆటగాళ్లు 140 కోట్ల భారతీయుల ఆకాంక్షను నెరవేర్చారని జై షా ప్రశంసించారు. 'రోహిత్ శర్మ అద్భుత నాయకత్వంలో అజేయంగా వరల్డ్ కప్ గెలిచి భారత్ చరిత్ర సృష్టించింది. విమర్శకులకు క్రికెటర్లు తగిన రీతిలో తమ ఆటతోనే సమాధానామిచ్చారు. ఈ ప్రయాణం అందరికీ స్ఫూర్తిదాయకం. ప్రతిభ, పట్టుదల, పోరాటస్ఫూర్తితో ఈ జట్టు మనందరం గర్వపడేలా చేసింది. జట్టు సభ్యులు, ఇతర సహాయక సిబ్బందికి నా అభినందునలు. ఈ గెలుపు సందర్భంగా భారత జట్టుకు రూ. 125 కోట్ల ప్రైజ్‌మనీని బహుమతిగా ప్రకటిస్తున్నాం' అని జై షా పేర్కొన్నారు.

ప్రధాని మోదీ సంభాషణ...

మరోవైపు ఫైనల్ అనంతరం భారత కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, కోచ్ రాహుల్ ద్రవిడ్‌లతో ప్రధాని నరేంద్ర మోదీ ఫోన్‌లో ప్రత్యేకంగా సంభాషించారు. గొప్ప విజయాన్ని సాధించినందుకు వారందరికీ ఆయన అభినందనలు తెలిపారు. రోహిత్ దూకుడైన ఆటతీరు భారత్ క్రికెట్‌కు కొత్త దిశను చూపించిందని ప్రశంసించిన మోదీ... ఫైనల్ తరహాలోనే ఇన్నేళ్లుగా భారత బ్యాటింగ్‌ను నడిపించిన విరాట్ కోహ్లి ఇకపై కూడా కొత్త తరం క్రికెటర్లకు స్ఫూర్తిగా నిలుస్తాడని అన్నారు. కోచ్‌గా ద్రవిడ్ అంకితభావం, వ్యూహాలు, కుర్రాళ్లను ప్రోత్సహించిన తీరు జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాయని కూడా వ్యాఖ్యానించారు.

విరామం లేని సంబరాలు







వరల్డ్ కప్ విజయం తర్వాత భారత ఆటగాళ్ల ఆనందానికి పట్టపగ్గాలు లేకుండా పోయాయి. కెన్సింగ్టన్ ఓవల్ మైదానంలో ఫైనల్ మ్యాచ్ ఆఖరి బంతి పడిన తర్వాత మొదలైన సంబరాలు దాదాపు నాలుగు గంటల పాటు సాగాయి. పాటలు, నృత్యాలతో ఆటగాళ్లంతా తమ ఆనందాన్ని ప్రదర్శించారు. ఒకదశలో జట్టు సహచరులే కాదు అక్కడ పెద్ద సంఖ్యలో ఉన్న అభిమానులతోనూ ఆడిపాడి క్రికెటర్లు తమ సంతోషాన్ని పంచుకున్నారు. ఒక ఫ్యాన్‌కు పంత్ తన షూస్‌ను బహుమతిగా ఇచ్చాడు. గ్రౌండ్ నుంచి డ్రెస్సింగ్ రూమ్‌లో, ఆ తర్వాత హోటల్‌లో కూడా ఈ వేడుకలు కొనసాగాయి. టీమిండియా సంప్రదాయంగా మార్చుకున్న 'బెస్ట్ ఫీల్డర్' అవార్డు కార్యక్రమంలో డ్రెస్సింగ్ రూమ్‌లో ఆహ్లాదంగా సాగింది. బౌండరీ వద్ద అసాధారణ క్యాచ్ అందుకున్న సూర్యకుమార్ మరో మాటకు తావు లేకుండా బెస్ట్ ఫీల్డర్‌గా నిలవగా... సంబరాల మధ్య జై షా చేతుల మీదుగా అతను ఈ మెడల్‌ను స్వీకరించాడు. సాధారణంగా ఎలాంటి భావాలు కనిపించకుండా ప్రశాంతంగా ఉంటే రాహుల్ ద్రవిడ్ కూడా ఈ ఆనందపు క్షణాల్లో అంతే ఉత్సాహంతో పాల్గొనడం విశేషం. జట్టు సభ్యులంతా తమ హెడ్ కోచ్‌ను ఎత్తుకొని తమ సంతోషాన్ని మరింత జోరుగా ప్రదర్శించారు. వరల్డ్ కప్ ట్రోఫీని తమ బెడ్ వద్దే ఉంచుకొని పడుకున్న చిత్రాలను కూడా రోహిత్ శర్మ, సూర్యకుమార్ సోషల్ మీడియాలో పంచుకున్నారు. మరోవైపు బార్బడోస్‌ను పెను తుఫాన్ 'బెరిల్' ముంచెత్తింది. దాంతో బ్రిడ్జ్‌టౌన్ నుంచి బయటకు వెళ్లే అన్ని విమానాలు రద్దు అయ్యాయి. టీమిండియా ఆటగాళ్లు ముందుగా న్యూయార్క్‌కు వెళ్లి అక్కడి నుంచి భారత్‌కు రావాల్సి ఉంది. తుఫాన్ కారణంగా జట్టు బయలుదేరడం ఆలస్యం కావచ్చు.

స్నేహ్ రాణాకు 8 వికెట్లు

- పోరాడుతున్న దక్షిణాఫ్రికా
- సునె లుస్ సెంచరీ


స్నేహ్

చెన్నై: భారత మహిళల జట్టుతో జరుగుతున్న ఏకైక టెస్టులో ఇన్నింగ్స్ ఓటమి తప్పించుకోవడానికి దక్షిణాఫ్రికా జట్టు పోరాడుతోంది. ఫాలోఆన్ ఆడుతూ రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన దక్షిణాఫ్రికా మూడో రోజు ఆట ముగిసే సమయానికి 2 వికెట్లు కోల్పోయి 232 పరుగులు సాధించింది. ఇన్నింగ్స్ పరాజయం తప్పించుకోవాలంటే దక్షిణాఫ్రికా మరో 105 పరుగులు వెనుకబడి ఉంది. నేడు మ్యాచ్‌కు చివరి రోజు. టాప్ ఆర్డర్ బ్యాటర్లు సునె లుస్ (109; 18 ఫోర్లు) సెంచరీ చేయగా... కెప్టెన్ లౌరా వోల్‌వార్ట్ (93 బ్యాటింగ్; 12 ఫోర్లు) శతకానికి చేరువైంది. వీరిద్దరు రెండో వికెట్‌కు 190 పరుగులు జోడించారు. లౌరాకు జతగా మరిజన్ కాప్ (15 బ్యాటింగ్) క్రీజులో ఉంది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 236/4తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన దక్షిణాఫ్రికా జట్టు స్నేహ్ రాణా ఆఫ్ స్పిన్ వలలో చిక్కుకుంది. మరో 30 పరుగులు జోడించి మిగతా 6 వికెట్లు కోల్పోయి 266 పరుగులవద్ద ఆలౌటైంది.


సునె లుస్

30 ఏళ్ల స్నేహ్ రాణా 25.3 ఓవర్లలో 77 పరుగులిచ్చి 8 వికెట్లు పడగొట్టింది. తద్వారా మహిళల టెస్టు క్రికెట్ చరిత్రలో ఒకే ఇన్నింగ్స్‌లో 8 వికెట్లు తీసిన మూడో బౌలర్‌గా, భారత్ నుంచి రెండో బౌలర్‌గా స్నేహ్ గుర్తింపు పొందింది. 1995లో జంషెడ్‌పూర్‌లో ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టులో భారత స్పిన్నర్ నీతూ డేవిడ్ 53 పరుగులిచ్చి 8 వికెట్లు... గత ఏడాది నాటింగ్‌హామ్‌లో ఇంగ్లండ్ జట్టుతో జరిగిన టెస్టులో యాష్లే గార్డ్‌నర్ 66 పరుగులిచ్చి 8 వికెట్లు తీసుకున్నారు.


జ్యోతి, నందినిలకు స్వర్ణాలు

పంచ్‌కులా (హరియాణా): జాతీయ సీనియర్ ఇంటర్ స్టేట్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో చివరి రోజు తెలంగాణకు ఒక స్వర్ణం, ఆంధ్రప్రదేశ్‌కు ఒక స్వర్ణం, ఒక రజతం లభించాయి. మహిళల విభాగంలో ఏడు క్రీడాంశాల (100 మీటర్ల హర్డిల్స్, హైజంప్, షాట్‌పుట్, 200 మీటర్లు, లాంగ్‌జంప్, జావెలిన్ త్రో, 800 మీటర్లు) సమాహారమైన హెప్టాథ్లాన్‌లో తెలంగాణ క్రీడాకారిణి నందిని అగసార పసిడి పతకాన్ని దక్కించుకుంది. నందిని ఓవరాల్‌గా 5806 పాయింట్లు సాధించి అగ్రస్థానాన్ని సొంతం చేసుకుంది. మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో అంతర్జాతీయ అథ్లెట్, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జ్యోతి యర్రాజీ విజేతగా నిలిచింది. వైజాగ్‌కు చెందిన జ్యోతి 100 మీటర్ల హర్డిల్స్ ఫైనల్ రేసును 13.06 సెకన్లలో ముగించి విజేతగా నిలిచింది. పురుషుల 200 మీటర్ల విభాగంలో ఆంధ్రప్రదేశ్‌కే చెందిన నలుబోతు షణ్ముగ శ్రీనివాస్ రజత పతకాన్ని సాధించాడు. ఫైనల్లో షణ్ముగ 20.95 సెకన్లలో గమ్యానికి చేరి రెండో స్థానాన్ని పొందాడు.


జ్యోతి



నందిని

సింగిల్స్ ఫైనల్లో సహజ



లాస్ ఏంజెలిస్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) డబ్ల్యూ15 టోర్నీలో తెలంగాణ క్రీడాకారిణి సహజ యామలపల్లి ఫైనల్లోకి దూసుకెళ్లింది. రాచెల్ గైలిస్ (అమెరికా)తో జరిగిన సెమీఫైనల్లో సహజ 6-4, 6-0తో గెలుపొందింది. అంతకుముందు క్వార్టర్ ఫైనల్లో సహజ 6-1, 6-1తో కేట్ ఫాకి (అమెరికా)పై, రెండో రౌండ్‌లో 6-2, 6-4తో క్లారా కొసాన్ (అమెరికా)పై, తొలి రౌండ్‌లో 7-6 (7/1), 7-6 (7/4)తో ఎలైస్ వాగ్లే (అమెరికా)పై విజయం సాధించింది.

సెమీస్‌లో మాళవిక ఓటమి



టెక్సాస్: యూఎస్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత క్రీడాకారుల పోరాటం ముగిసింది. మహిళల సింగిల్స్‌లో బరిలో మిగిలిన భారత రైజింగ్ స్టార్ సెమీఫైనల్లో నిష్క్రమించింది. ఆదివారం జరిగిన సెమీఫైనల్లో మాళవిక 16-21, 13-21తో నాత్సుకి నిదైరా (జపాన్) చేతిలో ఓడిపోయింది. మహిళల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో గాయత్రి-ట్రెసా ద్వయం 17-21, 21-17, 19-21తో ఆరో సీడ్ రుయ్ హిరోకామి-యునా కాటో (జపాన్) జంట చేతిలో పరాజయం పాలైంది.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	210	79,033
నిఫ్టీ ▽	34	24,011

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	17,733	▽	126
డోజోన్స్	39,119	▽	45
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,164	▽	16
డాక్స్	18,235	△	16
హాంగ్‌సెంగ్	2,946	▽	27
నికాయ్	39,342	▽	326

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎసిఖ	83.09	84.11
£	బ్రిటన్ పౌండ్	ఎసిఖ	104.84	107.40
€	యూరో	ఎసిఖ	88.58	90.54
¥	జపాన్ ఎన్ (100)	ఎసిఖ	51.88	53.01
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎసిఖ	54.71	56.65
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.25	63.94
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.35	22.91
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.83	23.61
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.37	12.44

ఐటీ రిటర్న్‌.. చలో ఆన్‌లైన్!

రిటర్నుల దాఖలు ఎంతో ఈజీ

అందుబాటులో ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు

ఆదాయపన్ను శాఖ నుంచి వీటికి అనుమతి

కొంత చార్జీతో నిపుణుల సలహా సూచనలు

పెట్టుబడుల విషయంలోనూ మార్గనిర్దేశం

ఆదాయపన్ను రిటర్నులు (ఐటీఆర్) దాఖలు చేయాల్సిన తరుణం ఆసన్నమైంది. జూలై 31 తుది గడువు. చివరి రోజు వరకు ఆగకుండా ముందుగా రిటర్నులు దాఖలు చేయడం సూచనీయం. చాలా మందికి రిటర్నుల విషయంలో ఎన్నో సందేహాలు వస్తుంటాయి. వేరొకరి సాయం తీసుకుంటుంటారు. కానీ, ఎవరికివారే ఆదాయపన్ను శాఖ ఈ-ఫైలింగ్ పోర్టల్ ద్వారా రిటర్నులను ఎలక్ట్రానిక్ రూపంలో సమర్పించొచ్చు. ఈ-ఫైలింగ్ పోర్టల్‌ను యూజర్లకు అనుకూలంగా మార్చేందుకు ఆదాయపన్ను శాఖ ఎన్నో చర్యలు చేపట్టినప్పటికీ, ఐటీఆర్ దాఖలు ప్రక్రియ అర్థం కాని వారు చాలా మందే ఉంటారు. ఇలాంటి వారికి ఉన్న మెరుగైన ప్రత్యామ్నాయ మార్గం.. మధ్యవర్తిత్వ సంస్థల సాయం తీసుకోవడం. వీటి ద్వారా చాలా సులభంగా రిటర్నులు దాఖలు చేయవచ్చు. ఈ విషయంలో ఇవి మెరుగైన సేవలను అందిస్తున్నాయి. వీటి గురించి తెలియజేసే ప్రయత్నమే ఈ వారం ప్రాఫిట్ ప్లస్ కథనం.

ఈఆర్ఐలు



ఈ-రిటర్న్ ఇంటర్‌మీడియరీలు (ఈఆర్ఐలు) ఎలక్ట్రానిక్ రూపంలో పన్ను రిటర్నులు వేసేవారికి కావాల్సిన అన్ని రకాల సేవలు అందిస్తున్నాయి. ఇవి అనుసంధానకర్తగా వ్యవహరిస్తాయి. సాఫ్ట్‌వేర్ ఆధారితంగా నడిచే ప్లాట్‌ఫామ్‌లు. వీటి ద్వారా ఎవరైనా రిటర్నులు సమర్పించొచ్చు. పన్ను చెల్లింపుదారుల తరఫున పన్ను రిటర్నుల దాఖలుకు ఐటీ శాఖ నుంచి వీటికి అనుమతి ఉంది. క్లియర్‌ట్యాక్స్, క్వికో, ట్యాక్స్‌బడ్డీ, మైఐటీ రిటర్న్, ఈజెడ్‌ట్యాక్స్, ట్యాక్స్2విన్ ఇవన్నీ ఈఆర్ఐలే. రిటర్నుల ఆటోఫిల్, రివ్యూ, ఈ-ఫైల్.. ఇలా మూడంచెల్లోనే రిటర్నులను సమర్పించొచ్చు. పన్ను రిటర్నులు వేయడం ఇంత సులువా? అనేలా ఇవి సేవలు అందిస్తున్నాయి.

సౌకర్యం..



ఇవి ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు కావడంతో పన్ను చెల్లింపుదారులు తమ ఇంటి నుంచే ఖాళీ సమయంలో సులభంగా రిటర్నులు దాఖలు చేయవచ్చు. వీటి యూజర్ ఇంటర్‌ఫేస్ అర్థం చేసుకునేందుకు సులభంగా, సమకాలీనంగా ఉంటుంది. అందుకే ఇటీవలి కాలంలో ఈ ప్లాట్‌ఫామ్‌లను వినియోగించుకునే వారు పెరుగుతున్నారు. మొబైల్ యాప్‌ల నుంచి రిటర్నులు వేసే సౌకర్యాన్ని సైతం అందిస్తున్నాయి. క్వికో అయితే యూపీఐ ద్వారా పన్ను చెల్లించే సదుపాయాన్ని ఆఫర్ చేస్తోంది. పాన్, ఆధార్, బ్యాంక్ స్టేట్‌మెంట్, ఫామ్ 16 పత్రాల కాపీలను దగ్గర ఉంచుకుంటే, రిటర్నులు వేగంగా సమర్పించొచ్చు. ఈ డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయాల్సిన అవసరం లేదు. షేర్లు, మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులపై మూలధన లాభాలు ఉన్న వారూ ఈ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా రిటర్నులు సులభంగానే దాఖలు చేసుకోవచ్చు. ప్రముఖ స్టాక్ బ్రోకర్లతో వీటికి ఒప్పందం ఉంది. కనుక పన్ను చెల్లింపుదారుల సమ్మతితో వారికి సంబంధించి క్యాపిటల్ గెయిన్ ట్యాక్స్ వివరాలను బ్రోకర్ల సర్వర్ల నుంచి సెకన్ల వ్యవధిలో తీసుకుని రిటర్నుల పత్రంలో నమోదు చేస్తాయి. కనుక వీటిని విడిగా నమోదు చేయాల్సిన ఇబ్బంది ఉండదు. అందుకే తమ స్టాక్ బ్రోకర్‌తో టైఅప్ ఉన్న ఈఆర్ఐని ఎంపిక చేసుకోవాలి. లేదంటే విడిగా ప్రతీ పెట్టుబడికి సంబంధించిన కొనుగోలు తేదీ, ధర, విక్రయం తేదీ, ధర తదితర వివరాలు నమోదు చేయాల్సి వస్తుంది.

సేవలకు చార్జీలు...

ఈ ప్లాట్‌ఫామ్‌లు రిటర్నుల దాఖలుకు కొంత చార్జీ వసూలు చేస్తున్నాయి. నిపుణుల సహకారం లేకుండా సొంతంగా రిటర్నుల ఫైలింగ్‌కు చార్జీ రూ.200 నుంచి రూ.1,600 వరకు ఉంది. ఆదాయస్థాయికి అనుగుణంగా ఈ చార్జీ మారుతుంది. కొన్ని ప్లాట్‌ఫామ్‌లు పన్ను చెల్లింపుదారులు సొంతంగా రిటర్నులు దాఖలు చేసుకుంటే ఎలాంటి చార్జీ తీసుకోవడం లేదు. నిపుణుల సాయం తీసుకుని, రిటర్నులు వేయాలనుకుంటే చార్జీ చెల్లించాల్సి ఉంటుంది. ఈఆర్ఐ సంస్థలకు యూట్యూబ్ చానళ్లు ఉన్నాయి. ప్లాట్‌ఫామ్ సేవలను ఎలా వినియోగించుకోవచ్చన్న దానిపై వీడియోలు చూసి తెలుసుకోవచ్చు. వ్యక్తిగత ఆర్థిక అంశాలపై సమాచారం అందించే వీడియోలు సైతం అక్కడ లభిస్తాయి.

డేటా భద్రత సంగతి?



ఈఆర్ఐలు అన్నీ కూడా పన్ను చెల్లింపుదారులకు సంబంధించి సున్నితమైన వ్యక్తిగత డేటాను పెద్ద మొత్తంలో కలిగి ఉంటాయి. కనుక ఆయా ప్లాట్‌ఫామ్‌ల భద్రత ఎంతన్నది ముందే విచారించుకోవాలి. పన్ను చెల్లింపుదారుల సమాచారాన్ని మరొకరితో పంచుకోవడం లేదా విక్రయించడం చేయబోమని ఈ వేదికలు హామీ ఇస్తున్నాయి. ఈ ప్లాట్‌ఫామ్‌లు టెక్నాలజీ, భద్రత కోసం తగినంత ఖర్చు చేయాల్సి వస్తుంది. వీటి విషయంలో రాజీకి అవకాశం లేదు.

రిటర్నులు ఎవరు వేయాలి?

వార్షిక ఆదాయం రూ.2,50,000 వరకు ఉన్న వారు పన్ను పరిధిలోకి రారు. పాత పన్ను విధానంలో ప్రాథమిక మినహాయింపు ఆదాయ పరిమితి రూ.2,50,000. అదే కొత్త పన్ను విధానంలో అయితే వార్షికాదాయం రూ.3,00,000 మించని వారు పన్ను రిటర్నులు దాఖలు చేయనవసరం లేదు. ఇంతకు మించి ఆదాయం కలిగిన ప్రతి ఒక్కరూ రిటర్నులు విధిగా దాఖలు చేయాల్సిందే. అయితే పన్ను చెల్లించే ఆదాయం లేకపోయినప్పటికీ, కొన్ని సందర్భాల్లో రిటర్నులు దాఖలు చేయాలని చట్టంలోని సెక్షన్ 139 స్పష్టం చేస్తోంది.

ఏ సందర్భాల్లో రిటర్నులు వేయాలి..? (సెక్షన్ 139)

- విదేశీ కంపెనీల్లో పెట్టుబడులు (షేర్లు) కలిగి ఉన్న వారు రిటర్నులు దాఖలు చేసి, అందులో ఆ వివరాలు పేర్కొనాలి. విదేశీ కంపెనీల్లోని వాటాల ద్వారా వచ్చే డివిడెండ్ వివరాలను సైతం వెల్లడించాలి. విదేశీ కంపెనీల బాండ్లు, విదేశాల్లో ఇల్లు, ఆ ఇంటి నుంచి అద్దె ఆదాయం వస్తున్న ప్రతి ఒక్కరూ రిటర్నులు దాఖలు చేయాలని సెక్షన్ 139(1) చెబుతోంది. భారత్‌కు వెలుపల ఏ దేశంలో అయినా అకౌంట్‌కు సంతకం చేసే అధికారం కలిగి ఉన్న వారు కూడా రిటర్నులు వేయాలి. తన పేరు మీద ఇన్వెస్ట్ చేసినా లేదా తల్లిదండ్రుల పేరు మీద విదేశాల్లో ఇన్వెస్ట్ చేసినా సరే.. రిటర్నుల దాఖలు తప్పదు.
- ఒక వ్యక్తి తాను, తన జీవిత భాగస్వామి, లేదా ఇతరుల (తల్లిదండ్రులు తదితర) విదేశీ పర్యటనల కోసం ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.2 లక్షలు, అంతకుమించి ఖర్చు చేసినట్టయితే రిటర్నులు వేయాల్సి ఉంటుంది.
- ఒక ఆర్థిక సంవత్సరంలో విద్యుత్ బిల్లుల మొత్తం రూ.లక్ష దాటినా సరే రిటర్నుల దాఖలు తప్పనిసరి.
- మూలధన లాభాలపై పన్ను మినహాయింపు కోరుకునే వారు రిటర్నులు దాఖలు చేయాలి.
- మూలం వద్దే పన్ను కోత (టీడీఎస్), మూలం వద్దే పన్ను వసూళ్లు (టీసీఎస్) ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.25,000, అంతకుమించి ఉంటే రిటర్నులు వేయాలని ఆదాయపన్ను శాఖ 2022 ఏప్రిల్ నాటి నోటిఫికేషన్ స్పష్టం చేస్తోంది. ఇదే నోటిఫికేషన్ ప్రకారం.. ఒక ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్ సేవింగ్స్ ఖాతాలో రూ.50లక్షలు అంతకుమించి డిపాజిట్ చేసిన సందర్భాల్లో, వ్యాపార టర్నోవర్ లేదా వ్యాపారం నుంచి రావాల్సిన మొత్తం రూ.60లక్షలు మించి ఉన్నా రిటర్నులు దాఖలు చేయాల్సిందే.
- స్వయం ఉపాధిలోని వారు కరెంట్ ఖాతా కలిగి, అందులో ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.కోటి డిపాజిట్ చేసిన సందర్భంలోనూ రిటర్నులు వేయాలి.
- వడ్డీ ఆదాయం, డివిడెండ్లపై టీడీఎస్ అమలు చేస్తుంటారు. పన్ను చెల్లించేంత ఆదాయం లేని వారు, ఇలా టీడీఎస్ రూపంలో మినహాయించినది తిరిగి పొందాలంటే (రిఫండ్), ఆదాయపన్ను రిటర్నులు దాఖలు చేయాల్సి ఉంటుంది.

గడువులోపు రిటర్నులు వేయకపోతే?

జూలై 31 తర్వాత రిటర్నులు దాఖలు చేసే వారు సెక్షన్ 234ఎఫ్ కింద పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుంది. ఆదాయం రూ.5 లక్షల్లోపు ఉన్న వారికి రూ.1,000, రూ.5 లక్షలు మించి ఆదాయం ఉంటే రూ.5,000 పెనాల్టీ కింద చెల్లించాలి.



అన్ని విధాలా సహకారం

పన్ను అంశాల్లో పూర్తి సహకారం అందించేందుకు ఇవి సిద్ధంగా ఉంటాయి. పాత, కొత్త పన్ను విధానాల్లో ఏది అనుకూలం? వ్యక్తి ఆదాయ వనరుల ఆధారంగా దాఖలు చేయాల్సిన ఐటీఆర్ పత్రాన్ని ఈఆర్ఐ సిస్టమ్ ఆటోమేటిక్‌గా ఎంపిక చేస్తుంది. కేవలం వేతనమే కాదు, ఈక్విటీలు, ఎఫ్ అండ్ ఓ ఆదాయం, విదేశీ ఆస్తుల ద్వారా ఆదాయం ఇలా భిన్న రూపాల్లో ఆదాయ వనరులు ఉన్న వారికి ఐటీఆర్ పత్రం ఎంపికను ఇవి సులభతరం చేస్తాయి. రిటర్నులు దాఖలు చేయడమే కాదు, ఈ వెరిఫికేషన్‌ను కూడా అక్కడే పూర్తి చేయవచ్చు. ట్యాక్స్‌బడ్డీ ప్లాట్‌ఫామ్ ద్వారా రిటర్నులు వేసినట్టయితే.. ఒకవేళ ఆదాయపన్ను శాఖ నుంచి నోటీసులు వస్తే, పన్ను చెల్లింపుదారులకు తెలియజేయడం, నోటీసుకు ఇవ్వాల్సిన సమాధానం విషయంలోనూ సహకారం లభిస్తుంది. ఈఆర్ఐ ప్లాట్‌ఫామ్‌లపై రిటర్నుల దాఖలుకు సంబంధించి రెండు స్కీమ్‌లు ఉంటాయి. ఒకటి సొంతంగా దాఖలు చేసుకోవడం. రెండోది నిపుణుల సహకారంతో దాఖలు చేసుకోవడం. కొంత చార్జీ చెల్లించి పన్ను నిపుణులు, చార్టర్డ్ అకౌంటెంట్ల సహకారాన్ని రిటర్నుల విషయంలో తీసుకోవచ్చు. వర్చువల్‌గా నిపుణులతో సమావేశమై సందేహాలు తీర్చుకోవచ్చు. అడ్వాన్స్‌డ్ ట్యాక్స్ విషయంలోనూ ఈ ప్లాట్‌ఫామ్‌లు సాయం అందిస్తున్నాయి.. అంతే కాదు ఐటీ చట్టంలోని వివిధ సెక్షన్ల కింద పన్ను మినహాయింపులు, పన్ను తగ్గింపు ప్రయోజనాలు పొందడానికి వీలుగా పెట్టుబడుల విషయంలోనూ సలహాలు తీసుకోవచ్చు. జీవిత బీమా, ఆరోగ్య బీమా, ఎన్‌పీఎస్, ఈఎల్ఎస్ఎస్, పన్ను ఆదా డిపాజిట్లలో పెట్టుబడులపై సహకారం లభిస్తుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

1-7-2024	
విశాఖ	545-00
చిత్తూరు	573-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	530-00
విజయవాడ	540-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	525-00
వరంగల్	527-00
రిటైల్ ధర	5.85

ఈ వారం 2 లిస్టింగ్‌లు, 2 ఐపీవోలు

- 2న అలైడ్ బ్లెండర్స్, 3న వ్రజ్ ఐరన్ లిస్టింగ్
- 3నే ఎమ్‌క్యూర్ ఫార్మా, బన్సల్ వైరింగ్ ఇష్యూలు షురూ



న్యూఢిల్లీ: ఈ వారం దేశీ స్టాక్ మార్కెట్లలో 4 ఐపీవోలు హడావిడి చేయనున్నాయి. గత వారమే ఇష్యూలు పూర్తి చేసుకున్న అలైడ్ బ్లెండర్స్ 2న, వ్రజ్ ఐరన్ 3న స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టకానున్నాయి. ఇక మరోపక్క ఎమ్‌క్యూర్ ఫార్మాస్యూటికల్స్, బన్సల్ వైరింగ్ పబ్లిక్ ఇష్యూలు 3నే ప్రారంభంకానున్నాయి. ఆఫీసర్స్ చాయిస్ విస్కీ బ్రాండ్ కంపెనీ అలైడ్ బ్లెండర్స్ రూ. 281 ధరలో చేపట్టిన ఇష్యూ ద్వారా రూ. 1,500 కోట్లు అందుకుంది. స్పాంజ్ ఐరన్, టీఎంటీ బార్ల తయారీ కంపెనీ వ్రజ్ ఐరన్ అండ్ స్టీల్ షేరుకి రూ. 207 ధరలో చేపట్టిన ఇష్యూ ద్వారా రూ. 171 కోట్లు అందుకుంది. జూలై 5న ముగియనున్న స్టీల్ వైర్ల తయారీ కంపెనీ బన్సల్ వైర్ ఇండస్ట్రీస్ పబ్లిక్ ఇష్యూకి రూ. 243–256 ధరల శ్రేణిని ప్రకటించింది. మొత్తం రూ. 745 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయడం ద్వారా రూ. 745 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. రిటైలర్లు కనీసం 58 షేర్లకు దరఖాస్తు చేయవలసి ఉంటుంది. హెల్త్‌కేర్ రంగ కంపెనీ ఎమ్‌క్యూర్ ఫార్మా పబ్లిక్ ఇష్యూకి రూ. 960–1008 ధరల శ్రేణిని ప్రకటించింది. 5న ముగియనున్న ఇష్యూ ద్వారా రూ. 800 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. అంతేకాకుండా మరో 1.14 కోట్ల షేర్ల(రూ. 1,152 కోట్ల విలువ)ను ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. వెరసి ఇష్యూ ద్వారా రూ. 1,952 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. రిటైలర్లు కనీసం 14 షేర్లకు దరఖాస్తు చేయవలసి ఉంటుంది.

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఎంఎఫ్ ఎనర్జీ ఆపర్చూనిటీస్ ఫండ్



ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మ్యూచువల్ ఫండ్ తాజాగా ఎనర్జీ ఆపర్చూనిటీస్ ఫండ్‌ను ఆవిష్కరించింది. ఈ ఎన్ఎఫ్‌వో జూలై 2న ప్రారంభమై 16తో ముగుస్తుంది. ఇది సంప్రదాయ, కొత్త తరహా ఇంధన పరిశ్రమలకు చెందిన సంస్థలు, అనుబంధ వ్యాపారాల్లోని కంపెనీల షేర్లలో ఇన్వెస్ట్ చేస్తుందని సంస్థ ఈడీ శంకరన్ నరేన్ తెలిపారు. తద్వారా దీర్ఘకాలంలో మెరుగైన రాబడులు అందించడంపై ఈ ఫండ్ దృష్టి పెడుతుందన్నారు. ప్రస్తుతం అంతా పునరుత్పాదక విద్యుత్ వైపు మళ్ళుతున్న నేపథ్యంలో ఈ విభాగంలో పెట్టుబడుల వృద్ధికి గణనీయంగా అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.


యాక్సిస్ ఎంఎఫ్ నుంచి నిఫ్టీ 500 ఇండెక్స్ ఫండ్



యాక్సిస్ మ్యూచువల్ ఫండ్ కొత్తగా నిఫ్టీ 500 ఇండెక్స్ ఫండ్‌ను ఆవిష్కరించింది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ జూలై 9తో ముగుస్తుంది. ఇది ఎన్ఎస్ఈలో లిస్టయిన టాప్-500 కంపెనీల్లో ఇన్వెస్ట్ చేసే అవకాశాన్ని కల్పిస్తుంది. కనీసం రూ. 100 నుంచి ఇందులో ఇన్వెస్ట్ చేయొచ్చు. లార్జ్ క్యాప్ స్టాక్స్‌లో 73%, మిడ్ క్యాప్‌లో 17%, స్మాల్ క్యాప్ స్టాక్స్‌లో 10% వరకు ఈ ఫండ్ ఇన్వెస్ట్ చేస్తుంది. మార్కెట్ క్యాప్‌లవ్యాప్తంగా డైవర్సిఫికేషన్ కోరుకునే దీర్ఘకాలిక ఇన్వెస్టర్లకు, తక్కువ వ్యయాలతో కూడుకున్న ప్యాసివ్ పెట్టుబడి వ్యూహాన్ని అనుసరించదల్చుకున్నవారికి, సరళమైన పెట్టుబడి సాధనం కావాలనుకునే కొత్త ఇన్వెస్టర్లకు ఈ ఫండ్ అనువైనదని యాక్సిస్ ఏఎంసీ ఎండీ బి. గోపకుమార్ తెలిపారు.

ఈటీఎఫ్ ఎన్ఎఫ్‌వోలు.. లిస్టింగ్ లాభాలొస్తాయా?

Q & A




ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్స్ 65 శాతం నుంచి 85 శాతం వరకు ఈక్విటీలలో, మిగిలినది ఫిక్స్‌డ్ ఇన్‌కమ్‌లో ఇన్వెస్ట్ చేయడం తప్పనిసరి అని విన్నాను. అలాంటప్పుడు ఈక్విటీ పెట్టుబడులను వివిధ మార్కెట్ విలువల పరిధిలోని స్టాక్స్‌లోనూ ఇన్వెస్ట్ చేయడం కూడా తప్పనిసరా? లేక ఫ్లెక్సీక్యాప్ మాదిరిగా పెట్టుబడుల విషయంలో ఫండ్ మేనేజర్‌కు స్వేచ్ఛ ఉంటుందా? అలాగే, డెట్ పెట్టుబడులకు సంబంధించి తప్పనిసరి నిర్బంధం ఏదైనా ఉందా?

– గౌరవ్ గుప్తా

అగ్రెస్సివ్ హైబ్రిడ్ మ్యూచువల్ ఫండ్స్ పథకాలకు సంబంధించి ఈక్విటీ పెట్టుబడుల పరంగా మార్కెట్ విలువ విషయంలో ఎలాంటి నిర్బంధాలు లేవు. అందుకే ఈ పథకాలు ఫ్లెక్సీక్యాప్ మాదిరే పనిచేస్తుంటాయి. కాకపోతే అధిక శాతం పెట్టుబడులను లార్జ్‌క్యాప్ కంపెనీలకు కేటాయిస్తుంటాయి. అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్స్ ఈక్విటీకి కేటాయించే మొత్తం పెట్టుబడుల్లో 76 శాతాన్ని లార్జ్‌క్యాప్‌లోనే ఇన్వెస్ట్ చేస్తుంటాయి. ఇక మిడ్‌క్యాప్ కంపెనీలకు 15 శాతం వరకు, స్మాల్‌క్యాప్ కంపెనీలకు 8 శాతం వరకు కేటాయిస్తుంటాయి. అదే ఫ్లెక్సీక్యాప్ పథకాలను గమనించినట్టయితే అవి సగటున 71 శాతం వరకు లార్జ్‌క్యాప్ కంపెనీలకు, 19 శాతం మిడ్‌క్యాప్ కంపెనీలకు, 10 శాతం వరకు స్మాల్‌క్యాప్ కంపెనీలకు కేటాయిస్తుంటాయి. ఇక అగ్రెస్సివ్ హైబ్రిడ్ మ్యూచువల్ ఫండ్స్ పథకాలు డెట్ సాధనాలకు సంబంధించి ఫలానా విధంగా ఇన్వెస్ట్ చేయాలన్న నిర్బంధం కూడా లేదు. కాకపోతే ఇవి డెట్ పెట్టుబడుల్లోనూ నాణ్యతకే ప్రాధాన్యం ఇస్తుంటాయి. 80 శాతం వరకు అధిక రేటింగ్ సాధనాలైన ఎస్‌వోవీలు, ఏఏఏ, ఏప్లస్, ఏఏప్లస్ వాటిల్లో ఇన్వెస్ట్ చేస్తాయి. మీరు ఇన్వెస్ట్ చేసిన, చేయాలనుకుంటున్న పథకానికి సంబంధించి అస్సెట్ అలోకేషన్ (పెట్టుబడుల కేటాయింపులు) వివరాలను వ్యాల్యూరీసెర్చ్ వెబ్‌సైట్ నుంచి చూసి తెలుసుకోవచ్చు.



ఐపీవో అనంతరం లిస్టింగ్‌లో కంపెనీలు ఇస్తున్న బంపర్ లాభాల మాదిరే.. ఈటీఎఫ్ ఎన్ఎఫ్‌వోల్లోనూ లిస్టింగ్ లాభాలు సాధ్యమేనా?

– వరుణ్ ప్రకాశ్

ఈటీఎఫ్ ఎన్ఎఫ్‌వోలూ లిస్టింగ్‌లో లాభాలు ఇవ్వొచ్చు. కానీ, గడిచిన కొన్ని సంవత్సరాలుగా ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో) మార్కెట్లో చూస్తున్నంత లిస్టింగ్ లాభాలు వీటిల్లో ఉండవు. పరాస్ డిఫెన్స్ కంపెనీని గుర్తు తెచ్చుకోండి. లిస్టింగ్ రోజే 185 శాతం లాభాలను ఇచ్చింది. టాటా టెక్నాలజీస్ కూడా 162.85 శాతం లాభంతో లిస్ట్ అయింది. ఈటీఎఫ్ ఎన్ఎఫ్‌వోలలో అంత లాభాలు ఉండకపోవడానికి కారణం వాటి నిర్మాణం స్టాక్స్‌తో పోల్చితే పూర్తి భిన్నంగా ఉండడం వల్లే. ఈటీఎఫ్‌లు (ప్యాసివ్ ఫండ్స్) కేవలం అవి ఇన్వెస్ట్ చేసే సూచీల పనితీరునే ప్రతిబింబించగలవు. సూచీల నిర్మాణానికి తగినట్టుగానే వాటి యూనిట్ల పనితీరు ఉంటుంది. అందుకే వాటి లిస్టింగ్ లాభాలు సాధారణంగానే ఉంటాయి. ఈటీఎఫ్‌లకు అధిక డిమాండ్ ఉన్నప్పటికీ లిస్టింగ్ రోజున లాభాలు గణనీయంగా ఉండవు. 2002 నుంచి 2024 మధ్యకాలంలో 150 ఈటీఎఫ్ ఎన్ఎఫ్‌వోలు మార్కెట్లోకి వచ్చాయి. వీటిని పరిశీలించినప్పుడు.. 90 ఈటీఎఫ్ యూనిట్లు లిస్టింగ్ రోజు ముగింపు ప్రీమియంతోనే ఉంది. చాలా వరకు 0–5 శాతం మధ్య ప్రీమియంతో ముగిశాయి. కేవలం 11 ఈటీఎఫ్‌లే లిస్టింగ్ రోజున ఇష్యూ ధరకంటే 5 శాతానికి పైగా లాభంతో ముగిశాయి. లిస్టింగ్ రోజున గణనీయమైన లాభాలు ఆశించే వారికి ఈటీఎఫ్ ఎన్ఎఫ్‌వోలు తగినవి కావు.

వెస్ట్ కోస్ట్ పేపర్	ఏయూఎం క్యాపిటల్	కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 670
టార్గెట్: రూ. 859
ఎందుకంటే: ప్రింటింగ్, రైటింగ్ పేపర్ దిగ్గజం వెస్ట్‌కోస్ట్ పేపర్ మిల్స్ డైవర్సిఫైడ్ ప్రొడక్ట్ పోర్ట్‌ఫోలియోను కలిగి ఉంది. అత్యంత నాణ్యమైన రైటింగ్, ప్రింటింగ్ పేపర్‌ను 52 నుంచి 140 జీఎస్ఎం వరకూ తయారు చేస్తోంది. ఆధునిక ప్రింట్ సంస్థలకు అనుకూలమైన పేపర్‌ను అందిస్తోంది. కమర్షియల్ నుంచి ప్రీమియం ప్రింటింగ్ వరకూ వీటికి అందుబాటు ధరల్లో నాణ్యమైన పేపర్ కావలసి ఉంటుంది. హైఎండ్ అప్లికేషన్స్‌లో వినియోగించే ఉత్పత్తుల విలువ జోడింపుతోపాటు, కస్టమర్ల అవసరాలకు అనుగుణమైన(కస్టమైజ్‌డ్), ప్రత్యేకత కలిగిన ప్రొడక్టులను రూపొందించడంలో పటిష్టతను ప్రదర్శిస్తోంది. అంతేకాకుండా సమయానుగుణంగా చేపడుతున్న ఇతర సంస్థల వ్యూహాత్మక కొనుగోళ్ల ద్వారా దేశీ పేపర్ మార్కెట్లో బలపడుతూ వస్తోంది. ఇంతక్రితం అంటే 2020లో ఆంధ్రా పేపర్‌లో మెజారిటీ వాటాను సొంతం చేసుకుంది. పేపర్ తయారీలో 2,41,000 ఎంటీపీఏ సామర్థ్యంగల ఆంధ్రా పేపర్‌లో ప్రస్తుతం వెస్ట్ కోస్ట్ వాటా 72 శాతానికి చేరింది.



2023 సెప్టెంబర్‌లో యూనిషై డెకార్‌ను కొనుగోలు చేసేందుకు జాతీయ కంపెనీ చట్ట ట్రిబ్యునల్(ఎన్‌సీఎల్‌టీ) నుంచి అనుమతిని పొందింది. ఇతర సంస్థల కొనుగోళ్లసహా ఉత్పత్తికి అవసరమయ్యే ముడిసరుకుల సరఫరాలు తదితరాలను సొంతంగా(బ్యాక్‌వార్డ్ ఇంటిగ్రేషన్) సమకూర్చుకోవడం ద్వారా కార్యకలాపాలను పూర్తిస్థాయిలో సమీకృతం చేసింది. తద్వారా మార్కెట్లో తన పొజిషన్‌ను మరింత పటిష్టపరచుకుంటోంది. అవసరమైన ముడిసరుకులను పూర్తిగా దేశీయంగానే సమకూర్చుకుంటూ వ్యయాలను క్రమబద్ధీకరించింది. కొత్త జాతీయ విద్యా విధానం, ఈకామర్స్‌లో భారీ వృద్ధి పేపర్ పరిశ్రమకు అన్నివిధాల సానుకూల అంశాలుగా నిలవనున్నాయి.

నియోజెన్ కెమికల్స్	హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్	కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 1,588
టార్గెట్: రూ. 1,936
ఎందుకంటే: బ్రోమైన్, లిథియం ఆధారిత స్పెషాలిటీ కెమికల్స్ కంపెనీ నియోజెన్ కెమికల్స్ అధిక వృద్ధి బాటలో సాగనుంది. పరిశ్రమ వర్గాల అంచనాల ప్రకారం 2024–2030 మధ్య కాలంలో కంపెనీ లాభార్జన వార్షిక ప్రాతిపదికన 43 శాతం చొప్పున జంప్ చేయనుంది. రిటర్న్ ఆన్ ఈక్విటీ(ఆర్‌వోఈ) 2024లో నమోదైన 6 శాతం నుంచి 2030కల్లా 23 శాతం మెరుగుపడనుంది. కంపెనీకి గల బ్యాటరీ మెటీరియల్ బిజినెస్ నుంచి కొత్త తరం(న్యూఏజ్) కెమికల్స్ వేగవంత వృద్ధికి దోహదం చేయనున్నాయి. ఇందుకు ప్రధానంగా మిత్సుబిషి ఐయానిక్ సొల్యూషన్స్(ఎంయూఐఎస్) తోడ్పాటు నివ్వనుంది. 2026 ద్వితీయార్ధానికల్లా టెక్నాలజీ ఆధారిత ఎలక్ట్రోలైట్ తయారీ ప్లాంటు కార్యకలాపాలు ప్రారంభమయ్యే అవకాశముంది. దీంతో ఎలక్ట్రోలైట్ తయారీలో నియోజెన్ కెమికల్స్ సామర్థ్యం 16 రెట్లు దూసుకెళ్లనుంది. 32,000 ఎంటీపీఏకు చేరనుంది. గతేడాది(2023–24) దేశీయంగా ఎలక్ట్రోలైట్‌కు 10,600 ఎంటీపీఏ డిమాండ్ నమోదైంది. ఇది పూర్తిస్థాయిలో బ్యాటరీ ప్యాక్‌ల ద్వారా ప్రత్యక్షంగా దిగుమతుల ద్వారా లభ్యమైంది. 2030కల్లా ఎలక్ట్రోలైట్ డిమాండ్ వార్షిక ప్రాతిపదికన 39 శాతం చొప్పున పుంజుకోనున్నట్లు అంచనా. వెరసి 2030కల్లా 77,000 ఎంటీపీఏను తాకనుంది. ఫలితంగా న్యూఏజ్ కెమికల్స్ పరిశ్రమలో ముందస్తు తయారీ కంపెనీగా నిలవనున్న నియోజెన్ కెమికల్స్‌కు అదనపు ప్రయోజనం చేకూరనుంది. అంతేకాకుండా ఎలక్ట్రోలైట్ తయారీలో దేశీయంగా అతిపెద్ద కంపెనీగా అవతరించనుంది. ఈ బాటలో 2030కల్లా బ్యాటరీ మెటీరియల్స్ బిజినెస్ నుంచి రూ. 3,000 కోట్ల అమ్మకాలు సాధించనుంది. అంటే ఆదాయంలో 72 శాతం వాటా సమకూరనుంది. దీంతో వర్కింగ్ క్యాపిటల్ సైకిల్ ప్రస్తుత 210 రోజుల నుంచి 32 రోజులకు దిగిరానుంది.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

వరుణించిన నైరుతి

- జూన్‌లో 58% అధిక వర్షపాతం
- రాయలసీమలో అత్యధిక వర్షాలు
- కోస్తాంధ్రలో అధికం
- 180 శాతంతో సత్యసాయి జిల్లా అగ్రస్థానం
- ఈ నెలలోనూ విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం



సాక్షి, విశాఖపట్నం: నైరుతి రుతు పవనాలు సీజన్ ఆరంభం నుంచే అధిక వర్షాలు కురిపించాయి. రాష్ట్రంలో జూన్ నెలలో సాధారణ వర్షపాతం 91.2 మి.మీ. కాగా.. 143.7 మి.మీ. వర్షం కురిసింది. 52.5 మి.మీ. అధిక వర్షపాతం నమోదైంది. ఇది సాధారణం కంటే 58 శాతం అధికం.

సస్యశ్యామల 'సీమ'

నైరుతి రుతు పవనాలు ఈ ఏడాది రాయలసీమను కరుణించాయి. రాయలసీమలోని 8 జిల్లాల్లోనూ అత్యధిక వర్షపాతమే నమోదైంది. కోస్తాంధ్రలోని అనకాపల్లి, నెల్లూరు జిల్లాల్లో మాత్రమే అత్యధిక వర్షం కురవగా.. అల్లూరి సీతారామరాజు, కోనసీమ, బాపట్ల, ఏలూరు, గుంటూరు, కృష్ణా, పల్నాడు, ప్రకాశం, శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాల్లో సాధారణ వర్షపాతం కురిసింది. ఇక తూర్పు గోదావరి, కాకినాడ, ఎన్టీఆర్, పార్వతీపురం మన్యం, విజయనగరం, పశ్చిమ గోదావరి జిల్లాల్లో అధిక వర్షపాతం నమోదైంది. జిల్లాల వారీగా చూస్తే.. రాష్ట్రంలోకెల్లా శ్రీసత్యసాయి జిల్లాలో అత్యధికంగా 180 శాతం వర్షపాతం కురిసింది. ఆ జిల్లాలో జూన్‌లో 55.1 మి.మీ.లకు గాను 154.2 మి.మీ. వర్షం పడింది. ఆ తర్వాత 177 శాతంతో అనంతపురం రెండో అత్యధిక వర్షం కురిసిన జిల్లాల్లో నిలిచింది. అక్కడ 63.6 మి.మీ.లకు 176.2 మి.మీ. వర్షం కురిసింది. రాష్ట్రంలో వాతావరణ విభాగం పరిధిలో కోస్తాంధ్ర, రాయలసీమ సబ్ డివిజన్లు ఉన్నాయి. ఈ లెక్కన కోస్తాంధ్రలో 105.6 మి.మీ.లకు 129.1 మి.మీ. (22 శాతం అధికం), రాయలసీమలో 70.7 మి.మీ.లకు 160 మి.మీ. (127 శాతం అధికం) వర్షపాతం నమోదైంది.

సీమలోనే ఎక్కువ ఎందుకంటే..

కోస్తాంధ్ర కంటే రాయలసీమలోనే ఎక్కువ వర్షపాతం నమోదు కావడానికి కారణాలున్నాయి. ఈ ఏడాది నైరుతి రుతు పవనాలు జూన్ ఆరంభంలోనే రాయలసీమ మీదుగా కోస్తాంధ్రలోకి ప్రవేశించాయి. ఆ సమయంలో రాయలసీమలో విస్తారంగా వర్షాలు కురిశాయి. దక్షిణ కోస్తా నుంచి ఉత్తర కోస్తాలోకి విస్తరించిన రుతుపవనాలు ముందుకు కదలకుండా 10 రోజులపాటు స్తబ్దుగా ఉండిపోయాయి. దీంతో ఆ సమయంలో రాయలసీమలో వర్షాలు కొనసాగాయి. కోస్తాంధ్రలో.. ముఖ్యంగా ఉత్తర కోస్తాలో తేలికపాటి జల్లులే కురిశాయి. దీంతో రాయలసీమలోని అన్ని జిల్లాల్లోనూ అత్యధిక వర్షపాతం రికార్డయింది.

జూలైలోనూ సమృద్ధిగా..

జూన్ నెలలో ఆశాజనకంగా కురిసిన వర్షాలు జూలైలో మరింత సమృద్ధిగా కురుస్తాయని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. నైరుతి రుతు పవనాల ప్రభావం జూలైలో అధికంగా ఉంటుందని, ఫలితంగా రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వానలు కురిసే పరిస్థితులు ఉన్నాయని పేర్కొంటున్నారు. అలాగే జూలై నెలలో బంగాళాఖాతంలో అల్పపీడనాలు, వాయుగుండాలు ఏర్పడే అవకాశం ఉందని.. ఇవి కూడా వర్షాలు కురవడానికి దోహదపడతాయని చెబుతున్నారు.

'లద్దాఖ్' మృతుల్లో పెడన జవాను

- యుద్ధట్యాంకు నదిలో మునిగి కొట్టుకుపోయిన ఐదుగురిలో నాగరాజు
- నాగరాజు స్వగ్రామం కృష్ణా జిల్లా పెడన మండలం చేవేంద్ర



భార్య మంగాదేవి, కుమార్తె హాసినితో నాగరాజు

పెడన: సైనిక విన్యాసాల్లో భాగంగా తూర్పు లద్దాఖ్‌లోని ఎల్ఏసీ సమీపంలోని నదిని దాటుతున్న యుద్ధట్యాంకు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయిన ఘటనలో మృతిచెందిన ఐదుగురిలో కృష్ణాజిల్లా పెడన మండలం చేవేంద్ర గ్రామానికి చెందిన జవాను సాదరబోయిన నాగరాజు (32) ఉన్నారు. ఈ ప్రమాదంలో ప్రకాశం జిల్లాకు చెందిన ముత్తుముల రామకృష్ణారెడ్డి (47) మరణించిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో నాగరాజు కూడా ప్రాణాలు కోల్పోయారు. ఎనిమిదేళ్ల కిందట ఇంటర్ పూర్తయిన తరువాత నాగరాజు ఆర్మీలో చేరారు. నాగరాజుకు 2019 అక్టోబర్‌లో తేలప్రోలుకు చెందిన మంగాదేవితో వివాహమైంది. మంగాదేవి పెడన మండలం ఉరివి గ్రామ సచివాలయంలో మహిళా పోలీసుగా విధులు నిర్వర్తిస్తున్నారు. వారికి ఏడాది వయసున్న కుమార్తె హాసిని ఉంది. భర్త మరణ వార్త విన్నప్పటి నుంచి మంగాదేవి ఉలుకు పలుకు లేకుండా ఉందని కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. నాగరాజు తల్లిదండ్రులు వెంకన్న, ధనలక్ష్మి. నాగరాజుకు ఒక అక్క, తమ్ముడు ఉన్నారు. ఈ ఏడాది మార్చిలో సెలవులకు ఇంటికి వచ్చిన నాగరాజు ఆర్మీ జవానుగా పనిచేస్తున్న తన తమ్ముడు శివయ్య కుమార్తెకు అన్నప్రాశన వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఏప్రిల్ మొదటి వారంలో నాగరాజు తిరిగి విధులకు హాజరయ్యారు.

నేడు స్వగ్రామానికి మృతదేహం

నాగరాజు మృతదేహం సోమవారం ఉదయం స్వగ్రామానికి చేరుకుంటుందని మిలటరీ అధికారులు కుటుంబ సభ్యులకు తెలిపారని పెడన ఎస్ఐ టి.సూర్యశ్రీనివాస్ చెప్పారు. ఆయన ఆదివారం నాగరాజు ఇంటికి వెళ్లి కుటుంబసభ్యుల్ని ఓదార్చారు. నాగరాజు మృతదేహం హైదరాబాద్ నుంచి గన్నవరం విమానాశ్రయానికి, అక్కడి నుంచి రోడ్డు మార్గంలో చేవేంద్ర గ్రామానికి చేరుకుంటుందని ఎస్ఐ తెలిపారు. సోమవారం సాయంత్రంలోగా సైనిక లాంఛనాలు, స్థానిక పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తారని చెప్పారు.

పొగాకు అమ్మకాలపై అపరాధ రుసుం రద్దు

- రైతులకు కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ హామీ



పీయూష్ గోయల్‌కు సమస్యలు వివరిస్తున్న పొగాకు రైతు సంఘాల ప్రతినిధులు

దేవరపల్లి: అనుమతించిన దానికంటే అధికంగా ఉత్పత్తి అయిన పొగాకు అమ్మకాలపై అపరాధ రుసుం రద్దు చేస్తున్నట్లు కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ ప్రకటించారు. దీనికి సంబంధించి త్వరలోనే వేలం కేంద్రాలకు ఉత్తర్వులు పంపిస్తామని తెలిపారు. కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్‌ను హైదరాబాద్‌లోని నోవోటెల్ హోటల్‌లో రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ఆధ్వర్యాన పొగాకు రైతు సంఘాల ప్రతినిధులు శనివారం రాత్రి కలిసి, పలు సమస్యలు వివరించారు. అనుమతించిన దానికంటే అధికంగా ఉత్పత్తి చేస్తున్న పొగాకు అమ్మకాలపై బోర్డు వసూలు చేస్తున్న అపరాధ రుసుం రద్దు చేయాలని కోరారు. పొగాకు కేంద్రాల్లో శాశ్వత సిబ్బందిని నియమించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి పీయూష్ గోయల్ మాట్లాడుతూ, అదనపు పంట అమ్మకాలపై అపరాధ రుసుం ఈ ఏడాదికి రద్దు చేస్తున్నామని ప్రకటించారు. వేలం కేంద్రాల్లో ఖాళీ పోస్టులను ఈ నెలాఖరుకు భర్తీ చేస్తామన్నారు. వచ్చే ఏడాదికి రాయితీపై డ్రిప్ ఇరిగేషన్ అందజేస్తామని పేర్కొన్నారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో పొగాకు బోర్డు చైర్మన్ సీహెచ్ యశ్వంత్ కుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు, ఇండియన్ టుబాకో అసోసియేషన్ అధ్యక్షుడు పోలిశెట్టి శ్యామ్ తదితరులున్నారు.

ఆ భర్తకు ముచ్చటగా మూడో పెళ్లి

- పెళ్లి పెద్దలుగా మారి వివాహం జరిపించిన ఇద్దరు భార్యలు
- శుభలేఖలు పంచి మరీ బంధువులకు ఆహ్వానం
- దగ్గరుండి వివాహం జరిపించి విందు ఏర్పాటు



పెదబయలు: పెళ్లి చేసుకుని నిండు నూరేళ్ల పాటు ఒకే భార్యతో సంసారం చక్కగా సాగిపోతే చాలని అందరూ కోరుకుంటారు. భార్య కూడా తన భర్త తనకు మాత్రమే సొంతమనుకుంటుంది. కానీ.. అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలం గుల్లేలు పంచాయతీ పరిధిలోని కించూరులో ఓ వ్యక్తి ఏకంగా మూడో వివాహం చేసుకున్నారు. మొదటి భార్య, రెండో భార్య పెళ్లి పెద్దలుగా వ్యవహరించి మరీ అతడికి పెళ్లి జరిపించారు. వివరాల్లోకి వెళితే.. కించూరు గ్రామానికి చెందిన సాగేని పండన్న అనే వ్యక్తి పార్వతమ్మను మొదటి వివాహం చేసుకున్నాడు. సంతానం లేదన్న కారణంతో 2006లో అప్పలమ్మ అనే మహిళను రెండో వివాహం చేసుకున్నాడు. వీరికి 2007లో బాబు పుట్టాడు. ఆ తరువాత మళ్లీ సంతానం లేకపోవడంతో చాలా కాలం పిల్లల కోసం ఎదురుచూశారు. 17 ఏళ్లుగా రెండో సంతానం లేకపోవడంతో పిల్లలు కావాలనే కోరిక పండన్నకు బలంగా ఉండేది. ఈ విషయాన్ని ఇద్దరు భార్యల దృష్టికి తీసుకెళ్లి.. మూడో పెళ్లి చేసుకుంటానని పండన్న చెప్పడంతో వారు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. తామే దగ్గరుండి వివాహం చేస్తామని కూడా మాట ఇచ్చారు.

పెళ్లి సంబంధమూ భార్యలే కుదిర్చారు

భర్తకు ఇచ్చిన మాట ప్రకారం.. జి.మాడుగుల మండలం కిల్లంకోట పంచాయతీ పరిధిలోని కె.బందవీధి గ్రామానికి చెందిన లక్ష్మితో ఇద్దరు భార్యలు పెళ్లి కుదిర్చారు. వారే పెళ్లి కార్డులు ముద్రించి.. కుటుంబ సభ్యులు, బంధువులకు ఆహ్వానం పలికారు. జూన్ 25న కించూరు గ్రామంలోనే వివాహం జరిపించారు. పెళ్లికి వచ్చిన బంధువులు, అతిథులందరినీ గౌరవ మర్యాదలకు లోటు లేకుండా ఇద్దరు భార్యలు దగ్గరుండి చూశారు. గిరిజన ప్రాంతాల్లో రెండు పెళ్లిళ్లు చేసుకోవడం తరుచుగా జరుగుతూనే ఉంటుంది. ఇక్కడ మాత్రం ఇద్దరు భార్యలు పెళ్లి ఆహ్వాన పత్రికలు ముద్రించి ఘనంగా మూడో పెళ్లి చేశారు. తన ఇద్దరు భార్యల సమ్మతితోనే వివాహం చేసుకున్నానని.. వారే దగ్గరుండి పెళ్లి జరిపించారని పండన్న చెప్పాడు. వారికి రుణపడి ఉంటానని పేర్కొన్నాడు.

నేను జగన్‌ను కలవలేదు

- ఆ కథనాలు, వార్తలన్నీ అబద్ధం
- కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్



సాక్షి బెంగళూరు: ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాను కలవలేదని, తాను భేటీ అయినట్లు వస్తున్న వార్తలను నమ్మవద్దని కేపీసీసీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పష్టం చేశారు. కొద్ది రోజులుగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బెంగళూరులోని తన నివాసంలో ఉంటున్నారు. ఈ క్రమంలో డీకే శివకుమార్‌ను వైఎస్ జగన్ కలిశారని, పలు రాజకీయ అంశాలపై చర్చించారని వదంతులు వ్యాపించాయి. డీకే శివకుమార్‌ను వైఎస్ జగన్ కలిసి పుష్పగుచ్ఛం అందించినట్లు మార్ఫింగ్ ఫొటోలు కూడా ప్రచురితమయ్యాయి. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి డీకే శివకుమార్ ఎక్స్ (ట్విటర్) ద్వారా స్పందించారు. తాను ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో భేటీ అయినట్లు కొందరు నకిలీ ఫొటో సృష్టించి ప్రచారం చేస్తున్నారని, తాను ఆయన్ను కలవలేదని చెప్పారు. ఆ కథనాలు, వార్తలన్నీ అబద్ధం అని చెప్పారు. ఇలాంటి వార్తలను నమ్మొద్దని ప్రజలను కోరారు.

ఏపీఎల్ మూడో సీజన్ ప్రారంభం



పోటీల ప్రారంభోత్సవంలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి తదితరులు

విశాఖ స్పోర్ట్స్: ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) మూడోసీజన్ పోటీలు ఆదివారం విశాఖపట్నంలోని వైఎస్సార్ స్టేడియంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను రాష్ట్ర రవాణా, యువజన, క్రీడలశాఖ మంత్రి ఎం.రాంప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో కొన్నేళ్లుగా రాజకీయ ప్రమేయం ఎక్కువై క్రీడాకారుల ప్రతిభకు విఘాతం ఏర్పడిందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాల విద్యార్థులకు మంచి ప్రోత్సాహం అందించడానికి కృషిచేస్తామన్నారు. ఆంధ్ర క్రికెట్ సంఘం, ఏపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ టోర్నీలో ఆరుజట్ల కెప్టెన్లు, ఆటగాళ్లు ట్రోఫీని ప్రదర్శించారు. గత సీజన్ టైటిల్ పోరులో తలపడ్డ రాయలసీమ కింగ్స్, కోస్టల్ రైడర్స్ జట్ల మధ్య మంత్రి టాస్‌వేసి పోటీలను ప్రారంభించారు. జూలై 13వ తేదీతో ముగిసే ఈ పోటీల్లో ఉత్తరాంధ్ర లయన్స్, గోదావరి టైటాన్స్, బెజవాడ టైగర్స్, వైజాగ్ వారియర్స్ జట్లు కూడా పోటీపడుతున్నాయి. ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ అధ్యక్షుడు శరత్‌చంద్రరెడ్డి, కార్యదర్శి ఎస్.ఆర్.గోపీనాథ రెడ్డి స్వాగతం పలికిన ఈ కార్యక్రమంలో ఎంపీలు శ్రీభరత్, కేశినేని శివనాథ్, విశాఖ నగర మేయర్ హరివెంకటకుమారి, వీడీసీఏ అధ్యక్షుడు, ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, ఎమ్మెల్యే రామకృష్ణబాబు, జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ మయూర్ అశోక్ పాల్గొన్నారు.



బంగ్లాదేశ్‌కు చేరుకున్న భారతీయ నౌకాదళ నౌక ఐఎన్ఎస్ రణవీర్

ఛటోగ్రామ్‌కు ఐఎన్ఎస్ రణవీర్

సింథియా: తూర్పు నావికాదళానికి చెందిన ఐఎన్ఎస్ రణవీర్ నౌక కార్యాచరణ విస్తరణలో భాగంగా శనివారం బంగ్లాదేశ్‌లోని ఛటోగ్రామ్‌కు చేరుకున్నట్లు నేవీ అధికారులు తెలిపారు. ఈ నౌకకు బంగ్లాదేశ్ ప్రధానమంత్రి షేక్ హసీనా నేతృత్వంలో బంగ్లాదేశ్ అధికారులు ఘనస్వాగతం పలికినట్లు చెప్పారు. రెండుదేశాల నౌకాదళాల సిబ్బంది సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్ ఎక్స్ఛేంజ్, క్రాస్‌డెక్ విజిట్‌లు, కమ్యూనిటి ఔట్రీచ్, స్నేహపూర్వక స్పోర్ట్స్ ఫిక్చర్‌లతో వృత్తిపరమైన పరస్పర చర్యల్లో పాల్గొంటారని వివరించారు. ఐఎన్ఎస్ రణవీర్.. రాజ్‌పుత్ క్లాస్ గైడెడ్ మిస్సైల్ డిస్ట్రాయర్. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో అత్యాధునిక ఆయుధాలు, సెన్సార్‌లతో ఆధునికీకరించిన ఈ నౌక ఆత్మనిర్భర భారత్‌కు అనుగుణంగా పనిచేస్తుంది.

మళ్లీ టెట్ నోటిఫికేషన్

- నేడు విడుదల.. రేపు షెడ్యూల్

సాక్షి, అమరావతి: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్ - టెట్)కు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. దరఖాస్తుల స్వీకరణ, పరీక్షల నిర్వహణ వంటి పూర్తి సమాచారంతో కూడిన షెడ్యూల్ మంగళవారం ప్రకటించనున్నట్లు కమిషనర్ సురేష్ కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం డీఎస్సీ ద్వారా 16,347 పోస్టులు భర్తీ చేయనున్న నేపథ్యంలో టెట్ నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అభ్యర్థులకు కావాల్సిన పూర్తి సమాచారం, పరీక్షలు జరిగే తేదీలను త్వరలో https://cse.ap.gov.in/ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామని, ప్రత్యేక హెల్ప్ డెస్క్ కూడా ఏర్పాటుచేశామన్నారు.

ఫిబ్రవరిలో ఒకసారి నిర్వహణ

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం డీఎస్సీ ద్వారా 6,100 పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ ఇచ్చింది. దీంతోపాటు అభ్యర్థుల విజ్ఞప్తుల మేరకు ఫిబ్రవరిలో టెట్-2024 నోటిఫికేషన్ ఇచ్చింది. దీంతో బీఈడీ, డీఈడీ అభ్యర్థులు మొత్తం 2,67,789 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరికి ఫిబ్రవరి 27 నుంచి మార్చి 6 వరకు సీబీటీ (ఆన్‌లైన్) విధానంలో టెట్ పరీక్షలు నిర్వహించగా 2,35,907 మంది (88.90 శాతం) హాజరయ్యారు. అయితే, ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఫలితాలు వెల్లడించలేదు. జూన్ 25న ప్రకటించిన టెట్ ఫలితాల్లో 1,37,903 మంది (58.4 శాతం) మంది అర్హత సాధించారు. సెకండరీ గ్రేడ్ టీచర్ల అర్హత పరీక్ష పేపర్-1ఏ (రెగ్యులర్)లో 75,142 మంది, పేపర్-1బీ (స్పెషల్ ఎడ్యుకేషన్)లో 790 మంది ఉత్తీర్ణులయ్యారు. స్కూల్ అసిస్టెంట్ టీచర్ల అర్హత పరీక్ష అయిన పేపర్-2ఏ(రెగ్యులర్)లో 60,846 మంది, పేపర్-2బీ (స్పెషల్ ఎడ్యుకేషన్)లో 1,125 మంది విజయం సాధించారు. ఈ నేపథ్యంలో.. మరోసారి టెట్ (జూలై) నిర్వహణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

గత ప్రభుత్వం ఇచ్చిన డీఎస్సీ రద్దు

ఇక ఈ ఏడాది ఫిబ్రవరిలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 6,100 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఇచ్చిన డీఎస్సీ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం రద్దు చేసింది. ఈ మేరకు ఆదివారం పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీచేశారు. ఒకట్రెండు రోజుల్లో 16,347 ఉపాధ్యాయ పోస్టులతో కొత్తగా నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. అయితే, ఈ కొత్త డీఎస్సీలో సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు తక్కువగా ఉన్నాయని, కావాలనే ఈ పోస్టులు భర్తీకి ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలేదని పలు జిల్లాల్లో అభ్యర్థులు ఆందోళన చేస్తున్నారు.

ఆన్‌లైన్ ద్వారా డిగ్రీ అడ్మిషన్లు

ప్రవేశాలకు నేడు నోటిఫికేషన్

- మొత్తం సీట్లు దాదాపు 3.20 లక్షలు
- గత ఏడాది జూన్ 19నే ప్రక్రియ ప్రారంభం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు సంబంధించి ఉన్నత విద్యా మండలి సోమవారం నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు అన్ ఎయిడెడ్, అటానమస్ డిగ్రీ కళాశాలల్లో సాధారణ డిగ్రీ కోర్సుల్లో ఆన్‌లైన్ ద్వారా సీట్లను భర్తీ చేయనుంది. వాస్తవానికి ఇంటర్మీడియట్ ఫలితాలు విడుదలై రెండు నెలలు దాటినప్పటికీ డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభం కాకపోవడంతో విద్యార్థులు ఆందోళన చెందారు. తాజాగా.. ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ ఫలితాలు కూడా ప్రకటించారు. వర్సిటీల నుంచి కళాశాలలకు అనుమతుల పొడిగింపు ప్రక్రియలో జాప్యంతోపాటు కొత్తగా బీసీఏ, బీబీఏ, బీఎంఎస్ కోర్సులు అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) పరిధిలోకి వెళ్లాయి. ఫలితంగా యూజీసీ నుంచి రావాల్సిన గుర్తింపు ఏఐసీటీఈ ఇవ్వాల్సి వస్తోంది. ఈ క్రమంలో రాష్ట్రంలో సుమారు వెయ్యికి పైగా డిగ్రీ కళాశాలలు ఉండగా అందులో 800 వరకు బీసీఏ, బీబీఏ, బీఎంఎస్ కోర్సులు అందిస్తున్న కళాశాలలు వున్నాయి. వీటికి ఏఐసీటీఈ అనుమతులు వచ్చి, రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ ఎన్ఓసీ ఇచ్చిన తర్వాతే సీట్ల భర్తీ చేయాల్సి రావడంతో అడ్మిషన్లకు జాప్యం జరిగింది. వీటికి తోడు.. 43 కళాశాలలు కొత్తగా అనుమతులు కోసం దరఖాస్తు చేశాయి. వీటిలో కేవలం రెండు లేదా మూడింటికి మాత్రమే అనుమతులొచ్చే అవకాశముందని ఉన్నత విద్య వర్గాలు చెబుతున్నాయి. ఈ కళాశాలల్లో 2024-25లోనే అడ్మిషన్లకు అవకాశం కల్పించనున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే.. గతేడాది జూన్ 19 నుంచి ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం కాగా.. ప్రస్తుత ప్రభుత్వంలో ఆలస్యంగా జరుగుతుండటం గమనార్హం. మొత్తం సాధారణ డిగ్రీలో సుమారు 3.20 లక్షల వరకు సీట్లున్నాయి.

తెలంగాణ

గూడూరులో అరుదైన జైన పద్మావతి శిల్పాలు



జనగామ: జనగామ జిల్లా పాలకుర్తి మండలం గూడూరులో రాష్ట్ర కూటుల కాలం నాటి రెండు జైన యక్షిణి శిల్పాలను గుర్తించినట్లు చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి తెలిపారు. ఈ శిల్పాల్లో ఒకటి గ్రామంలో పోచమ్మగుడి చెట్టు కింద 'కోమటోళ్ల బొమ్మలు'అని స్థానికులు పిలిచే శిల్పాలలో ఉందన్నారు. నడుము నుంచి పైభాగం వరకు మానవ స్త్రీ రూపం, దిగువ భాగం మెలితిరిగిన పాము తోకతో ఉందని, ఆభరణాలు మందంగా ఉన్నాయని తెలిపారు. మధ్య నుంచి పుట్టినట్లుగా నడుము భాగంలో పద్మం ఉంది. ముఖ భాగం, చేతులు ధ్వంసమై ఉన్నాయన్నారు. ఇక్కడే చేతిలో ఇమిడే చిన్న పరిమాణంలో ఆసీనుడై ధ్యాన ముద్రలో ఉన్న తీర్థంకర శిల్పం ఉన్నట్లు వివరించారు. మరో శిల్పం పాటిగడ్డ మీద గుర్తించినట్లు చెప్పారు. నల్లని పొడవైన గ్రానేట్ శిలపై నర నాగదేవత రూపంలో ఉందని, తలపై తొమ్మిది పడగల సర్పం గొడుగు పట్టి, రెండు చేతుల్లో తామర మొగ్గలు ఉన్నట్లు పేర్కొన్నారు. మనకు కనిపించే నాగదేవత విగ్రహాలన్నీ ఒకటి కాదు..అందులో జైనయక్షిణి పద్మావతిదేవి శిల్పాలు ఉంటాయని చెప్పారు.

క్లుప్తంగా...

గిరిజన గురుకులాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

- డిప్యుటేషన్‌పై టీచర్లను పంపించాలని ఆదేశాలు

సాక్షి, అమరావతి: గిరిజన గురుకులాల్లోని కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు పెన్‌డౌన్ చేపట్టడంతో ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టింది. మెగా డీఎస్సీ వల్ల తమ ఉద్యోగాలకు ప్రమాదం ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఇప్పటికే సీఎం చంద్రబాబు, డిప్యూటీ పవన్‌ను కలిసి తమకు న్యాయం చేయాలంటూ విన్నవించారు. రాష్ట్రవ్యాప్తంగా గిరిజన గురుకులాల్లో 1,650 మంది 10 నుంచి 15 ఏళ్లుగా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నారు. మెగా డీఎస్సీలో గిరిజన ప్రాంతాల్లోని గురుకుల విద్యాలయాలకు చెందిన 1,143 పోస్టులను ప్రతిపాదించడంతో తామంతా రోడ్డున పడతామని ఆందోళన చెందుతున్నారు.స్పష్టమైన హామీ ఇవ్వని ప్రభుత్వం మాత్రం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తోంది. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో కొద్దిరోజులపాటు తాత్కాలికంగా పనిచేసేలా ఇతర శాఖల నుంచి ఉపాధ్యాయులను డిప్యుటేషన్‌పై నియమించాలని జిల్లా అధికారులకు ఆదేశాలిచ్చింది. రాష్ట్రంలోని 9 సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ)ల ప్రాజెక్ట్ ఆఫీసర్లు, జిల్లా గిరిజన సంక్షేమ అధికారులు ఈ మేరకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. పాఠశాలల వారీగా, సబ్జెక్టుల వారీగా గైర్హాజరైన ఔట్‌సోర్సింగ్ టీచింగ్ సిబ్బంది వివరాలు పంపిస్తామని, ఆయా ఖాళీల్లో ప్రత్యామ్నాయ సిబ్బందిని సమకూర్చుకుని ఉన్నతాధికారులకు నివేదించాలని ఆదేశాల్లో పేర్కొంది.

నేటి నుంచి ప్రత్యేక కేటగిరీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

- నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఏర్పాట్లు పూర్తి
- అడ్మిషన్ల కన్వీనర్ ఎస్.అమరేంద్ర కుమార్



నూజివీడు: ఆర్జీయూకేటీ పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో 2024-25 విద్యా సంవత్సరం అడ్మిషన్లలో భాగంగా జూలై ఒకటో తేదీ నుంచి ఆరో తేదీ వరకు ప్రత్యేక కేటగిరీ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రత్యేక కేటగిరీలో సైనిక సంతతి కోటాలో 2,582 మంది, స్పోర్ట్స్ కోటాలో 1,162 మంది, ఎన్‌సీసీ కోటాలో 1,830 మంది, దివ్యాంగుల కోటాలో 332 మంది, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కోటాలో 270 మంది దరఖాస్తు చేసుకున్నారు. సైనిక సంతతి కోటా అభ్యర్థుల సర్టిఫికెట్లను సోమవారం నుంచి 3వ తేదీ వరకు, క్రీడా కోటా అభ్యర్థుల సర్టిఫికెట్లను 3వ తేదీ నుంచి 6వ తేదీ వరకు, దివ్యాంగుల కోటా అభ్యర్థుల సర్టిఫికెట్లను 3వ తేదీన, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కోటా అభ్యర్థుల సర్టిఫికెట్లను 2, 3 తేదీల్లో, ఎన్‌సీసీ కోటా అభ్యర్థుల సర్టిఫికెట్లను 3వ తేదీ నుంచి 5 వరకు పరిశీలించనున్నారు. అభ్యర్థులు వారికి కేటాయించిన తేదీల్లో ఉదయం తొమ్మిది గంటల కల్లా నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో రిపోర్టు చేయాల్సి ఉందని అడ్మిషన్ల కన్వీనర్ ఎస్.అమరేంద్ర కుమార్ ఆదివారం వెల్లడించారు.

ఏజెన్సీలో రేషన్ వాహనాల రద్దు సరికాదు

- పౌర హక్కుల సంఘం నాయకుడు శ్రీరామమూర్తి



తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర): భారత స్వాతంత్ర్య పోరాటంలో జూన్ 30వ తేదీకి ప్రాముఖ్యత ఉందని, 1855 జూన్ 30న సంతాల్ ఆదివాసీలు భూస్వాములకు, వడ్డీ వ్యాపారులకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసిన రోజు అని ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఏఎస్ఆర్ నగర్‌లో సంతాల్ ఆదివాసీల తిరుగుబాటు దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. పౌర హక్కుల సంఘం జిల్లా నాయకుడు శ్రీరామమూర్తి మాట్లాడుతూ నేటికీ గిరిజనులు తమ హక్కులను కోల్పోతున్నారని, సమాజానికి దూరంగా జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం గిరిజన గ్రామాల్లో ఇంటింటికీ రేషన్ సరఫరా చేసేందుకు వాహనాలను పరిచయం చేసిందన్నారు. దీనివల్ల గిరిజనులకు ఎంతో ప్రయోజనం కలిగేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఈ విధానానికి స్వస్తి పలికిందని, దీనివల్ల ఎందరో జీవనోపాధి కోల్పోతున్నారని, మళ్లీ ఈ గిరిజనులు కొండలెక్కి, గుట్టలెక్కి రేషన్ కోసం కిలోమీటర్లు నడిచిరావలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భారత్ బజావో శ్రీనివాస్, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య కార్యదర్శి నిర్మల పాల్గొన్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
సోమవారం ♦ 1 ♦ జూలై ♦ 2024

కలువ కుతూహలం


కలువ, లేదా తామర పువ్వులంటే అందరికీ ఇష్టమే. ఆదివారం చిక్కబళ్లాపురం వద్ద ముక్తిహళ్లి చెరువులో తామర పుష్పాలు సేకరించిన పర్యాటకులు

న్యూస్‌రీల్

జోరుగా వంటల పోటీలు



చిక్కబళ్లాపురం: చిక్కబళ్లాపురం నగరంలోని వాసవి ధర్మశాలలో ఆర్యవైశ్య మహిళల పిండి వంటల మేళా ఉత్సాహంగా జరిగింది. మహిళలు పలురకాల వంటకాలను తయారు చేసి అక్కడే విక్రయించారు. దోసెలు, ఓళిగ, కుడుములు తదితర వంటకాలను తయారు చేశారు. ఈ సందర్భంగా ఆటలు, పాటల పోటీలు ఆకట్టుకున్నాయి.

బంతి హైకమాండ్ కోర్టుకు

- ఖర్గేతో డీసీఎం భేటీ


ఢిల్లీలో ఖర్గేతో డీకే సమావేశం

శివాజీనగర: ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం పదవులపై గొడవల నేపథ్యంలో ఆదివారం డిప్యూటీ సీఎం, కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను ఢిల్లీలో కలిశారు. రాష్ట్ర రాజకీయాల గురించి చర్చించారు. శుక్రవారమే సీఎం సిద్దు, ఖర్గేతో భేటీ అయ్యారు. కేపీసీసీ అధ్యక్ష మార్పు ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది. సీఎం, డీసీఎం సహా కేపీసీసీ పదవులు బెంగళూరు, మైసూరు వాసుల చేతిలో ఉన్నాయి. కాబట్టి ఉత్తర కర్ణాటక నేతలకు పార్టీ పదవిని ఇవ్వాలని కొందరు డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. అయితే త్వరలో బెంగళూరు పాలికె, జడ్పీ, టీపీ తదితర ఎన్నికలు రాబోతున్నాయి. అవి ముగిసేవరకు మార్పు చేయరాదని ఖర్గేని డీకే కోరినట్లు తెలుస్తోంది. తనకు వ్యతిరేకంగా కొందరు మంత్రుల మాటలు, సీఎం ధోరణి గురించి డీకే చర్చించినట్లు సమాచారం. బెంగళూరులో ఆదివారం హోం మంత్రి జీ.పరమేశ్వర్ మాట్లాడుతూ ఏదైనా మార్చాలనుకుంటే హై కమాండ్ ఆ పనిచేస్తుందని అన్నారు.

కోస్తా జిల్లాలకు భారీ వర్షసూచన


ఆదివారం కలబుర్గిలో వర్షం

దొడ్డబళ్లాపురం: రాష్ట్రంలోని కోస్తా జిల్లాల్లో రాబోయే 5 రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఉడుపి, ఉత్తరకన్నడ, దక్షిణ కన్నడ, శివమొగ్గ, కొడగు జిల్లాల్లో జూలై 4 వరకూ భారీ వర్షాలు కురిసే అవకాశముంది. ఈ జిల్లాల్లో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎల్లో అలర్ట్ ప్రకటించారు. భారీ వర్షాలతోపాటు బలమైన ఈదురు గాలులు వీస్తాయని, సముద్రంలోకి మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని తెలిపారు. ఆదివారం కలబుర్గి పరిసర ప్రాంతాల్లో జోరు వాన కురిసింది.

షాకిస్తోంది.. కరెంటు తీగ


కొడగు వద్ద వర్షాలకు కూలిపోయిన కరెంటు స్తంభం


బెళగావిలో ఇంట్లో కరెంటు తీగలు తగిలి ముగ్గురు మృతి (ఫైల్)

- రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ ప్రమాదాలు
- గత మూడేళ్లలో 1,519 మంది మృత్యువాత
- నియంత్రణ చర్యలు అంతంతే


అజాగ్రత్తగా ఉంటే అపాయమే

బనశంకరి: నేటి రోజుల్లో విద్యుత్ లేకపోవడాన్ని ఊహించలేం. మానవ జీవితానికి విద్యుత్ ఇంధనంగా మారింది. అయితే నాణేనికి మరోవైపు ఉంది. రాష్ట్రంలో తరచూ విద్యుత్ ప్రమాదాలు జరుగుతూ ప్రాణనష్టానికి కారణమవుతున్నాయి. మనషులే కాదు, ఏనుగులు, చిరుతలు వంటి అరుదైన వన్యజీవులు కూడా ప్రాణాలు కోల్పోతున్నాయి. ఇక విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదాలు జరిగి తరచూ లక్షల రూపాయల ఆస్తి నష్టమూ జరుగుతోంది. ఇందులో విద్యుత్‌శాఖ నిర్లక్ష్యం ఎంతో ఉందని ఆరోపణలు ఉన్నాయి.

ఘోర దుర్ఘటనలు

రాష్ట్రంలో గత మూడేళ్లలో కరెంటు ప్రమాదాల వల్ల 1,519 మంది మరణించారు. ఆవులు, ఎద్దులు తదితర 1,574 ప్రాణులు మృతి చెందాయి. గతేడాది నవంబరు ఆఖరులో వైట్‌ఫీల్డ్ మెయిన్‌రోడ్డులో తెగిపడిన కరెంటు తీగను తొక్కడంతో తల్లీ, కూతురు సజీవ దహనం కావడం తెలిసిందే. ఈ ఘోరానికి బెస్కాం నిర్లక్ష్యమే కారణమని ప్రజలు మండిపడ్డారు. బెళగావిలోనూ ఇంట్లో కరెంటు షాక్‌తో ముగ్గురు మరణించారు. 2023–24 లో 473 ప్రమాదాల్లో 481 మంది చనిపోగా, 643 ప్రాణులు విగతజీవులు కావడం ఆందోళన కలిగిస్తోంది. రోజురోజుకు విద్యుత్ వినియోగదారుల పెరగడంతో కరెంటు స్తంభాలు మారుమూల ప్రాంతాలలోకి వస్తున్నాయి. సురక్షిత నిర్వహణ, వినియోగం పెద్ద సవాల్‌గా మారింది.

ఇలా అధికంగా ప్రమాదాలు

- అధిక సంఖ్యలో విద్యుత్ ప్రమాదాలు విద్యుత్ వైర్లు తెగి కిందపడటం లేదా, వైర్లు వేలాడుతుండటంతో సంభవిస్తున్నాయి.


చిక్కమగళూరులో కరెంటు తీగలు తగిలి ఏనుగు బలి

- రోడ్ల పక్కన గల కరెంటు స్తంభాల వైర్లు తెగిపడిన ప్రమాదాల్లో గత మూడేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 143 మంది మృతి చెందగా 24 మంది గాయపడ్డారు. 513 ప్రాణులు చనిపోయాయి.
- విద్యుత్ పరికరాల కనెక్షన్ల వద్ద షాక్ కొట్టి 782 మంది ప్రాణాలు కోల్పోగా 148 పశువులు కన్నుమూశాయి.
- చెట్లు, కొమ్మలు, విద్యుత్ వైర్లపై పడటం, గాలివానలకు విద్యుత్ స్తంభాలు కూలిపోవడం, అనధికార కనెక్షన్లతో ప్రమాదాలు వంటివి ఎక్కువగా జరుగుతున్నాయి.

సురక్షతా వారోత్సవాలు

విద్యుత్ సురక్షిత వినియోగం గురించి ప్రజల్లో జాగృతం చేయడం, విద్యుత్ ప్రమాదాల సంఖ్యను తగ్గించడానికి విద్యుత్ పర్యవేక్షణాలయ శాఖ చర్యలు చేపట్టింది. జూన్ 26 నుంచి జూలై 2 వరకు జాతీయ విద్యుత్ సురక్షతా వారోత్సవాలను నిర్వహిస్తోంది. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో ప్రజలకు, రైతులకు, విద్యాలయాలు, పరిశ్రమలు, మాల్స్, సినిమా థియేటర్లు తదితర ప్రాంతాల్లో జాగృతి కార్యక్రమాలను నిర్వహిస్తారు.

వినియోగం విస్తరించి..

అన్ని రంగాల్లో విద్యుత్ వినియోగం విస్తరించింది, విద్యుత్ రంగం విస్తరించడంతో ప్రమాదాల సంఖ్య పెరుగుతోంది. విద్యుత్ పర్యవేక్షణాలయ శాఖ ఆధ్వర్యంలో జాతీయ విద్యుత్ సురక్షతా వారోత్సవం నిర్వహిస్తామని అన్ని వర్గాల వారిని విద్యుత్‌శాఖ సిబ్బంది జాగృతం చేసి విద్యుత్ ప్రమాదాల సంఖ్య తగ్గించడమే లక్ష్యమని బెంగళూరు విద్యుత్‌శాఖ అధికారిణి బీవీ శశికళ తెలిపారు.

కబ్బన్ పార్కులో సంస్కృత వికాసం

- మన్ కీ బాత్‌లో ప్రధానిచే ప్రశంసలు


సంస్కృత గోష్టిలో యువత

శివాజీనగర: బెంగళూరులోని కబ్బన్ పార్కులో జరిగే వీకెండ్ సంస్కృత కార్యక్రమం ప్రధాని నరేంద్ర మోదీ దృష్టికి వెళ్లింది. ప్రతి ఆదివారం కబ్బన్ పార్కులో ఈ కార్యక్రమంలో చేరే ప్రజలు సంస్కృతంలో మాట్లాడుతారు. పెద్దలు తమ బిడ్డలు, మనమళ్లతో వచ్చి సంస్కృత భాషలోనే సంభాషించడం ద్వారా పిల్లలకు కూడా భాష వచ్చేలా చూస్తారు. సంస్కృత భాష పరిరక్షణ కోసం వారు చేస్తున్న కృషిని ఆదివారం మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ ప్రస్తుతించారు. ప్రజలు స్వయం ప్రేరేపణతో ఇక్కడికి వచ్చి సంస్కృత భాషను మాట్లాడి ఆనందిస్తారని తెలిపారు. గతంలో సంస్కృత భాష మాట్లాడే శివమొగ్గ జిల్లా మథూర ను ప్రధాని కొనియాడారు.

యువత మక్కువ

ఈ కార్యక్రమాన్ని సమష్టి గుబ్బి అనే మహిళ ప్రారంభించారు. కిం భూ అని ఈ భేటీలను పిలిచేవారు. ఏమిటీ విషయం అని దీని అర్థం. ఈ ప్రయత్నం బెంగళూరు వాసులను అమితంగా ఆకర్షించింది. ఎంతోమంది సంస్కృత భాషా ప్రియులు రావడం మొదలైంది. భాషా నిపుణులు మెళకువలను బోధిస్తే మిగతావారు నేర్చుకునేవారు. ఎక్కువమంది ఐటీ బీటీ, బ్యాంకు ఉద్యోగులు, యువత రావడం మొదలైంది. అలా ఒక సంస్కృత వికాస వేదికగా మారింది.


కార్యక్రమంలో పాల్గొన్న యోగా అభ్యాసకులు. సీనియర్ యోగా అభ్యాసకులకు సన్మానం

యోగా ఉత్సవం

మైసూరు: యోగా స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మైసూరు నగరంలోని మైసూరు విశ్వవిద్యాలయంలోని యోగా భవనంలో ఆదివారం రాష్ట్ర స్థాయి యోగా పోటీలను నిర్వహించారు. వివిధ జిల్లాల నుంచి సుమారు 500 మందికి పైన యోగాసాధకులు ఆసనాలు వేశారు. 8 సంవత్సరాల నుంచి 21 సంవత్సరాల వయసు మధ్య బాలలు, యువతకు పోటీలు నిర్వహించారు. చివరగా నృత్య ప్రదర్శనలు అలరించాయి.


బాలల నాట్య ప్రతిభ

లోయలోకి పడ్డ ఆర్టీసీ బస్సు

- 25 మందికి గాయాలు

మైసూరు: కేఎస్ ఆర్టీసీ బస్సు వేగంగా వెళుతూ అదుపు తప్పి పల్టీలు కొట్టిన ప్రమాదంలో 25 మందికి పైగా ప్రయాణికులు గాయపడ్డారు. ఈ సంఘటన జిల్లాలోని నంజనగూడు తాలూకాలోని మరడిహుండి గ్రామంలో ఆదివారం జరిగింది. బస్సు బిళిగాళి గ్రామం నుంచి ఎస్.హోసకోటె మీదుగా మైసూరుకు వెళ్తోంది. ఘటనాస్థలం దగ్గర డ్రైవర్ అదుపుతప్పడంతో బస్సు లోయలోకి పల్టీలు కొడుతూ పడిపోయింది. ఈ ప్రమాదంలో 25 మందికి పైన ప్రయాణికులకు గాయాలు కాగా, స్థానికులు, పోలీసులు కలిసి వారిని బయటకు తీసి వాహనాలలో మైసూరులోని ఆస్పత్రులకు తరలించారు. బస్సు డ్రైవర్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. వరుణ పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

ఫిలింసిటీ నిర్మిస్తాం: సీఎం

శివాజీనగర: కన్నడ ఓటీటీ వేదిక నిర్మించేందుకు పరిశీలించి చర్యలు తీసుకొంటామని, ఫిలిం సిటీ నిర్మాణంతో పాటుగా కన్నడ చలనచిత్ర రంగ ప్రగతికి అన్ని వసతులూ కల్పిస్తామని సీఎం సిద్దరామయ్య తెలిపారు. ఆదివారం నగరంలోని శివానంద సర్కిల్ వద్ద నిర్మించిన చలచిత్ర నిర్మాతల సంఘం నూతన భవనాన్ని ప్రారంభించి మాట్లాడారు. డాక్టర్ రాజకుమార్ కన్న కలలులాగా ఫిలింసిటీ నిర్మిస్తామన్నారు. నిర్మాతలు ఉత్తమ సినిమాలను నిర్మించడంతో పాటు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. నిర్మాత సా.రా.గోవిందు మాట్లాడుతూ గుండురావు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో 50 శాతం పన్ను రాయితీనిచ్చారు. దేవేగౌడ రాష్ట్ర ఆర్థిక మంత్రిగా ఉన్నపుడు పూర్తి పన్ను రాయితీ నిచ్చారు. 2019 నుండి ఇప్పటి వరకు నిర్మాతలకు సబ్సిడీ రాలేదు. పురస్కారాలు లేవు అని అసంతృప్తి వ్యక్తంచేశారు. పలు రకాల డిమాండ్లను వినిపించారు. ఈ కార్యక్రమంలో సాధుకోకిల, మంత్రి భైరతి సురేశ్, ఎమ్మెల్యే రిజ్వాన్ హర్షద్, సినీ నటుడు డాక్టర్ శివరాజ్‌కుమార్, జగ్గేశ్ తదితరులు పాల్గొన్నారు.

మేకెదాటుకు, ఎగువభద్రకు సాయం చేయరూ

= ప్రధాని మోదీకి సీఎం సిద్దు వినతులు

శివాజీనగర: ముఖ్యమంత్రి సిద్దరామయ్య శనివారం సాయంత్రం ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీని భేటీ చేశారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న మౌలిక సదుపాయాల పథకాల నిధుల విన్నవించినట్లు సిద్దు ఎక్స్‌లో తెలిపారు. బెంగళూరుకు తాగునీరు అందించే, 400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే మేకెదాటు డ్యాం కు రూ.9000 కోట్ల నిధులు, డీపీఆర్ నివేదికకు కేంద్ర జల కమిషన్ నుంచి అనుమతి పెండింగ్‌లో ఉన్నాయి, వాటిని మంజూరు చేయాలని కోరారు. ఎగువ భద్రాకు రూ.5,300 కోట్లు విడుదల చేయాలని, కళసా బండూరి ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వాలని విన్నవించారు. బెంగళూరు నగర ట్రాఫిక్ ఒత్తిడి పరిష్కారానికి 60 కి.మీ.సొరంగ మార్గానికి రూ.3 వేల కోట్లు ఖర్చు కానుంది. ఇది హైవే4, 7ను తాకుతుంది, దీనికి కేంద్ర జాతీయ రహదారి ప్రాధికార సహాయం చేయాలని అడిగారు. మెట్రో రైలు 3వ దశలో 44.65 కి.మీల నిర్మాణానికి రూ.15,611 కోట్ల ఖర్చు అవుతుందని నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించగా, అనుమతి పెండింగ్ ఉంది. త్వరగా అనుమతి జారీ చేయాలని కోరారు. ప్రధాని సానుకూలంగా స్పందిస్తారనే నమ్మకం ఉందని తెలిపారు.

ఈసారి షావర్మాపై వేటు?

- అందులో హానికారక బ్యాక్టీరియాలు గుర్తింపు
- ఇటీవల బొంబై మిఠాయి, గోబీ, చికెన్ పకోడాపై ఆంక్షలు

శివాజీనగర: ఆరోగ్యానికి హానికరమంటూ రాష్ట్రంలో రంగులు వాడి చేసే గోబి మంచూరియా, బొంబై మిఠాయి, చికెన్ కబాబ్‌లను సర్కారు నిషేధించడం తెలిసిందే. పానీపూరిలో క్యాన్సర్ కారక పదార్థాలు ఉన్నాయని, త్వరలో చర్యలను ప్రకటిస్తామని తెలిపింది. ఈ జాబితాలో అరబ్ దేశాల వంటకమైన చికెన్ షావర్మా కూడా చేరనుంది. ఆహార భద్రత, వైద్య అధికారులు రాష్ట్రవ్యాప్తంగా సేకరించిన పలు షావర్మా నమూనాలలో అనారోగ్యానికి కారణమయ్యే బ్యాక్టీరియా, ఈస్ట్‌లు బయటపడ్డాయి. కాబట్టి వాటి విక్రయాలను నిషేధించాలని ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు.

17 నమూనాలను పరీక్షించగా

కొంతకాలంగా బెంగళూరు, మంగళూరు వంటి నగరాలలో షావర్మా షాపులు వెలిశాయి. చికెన్‌ను పెద్ద గోపురం మాదిరిగా ఏర్పాటు చేసి వేడి చేసి ముక్కలుగా కత్తిరించి, చపాతీలో చుట్టి ఇస్తారు. దీనిని సేవించి అస్వస్థతకు గురైన కేసులు అధికమయ్యాయి. ఈ నేపథ్యంలోనే ఆరోగ్య శాఖ రాష్ట్రవ్యాప్తంగా 17 చోట్లలో శాంపిల్స్‌ను సేకరించగా, 8 శాంపిల్స్‌లో బ్యాక్టీరియా, ఈస్ట్‌లు బయటపడ్డాయి. దీంతో షావర్మా అసురక్షితం అని నిర్ధారించారు. ఆహారాన్ని ఎక్కువసేపు నిల్వ ఉంచితే బ్యాక్టీరియాలు, ఈస్ట్‌లు ఏర్పడతాయి. కేరళలో షావర్మా తిని పలువురు చనిపోయారు కూడా. షావర్మ వ్యాపారులు తప్పనిసరిగా ఎఫ్ఎస్ఎస్ఏఐలో నమోదు చేసుకోవాలని నిబంధన ఉంది. షాపులో ఆ రిజిస్ట్రేషన్ పత్రం పెట్టకపోతే అమ్మకాన్ని బ్యాన్ చేస్తామని హెచ్చరించినట్లు ఓ అధికారి తెలిపారు.


పానీపూరిలో క్యాన్సర్ కారకాలని ప్రకటన


రంగులు వాడి చేసే గోబీ విక్రయించరాదు


ఇప్పుడు షావర్మా హానికరమని వెల్లడి




బొంబై మిఠాయి, చికెన్ పకోడాలలో ఉపయోగించే రంగుల వల్ల అనారోగ్య ప్రాప్తి

క్లుప్తంగా

మొక్కలు నాటి సంరక్షించాలి



విద్యార్థులతో మొక్కలను నాటిస్తున్న ఉపాధ్యాయులు

హొసపేటె: మానవులు స్వార్థంతో చెట్ల నరికి వేస్తున్నారని, ఇది పర్యావరణానికి పెను ప్రమాదమని పాఠశాల ఎస్డీఎంసీ అధ్యక్షుడు ముద్దన్న తెలిపారు. కూడ్లిగి తాలూకాలోని మాకనడకు గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ విషయంలోనూ విద్యార్థులపై చాలా బాధ్యత ఉందని, పాఠశాలలో ప్రతి చిన్నారి ఒక మొక్కను నాటి, వాటిని సంరక్షించాలని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సభ్యులు తిప్పేస్వామి, బోరేష్, ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, ప్రశాంత్‌కుమార్, భాగ్యలక్ష్మీ శుభమంగళ, ఏసీఎంసీ ఉపాధ్యక్షులు, ప్రధాన ఉపాధ్యాయులు, సభ్యులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా టెట్ పరీక్షలు



రాయచూరు రూరల్: జిల్లాలో ఉపాధ్యాయ అర్హత పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఆదివారం ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలను అదనపు జిల్లాధికారి దురుగేశ్, జిల్లా విద్యాశాఖాధికారి బడిగేర, తాలూకా విద్యాశాఖాధికారులు చంద్రశేఖర్, సుఖదేవ్‌లు పరిశీలించారు. జిల్లాలో 110 కేంద్రాలలో పరీక్షలు నిర్వహించారు. 5560 అభ్యర్థులకు గాను 724 మంది గైర్హాజరైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి బడిగేర తెలిపారు.

జిల్లాలో 38 డెంగీ కేసులు నమోదు

రాయచూరు రూరల్: జిల్లాలో డెంగీ కేసులు నమోదవుతున్నాయి. దోమకాటుతో సోకే డెంగీ రోగులు రోజు రోజుకు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. సింధనూరు తాలూకా కణూరులో ఆరేళ్ల బాలిక సాక్షికి డెంగీ లక్షణాలు ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. దీంతో హుటాహుటిన జిల్లా ఆరోగ్య అధికారి సరేంద్రబాబు వైద్య బృందాన్ని గ్రామాకి తరలించారు. జిల్లాలో వ్యాప్తంగా 38 డెంగీ కేసులు నమోదైనట్లు సమాచారం.

కరియప్ప తాత విగ్రహం ఆవిష్కరణ



విగ్రహావిష్కరణలో స్వామీజీలు

రాయచూరు రూరల్: నేటి ఆధునిక సమాజంలో భక్తులు దారి తప్పుతున్నారని, వారిని ఆధ్యాత్మిక దారిలో నడిపించాలని కిల్లే బృహన్మఠ మఠాధిపతి శాంతమల్ల శివాచార్యులు పేర్కొన్నారు. ఆదివారం తాలూకాలోని వడ్లూరులో లచ్చాణి కమరిమఠ కరియప్ప తాత మహారాజ్ విగ్రహావిష్కరణ చేసి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో వృషభ లింగస్వామి, లింగప్పతాత, మహంతయ్య, సంగయ్య, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

యువ కవులకు మార్గదర్శి



పుస్తకాలను విడుదల చేస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: యువ కవులకు సర్వ మంగళ సక్రి మార్గదర్శి అని దేవానం ప్రియ సాహితీవేత్త వీరేష్ చౌద్రి అన్నారు. ఆదివారం కన్నడ భవనంలో జిల్లా, తాలుకా కన్నడ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో చిత్ జ్యోతి-తత్వకారుల విచారాలపై సర్వ మంగళ సక్రి రాసిన పుస్తకాలను విడుదల చేసి మాట్లాడుతూ... కవితలు సమాజనికి పనికి వచ్చే, యువకుల మనసులను దోచే విధంగా పుస్తకాలను రాయాలన్నారు. మొబైళ్లకే పరిమితమైన మనసులను చూరగొనాలన్నారు.

అధికారికి రూ. 25 వేల జరిమానా

మైసూరు: సమాచారహక్కు చట్టం నిబంధనలు ఉల్లంఘించిన అధికారికి రూ.25వేల జరిమానా విధిస్తూ సమాచారం చట్టం కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. వివరాలు.. సదానందగౌడ అనే సమాచార హక్కు చట్టం కార్యకర్త ఒక అంశానికి సంబంధించి సమాచారం కావాలని బెంగళూరు నగరంలోని ఎం.ఎస్.బిల్డింగ్‌లో ఉన్న ఉద్యానవన శాఖ సమాచార అధికారి ఎం.డి.గుడుదప్పకు దరఖాస్తు చేసుకున్నాడు. అయితే సమాచారం ఇవ్వకుండా నిర్లక్ష్యం చేశారు. దీంతో బాధితుడు సమాచార హక్కు కమిషన్‌కు ఫిర్యాదు చేశాడు. విచారణ జరిపించిన కమిషన్... గుడుదప్పకు రూ.25వేల జరిమానా విధించింది.

అంజూర సాగు.. ఆదాయం బాగు

- అంజూర పండ్ల తోటలతో రైతన్నలకు లాభాలు
- నాటిన ఆరునెలల నుంచి ఫలసాయం
- జిల్లాలో విస్తరిస్తున్న సాగు



బళ్లారి జిల్లాలో సాగు చేసిన అంజూర



ఒక్కసారి సాగుచేస్తే ఏడాదంతా ఫలసాయం

సాక్షి,బళ్లారి: జిల్లాలో నీటి పారుదల భూముల్లో వరి, మిరప, మొక్కజొన్న తదితర పంటలతో లాభాలు గడిస్తున్న ఒక్కోసారి పెట్టుబడులు కూడా రాని పరిస్థితి. సకాలంలో వర్షం కురవక, కురిసినా తెగుళ్లు చుట్టుముట్టడం, తీరా పంట చేతికి వచ్చాక ధర లేక రైతులు దిగాలు చెందడం చూస్తూనే ఉంటాం. దీంతో రైతులు అప్పుల పాలవుతున్నారు. ఈ క్రమంలో జిల్లాలో కొందరు రైతులు అంజూర సాగు చేపట్టారు. పండ్ల తోటలను పెంచుతూ ఆర్థిక ప్రగతి సాధిస్తున్నారు.

ఏడాదిపాటు ఫలసాయం :

ఈ ఏడాది పాటు అంజురా పండ్లు కాయడం ద్వారా రైతులకు ప్రతి రోజు ఆదాయాన్ని పొందవచ్చు. జిల్లాలో అంజుర పండ్లకు అధిక డిమాండ్ ఉంది. ప్రస్తుత మార్కెట్‌లో కిలో రూ.150 పై మాటే పలుకుతుండటంతో రైతులకు పెట్టుబడులు పోను ఎకరాకు ఏడాది రూ.2 లక్షలకు పైగా ఆదాయం వస్తుంది. జిల్లాలో కురుగోడు, లక్ష్మీపుర, కల్కంబ, ముష్టగట్టి, బాదనహట్టి, సిరిగేరి, కంప్లి, మించేరి తదితర గ్రామాల్లో రైతులు అధిక సంఖ్యలో అంజుర పండ్లను సాగు చేస్తూ మంచి ఆదాయాన్ని పొందుతున్నారు. ఇక్కడ పండించిన అంజూరను పొరుగు రాష్ట్రాలు తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, తదితర ప్రాంతాలకు పెద్ద ఎత్తున్న ఎగుమతులు చేస్తున్నారు.

అంజూరతో ఆరోగ్యం :

ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేసే అంజూరలో ఔషధ గుణాలు ఉండటంతో ఎక్కువ మంది తింటున్నారు. అంజూరు పండుగానే కాకుండ ఎండబెట్టి కూడా వినియోగిస్తున్నారు. అంజూరా చెట్లకు మందులు తక్కువ వాడటం వల్ల ఆరోగ్యానికి కూడా ఈ పండు రామబాణంలా పనిచేస్తుంది. ముఖ్యంగా మలబద్ధక నివారణకు ఎంతో ఉపయోగపడుతుందని వైద్యులు చెబుతున్నారు. బళ్లారి జిల్లాలో దాదాపు 5 వేల ఎకరాలలో అంజూర సాగు చేస్తున్నారు. దీంతో ఇతర ప్రాంతాలకు జిల్లా నుంచి ఎగుమతులు పెరగడంతో అంజుర పండ్లు పెట్టింది పేరుగా జిల్లా ఖ్యాతికెక్కింది. అంజూరాను ప్రత్యేక ప్యాకింగ్ చేస్తూ ఎగుమతి చేస్తున్నారు. రైతులతో పాటు వ్యవసాయ కూలీలకు పనులు దొరుకుతున్నాయి. జిల్లాలో ఒక్కో రైతు ఏటా రూ.10 నుంచి 20 లక్షల వరకు ఆదాయం పొందుతున్నారు. అంజూరాతో అధిక లాభాలు రావడంతో సంతోషంగా ఉందని రైతులు పేర్కొన్నారు. ఒక ఎకరాకు ఏడాది పొడవున రూ.3 లక్షల వరకు ఆదాయం వస్తుందన్నారు. పెట్టుబడులు తక్కువ ఆదాయం ఎక్కువగా ఉందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఔషధ గుణాలు కలిగిన పండు

వ్యక్తికి రూ. 8. లక్షలు టోకరా

హుబ్లీ: ఆన్‌లైన్ మోసాల గురించి తరచూ వార్తలు వస్తున్నా అమాయకులు జాగృతి కావడం లేదు. ఇలాగే ఓ యువకుడు పెద్ద మొత్తంలో డబ్బు మోసపోయాడు. నగరంలోని ఏక్తా నగర్‌కు చెందిన నిజాముద్దీన్ బాధితుడు. షేర్ మార్కెట్‌లో పెట్టుబడి పెడితే భారీగా లాభాలు వస్తాయని నమ్మించి తాము సూచించిన ఐపీఓలో పెట్టుబడులు పెడితే లాభాలు వస్తాయని సైబర్ కేటుగాళ్లు ప్రోత్సహించి రూ. 8.27లక్షలు వారి ఖాతాల్లో జమ చేసుకున్నారు. అనంతరం కాల్ రిసీవ్ చేయకపోవడంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బస్సు చక్రానికి నిప్పు

హుబ్లీ నగరంలోని కిత్తూరు చెన్నమ్మ సర్కిల్ వద్ద బస్సు చక్రానికి ఉన్న ఫలంగా నిప్పు అంటుకుంది. వెంటనే స్థానికులు మంటలను ఆర్పివేయడంతో ప్రమాదం తప్పింది.

మట్కా ఆడుతున్న నలుగురిపై కేసు

హుబ్లీ అంచటగేరి వీధి, అదే విధంగా జనతా బజార్ వద్ద మట్కా ఆడుతున్న నలుగురిపై స్థానిక ఉపనగర పోలీసులు కేసులు నమోదు చేశారు.

నారదగడ్డ క్షేత్రం ఆస్తుల నిర్వహణపై అభిప్రాయ సేకరణ



మాట్లాడుతున్న డీసీ నాయక్

రాయచూరు రూరల్: పవిత్ర నారద గడ్డ క్షేత్రం ఆస్తుల నిర్వహణకు సంబంధించి భక్తులు, ప్రజలు, రైతుల అభిప్రాయాలను సేకరించామని జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్ వెల్లడించారు. ఆదివారం రాయచూరు తాలూకా నారదగడ్డలోని చెన్న బసవస్వామి మఠంలో ఏర్పాటు చేసిన జనాభిప్రాయ సేకరణలో ఆయన మాట్లాడారు. 1000 నుండి 1200 ఎకరాలు మాన్యం భూములున్నాయన్నారు. ఈ విషయంలో మఠం ఆస్తులు కోడేకల్ శివానంద స్వామీజీ మాన్యం భూమలు తనవంటు 12 ఏళ్ల క్రితం జిల్లా కోర్టుకు వెళ్లారు. వంశపారం పర్యంగా మఠం ఆస్తులు ఆంధ్రప్రదేశ్ అనంతపురం జిల్లా ఉరవకొండ కరిబసవ మఠం అజమాయిషీలో ఉన్నాయన్నారు. ఇటీవల హైకోర్టు ప్రజాభిప్రాయ సేకరణకు ఆదేశించడంతో గ్రామ పంచాయతీల ద్వార రికార్డులను పరిశీలించమన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికలు లేకుండా రోడ్ల నిర్మాణం



మాట్లాడుతున్న విశ్రాంత ఇంజినీర్ ఉద్దిహాళ్



పాల్గొన్న స్థానికులు

బళ్లారి టౌన్: నగరంలో ప్రణాళికలు లేకుండా రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నారని నీటి పారుదల శాఖ రిటైర్డ్ ఇంజినీర్ ఉద్దిహాళ్ ఆరోపించారు. ఆదివారం బళ్లారి నాగరిక పోరాట సమితి స్థానిక గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన నగర మౌలిక సదుపాయాల కోసం చేపట్టిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... నగరంలో కొద్ది పాటి వర్షం వస్తే చాలు ఇళ్లలోకి నీరు చొరబడుతున్నాయన్నారు. రోడ్లు నిర్మించేటప్పుడు డ్రైనేజీల నిర్మాణం చేపట్టడం లేదన్నారు. ఇటీవల కురిసిన కొద్ది పాటి వర్షాలతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయన్నారు. కార్యక్రమంలో ప్రముఖ సర్జన్ డాక్టర్.అరవిందపాటిల్ మాట్లాడుతూ... ప్రస్తుతం బళ్లారి నగరం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోందని, అయితే మౌలిక సదుపాయాలు అనుగుణంగా లేవన్నారు. అదే విధంగా నగరంలో దోమల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో నాగరిక పోరాట సమితి జిల్లా కన్వీనర్ సోమశేఖర్‌గౌడ, మరో విశ్రాంత ఇంజినీర్ మృతుజ సాబ్, డాక్టర్.గోవర్ధనరెడ్డి, ప్రమోద్, యోగనందా రెడ్డి, నరసన్న, శ్యాంసుందర్ గురురాజ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రతిభకు తార్కాణం కావాలి



పురస్కారాలు అందుకున్న విద్యార్థులు

రాయచూరు రూరల్: విద్యార్థులు ప్రతిభకు తార్కాణం కావాలని ఆధ్యాత్మిక ప్రవక్త వీణా బన్నంజే పేర్కొన్నారు. ఆదివారం పండిత సిద్ధరామ జంబలదిన్ని రంగ మందిరంలో అఖిల బ్రహ్మణ సమాజంచే ప్రతిభా పురస్కారాలు, విప్ర అవార్డులను ప్రారంభించి మాట్లాడారు. సమాజంలో సేవలు చేయాలనే తపన ప్రతి ఒక్కరిలో రావాలన్నారు. స్వార్థం వీడాలన్నారు. అదే విధంగా పరిసరాలను సంరక్షించాలన్నారు. పరిషత్ సభ్యుడు వసంత్ కుమార్ మాట్లాడుతూ... దేశ అభివృద్ధిలో బ్రాహ్మణుల పాత్ర అమోఘమన్నారు. ఈ సందర్భంగా విప్ర అవార్డులను డా.వి. జి.కులకర్ణికి అందచేసి, పది, ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీఏ అధ్యక్షుడు రాజశేఖర్, అఖిల కర్ణాటక బ్రహ్మణ సమాజం అధ్యక్షుడు మురళీధర్, నరసింగ్ రావ్, ఆనంద్ ఫడ్నిష్, రాఘవేంద్ర, అరవింద్ కులకర్ణి, అనిల్, విజయ్, ప్రహ్లాద రావ్, వేంకటేష్, రమేష్, శ్యాంరావ్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతను కాపాడుకోవాలి



కాలువలో జేసీబీతో చెత్త తొలగిస్తున్న దృశ్యం

హొసపేటె: ఇంటితో పాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకువాలని, అప్పుడే ఆరోగ్యకర జీవనం సాధ్యమని ఎమ్మెల్యే గవియప్ప తెలిపారు. ఆదివారం నగరంలో ఆర్టీఓ కార్యాలయం వద్ద ఉన్న హెచ్ఎల్‌సీ కాల్వలో స్వచ్ఛత కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. నగరవాసులు స్వచ్ఛతపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లాధికారి దివాకర్, నగరసభ అధికారులు మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

నివృత్త ఉపన్యాసకుడికి ఘనంగా వీడ్కోలు



గోపీకృష్ణన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

కోలారు: నివృత్త ఉపన్యాసకుడు జీఎం గోపీకృష్ణన్‌కు ఆదివారం నగరంలోని బాలికల జూనియర్ కళాశాలలో ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆగ్నేయ ఉపాధ్యాయ నియోజకవర్గం పరిషత్ సభ్యుడు డిటి శ్రీనివాస్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం జులైలోనే 7వ వేతన కమీషన్ నివేదికను అమలు చేయడం ద్వారా ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులకు తీపి కబురు అందిస్తోందని తెలిపారు. ఇప్పటికే వేతన కమిషన్ నివేదిక ప్రభుత్వానికి అందిందని, వెంటనే అమలు చేయాలని ముఖ్యమంత్రికి విన్నవించామన్నారు. కొత్త పింఛన్ పద్ధతిని రద్దు చేసి పాత పింఛన్ పద్ధతిని తిరిగి అమలు చేస్తుందన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేస్తామన్నారు. నివృత్త ఉపన్యాసకుడు గోపీకృష్ణన్ అందించిన సేవలు అపారమని ఆయన శిష్యరికంలో ఎంతో మంది విద్యార్థులు సమాజంలో గౌరవనీయ స్థానంలో ఉన్నారన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బాలకృష్ణ, రోటరీ సెంట్రల్ అధ్యక్షుడు శ్రీనాథ్, ఇంటర్ విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ రామచంద్రప్ప, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

హెచ్ఎంకు ఘన సన్మానం

కోలారు: పదవీ విరమణ పొందిన పాఠశాల ప్రధానోపాధ్యాయునికి ఆదివారం ఘనంగా వీడ్కోలు పలికారు. తాలూకాలోని నరసాపుర హోబలి కే.బి. హొసబల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రమేష్ 11 ఏళ్లుగా ప్రధానోపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా సహచర ఉపాధ్యాయులు ఆయన్ను ఘనంగా సన్మానించి ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. పాఠశాల పీటీఏ అధ్యక్షులు ప్రకాష్, ఉపాధ్యాయులు ఆక్తిరిబేగం, సంధ్యారాణి, చంద్రు, ఛాయాకుమారి, గ్రామప్రజలు, విద్యార్థులు ఉపాధ్యాయున్ని సన్మానించారు.

ఏపీఎంసీ మార్కెట్ అభివృద్ధికి కృషి



ఏపీఎంసీ కమిటీ అధ్యక్షుడు నాగేంద్ర తదితరులు

బళ్లారి అర్బన్: బళ్లారి ఏపీఎంసీ మార్కెట్ అభివృద్ధికి సాయశక్తుల కృషి చేస్తానని అధ్యక్షుడిగా కొత్తగా బాధ్యతలు చేపట్టిన కట్టిమని నాగేంద్ర తెలిపారు. తన కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో అతిపెద్ద మార్కెట్‌గా ప్రభుత్వానికి అత్యధిక ఆదాయం చేకూరుతుందన్నారు. ఇలాంటి మార్కెట్‌కు తాను అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించడం తనకెంతో గర్వంగా ఉందన్నారు. ఈ విషయంలో కాంగ్రెస్ ప్రముఖులు నేతలు, ముఖ్యంగా సిద్ధరామయ్య ప్రభుత్వం తనపైఎంతో విశ్వాసంతో అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని అన్నారు. మార్కెట్‌లో ప్రధానంగా మౌలిక సదుపాయాల కొరత ఉందని, తొలుత ఏపీఎంసీ ఆవరణంలో పేరుకుపోయిన ఓపెన్ డ్రైనేజీ కాలువలో చెత్త తొలగించే పనులు చేపడుతామన్నారు. కమిటీ ఉపాధ్యక్షుడు బీ.ఉలప్ప కూడా తనకు ఎంతో సహకారం అందిస్తున్నారని కమిటీ సభ్యులు, అధికారుల సహకారంతో ఏపీఎంసీని సమగ్రంగా అభివృద్ధి చేస్తానని చెప్పారు.

సొంతదారులకు సొత్తు అప్పగింత



బాధితురాలికి చైన్ అందజేస్తున్న ఎస్పీ

హొసపేటె: జిల్లాలో వివిధ చోరీ కేసుల్లో రికవరీ అయిన సొత్తును పోలీసులు సొంతదారులకు అప్పగించారు. దాదాపు రూ. 1.78 కోట్లకు పైగా విలువైన సొత్తును స్వాధీనం చేసుకుని బాధితులకు అప్పగించామని జిల్లా ఎస్పీ శ్రీహరిబాబు తెలిపారు. శనివారం సాయంత్రం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన అసెట్ రిటర్న్ కార్యక్రమంలో వాటిని అందజేసి మాట్లాడారు. గత ఏడాది జరిగిన వివిధ కేసుల్లో బంగారు నగలు, మొబైళ్లు, బైక్‌లు రికవరీ చేశామని, వాటిని విచారణ చేసి సొంతదారులకు అప్పగించామన్నారు. కార్యక్రమంలో అదనపు పోలీసులు సూపరింటెండెంట్ సలీం పాషా, హరపనహళ్లి ఇన్‌చార్జి డీఎస్పీ మహంతేశ సజ్జన్, కూడ్లిగి డీఎస్పీ మల్లేష్ బైలాపూర్, హొస్పేట్ డీఎస్పీ మంజునాథ్ తల్వార్, సీపీఐలు గురురాజా, వెంకటస్వామి, పీఎస్ఐలు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన అతివేగం

- కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని ఇద్దరు మృతి
- మరో ఐదుగురికి తీవ్ర గాయాలు
- కూడ్లిగి పట్టణ శివారులో ప్రమాదం



ధ్వంసమైన కారు



మృతుడు

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

సాక్షి బళ్లారి/హొసపేటె: విజయనగర జిల్లా కూడ్లిగి పట్టణ శివారులోని 50వ జాతీయ రహదారిలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వాయు వేగంతో వెళ్తున్న కారు అదుపుతప్పడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో కారు డ్రైవర్ వినయ్ (27), చెన్న బసవ (27) అక్కడికక్కడే మృతి చెందారు. రాయచూరులోని లింగసుగూరు నుంచి స్నేహితుల బృందం కేరళలోని వయనాడ్‌కు కారులో బయలుదేరారు. స్నేహితులు గాఢ నిద్రలో ఉండగా కారు డ్రైవర్ వినయ్ వాహనాన్ని అతి వేగంగా నడపడం వల్ల అదుపుప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొని ఐదుసార్లు పల్టీలు కొట్టింది. డ్రైవర్‌తో పాటు చెన్న బసవ మృతి చెందగా కారులో ఉన్న మరో ఐదుగురు సచిన్ (28), కార్తీక్ (27), గౌతమ్ (26), ప్రభు (28), సాగర్ (27) అనే వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని సమీపంలోని కొప్పళ జిల్లా ఆస్పత్రికి తరలించారు. కూడ్లిగి పోలీసులు కేసు నమోదు చేశారు.

కోలారు వార్తలు...

ప్రశాంతంగా టెట్



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అక్రం పాషా

కోలారు: నగరంలోని 14 కేంద్రాలలో ఆదివారం ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)ను సజావుగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ అక్రం పాషా పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. ఉదయం పరీక్షకు 2141మంది అభ్యర్థులకు గాను 251 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం రెండవ అవధికి జరిగిన పరీక్షకు 3394 మంది నమోదు చేసుకోగా ఇందులో 3125 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ప్రతి పరీక్షా కేంద్రంలోను సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వెబ్‌కాస్టింగ్ నిర్వహించారు. విద్యుత్ అంతరాయం ఏర్పడడంతో జనరేటర్ వ్యవస్థను కల్పించారు. పరీక్షా కేంద్రాల చుట్టూ 144 సెక్షన్ విధించారు. పరీక్షా కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో జిరాక్స్ కేంద్రాలను మూసివేయించారు. డీఈఓ కృష్ణమూర్తి, నోడల్ అధికారి కృష్ణప్పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

భక్తి శ్రద్ధలతో అణ్ణమ్మ దేవికి పూజలు



కోలారు నగర సమీపంలోని కొండరాజనహళ్లి ఏపీఎంసీ మార్కెట్ ఆర్ఎంవీ మండీ యజమాని చలపతి తన నివాసంలో బెంగుళూరు నగర దేవత అణ్ణమ్మ దేవికి విశేష పూజలు నిర్వహించారు. లోక కళ్యాణం కోసం జిల్లాలో బాగా వర్షాలు పడి ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాక్షించి అణ్ణమ్మ దేవికి విశేష పూజలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో విధాన పరిషత్ మాజీ ఉప సభాపతి విఆర్ సుదర్శన్, తాపం మాజీ అధ్యక్షురాలు విజయలక్ష్మి, వందల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మార్కెట్ కార్మికులకు అన్న సంతర్పణ నిర్వహించారు.

సేంద్రియ ఎరువుల యూనిట్ పరిశీలన



పరిశీలన చేస్తున్న దృశ్యం

కోలారు: సేంద్రీయ ఎరువులను విరివిగా వాడడం ద్వారా భూ మాలిన్యాన్ని నివారించడానికి సాధ్యం అవుతుందని ట్రైబల్ ఉమెన్ ఇంటర్నేషనల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ చైర్‌పర్సన్ డాక్టర్ వాణి తెలిపారు. ఆదివారం మహిళా రైతు సుజాత నిర్మించిన సేంద్రీయ ఎరువుల తయారీ యూనిట్‌ను పరిశీలించి మాట్లాడారు. రసాయనిక ఎరువుల వాడకం, కీటక నాశకాలను మితిమీరి ఉపయోగించడం వల్ల భూసారం తగ్గిపోయి పంట దిగుబడి పడిపోతుందన్నారు. దీనిని తప్పించడానికి సేంద్రీయ ఎరువుల వాడకం తప్పనిసరి అన్నారు. సేంద్రీయ ఎరువుల వాడకం ద్వారా ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలను పండించడానికి సాధ్యం అవుతుందన్నారు. అతిగా రసాయనిక పదార్థాలను ఉపయోగించడం ద్వారా మట్టి కలుషితమవుతుంది, అందునా కోలారు జిల్లాలో టమాట పంటలకు అనేక రోగాలు ఆశించి దిగుబడి సమస్య తలెత్తిందన్నారు. మల్బరీ ఆకులకు కూడా రసాయనిక ఎరువులను ఉపయోగించడం వల్ల పట్టు పురుగులు పెరగక నాణ్యమైన పట్టు ఉత్పత్తి సాధ్యం కావడం లేదన్నారు. ఈ సమస్యల నివారణకు సేంద్రీయ ఎరువుల వినియోగం ఒక్కటే మార్గమని తెలిపారు. ప్రగతిపర రైతు సుజాత మాట్లాడుతూ... తమ తోటలో రసాయనిక ఎరువులను ఉపయోగించకుండా కేవలం సేంద్రీయ ఎరువుల ద్వారానే పంటలను పండిస్తున్నట్లు తెలిపారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనాలి



మాట్లాడుతున్న ధర్మాధికారి జయరాం

మాలూరు: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనాలని శ్రీ క్షేత్ర కైవార ధర్మాధికారి ఎంఆర్ జయరాం తెలిపారు. మాస్తి ఫిర్కా రాజేనహళ్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ యోగి నారేయణ స్వామి, శ్రీ అమర నారేయణస్వామి, నవగ్రహ సమేత నూతన శిలావిగ్రహ ప్రతిష్ఠాపనా కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ధర్మాధికారి పాల్గొని భక్తులను ఆశీర్వదించి మాట్లాడారు. ధర్మ సేవ అపారంగా కలిగిన కైవారం తాతయ్యను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కైవార తాతయ్య జీవిత చరిత్రను అందరూ తెలుసుకోవాలన్నారు. త్రికాల జ్ఞాని కైవార తాతయ్య భవిష్యవాణిని చెప్పారని అన్నారు. ఆయన చెప్పిన భవిష్యవాణి ఒక్కొక్కటే నిజం అవుతున్నాయన్నారు. తాతయ్య మఠం కార్యదర్శి బాలకృష్ణ భాగవతార్, మఠం ఉపాధ్యక్షుడు విభాకర రెడ్డి, దేవాలయ సమితి అధ్యక్షుడు తానప్ప, కార్యదర్శి మురళి పాల్గొన్నారు.



అభినందిస్తున్న దృశ్యం

పదాధికారుల ఎంపిక ఏకగ్రీవం

శ్రీనివాసపురం: శ్రీనివాసపురం తాలూకా గ్రామ పంచాయతీ పాలనాధికారుల సంఘం నూతన పదాధికారుల ఎంపిక ఏకగ్రీవంగా జరిగింది. పట్టణంలోని ప్రభుత్వ ఉద్యోగుల భవనంలో ఆదివారం సంఘానికి నూతన పదాధికారులను ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా ఎస్ శంకర్, గౌరవ అధ్యక్షుడిగా వి చలపతి, ప్రధాన కార్యదర్శిగా ఎస్ మురళి, ఉపాధ్యక్షుడుగా ఎంఎస్ హరీష్ బాబు, మహిళా విభాగం ఉపాధ్యక్షురాలిగా నిర్మలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన పదాధికారులను పలువురు అభినందించారు.